సంపుటము 18
సంచిక 4

భారతి

వృష చైత్రము
ఏప్రెల్ 1941

ఆముక్తమాల్యదకర్తయెవరు?

పెద్దన కాదు, కృష్ణదేవరాయలును కాదు

గ్రంథస్వరూపము:

ఈగ్రంథమున నేడాశ్వాసములు గలవు. అందుఁ దొలి యాశ్వాసమునఁ బ్రబంధసామాన్యమునఁ దెలియవచ్చు నిష్టదేవతాస్తుతి, గ్రంథకర్తప్రశంస, కృతిపతిప్రశంస, గ్రంథప్రవృత్తికి హేతువు, షష్ఠ్యంతములును దెలియవచ్చుచున్నవి. ఈ విషయములు నలువదితొమ్మిదిపద్యములతోఁ జెప్పఁబడినవి. ఇందలి కృతిపతిప్రశంసయందుఁ దెలియవచ్చెడి విషయ మేమనఁగాఁ గృష్ణరాయలు దాఁ "గళింగదేశవిజిగీషామనీషం దండెత్తిపోయి విజయవాటిం గొన్ని వాసరంబు లుండి శ్రీకాకుళనికేతనుండగు నాంధ్రమధుమథను సేవింపంబోయి హరివాసరోపవాసం బచ్చటఁ గావించి నప్పుణ్యరాత్రిచతుర్థయామంబున స్వప్నంబున నంధ్రజలజాక్షుఁ డాతనితో నంధ్రభాషయందు నొక్కకృతి మాకుఁ బ్రియముగాఁగ వినిర్మింపు మని చెప్పి ప్రబంధవిషయమును—

"ఎన్నఁ గూర్తునన్న విను
మేమును దాల్చిన మాల్యమిచ్చు న
ప్పిన్నది రంగమందయిన
పెండిలి సెప్పుము మున్ను గొంటి నే
వన్నవదండ యొక్కటనుగ
వాఁడిద నేను దెలుంగరాయఁడన్
గన్నడరాయ యక్కొడుకఁ
గప్పఁ బ్రియాపరిభుక్తభాక్కథన్" (౧-౧౪)

అని చెప్పి తెలుఁగున రచియింపు మనుటకు—

"తెలుఁ గదేల యన్న దేశంబు తెలుఁ గేను
దెలుఁగువల్లభుండఁ దెలుఁ గొకండ,
యెల్లనృపులు గొలువ నెఱుఁగవే బాసాడి
దేశభాషలందుఁ దెలుఁగు లెస్స" (౧-౧౫)

అని కారణంబు దెల్పి కృతిపతినిర్ణయమును,

"అంకితమో యన నీ కల
వేంకటపతి యిష్టమైన వేల్పగుటఁ దదీ
యాంకితము సేయు మొక్కక
సంకేతముగా కతఁడ రస జ్ఞేఁ గానే" (౧-౧౬)

అని చేసెను.

శ్రీ ఓరుగంటి నీలకంఠశాస్త్రి

ఇట్టి స్వప్నంబునుండి మేల్కాంచిన రాజు మఱునాఁటి యుదయంబున నిండోలగం బుండి విద్వజ్జనంబులఁ గానిపించికొని నమస్కరించి యాశుభ స్వప్నంబును వినిపించిన హర్షించి వారును వఖర్వ మహిమాతిధూర్వహుఁ డగు తుర్వసువంశంబునం బుట్టినట్టి నీ కిట్టి శోభనపరంపర లేమద్భుతంబులు! అవధరింపు మని రాయలవంశంబును "కలశపాథోరాశి" (౧-౧౫) యని ప్రారంభించి వర్ణించి తుదకు

"ప్రబలరాజాధిరాజవీరప్రతాప
రాజపరమేశ్వరార్థదుర్గానటేశ
సాహితీసమరాంగణసార్వభౌమ
కృష్ణరాయేంద్రకృతివినిర్మింపు" (౧-౪౪)

మని యన్నట్లు చాఁటె ప్పకొనిరి. ఈ వంశవర్ణనమునందు "కలశపాథోరాశి", "ఆసుధాధామ విభవ", "వానికిఁ బురూరవుఁడు", "అతనికి యదుతుర్వసులను", "వానివంశంబు", "ఘనుఁడై తిమ్మక్షితీశాగ్రణి", "వితరణఖని", "బలమదమత్త", "నిజభుజాశ్రిత", "ఆయీశ్వరనృపతికి", "అందు నరసప్రభుఁడు", "అంభోధివసన", "అన్నృసింహప్రభుండు", "వీర నృసింహుఁడు", "అవిభువవంతరంబు", "తొలఁగెను ధూమకేతుశోభ", "కొలుదొల్తనదమ్రాద్రి", "అభిరతి కృష్ణరాయ" యను పద్యములు మనుచరితమునం దున్నట్లే యున్నవి.

ఇట్లు షష్ఠ్యంతలు వలుక కవి "అంభోధికన్యకా" యని ప్రారంభించి "వేంకటాచలపతికి" నని నాల్గు షష్ఠ్యంతపద్యముల వేంకటపతిఁ గృతిపతిఁ గావించి "నా విన్నవింపఁబూను నాముక్తమాల్యదామహాప్రబంధమునకుఁ గథాక్రమం బెట్టి దనిన" నని పలికి విలుబుత్తూరివర్ణనముతోఁ గథ నుపక్రమించెను.

ప్రబంధము లన్నింటియందును నాశ్వాసపరిసమాప్తిని ప్రబంధకర్తలు గద్యములతోఁ జెప్ప నిందు మాత్రము కవి పద్యములతోడనే చెప్పుట యొక విశేషము. ఇట్లు దెలియవచ్చెడి యాశ్వాసాంత్యపద్య సప్తకమును, ప్రారంభమునఁ గల కృతికర్తృవంశ ప్రశంసను యథాస్థితముగ విశ్వసించినచోఁ గృష్ణరాయలే కృతికర్త యనుటలో సందేహము దోఁపదుగదా!

కర్తృత్వ వివాదము :

ఇది యిట్లుండ నీగ్రంథము కృష్ణరాయలచే నెంతమాత్రము రచియింపఁబడలే దనియు, నట్లు దలంచుటకుఁగూడ నెంతమాత్ర మవకాశము లేదనియు, నక్కాలమున రాయలయాస్థానమునఁ గవిశేల్లజుఁడుగాఁ దెలియవచ్చెడి పెద్దనార్యునిచే రచియింపఁబడియుండ నోపు ననియు వాదాంతరము ప్రవర్తింపఁజేయఁబడినది. ఉభయవాదులుగూడ గ్రంథమున వీరవైష్ణవము వర్ణింపఁబడుటచే గ్రంథకర్త వీరవైష్ణవాభిమానియే గావలయు నని చెప్పుచు నట్టి వీరవైష్ణవము పెద్దనకే యభిమత మని తత్కర్తృత్వవాదులును, కృష్ణరాయలకే యభిమత మని తత్కర్తృత్వవాదులును జెప్పిరి. ఉభయవాదము లెట్లున్నను నుభయులుమాత్రము గ్రంథకర్త వీరవైష్ణవుఁడే యని యంగీకరించిరి. తత్తద్గ్రంథకర్తలు వీరవైష్ణవులనిగాని, వీరశైవులనిగాని, వేఱొకరనిగాని చెప్పుటకు గ్రంథస్థవిషయమే యాధారముగావున నా గ్రంథస్థవిషయమును దొలుతఁ గొంత పరిశీలింతము.

గ్రంథమునందలి విషయములలో నగ్రగణ్య మిష్టదేవతాస్తుతి. అందు "వేంకటభర్తఁ గొల్చెదన్ — వేంకట మను కొండయొక్క దొరను సేవింతు" నని చెప్పుటచే నతఁడే తన యభీష్టమగు దైవ మని చెప్పినట్లు సువ్యక్తము. ఆకొండదొర యెవ్వఁ డన నవ్వాని విశేషము పద్యముయొక్క పైచరణములచే విష్ణు వని సూచించెను. ఈయభిప్రాయమే యుత్తరగ్రంథముచేఁ జెప్పఁబడియెను. ఎట్లనఁగా రెండవపద్యమున "భజింతు న్నిరంతరముగా దాంతుని నయ్యనంతుని నతీతబ్రహ్మకల్పాంతుని" నని విష్ణుశయ్యయగు ననంతుని వర్ణించెను. మూఁడవ పద్యమున విష్ణువాహనమగు గరుడాళ్వారు "పతగసమ్రాట్పత త్త్రిప్రభంజనము"లని వర్ణింపఁబడియె. నాలవపద్యమున విష్వక్సేనుని చెత్తము "సైన్యపతికాంచనవేత్రము నాశ్రయించెద" నని వర్ణింపఁబడియె. అయిదవపద్యమున "పాంచజన్య మొసఁగుస్ గల్యాణసాకల్యము"నని పాంచజన్యము

వర్ణింపఁబడెను. ఆఱవపద్యమున "నందకం బఘలతా శ్రేణిచ్ఛిదం జేయుత" మని నందకంబును, ఏడవపద్యమున "కౌమోదకి మోదకీలితసముజ్జ్వలకల్పకమాల్యఁ గొల్చెద"నని కౌమోదకియు, ఎనిమిదవపద్యంబున "శార్ఙ్గధనుర్లతగాచుఁగావుత"మని శార్ఙ్గమనెడి ధనువును, తొమ్మిదవపద్యమున "సుదర్శనదేవుఁ గొల్చెద"నని సుదర్శనమును వర్ణింపఁబడెను.

ఇంతవఱకు విష్ణువు, నతని యాయుధములను, నతని శయ్యను, నతని వాహనమును, నతని సేనానాయకుని వర్ణించి యాతని వేంకటభర్తగాఁ బ్రస్తుతించెను.

ఇఁకఁ బదవపద్యమునందు "ఇలఁ బన్నిద్దఱు సూరులందలఁతు మోక్షేచ్ఛామతిన్ దివ్యుల"నని పన్నిద్దఱాళ్వారులును స్తుతియింపఁబడిరి. పన్నిద్దఱాళ్వారులనఁగా—౧. మధురకవియాళ్వారు, ౨. నమ్మాళ్వారు, ౩. పెరియాళ్వారు, ౪. పొయిఘయాళ్వారు, ౫. భూతత్తాళ్వారు, ౬. పేయాళ్వారు, ౭. తిరుమంగయాళ్వారు, ౮. తిరుప్పాణియాళ్వారు, ౯. తిరుమడిశయాళ్వారు, ౧౦. కూరత్తాళ్వారు, ౧౧. తిరుకొచ్చినంబియాళ్వారు, ౧౨. కులశేఖరాళ్వారు అనువారలు. ఇందలి పెరియాళ్వారే విష్ణుచిత్తుఁ డని యీ గ్రంథమునఁ బేర్కొనఁబడిరి. తచ్చరితముగావున నియ్యది 'విష్ణుచిత్తీయము'నాఁ బరఁగుచున్నది. ఈ పెరియాళ్వారునకు వనమున దొరకినట్లు వర్ణింపఁబడిన గోదాదేవియే 'యాండాళ్లు'ని వైష్ణవలోకమున సుప్రసిద్ధవ్యవహారము గనుచున్నది. ఈ యాండాళ్లపరనామధేయయగు గోదాదేవియే యాముక్తమాల్యదకథానాయిక యని గ్రహింపవలయును.

ఇట్లు పదిపద్యములచే నిష్టదేవతావందనము చేసి "మున్నేఁ గళింగదేశవిజిగీషామనీషన్ దండెత్తిపోయి" యని కవి తన కృత్యారంభావసర ప్రశంసను జేసియుండెను. ఇట నిష్టదేవతావందనము చేసినవెనుక సుకావ్యములందు నవశ్యాచరణీయముగఁ దెలియవచ్చెడి గురుస్తుతి, సుకవిప్రశంస, కుకవినింద లెచ్చటను గానరావు. ఈ ప్రబంధమున నిది యొక యపూర్వ విశేషము.

సాధకబాధకములు :

పెద్దనార్యుఁ డీప్రబంధమును రచియించె ననుటకు నిచటఁ దెలియవచ్చెడి యిష్టదేవతాస్తుత్యాదికము, గురుసుకవిస్తుతిత్యాగము, కుకవినిందాలోపమును బాధకములు. ఎందుచే ననఁగాఁ, బెద్దన రచియించిన మనుచరిత్రమునందలి యిష్టదేవతాస్తుతి దీనికి నత్యంత విలక్షణముగఁ గన్పట్టుటయే కాక గురుసుకవిస్తుతి, కుకవినిందయుఁ గానవచ్చుచున్నవి. మనుచరిత్రమునందలి యిష్టదేవతాస్తుతియందు "రాజీవాక్షుండు కృతార్థుఁ జేయు శుభదృష్టిన్ గృష్ణరాయాధిపు"నని విష్ణుస్తుతి సామాన్యముగఁ జేసి, రెండవపద్యమున "శాంబరీక్షిల్లుఁ"డని శివస్తుతి గావించి, మూఁడవపద్యమున "నాలుగుమోముల న్నిగమవాదము లుప్పతిల"నని చతుర్ముఖుని స్తుతించెను. నాల్గవపద్యమున "గజాస్యునిఁ గొల్తు"నని విఘ్నేశుని, నైదవపద్యమున "నలువరాణి మదాత్మలో వెలయుఁగాత"మని సరస్వతిని స్తుతించెను. ఇదియ మనుచరితమునందు నిబద్ధంబగు నిష్టదేవతాస్తుతి. మొదటి మూఁడు పద్యములందును మువ్వురు వేల్పులును గృష్ణరాయనికి నభ్యుచ్ఛ్రయము గలుగఁజేయునట్లు పెద్దనార్యుఁ డాశీర్వదించెను. విశేష మేది యనఁగా నైమువ్వురు దేవతలును సామాన్యముగఁ బేర్కొనఁబడిరే కాని యేదియో యొక ప్రదేశముచే నరికట్టఁబడి, వేంకటభర్తయనికాని, రంగభర్తయనికాని, కాళీభర్తయనికాని నిర్వచింపఁబడలేదు. ఈ యాముక్తమాల్యదియం దన్ననో సర్వవ్యాపకుఁడగు విష్ణువు, పాపము, శ్రీకాకుళము, శేషశైలము, విలుబుత్తూరు, శ్రీరంగము నను నాల్గుప్రదేశములలో నిలువఁబడిన శిలావృత్తికులందుమాత్రమే సమన్వయింపఁబడియున్నాఁడు. ఇఁకఁ బెద్దనార్యుఁడు గురుస్తుతి నిట్లు చేసెను:

"కొలుతున్ మద్గురు విద్యా
నిలయుఁ గరుణాకటాక్షనిబిడజ్యోత్స్నా
దళితాశ్రితజనదురిత
చ్ఛలగాఢధ్వాంతసమితి శఠకోపయతిన్"

ఆశ్వాసాంతమందలి గద్యములలోఁగూడ—

"శఠకోపతాపసప్రసాదాసాదిత
చతుర్విధకవితామతల్లిక"

యని చెప్పుకొనెను. దీనింబట్టి పెద్దనార్యుని గురువు శఠకోపతాపసుఁ డని తెలియుచున్నది. ఇందలి "శఠకోపతాపసప్రసాదాసాదిత చతుర్విధకవితా మతల్లిక"యను పదముచే నీతనికి శఠకోపుఁడు కవితా గురు వని విదితము. అనఁగా నతనియొద్దఁ బెద్దనార్యుఁ డాంధ్రభాషాపాండిత్యమును, గవితను బొందియుండె నని స్పష్టము. ఇంతమాత్రముచే శఠకోపయతి వైష్ణవ యతియైనఁ గానోపుఁగాని పెద్దన వీరవైష్ణవుఁ డెంత మాత్రమును గాఁడుగదా! ప్రకృతలోకమున వైష్ణవుల యొద్ద స్మార్తులును, స్మార్తులయొద్ద వైష్ణవులును విద్య నభ్యసించుచుఁ గృతజ్ఞతాసూచకంబుగ నవ్వారలను గురువులుగాఁ దమ గ్రంథములఁ బేర్కొనుటయేకాక వారలకుఁ దమ గ్రంథములను గృతులుగా నొసంగు టయు, నాత్మజులకు సైతము గురువుల యభిధానంబు లిడుటయుఁ గానమా? అంతమాత్రముననే స్మార్తులు వైష్ణవు లగుటగాని, వైష్ణవులు స్మార్తు లగుటగాని వలనుపడదుగదా!

ఇఁకఁ బెద్దనార్యుఁడు వైష్ణవుఁడు గాఁ డను టకు నిందుఁ దెలియవచ్చెడి శివగణేశస్తుతులే నిదర్శనములు. అతఁడు వీరవైష్ణవుఁడు గాఁడనియు, శివకేశవుల యందు సమానప్రతిపత్తి గలవాఁడే యనియు నిర్వచించుటకు నీదిగువ పద్యమే ప్రమాణము:

"శ్రీరుచిరత్వ భూతిమతి జిత్వరతాకృతిశక్తికాంతులన్
ధీరత సారభోగముల ధీనిధి యీశ్వర నారసింహుఁడా
వారిజనాభశంకరుల వారి కుమారుల వారి తమ్ములన్
వారియనంగుమామలను వారివిరోధులఁబోలునిమ్మహిన్"

ఇందు శివకేశవులు సమానముగానే పేర్కొనఁబడిరి. న్యూనాధిక భావములు వారిలోఁ జెప్పఁబడలేదు గదా! ఇందుకే కాఁబోలు, ఆముక్తమాల్యదయందు మనుచరితమునుండి పద్యములను సంగ్రహించిన కవి పూర్వాపరపద్యములను సంగ్రహించి తన మతమునకు గళపతితమగుటచే నీ మనోహరంబగు పద్యమును బరిత్యజించెను. ఇట్టి యపూర్వకృత్యంబులకుఁ గడంగిన కవి పెద్దన యనుట కవకాశము కించిత్తైనను లేదుగదా!

ఇంతవఱకు నిష్టదేవతాస్తుత్యాదికముంబట్టి తేలిన సారాంశము నిరూపింపఁబడియె. ఇఁకఁ గథాసందర్భమును విమర్శింతము.

ఆంధ్రదేవుఁ డపేక్షించిన కథావిశేషమునుగూర్చి కవి "ఎన్నినఁగూర్తు నన్న విను... ప్రియాపరిభుక్తభాక్స్రగ్ధరన్"అని ప్రశంసించియున్నాఁడు. దీనిం బట్టియు, గ్రంథస్థైకదేశవిషయముంబట్టియు నాండాళ్లు శ్రీరంగనాయకుల వివాహమహోత్సవము నంధ్రదేవుఁ డపేక్షించినట్లు స్పష్టమగుచున్నది. కావునఁ దత్పరిణయ మీ గ్రంథమునఁ బ్రధానవిషయముగ నొప్పుచుండ వలయును. కావ్యము నామూలాగ్రముగ నరసిచూచినఁ గావ్యమున కీకథ ముఖ్యవిషయమనికాని, యీకావ్య మందలి నాయిక యాండాళ్లుగాఁ దలంపఁబడు గోదాదేవియనికాని నిశ్చయించుటకుఁ దగు రీతిని గావ్యరచనాక్రమం బున్నట్లు చూపట్టదు. ఏల యనఁగాఁ దొలి నాల్గాశ్వాసములందుఁగొంచెమైనను గోదాప్రశంస లేదు. గోదాచరిత్ర మైదవయాశ్వాసమునను, నామెపరిణయము సప్తమాశ్వాసాంతమునను వర్ణింపఁబడియె. అప్రస్తుతముగాఁ దోఁచునట్టి మాలదాసరికథతోడ నాఱవ యాశ్వాసమును, నట్టిదియే యగు బ్రహ్మరాక్షసుని కథతోడ నేడవయాశ్వాసమునందలి తొలిభాగము నొప్పుచున్నవి. ఆఱవ యాశ్వాసమున వసంతఋతువర్ణనము ప్రాధాన్యమును వహించుటచే గోదాచరిత్ర మత్యల్ప గ్రంథముచేతనే చెప్పఁబడియె. అనఁగా నద్దానికిఁ దగు గ్రంథముచేఁ జెప్పఁబడలేదు. ఆతీరుననే పరిణయ ప్రకరణము కుదిని నల్పగ్రంథములో వర్ణింపఁబడియె. ఈయేడాశ్వాసములనుండి గోదాచరిత్రమును బ్రతిపాదించు పద్యములను వేఱుగా నుంచినను గ్రంథస్థకథాభాగమునకు నించుకైనను లోపము గన్పట్టదు. అట్లే గోదాచరిత్రమునుండి మిగిలిన గ్రంథభాగమును వేఱు చేసినను గోదాచరిత్రమునకు లోటు లేదు. అనఁగా నారెండింటికిని సంబంధ మంత శూన్యముగా నున్నది. ఇట్లే మొదటినాల్గాశ్వాసములును, నాఱవ యాశ్వాసమును, నేడవయాశ్వాసమందలి బ్రహ్మరాక్షసవృత్తాంతమును బూర్తిగ విడిచినను గథకు హానిలేదు. కాఁగా గ్రంథసందర్భముచే నంధ్రదేవాభిలషిత మగు గోదా

చరిత్రమునకును, మిగిలిన కథాభాగమునకును సంబంధము మృగ్యమైయున్నది.

కావ్యత్వహాని :

ఈగ్రంథమును గావ్య మనఁదలఁచినచోఁ గావ్యమునకు నియతముగ నుండవలయు నాయికా నాయకుల నిందుఁ గనుగొనుట కించుకేనియు నవకాశము లేదు. గ్రంథస్థవిషయములంబట్టి చూచినచో నెవ్వనినేనియు నాయకునిగా నిర్ణయించిన వానికిఁ దగు నాయిక గన్పట్టదు. నాయికం జూచినఁ దగు నాయకుఁడు లేఁడు. యామునవిష్ణుచిత్తాదులను నాయకులుగా గ్రహించిన వారికిఁ దగు నాయికలుగాని, తగు రసముగాని లేదు. గోదనే నాయికగా గ్రహించిన నద్దానికిఁ దగు నాయకుఁడు వర్ణింపఁబడ లేదు. రంగనాయకుని నాయకునిగా గ్రహించినను నందులకుఁ దగు రసపోషణమునకు విభావాదివర్ణనము లేదు. కావ్యమున విసుగు జనింపఁజేయు శుష్కవర్ణనములచే రస మెన్నటికిఁ బరిపుష్టము గానేరదు. కావున నీగ్రంథమునఁ బ్రధానము కథాభాగమునఁ గొంతవిశేషముగఁ గన్పట్టుటచే విషయమును బట్టి లోకమున కట్టి యుపకృతి నీకావ్యము గలుగఁ జేయు ననునది సందేహాస్పదమే! ఇఁకఁ బ్రాచీనాభిమతంబుగఁ గావ్యమునకు వలయు గిరినద్యాదివర్ణనములుగూడ సమగ్రంబుగ నిందుఁ గానరావు. ఇందుఁ దెలియవచ్చువర్ణనములు ౧. విలంబుత్తూరు, ౨. మధురాపురము, ౩. వర్షాకాలము, ౪. శరదృతువు, ౫. వసంతఋతువులకు సంబంధించినవే. కావున వర్ణనములంబట్టి చూచిన నిందుఁ బరఋతువర్ణనములే కన్పడుచున్నవి. గ్రంథస్థవిషయజిజ్ఞాసానివృత్తికై గ్రంథస్థవిషయక్రమము నిరూపింపఁబడుచున్నది.

ఆ ౧ — ౫౧–౭౫ విలంబుత్తూరి వర్ణనము.
౭౬ భాగవతులు.
౭౭– ౮౫ విష్ణుచిత్తుఁడు
ఆ ౨ — ౩– ౩౮ మధురాపుర వర్ణనము.
౩౯– ౪౩ మత్స్యధ్వజుఁడు.
౪౫– ౭౦ గ్రీష్మము.
ఆ ౩ — ౬– ౧౩ విష్ణుచిత్తవాదము.
౧౪– ౮౯ ఖాండిక్యకేశిధ్వజసంవాదము.
ఆ ౪ — ౩– ౯ విష్ణుచిత్తుని విజయము.
౧౦– ౩౩ విష్ణుచిత్తునకు భగవంతుఁడు సాక్షాత్కరించుట.
౩౪– ౩౮ విష్ణుచిత్తుని స్వపుర ప్రవేశము.
౩౬– ౭౬ యామునాచార్యచరిత్రము.
౭౫–౧౩౬ వర్షాకాలము.
౧౩౭–౧౮౩ శరదృతువర్ణనము.
౧౮౪–౨౦౩ యామునప్రభువు.
౨౦౪–౨౮౫ యామునప్రభు రాజనీతి.
ఆ ౫ — ౫ – ౯౬ గోదాదేవి.
౯౭–౧౫౭ వసంతఋతువు.
ఆ ౬ — ౩– ౬౬ మాలదాసరి.
ఆ ౭ — ౨– ౨౬ బ్రహ్మరాక్షసవృత్తాంతము.
౨౭– ౫౩ గోదాదేవి శ్రీరంగమున రంగనాథుని సేవించుట.
౫౪– ౭౧ గోదాదేవీరంగనాథుల వివాహము.

పై విషయప్రదర్శనమునఁ గవితాశైలి యెట్టులున్నను విషయములుమాత్రము పరస్పరము సంబంధము లేక యొప్పుచున్నవి. పరిశీలింపఁగాఁ గవి తన యభీష్టములగు విషయములనుమాత్ర మిందుఁ జొప్పించుట కుద్దేశించినట్లు స్పష్టమగుచున్నది. లోకహితమునకై యుపదేశింపఁబడు కావ్యమునందుఁ బురాణాదులందుఁ బవిత్రతమంబుగ నెన్నఁబడు విషయమును బ్రధానముగఁ గైకొని యద్దానిని మనోహరముగ విస్తరింపఁజేయుట సుప్రసిద్ధమైయుండ నిద్దానియందు మాత్ర మట్లుగాక వటయక్షన్యాయమున వీరవైష్ణవప్రవర్తితమగు నేదియో యొక కథ గైకొనఁబడినది. కావున నిట్టి గ్రంథమును గావ్యలక్షణకోవిదులు సత్కావ్యముగా నెన్నుదురా యనుట సందేహగ్రస్తము. కవి యీ గ్రంథమునఁ బ్రధానముగా నుపదేశింపఁదలఁచిన విషయములు నాల్గుగా వెలయుచున్నవి:

౧. విష్ణుచిత్తయామునులు వైష్ణవదర్శనప్రవర్తకులుగా వర్ణింపఁబడుటచే వైష్ణవదర్శన ప్రవర్తకత్వాధికారు లిట్టివారే గావలయును.

౨. మాలదాసరిపాత్రముచేఁ గైశికీరాగగానము చేఁ జండాలురుగూడ నుత్తమంబగు వైష్ణవంబు నొందఁ గలరు.

3. గోదాచరితముచే నజ్ఞాతకులశీలలగు స్త్రీలు గూడ దాసీభావముచే నుత్తమంబగు విష్ణుదేవీత్వముం గూడఁ బొందఁగలరు.

౪. బ్రహ్మరాక్షసవృత్తాంతముచే శ్రుతిశాస్త్రోదితమగు బ్రాహ్మణత్వము సర్వవిధముల దుష్టము.

ఇంతియకాదు. కవి బ్రహ్మరాక్షస వృత్తాంత ప్రదర్శనముచేతను, ప్రధానతమంబగు గురుస్తుతిని విడుచుటచేతను (బహుశః ఈకవికి గురువు సాత్త్వికుఁడై యుండనోపు), గ్రంథాదియందలి నమస్కృతులందుఁ బ్రాచీనకవులను విడిచి పన్నిద్దఱాళ్వారులను మాత్రమే గ్రహించుటచేతను నీతఁడు బ్రహ్మద్వేషమే ప్రధానమగు విషయముతో నొప్పు వీరవైష్ణవాగ్రేసరసార్వభౌముఁడని స్పష్టమగుచున్నది. పురవర్ణనములందుఁ దఱచు వేశ్యావర్ణనమే విపులముగఁ జేయుచు బ్రాహ్మణవర్ణనము మాత్ర మవశ్యకర్తవ్యముగాఁ జేయవలసినచోట నొకపద్యముతోఁ జేసి యూరకుండెను.

"చిరసముపార్జితాగ్ని తడిఁ
　జెంది నశించు నటంచునో కృతా
ధ్వరతఁ దదగ్నివై మునికి
　దాననొకంగము తాచుచేతనో
పురధరణీసురుల్నిగమ
　భూధరము ల్జపయజ్ఞశీలురా
హరిధనదాదులైన వల
　హస్తము సాఁపరు దానధారకున్"
(౨-33)

ఇట్టి విషయసంవిధానమును జూచినఁ బెద్దనార్యుని కృతియగు మనుచరిత్రమునకును, నిద్దానికిని నెందును సామ్యము గానమని మనుచరిత్రమున దేవబ్రాహ్మణవర్ణనారీతిని బరిశీలించిన విజ్ఞులకు విదితము. రసపోషణమును బరిశీలించినను మనుచరిత్రము దృష్టిచే నిది నీరసకావ్య మనక తప్పదు. ఇట్టిది పెద్దనార్య ముఖనిఃసృత మనిన మనుచరితమునకుఁగూడఁ దలవంపు గదా!

గ్రంథకర్తృ హృదయము:

అది యట్లుండనిండు. కావ్యమునందలి పాత్రములలో సిద్ధాని రూపము నైనఁ దాల్చి తన హృదయంగమమగు భావమును లోకమునకు వెల్లడి చేయుట సర్వగ్రంథసాధారణమగు విషయము. అట్టిచోఁ గవి దాల్చిన పాత్రమును మనము విమర్శించినఁ గవి స్వరూపస్వభావాదులు స్పష్ట మయ్యెడిని. కావున నీతఁ గ్రంథకర్త యేపాత్రరూపమును దాల్చి తన యభిప్రాయమును వెల్లడించెనో ప్రస్తుతము నిరూపణీయము.

గ్రంథము సామాగ్రముగఁ బరిశీలించినచో గ్రంథకర్త తన హృదయమునంతను విష్ణుచిత్తునియందుఁ బ్రవేశపెట్టి తద్రూపధారి యాయెనని స్పష్టమగుచున్నది. అయ్యది విష్ణుచిత్తీయ మను నామముచేఁ గూడ వెల్లడియగుచున్నది. విష్ణుచిత్తుని స్వరూపస్వభావములు విలుబుత్తూరువర్ణనమునందలి వాక్యములచేఁ దెలియవచ్చుచున్నవి. అవ్వానిని దిలకింపుఁడు:

"విలుబుత్తూరు వెలంగు పాండ్యనగరో
　ర్వీరత్న సీమంతమై."　(౧-౫౧)

"అర్చ గావింతు రెపుడు ని ట్లతిథులైన
　భాగవతులకు నప్పురి భాగవతులు" (౧-౪౬)

"అం దుండుం ద్వయపద్మ పద్మవదనం
　డత్యంద్యుఁ డక్రాంతమో
గాంధాబద్ధమధుద్విషద్విరదుఁ డ
　న్వర్థాభిధానం డురు
చ్ఛందోబృందతదంతవాగపకనా
　సంజాతతజ్జన్య ని
ష్పంద ద్వైత సుసంవిదాలయుఁడు ని
　ష్ఠన్ విష్ణుచిత్తుం డనన్"　(౧-౪౪)

"అమ్మహీసురుండు ప్రకృతికంటెఁ బరుండగు దన్నును, దనకంటెఁ బరుం డగు పరమేశ్వరున్ బరమేశ్వర ప్రసాద బహుజననకృత సుకృత ఫలరూపయగు నాచార్యకృప నుపదానంబు నిధానంబు దెలిపిన గతిన్ దెలుపఁగా నాత్మీయ తదీయ శేషశేషిత్వసంబంధం బనా

ద్యంబుగాఁ దెలిసి యాతెలివి గల్గి యఖండ నిర్వృతిం గాంచి సుఖించు పరమయోగికి బహుక్లేశదంబు లగు చదువులం బనియేమి...భాగవతుల కప్రాకృతంబు లగు బహుభద్రమూర్తులు ధరియించి భగవత్పరిచర్య సేయుటయ పరమ పురుషార్థం బగుట యెఱిఁగి యచటి రథ చరణపాణిమాలికాకరణ కైంకర్యంబున కంకురిత కుతూహలుండై చేయుచుండె. మఱియు" (౧-౪౮)

"న్యాయార్జితవిత్తంబున
నాయోగీశ్వరుఁడు పెట్టు నన్నం బాప్రా
లేయపటీరాచల ప
ద్యాయాతాయాతవైష్ణవావళి కెల్లన్."
(౧-౪౯)

"ఇత్తెఱంగున నవైష్ణవోత్తముండు
జాగరూకతఁ దైర్థిక భాగవతుల
కితర మెఱుఁగక యెవ్వ రేమేమి వేఁడి
రలయ కవి పెట్టి సంతుష్టి సలుపుచుండె."
(౧-౮౫)

ఇట్టి విష్ణుచిత్తుఁడు వాదమున కేగు ప్రసంగము:
"తనరు దక్షిణ మధుర సాంద్రద్రుమధుర"
"తత్పురంబేలు పాండ్య మత్స్యధ్వజుండు"
"కొలువై బహుసమయంబుల
మెలఁగెడు కోవిదులఁ గూర్చి మీమాంసాశాస్త్రం
బులలో నెవ్వఁడు మోక్షం
బెలయించునొ చూచి నిశ్చయింపుఁ డటంచున్."
"వాద మొనరించి గెలిచి తత్త్వంబు దెలుపు
వానికని బీరపువ్వులఁ బోని టంక
సాలవాటుల నించి యాస్థానిఁ గట్టఁ
గాలసర్పముగతి వ్రేలు జాలెఁ జూచి"
"హరు నొకఁ డన నుమ నొకఁ డన
హరి నొకఁ డన శిఖి నొకఁడన నర్కు నొకఁడనన్
గరిముఖు నొకఁడన రజనీ
శ్వరు నొకఁ డన నజు నొకఁడన వాదై నతతిన్"
(౨-౮౬)

"విల్లిపుత్తూరిలో నల్ల విష్ణుచిత్తుఁ
డతుల తులసీ సుగంధి మాల్యమున మాల
మంత్రమున నక్క సేర్పఁబో మన్నవారు
దార మధురోక్తి నవ్విధ మానతిచ్చి"
(౨-౮౪)

"నేఁడు మహామతీ మధుర
నీవు రయంబునఁ జొచ్చి యందుఁ బాం
డ్యుఁడు దివాణమున్నెడ నయ
నించినఁ బ్రేలెడు దుర్మదాంధులన్,
బోఁడిమి మాన్చి మన్మహిమ
ముం బ్రకటించి హరింపు శుల్కమున్
వాఁడును రోసి నాఁ డిహము
వైష్ణవుగా నొనరింపు సత్కృపన్." (౨-౮౮)

"అనిన వడవడ వణఁకి సాష్టాంగ మెఱఁగి
సమ్మదాశ్రులు పులకలు ముమ్మరింప
వినయవినమితగాత్రుఁడై విప్రవరుఁడు
వెన్నునకు భక్తి నిట్లని విన్నవించె." (౨-౮౯)

"స్వామీ నన్ను నితఃపురా పఠిత శా
స్త్రగ్రంథ జాత్యంధు వా
రామ క్ష్మాఖనన క్రియాఖర ఖని
త్ర గ్రాహితోద్యత్కిణ
స్తోమాస్నిగ్ధకరున్ భవద్భవన దా
సున్ వాదిగాఁ బంపుచో
భూమీభృత్సభ నోటమైన నయశం
బు ల్మీకుఁ గాదండు నే." (౨-౯౦)

"గృహసమ్మార్జనమో జలాహరణమో
శృంగారపల్యంకికా
వహనంబో వనమాలికాకరణమో
వాల్లభ్య లభ్యధ్వజ
గ్రహణంబో వ్యజనాతపత్రధృతియో
ద్రాఘ్దీపికారోపమో
నృహరీ వాదము నాకు? లేరె యితరుల్
నీలీలకుం బాత్రముల్." (౨-౯౧)

"నీయిచ్ఛయె యిన్నిక పో
వోయి మునిప్రవర నిన్ను నొప్పింతును భూ
నాయకుసభ నిందులకై
రేయఖ్ఖము కలవ దవల నే నున్నాఁడన్" (౨-౯౩)

"అనిన మాటలకు నలిగి యయ్యాళువా
రియ్యకొనిరయెఁ బోవ నింతలోనఁ
బద్ధనయనుఁ డతనిపయనంబు దూఁగింపు
మనుచు నంబితోడ నానతిచ్చె." (౨-౯౪)

"ఆనతిఁ బడి—మధుర కరిగ" (౨-౯౫, ౯౬)

"వేదవేద్యమైన విష్ణు తత్త్వం బిట్లు
వాది గెలిచి తెలిపి వసుమతికి
భక్తి నోలలార్చి భగవత్ప్రపన్నగాఁ
జేసి లోకహితము సేయుటయును." (౪-౫)

"వాద మే మాయె నన్న భూవరునిపకు
పాత మాదాసరికిఁ గల్గె బ్రతికె ననెడు
వారు నా లెం డిటు విమర్శదూరమైన
వాకిట వసించు నెవ్వఁ డన్వారు నగుచు." (౪-౬)

"పురి రేఁగిం ది తదీయమైన నగరం
బున్ జేర్చుఁ డంచున్ బడిన్
దొరలన్ రాజకుమారులన్ బనుపఁగా..."(౪-౯)

"అంత,...నంబుజాక్షుఁడు నమ్మని సాదరించి,
యీతఁ డాగోచరుండయ్యె బుషియు నేగి
పౌరులు భజింపఁగాఁ బుత్తూరికరిగ" (౪-౩౩)

"తొంటికంటె శతగుణంబుగా భాగవతపూజా
ప్రవీణుండై యుండె నంత" (౪-౩౫)

"ప్రభువు లరిగిరి క్రమ్మరఁ బాండ్యనగరి
కమ్మనియు నట్లు వైష్ణవాభ్యర్చనంబు
దన చిరంతనతులసీకాదామకరణ
దాస్యమును జేసికొనుచుఁ దత్పరతనుండె"(౪-౩౬)

విష్ణుచిత్తుఁడు:

పైగ్రంథము నంతను లెస్సగఁ బరిశీలించిన విష్ణుచిత్తుఁ డనువాఁడు విలుబుత్తూరు దేవాలయమున నంబి, యనఁగాఁ బూజారికి నౌకరుగా నున్నట్లు తెలియుచున్నది. ఆతని పనులలో దేవునికిఁ బూలమాలలను సమర్పించుట యొకటి. నంబియొక్కయు, విష్ణుచిత్తునియొక్కయు జాతికులంబులను స్పష్టముగఁ దెలిసికొనుటకు నవకాశం బస్పష్టంబు. విలుబుత్తూరి వర్ణనమున నీతఁ డొక భాగవతుఁ డని మాత్రము "అందుండున్......విష్ణుచిత్తుండనన్" అని చెప్పఁబడియె. దీనివలన విష్ణుచిత్తుఁడు వేదవేదాంతముల నించుకేనియుఁ జదువనివాఁడయ్యు వేదాంతముల వలనఁ దెలియవచ్చెడి ద్వైతజ్ఞానము గలవాఁడనియు, ద్వయమంత్రమును నిరంతరము జపించువాఁడనియుఁ దెలియుచున్నది. ఈవిష్ణుచిత్తుని కట్టి విద్యాగంధమును లేదను విషయ ముత్తరగ్రంథముచేఁగూడఁ దెలియుచున్నది. బ్రాహ్మణునికి నిషిద్ధంబగు దేవలకత్వము నవలంబించిన నంబిక్రింద నౌకరుగా నున్న యీవిష్ణుచిత్తుఁ డట్టి బ్రాహ్మణుఁడా యని సందేహము. విలుబుత్తూరువర్ణనమునఁగూడ భాగవతవర్ణనమే కాని బ్రాహ్మణవర్ణనము గానరాదు. విలుబుత్తూరివర్ణనాతిశయమంతయు నించుమించుగా నంబులకును, నచట దాస్యముచేయు నౌకరులకును నచటి దేవుఁడు మాటిమాటికి బ్రత్యక్షమగుచు వారలతో నేదో సంభాషించుచుండు ననువిషయమే ప్రధానముగాఁగలది. విలుబుత్తూరునందలి దేవుఁ డెల్లప్పుడును దన సేవకులతోఁ జీటికిమాటికి మాటాడుట గ్రంథమున సర్వత్ర గన్పడుచున్నది. ఏతత్ప్రామాణ్యము ననుసరించియే ప్రకృత గ్రంథరచనా ప్రసంగముగూడ నాంధ్రదేవుని యాజ్ఞామూలకమే యనునట్లు స్పష్టమగుచున్నది. అట్టిచో నాంధ్రదేవుఁ డెవ్వరి చేతఁ బ్రబంధరచనమున కాజ్ఞాపించియుండు ననుట ప్రధానమగు విషయము. కృష్ణరాయేతరగ్రంథకర్తృత్వవాదము ననుసరించి యద్దానిఁ బరిశీలించిన నాంధ్రవిష్ణువున కత్యంతప్రియభక్తునికే యిట్టిది సాధ్యమగునని చెప్పుటకు నవకాశము గల్గును.

ఇది యిట్లుండ విష్ణుచిత్తుఁడు "నిష్పందద్వైతసంవిదాలయుఁడు"గా నిర్వచింపఁబడుటవలన శుద్ధాద్వైతవాదియని తెలియుచున్నది. అట్టి యీతఁడు మధురాపుర ప్రభుసభయందు విశిష్టాద్వైతమును బోధించినట్లు

"విద్వద్వందితుఁ డాతఁ డిట్లు సుఖసం
విత్తత్త్వబోధైకచుం
చుద్వైపాయనసూత్రసత్ప్రభృతుల నీ
శు న్మన్నిరూపించి పైఁ

దద్వైష్ణత్వము దాని కన్యదివిమ.
ద్వైతవర్తనంబు ద్విశి
ష్టాద్వైతంబును దేటగాఁ దెలుప మా
టాడెఁ బ్రమాణంబులన్" (౩-౯)

అని చెప్పఁబడియెను. ఇందు ద్వైపాయన సూత్రములకును, శ్రుతులకును విశిష్టాద్వైతంబునందుఁ బరమతాత్పర్యంబని తెలియవచ్చుచున్నది. "అందుండున్-నిష్పందదై వ్రతిసుపంవిదాలయుఁడు నిష్ఠన్ విష్ణుచిత్తుండనన్" అనుపద్యమును పై "విద్వద్వందిక్షుఁ" డను పద్యమును నొకచో నంచిన విష్ణుచిత్తరూపధారియగు గ్రంథకర్త మతస్వరూపంబుల నెఱుఁగఁడా యని తప్పక యనిపించును. అట్టితఁడే శ్రుతిమాత్రతాత్పర్యమునుమాత్రము నిశ్చయించుట కీతనికి సామర్థ్య మేది? 'స్వమతస్థాపన'మను పేర వ్రాయఁబడిన మూఁడవ యాశ్వాసమునందలి ౧౦, ౧౧, ౧౨, ౧౩ పద్యములు శ్రుతిమాత్రతాత్పర్యము నెంతమాత్రము బోధింపఁజాల వను విషయము మీమాంసాశాస్త్రజ్ఞులకు విదితమే. ఈ పద్యములు శ్రుతిమాత్రతాత్పర్యబోధకము లగుట యెట్లున్నను గ్రంథకర్తయొక్క వీరవైష్ణవాభిమానమును మాత్రము బోధించుచున్న వనుటకు సందేహము లేదు. ఇట్టి వీరవైష్ణవుఁడే పెద్దన యని చెప్పుట కెంతమాత్రమును వీలులేదుగదా! ఏల యనఁగాఁ, బెద్దనార్య కృతియగు మనుచరిత్రమును జూచిన నేతద్వాదమున కనువగు మాటలు కన్పడవు. అందు స్వారోచిషమనువునకు విష్ణువు ప్రత్యక్షము కాఁగా నాతఁడు చేసిన స్తోత్రము సాధారణముగఁ బురాణాదులందుఁ గన్పట్టు శ్రుతిస్మృత్యనుకూలమగు స్తుతియేకాని వేఱుగాదు. దానింబట్టి పెద్దన వైష్ణవుఁ డనికాని, వీరవైష్ణవుఁడని కాని చెప్పుటకు వలనుపడదు. కావునఁ బెద్దన యీ గ్రంథమును రచించె ననుటకు నేమియు నవకాశము లేదు. బహుశః గ్రంథకర్త కృష్ణరాయల యందలి యబ్రాహ్మణ్యమును దనయందుఁ గని తాన న్నాశ్రితసామ్యము నైకాని గ్రంథఖ్యాపనమునకుఁ బ్రభుకర్తృత్వప్రకటన ముత్తమసాధనముగా నెంచియుండ వచ్చును. ఏతాదృశగుణగణవిశిష్టుఁ డగు నీగ్రంథకర్త యెవ్వఁడైయుండు ననుటకు గ్రంథమునందలి ప్రచుర విషయప్రామాణ్యమున నంధ్రవిష్ణుసేవకులలో నొక్కఁడైయుండు ననెడివాదమును విజ్ఞులు గ్రహించియే యుందురు. విష్ణుచిత్తునికి విలుబుత్తూరి దేవుని యనుగ్రహమున స్వమతజ్ఞాన మలవడినట్లు ప్రకృతగ్రంథకర్తకుఁగూడ నంధ్రదేవుని యనుగ్రహమువలననే యాంధ్రభాషాజ్ఞాన మలవడినట్లు కవిగూడఁదన స్వప్నవృత్తాంతముచే సూచించినాఁడు. చూడుఁడు:

"మఱియు రసమంజరీముఖ్యమధురకావ్య
రచన మెప్పించికొంటి గీర్వాణభాష.
ఆంధ్రభాష యసాధ్యంబె యందు నొక్క
కృతి వినిర్మింపు మిఁక మాకుఁ బ్రియముగాఁగ" (౧-౧౩)

కవి గురుస్తుతిని త్యజించుటగూడ మావాదమున కనుకూలమే యగుచున్నది. యథార్థమాలోచించినచోఁ బై యంధ్రవిష్ణుభాషణమునకుఁ గృష్ణరాయలుగాని, పెద్దనగాని పాత్రు లగుదురని యెట్లు చెప్ప నవకాశము గల్గును? వీరిలో నొక్కరుఁడును నంధ్రవిష్ణువు సంభాషించుటకుఁ దగు సేవ లొనర్పలేదే!

ఇంతవఱకు నీగ్రంథకర్త పెద్దనార్యుఁడు గాఁడనియు, నియ్యది వీరవైష్ణవాభిమానము గల్గి యంధ్రవిష్ణ్వాలయమున విష్ణుచిత్తసాదృశ్యము నొందిన యొక వీరవైష్ణవ పరిచారకునిచే రచియింపఁబడియుండు ననియు నిరూపింపఁబడెను. ఇట్టి వీరవైష్ణవుఁడు కృష్ణదేవరాయ లగునా? కృష్ణరాయలయందు వైష్ణవంబు చూపుటకుఁ దాతాచార్యుల నీచములగు కథలు తక్క వేఱొండు ప్రమాణము లేదు. ఇంతియకాదు. కృష్ణదేవరాయల పట్టాభిషేకదానశాసన మాతనియం దారోపింపఁబడిన వైష్ణవమునకే బాధక మగుచున్నది. ఆశాసనమునందు నాతని పట్టాభిషేకసమయాన నాతని రాజధానియగు విరూపాక్షేశ్వరునికి నొక గ్రామమునిచ్చి రంగమండపము నిర్మించినట్లు గీర్వాణమునను, గన్నడమునను గూడ వ్రాయఁబడియున్నది. ఈ శాసనము శాలివాహనశకము ౧౪౩౦ శుక్లవత్సర మాఘశుద్ధచతుర్దశినాఁటిది. పై కారణకలాపములంబట్టి శ్రీకాకుళాంధ్రవిష్ణుదాసుఁ డెవ్వఁడో యాంధ్రమునఁ దా రచియించి కృష్ణరాయలపేరు పెట్టి, చేసిన

పనిని "ఆంధ్రభాష. యసాధ్యంబె" యని సాధించుకొన్నట్లు స్పష్ట మగుచున్నది. గ్రంథవ్యాపకత్వమునకిట్లు ప్రసిద్ధపురుషుల పేరు పెట్టుట వాఙ్మయమున సర్వత్ర కనుచునేయున్నారముగదా! ఇంకను, కృష్ణరాయల ప్రతికృతి చూడఁగా నురుట నేదియో కస్తూరి తిలకమే కనవచ్చునుగాని యూర్ధ్వపుండ్రములు గానరావు. వీరవైష్ణవుని చిత్రమున నట్లుండుట యామశాఖిమానులకుఁ దలవంపులు గాదా? కృష్ణరాయలే స్వయముగ గ్రంథమును రచియించిన రాజరాజగు తాను వ్రాసిన గ్రంథమును బ్రకటించు సందర్భమున గొప్ప యుత్సవము చేసి యయ్యది శాశ్వతమగునట్లు చేసియుండఁడా? కావున నియ్యది యంతయు వైష్ణవమాయయే కాని వేఱొండు గాదు.

ఏది యెట్లుండినను గ్రంథకర్త దాను మంచి సంస్కృతసాహిత్యమును, తెనుఁగుసాహిత్యమును సంపాదించి పెద్దనార్యకృతియగు మనుచరిత్రమును నభివానించి తన ప్రధానతత్త్వమగు వీరవైష్ణవమును లోకమునకుపదేశింపనెంచి నంబులయాంగును, దేవదాసీగణంబునందును, మాలదాసరులయందును మహత్త్వమును బ్రకటించుచు శ్రీరంగ, తిరుపతి, విలుబుత్తూరు, శ్రీకాకుల దేవాలయముల యతిశయమును లోకమునకు వెల్లడియగునట్లు గొప్పప్రబంధమును వ్రాసి వాఙ్మయమునకు నుపకృతి నేసెననిమాత్రము లోకము ప్రశంసింపఁదగినది.

అట్టి యాకవి కృష్ణరాయలకు సన్నిహితము గ కాలమునసే యుండియుండును. కావుననే తరువాతి వారు కొంతకాలమునకుఁ గృష్ణరాయలకృతి యనియుఁ, బెద్దనకృతి యనియుఁ దమ గ్రంథములందుఁ దెల్పుచు వచ్చిరి. దీనినిబట్టి శ్రీకాకుళవిష్ణుదాసులలో నొక్క వైష్ణవాగ్రేసరుఁడే దీనిని రచియించెఁ గాని యితరులచే నూహింపఁబడినట్లు పెద్దనార్యుఁడుగాని, గ్రంథమునఁ దెలియవచ్చు కృష్ణరాయలుగాని దీనినిరచియించిరనుట కెంతమాత్ర మవకాశము లేదని విజ్ఞులు గ్రహింతురు గాక!*

---

* ఈ మధ్య మా గర్తపురీహిందూకళాశాలలోని చారిత్రకపరిషత్తునందు ౧౧, ౧౨-౨-౪౧ తేదులందు శ్రీకృష్ణదేవరాయపట్టాభిషేకవర్ధంత్యుత్సవము జరిగినది. దానికి జగద్గురు శ్రీ కల్యాణానంద భారతీ మాస్తాచార్యమహాస్వాములవారు పరిషత్ప్రధానుల ప్రార్థనపై నధ్యక్షపీఠము నధిష్ఠించిరి. ఆ సమయమున రాయలనాఁటి వాఙ్మయమును విమర్శించుచు నాముక్తమాల్యదకృతికర్తృత్వము విషయమై కొంద ఱుపన్యసించి యందు వాదద్వయరూపమగు కర్తృత్వసందేహమును దెల్పిరి. కాని తుదకు వారు కృష్ణరాయకృతమే యని నిశ్చయించి యయ్యది స్థిరీకృతపూర్వమని నుడివిరి. దానిపై నధ్యక్షులు సెలవిచ్చుచు "నిదివఱకు బయల్వెడలిన వాదద్వితయమును ముప్పదిరెండు వత్సరములనుండి మేమెఱుంగుదుము. ప్రకృతము కృష్ణరాయకృతమే యని నిర్ణయించుటకుఁ దగు హేతువు గానరాదు. వాదము ముగియుటకు వాదిదౌర్బల్యమే కారణమగును. సరియగు వాది యున్నచో వాద మెన్నటికిని నిల్చియే యుండును. కావునఁ 'కృష్ణరాయ కృత'మని 'స్థిరీకృత పూర్వ'మని చెప్ప నవకాశములేదు. యథార్థ మాలోచించినచో విమర్శనము ప్రధానముగ గ్రంథస్థవిషయానుసారి యగుచో నందలి సత్యము తెల్లమగును. అందు సందేహ ముండుట కవకాశము లేదు. కాని పై విమర్శనములు రెండును నట్టివి కావు. అయ్యవి ప్రధానముగ భాషాస్వరూపమునే యనుసరించినవి. గ్రంథస్థవిషయము ననుసరించి విమర్శించినచో గ్రంథకర్త యెవ్వఁడగునో తెలియుట కవకాశముండును. కావున విమర్శకు లీ తృతీయ పథము ననుసరించి యింకమీఁద విమర్శించినచో సత్యము ప్రకటితమగు నని మేము విమర్శకులకు సూచించుచున్నా"మని విమర్శక లోకమున కొక క్రొత్తత్రోవను జూపిరి.

శ్రీ జగద్గురు దర్శితంబగు నూతనమార్గంబు ననుసరించిన నెట్లుండునో యను కుతూహలముతో నీ వ్యాసమునకు దొరకొంటిని. కావునఁ బండిత విమర్శకు లిందలిగుణములను గ్రహింతురుగాక! [డి. నీ. శా.]



[సీరియల్ నాటకము]

★ రాజరాజు ★

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

ఏడో రంగం

రత్నాంగి నగరిలో సారంగధరుడి వాసగృహం.

జాము న్నర పొద్దెక్కింది.

విప్పివుండిన ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం వొడిలో వుంచుకుని, సారంగధరుడు పడకకుర్చీలో వాలి కూచునివున్నాడు.

ఎదట మరో కుర్చీలో సుబుద్ధి కూచుని వున్నాడు.

***

సారంగధరుడు--- ఈ విషయమై తా మందరూ యింతగా ప్రయత్నించడం యేమీ బాగా లేదు.

సుబుద్ధి— ప్రయత్నించకుండా వుండడం మాకు సాధ్యమా ప్రభూ?

సారంగధరుడు— ఎందుకు కాదూ? ఇది యెంత రసాభాసగా వుందో తామెక్కరూ గుర్తించడం లేదు. ఉన్న చిక్కల్లా యిదీ.

సుబుద్ధి—తమరు— (అర్ధోక్తి)

సారంగధరుడు— నా విషయమై నాకే ఆందోళన లేదే? తమ కేల?

సుబుద్ధి—ధర్మంకోసం— (అర్ధోక్తి)

సారంగధరుడు— సార్వభౌములవారిని ఎదిరించడం తమకు ధర్మమా?

సుబుద్ధి—ధర్మంమొదట — (అర్ధోక్తి)

సారంగధరుడు— మా నాయనగారితో పోటీపడడం నాకు ధర్మమా?

సుబుద్ధి— తమవిషయం తరవాత మనవి చేసుకుంటాను. దేశంలో వున్న ప్రజ యావన్మందీ అక్రమం అని ఘోష పెడుతూ వుంటే సార్వభౌములు అది గమనించవలసిన పనిలేదూ మహాప్రభూ?

సారంగధరుడు—జనుల అందరి అభిప్రాయాలూ తాము తెలుసుకుని వచ్చారా?

సుబుద్ధి — (మిడుతూ మిడుతూ చూస్తాడు)

సారంగధరుడు — ఇక్కడి పరిస్థితు లన్నీ జనుల కందరికీ యథాతథంగా తెలిసి వున్నా యని తమరు సెలవిప్పించగలరా ?

సుబుద్ధి — తమరు నీహార లేశాలు వెతికితే మేము తాళలేము; కాని భృత్యధర్మాలు మేము అనుష్ఠించి తీరాలి. మేము స్వామి ద్రోహం చెయ్యలేము.

సారంగధరుడు — అయితే, మీస్వామి యెవరండీ ?

సుబుద్ధి — రాజరాజ నరేంద్రులవారే.

సారంగధరుడు — వారి ప్రయత్నాలు ప్రతిఘటించడం స్వామి భక్తికాదూ ?

సుబుద్ధి — వివరంగా మనవిచేసుకుంటాను.

సారంగధరుడు — చిత్తం.

సుబుద్ధి — సార్వభౌములవారిప్పు డొక వ్యామోహంలో తగులుకుని — (అర్ధోక్తి)

సారంగధరుడు — చాలు. ఆమాటతో తమ వుద్దేశమూ, కారణమూ బోధపడ్డాయి. సార్వభౌములవారి విషయమై తా మందరూ కేవలమూ భ్రాంతులయి, తలకు మించిన పని చేస్తున్నారు నే నిది అంగీకరించలేను. కనక మాటిమాటికీ నా కీ విషయం జ్ఞాపకం చేస్తూ వుండకండి. ఏకాగ్రచిత్తంతో నేను భారతం చదువుకుంటూ వుండగా తమరు నన్ను కలతపెట్టారు. అంచేత నే నిలా మనవి చేసుకోవలసివచ్చింది. అన్యథాభావించకండి. ఇంతకంటే మరొకపని లేకపోతే క్షమించి తా మిప్పటికి దయచెయ్యండి. (ప్రత్యుత్తరం కోసం చూడకుండా భారతం చేతులతో పుచ్చుకుంటాడు)

సుబుద్ధి — (ఒక్కక్షణం నిర్విణ్ణుడై వుండి) ప్రభూ !

సారంగధరుడు — (చూస్తూ పూరుకుంటాడు)

సుబుద్ధి — (లేస్తూ) సెలవిప్పించండి.

సారంగధరుడు — సెలవు.

[బుర్రవంచుకుని సుబుద్ధి వెళ్లిపోతాడు]

సారంగధరుడు — (భారతం చూస్తూ) "ఇట్లు జరాక్రాంతుం డైన యయాతి గొడుకుల నెల్ల రావించి, నాకు విషయసుఖతృప్తి లేకున్నయది, గావున మీయం దొక్కరుండు నాముదిమి గొని తన జవ్వనంబు నా కిచ్చునది యనిన విని, యదు తుర్వసు ద్రుహ్యు్యనులు దండ్రి కిట్లనిరి.

ఆ.వె. తగిలి జరయు రుజయు దైవవశంబున
నయ్యెనేని వాని ననుభవింత్రు
గాక, యెఱిఁగి యెఱిఁగి కడఁగి యా రెంటిఁ జే
కొందు రయ్య యెట్టి కుమతు లైన ?

క. నరలుగల కాము నైనను
దరుణులు రోయుదురు డాయ, ధనపతి
బురుషుఁడు దుర్వారజరా [యయ్యుం
పరిభూతి నభీష్టభోగబాహ్యుఁడ కాఁడే ?

అని యొడంబడకున్న నలిగి, యయాతి, యదువంశంబునవారు రాజ్యంబున కయోగ్యులుగాఁ, దుర్వసువంశంబునవారు ధర్మాధర్మవివేకశూన్యులై సంకీర్ణవర్ణకిరాతులకు రాజులుగా, ద్రుహ్యువంశంబునవా రుడుపప్లవనంతార్యం బైన దేశంబునకు రాజులుగా, జరాదూషకుం డగుట ననువంశంబునవారు ముదియునంతకు నుండక జవ్వనంబునన పం

చత్వంబున కరుగువారునుంగా శాపం బిచ్చి,—"

ముదిమి ముదిరినా యయాతిమహారాజులుంగారికి విషయసుఖతృప్తి కాలేదుట... ఎంచేతా? యౌవనప్రారంభం అయినప్పట్నుంచీ వారు స్త్రీలతో సుఖించినవారేనే? తరవాత, సౌందర్యరాశి దేవయానీదేవమ్మగారు అయాచితంగా లభించివుండడంవల్లనైనా వారి విషయసుఖాశ తీరిపోయి వుండవలసిందే? త్రిభువనసుందరి శర్మిష్ఠాదేవమ్మగారితోనున్నా వారు సుఖించివుండినారే? ......ఆ, అదీ హేతువు, శర్మిష్ఠాదేవమ్మగారితో వారు రహస్యంగా ప్రవర్తించవలసి వచ్చింది. అంచేత, అక్కడ, వారి శృంగారవిలాసాలకు చాలినంత అవకాశం యేర్పడక పోయింది. తద్వారా విషయసుఖతృప్తి కాకుండానే వారికి జరాభారం ముంచుకు వచ్చేసింది. దీనికి సాయం వారికి నిగ్రహశక్తి చాలకపోయింది—

"ఆ నలువురకుం గొండుక వానిం బూరుం బిలిచి యడిగిన, వాఁడు తండ్రి కోరినయట్ల చేసిన, నవయౌవనుండై యయాతి యభిమత సుఖంబులు సహస్రవర్షంబు లనుభవించి, తృప్తుండై, పూరుజవ్వనంబు వానికి యిచ్చి తన జరాభారంబుఁ దాన తాల్చి—"

పూరుని యౌవనబలంతోనే అతణ్ణి కన్న తల్లితోనే (కళ్లుమూసుకుని వాణికిపోతాడు) మన్మథావేశం యింత తీవ్రంగా వుంటుందా?

[అప్పుడు గౌరి వస్తుంది.]

గౌరి—అమ్మగారి సెల వయిరిది బాబూ!

సారంగధరుడు—తొందరగా రావాలా? (లేచి నుంచుంటాడు)

గౌరి—అవును.

సారంగధరుడు—వారేం చేస్తున్నారు?

గౌరి—వడ్డన అయింది. తమకోసం కనిపెట్టుకుని—

సారంగధరుడు—అయ్యో!

[సారంగధరుడు గౌరిదగ్గిరగా ముందుకి అడుగు వేస్తాడు. గౌరి అతను కప్పుకున్న శాలువ తీసేసి కుర్చీపీటమీద వుంచుతుంది. తరవాత యిద్దరూ వెళ్లిపోతారు.]

ఎనిమిదో రంగం

రాజరాజు నగరు.

కింద సభాశాలా, పైని రాజు నిత్యనివాసమూనూ. మజ్జనభోజనాదులు తరుచు అక్కడే జరుగుతూ వుంటాయి.

సారంగధరుడి కేడెనిమి దేళ్లు వచ్చినప్పట్నుంచీ అత నీయేర్పాటు చేసుకున్నాడు. వార్త వచ్చినప్పుడూ తనకి బుద్ధిపుట్టినప్పుడూ అతను రత్నాంగినగరికి వెడుతూ వుంటాడు. రత్నాంగిన్నీ అప్పుడప్పుడు అక్కడికి రావడం కద్దు.

అప్పటికి జామున్నర పొద్దుంది.

అది కొలువుతీరి వుండవలసిన సమయం అయినా అయిదారురోజులనుంచి అతను కిందికి దిగడం లేదు. రాజకార్యాలు అష్టప్రధానులద్వారా అక్కడే పరిష్కారం అయిపోతున్నాయి.

తరుచు రాజసభకి వచ్చే వారులంతా చాలా నిరుత్సాహంగా వున్నారు.

దేశదేశాలనుంచి వచ్చిన కళాకుశలులు ఎటూ సాహసించలేక ముళ్లమీద వున్నట్టు నగరంలో పడి వున్నారు.

నృత్యగీతాదివినోదాలకు లోపం లేకపోగా రాజు పని మామూలుగానే వుంది; కాని నగరం అంతా రాజు లేనట్టు యీసురోమంటూ వుంది. కోరివస్తే మంత్రులకూ, విజయాదిత్యుడికీ, సారంగధరుడికీ, నన్నయభట్టుకీ, రత్నాంగికీ తప్ప తక్కిన అందరికీ రాజదర్శనం అందరానిదిగా వుంది.

మహారుద్రయ్య మాత్రం వష్టిగడియలూ సన్నిధినే వుంటున్నాడు. ఒక్క భోజనానికి మాత్రమే అతె నింటికి వెడతాడు.

రాజు, బాలీసుకి ఆనుకుని రత్నకంబళీమీద కూచుని వున్నాడు. ఎదట, గోడకి చేరి నిలువుటద్దం వుంది. ముందర సందుకా పెట్టే, దానిమీద ఆంధ్ర మహాభారతం సభాపర్వమూ వున్నాయి.

గది అంతా అగరువత్తుల పరిమళం గుమాయిస్తోంది.

పాముకూసంవంటి జరీచెంగావి పంచె కట్టుకుని తెల్లని పట్టుఅంగీ తొడుక్కుని, రాజు, గిరజాలు చక్కగా సవరింపించుకుని వున్నాడు. తాంబూల రక్తాలైన పెదవులు తెలుపు ఎక్కువగా వున్న గౌరమీసాలకు వింతసోయగం కూరుస్తున్నాయి.

వజ్రాలకమ్మల ధగధగలూ, "కౌనకాడ" పచ్చ నిగనిగలూ చెక్కిలమీద ప్రతిఫలిస్తూ మెరుపుతీగలు సరుపుకున్నాయి.

మోకాలిమీదికి చాపుకుని వున్న కుడిచేతి రత్నాంగుళీయకం యెదటివారి కళ్లు కుడుతోంది.

వసారాలోనుంచి కవుజుపిట్టల కోలాహలం శ్రావ్యంగా వినవస్తోంది.

ఎదట, కొంచెం కుడిగా, మహామంత్రి చిట్టి వీరన్న, కొంచెం యెడమగా నన్నయభట్టూ మండె మీద కూచుని వున్నారు.

***

నన్నయభట్టు — యువరాజులుంగారి ప్రణయగాథ అలా వుంచుదాం. చిత్రపటాలు రాకపూర్వం తమకు వివాహసంకల్పం లేదు.

రాజరాజు— సెలవిప్పించండి.

నన్నయభట్టు—వచ్చిన చిత్ర పటాలన్నీ యువరాజులుంగారి నిమిత్తమే వుద్దేశించబడ్డవి.

రాజరాజు—కానివ్వండి.

నన్నయభట్టు—ఆ చిత్రాలకు చెందిన రాజపుత్రికలలో వొకావె— లేక కొందరే యువరాజులుంగారికి నచ్చుతారు; కాని ఆ రాజపుత్రికలకు మాత్రం అందరికీ అబ్బాయిగారంటే యిష్టమే.

రాజరాజు—అది వివాదాస్పద మైన విషయం. అయినా తమ సెల వేమిటో తెల్పించండి.

నన్నయభట్టు — అనురాగంవల్ల కావచ్చు, భక్తివల్ల కావచ్చు, పదవీవ్యామోహంవల్ల కావచ్చు; కాని యెటయినా ఆ రాజపుత్రికల కందరికీ యువరాజులుంగారంటే భర్తృభావం యేర్పడి వుంది.

రాజరాజు—మన అబ్బాయి తిరస్కరిస్తే ఆ రాజపుత్రికలు మరి పెళ్లే చేసుకోరంటారా తమరు?

నన్నయభట్టు—అది శీలనైశిత్యాన్ని పట్టి వుంటుంది. సత్యవంతులవారిని ప్రేమించి చివరికి సావిత్రీదేవమ్మగారేం చేశారో మనకి తెలియనిదా? సాల్వప్రభుబద్ధానురాగలైన అంబగారి విషయం యెలా పరిణమించిందో మన మెరగనిదా? లోకంలో యింకా అనేకరకాలు మనం చూస్తూవుండలేదా?

కనక, ఏది యేమయినా, ఆరాజపుత్రిక లందరూ ఏలినవారికి కోడలుబావివా రని అంగీకరించకతప్పదు.

రాజరాజు — అలాగే కానీయండి. అయితే, ఆ వావి తప్పనీ, పనికిరా దనీ, త్యాజ్యం అనీ యేగ్రంథంలో వుందీ?

చిట్టిపీరన్న — (మెకుపుకొట్టిన ట్టయి మొదట రాజు కేసీ, తరవాత నన్నయభట్టు కేసీ చూస్తాడు)

నన్నయభట్టు —(చకితుడై వాక్యక్షణం నీరవు డయిపోయి వుండి) మహాప్రభూ! అర్థాలు తియ్యడమే పనిగా పెట్టుకుంటే యేది యేమయినా చెయ్యవచ్చు. అయితే, వావి అంటే వావి మాత్రమే కాదు. యువరాజులుంగారు మనసారా యేరాజపుత్రికనో వరించి, ఆ విషయం స్పష్టపరిచేదాకా, మొత్తానికి వారందరూ తమకు కోడళ్లే.

రాజరాజు—పోనీ, తరవాత? (చిట్టిపీరన్న కేసి సగర్వంగా చూస్తాడు)

చిట్టిపీరన్న— నన్నయభట్టు కేసి దెబ్బతిన్నట్టు చూస్తాడు)

నన్నయభట్టు — తరవాత వారెవరో మన మెవరమో?

రాజరాజు—ఇప్పుడు మాత్రం తమ రాసూత్రం యెందు కన్వయించుకోరూ?

చిట్టిపీరన్న—(నన్నయ కేసి నిరుత్సాహంగా చూస్తాడు)

నన్నయభట్టు — (కొంచెం తీవ్రంగా) ఇప్పు డది అన్వయించదు కనక.

రాజరాజు — (వెటకారంగా నవ్వి) తమరు విడ్డూరాలు సెలవిస్తున్నారు. మహాకవీ! ధార్మికవిషయాలలో తమకు తెలవనివి లేవు. తమరు సూక్ష్మవిచారణ చెయ్యాలి; గాని తలిమ్మా విషయాలకు ప్రాధాన్యం యివ్వకూడదు.

నన్నయభట్టు—సూక్ష్మవిచారణ చేసే నేను మనవి చేసుకుంటున్నాను.

రాజరాజు— లేదు, ఎంత మాత్రమూ లేదు. తమ రిప్పుడు కవితావేశంతో వున్నారు. అంచేత భ్రాంతులై మాట్లాడుతున్నారు.

నన్నయభట్టు — భ్రాంతా? మహాప్రభూ! నాకు భ్రాంతా?

రాజరాజు — (వొత్తిపలుకుతూ) అవును రాలేనా. కాకేమీ?

నన్నయభట్టు — భ్రాంతి తమది, నాది కాదు. ధర్మనిర్ణయం చేసేటప్పుడు కవితావేశం వస్తే మాటలు పొంకంగా పడతాయి; గాని ధర్మమే తారుమారు కాదు. కవితావేశంతో వున్నప్పుడు మాయావృత మైన యీజగత్తులో అపరిచ్ఛిన్న మైన సత్యం గోచరిస్తుంది. ఇక భ్రాంతి కలగడం మోహావేశంతో వున్నప్పుడే మహాప్రభూ!

చిట్టిపీరన్న — (నన్నయ కేసీ, రాజరాజు కేసీ కంగారుగా చూస్తాడు)

రాజరాజు— (ఉదాసీనత కనపరుస్తూ) తమరు పెద్దలు, వేత్తలు, మహాకవులు, చిన్న చిన్న మాటలతో రసనిష్పత్తి చెయ్యగలవారు. కనక, యిప్పటి నాప్రవృత్తికి కారణం మోహావేశమో, మరొకటో తమకు విన్నవించడంవల్ల ప్రయోజనం లేదు; కాని,

అబ్బాయికి చిత్రపటాలు పంపించినప్పుడు రామభద్రరాజు కూతురు విషయం ఆలోచించవలసిన పనిలేదనీ, వీలే లేదనీ వర్తమానించాను. తమ రిది గమనించారా!

నన్నయభట్టు— చక్కగా గమనించాను. నేనే కాదు, అబ్బాయిగారి వివాహం కోసం యేలినవారు చేసి, చేస్తూవున్న ప్రయత్నాలు తెలిసినవా రందరూ కూడా తెన్నగా గమనించే వున్నారు. అంచేతనే నేనీవిషయం తమతో యింతదూరం మనవి చేసుకోవలసివచ్చింది.

రాజరాజు—అదేమిటండీ?

నన్నయభట్టు—జక్కులదీవి రాజపుత్రికను కేటాయించడమే శుద్ధతప్పు. తమ రిది గమనించారా?

రాజరాజు— (ఒక్కక్షణం నిరవుడై వుండి, తరవాత చిట్టిపేరన్నతో) ధర్మనిర్ణయాన్ని పురస్కరించుకుని ప్రారంభమైన ప్రసంగం మరొకదారికి పోతోంది.

చిట్టిపేరన్న—భట్టారకులవారు విషయదూరులు కావడం లేదనే నానమ్మకం మహాప్రభూ!

రాజరాజు— (తిరస్కార ముద్రతో) అలాగా?

నన్నయభట్టు— నేను విషయదూరుణ్ణి కావలసిన కారణం యిప్పు డేమి సంభవించింది మహాప్రభూ? ఇది క్లిష్టమైన విషయం కాదే? ధర్మం అంగీకరించడం వేరూ, ఆచరించడం వేరూ కావచ్చు గాని— (అర్ధోక్తి)

రాజరాజు— (దారి దొరికిం దన్నట్టు ధైర్యంగా) తమ రిప్పుడు కొంచెం రాజనీతి దృష్ట్యా పరిశీలించండి మహాకవీ!

చిట్టిపేరన్న—(ఉలిక్కిపడి) రాజ నీతి దృష్టి!

నన్నయభట్టు—(నిక్కచ్చిగా) ఇక్కడ రాజనీతి ప్రసక్తి యేమిటి మహాప్రభూ?

రాజరాజు—అంతానూ.

నన్నయభట్టు—ఏమీా లేదు. ఏలినవారి కిది కేవలమూ సాంసారికవిషయం.

రాజరాజు— తమ రంత సూక్ష్మవిచారణకు పూనుకుంటే, నా సంసారంలో మళ్లీ యిది నా సొంతవిషయం అని తమకు వేరే చెప్పనక్కరలేదు.

నన్నయభట్టు—తమరు సరిగా సెలవిప్పించారు. తమ సొంతవిషయమే నేను మనవి చేసుకుంటున్నది.

రాజరాజు— (ప్రత్యుత్తరం తోచక చూస్తూ వూరుకుంటాడు)

నన్నయభట్టు — ఏలినవారి వంశకర్తలలో వొకరైన ప్రతీపమహారాజులుంగారు, కుడితొడమీాద కూచున్న కారణంవల్ల కోడలుగా భావించి, కోరివచ్చిన గంగాదేవమ్మగారిని తిరస్కరించివున్నారు. జ్ఞాపకం...?

రాజరాజు—సెల విప్పించండి.

నన్నయభట్టు— అక్కడ తమ్మే కోరివచ్చిన యువతిని తిరస్కరించడం, ఇక్కడ తామే కుమారులకోసం వుద్దేశించిన యువతిని పరిగ్రహించబూనడం. ఈ సన్నివేశాలు రెండూ పరిశీలిస్తే—(అర్ధోక్తి)

రాజరాజు— దాని కిక్కడ పోలికే లేదు. ఇలాంటి కుశ్శంకలు పెంచుకూ

చుంటే ఎవరూ కూడా క్షణం అయినా బతకలేము.

నన్నయభట్టు—(తల పంకిస్తూ) కుశ్శం కలు—

రాజరాజు—ముమ్మాటికీనీ. ఎందుకు కాదూ ? సీతాస్వయంవరానికి కెవరెవరో వచ్చారు. అందరూ ఆమెని కోరే— గాఢంగా కామించే వచ్చారు. ఆమెని తలచుకుని సుఖస్వప్నాలు కనుక్కుంటూనే వచ్చారు. తమకు ప్రతిపాదించిన ధర్మ సూత్రాన్ని పురస్కరించుకుని చూస్తే,సీతా అమ్మవారు, ఎవరిమట్టుకు వారికే పరస్త్రీ అయిపోవడం లేదూ ?

నన్నయభట్టు—(హృదయం దూసుకు పోయినట్టు మొదట కొంచెం స్ఫుటంగా బాధ కనపర్చి, చివరికి చురచుర చూస్తూ) మహాప్రభూ! యుక్తులకు స్థానాస్థానా లున్నాయి. అధికారానికిన్నీ పరిమితి వుంది. ఎటు చూసినా, ధర్మానికి ప్రాతికూల్యం వహించడం శ్రేయస్కరం కాదు. కన్యావరణంలో కొడుకుతో పోటీపడడం—(అర్థోక్తి)

చిట్టిపీరన్న— (నన్నయతో) మనవి చేసుకుంటాను. (రాజుతో) మహాప్రభూ! తమ రిప్పుడు చాలా దూరం ఆలోచించ వలసి వుంది.

రాజరాజు— (చిట్టిపీరన్నతో) ఎంత దూరం ఆలోచించాలో అంత దూరమూ ఆలోచించే (పెట్టె గుద్దుతూ)నే నీపనికి పూనుకున్నాను. (నన్నయతో) తమరు ఇకనైనా చరిత్రచర్వణం కట్టిపెడితే చాలా బాగుంటుంది.

చిట్టిపీరన్న—(నన్నయ కేసి తిరిగి) చరిత్ర చర్వణం—

నన్నయభట్టు— (ఉద్రిక్తుడై, వెంటనే ఉద్రేకం అణుచుకుంటూ) చిత్—తం...... కట్టిపెడతాను...మహాప్రభూ! కట్టిపెట్టేస్తాను. నేను చేసేది చరిత్రచర్వణం అని తమరు నిక్కచ్చిగా సెలవిప్పించేటప్పుడు...ఇక చెప్ప వలసిం దేమి వుందీ? కాని, కల్లోలాలు చెల రేగే సూచనలు—(అర్థోక్తి)

రాజరాజు—కల్లోలాలు!

నన్నయభట్టు— అవును. కల్లోలాలే. ఆవేళ... ? బురుజుమీాదా...? చిత్రపటాలు పరిశీలించేటప్పుడు... ? జక్కులదీవి రాజ పుత్రిక విషయమై చెప్పిన వన్నీ—(అర్థోక్తి)

రాజరాజు — (వికటంగా మందహాసం చేసి) అదా? ఇంకా తమ రదే మననం చేసు కుంటున్నారా ? (దృఢస్వరంతో) మహా కవీ! అప్పుడే అది అప్రస్తుత — అసందర్భ ప్రశంస. మళ్లీ ఆవిషయం తవ్వి తల కెత్తు కోవడం మరీ అనుచితం.

నన్నయభట్టు—చి—త్తం.

రాజరాజు — ఈపాటికి తమరు ప్రకృతిస్థు లయివుండవలసింది.

నన్నయభట్టు—చి—త్తం.

రాజరాజు—ఏతావతా, రామభద్ర రాజు తన కొమార్తను నాకిచ్చి పెళ్లి చేయడానికి సర్వమూా సన్నద్ధం చేసుకుని వున్నాడు.

నన్నయభట్టు— (ఉలిక్కిపడి చిట్టిపీరన్న కేసి చూస్తాడు)

చిట్టివీరన్న—ఇది కొత్తసంగతి. మహాప్రభూ! వ్యవహారం చాలా రహస్యంగా జరిగినట్టుంది.

రాజరాజు—రహస్యాని కేం వచ్చిందీ! రామభద్రరాజు స్వయంగానే యీ విషయం తెలియపరిచాడు. అతని కూతురు త్రికరణయా అంగీకరించింది.

చిట్టివీరన్న — జక్కులదీవి మండలేశ్వరులే కోరి వర్తమానించినట్టా?

రాజరాజు—(గజిబిజిపడి వొకమాటు అటూ యిటూ చూసి, దిటవు తెచ్చుకుని) అవును. మహారుద్రయ్యగారు వెళ్లివుండకపోతే అతని విజ్ఞప్తి యిక్కడికే వచ్చివుండేది.

చిట్టివీరన్న — మహారుద్రయ్యగారు వెళ్లాకే వారీ నిశ్చయానికి—(అర్ధోక్తి)

రాజరాజు— (నన్నయభట్టుకేసి చూస్తూ, ఉండు అన్నట్టు చిట్టివీరన్నకేసి చెయ్యి వూపుతూ, నన్నయభట్టుతో) కనక, అవసరమయితే తమకు మరొక ప్రస్తావన చెయ్యడం మంచిది.

చిట్టివీరన్న—(నన్నయకేసి చూస్తూ ఇక లాభం లేదన్నట్టు నిరుత్సాహం కనపరుస్తాడు)

నన్నయభట్టు— ఈవిషయం యిలా తేలింది. ఇక మరొకవిషయం............ ఏదో వొకటి మాట్లాడా ననిపించుకుంటే చాలని నేనిక్కడికి రాలేదు. ధర్మానికి గ్లాని సంభవించినప్పుడు—(అర్ధోక్తి)

రాజరాజు—ధర్మాని కిప్పుడేమీ గ్లాని రాలేదు. ధర్మనిర్ణయంలో అభిప్రాయభేదం మాత్రమే వచ్చింది.

[నన్నయభట్టూ, చిట్టివీరన్నా నిర్విణ్ణులై వొకరికేసి వొకరు చూసుకుంటారు.]

నన్నయభట్టు—అభిప్రాయభేదమా?

రాజరాజు—అవు, నంతే.

నన్నయభట్టు— చాలా వింతగా వుంది. కోడలుగా స్వీకరించదలిచిన కన్యను భార్యగా పరిగ్రహిస్తూ "అభిప్రాయభేదం మాత్రమే" అనడం చాలా సాహస మైన మాట.

రాజరాజు—(పక్కకి చూస్తూ విసుగ్గా) కోడలు! కోడలు! ఒకటే ధోరణి. (చురుగ్గా చూస్తూ నన్నయతో కచ్చితంగా) అయితే, నేను తమరు చెప్పినట్లల్లా విని పడివుండవలసిందేనా? ధర్మనిర్ణయంలో నాస్వబుద్ధి వినియోగించుకోనే కూడదా?

నన్నయభట్టు— అప్రశ్న యిక్కడ సంగతంగా లేదు. తమకు తెలవని ధర్మరహస్యాలు లేకపోవడం నిజమే. కాని యిది సొంతవిషయం. పైగా, కాంతాసంబంధం కూడా అయినప్పు డిక వేరే చెప్పడం యెందుకూ?

రాజరాజు—(ముదలకింపుగా)"చెప్పడం యెందుకూ?" అనే నేనూ అడుగుతున్నాను.

నన్నయభట్టు— నేను కులబ్రాహ్మణ్ణి కనక.

రాజరాజు—(తల పంకిస్తూ చూస్తాడు)

నన్నయభట్టు— కులబ్రాహ్మణపదవి వినోదంకోసం స్థాపించబడ్డది కాదు కనక.

రాజరాజు—(మళ్లీ తల పంకిస్తాడు)

నన్నయభట్టు— ప్రాణికోటి అంతా ప్రభువుకి వశవర్తి; కాని ఆప్రభువు కుల బ్రాహ్మడి వశవర్తి అయి వుండితీరాలి కనక.

చిట్టివీరన్న—(అంజలిబంధంతో)మహాకవీ! మహాకవీ! మహాప్రభూ! మహాప్రభూ!

రాజరాజు—(అది వినిపించుకోకుండా నన్నయతో)అగత్యం లేనిదే తమరు వ్యగ్రులవుతున్నారు. తమ పదవి కలుషితం కానేలేదు.

నన్నయభట్టు-(దృఢస్వరంతో) అయితే, యేలినవారు, ఈవయస్సులో మళ్లీ ఒక నవోఢను పెళ్లి చేసుకోవాలని సంకల్పించుకోడమూ, విశేషించి జక్కులదీవి రాజపుత్రిక యెడల అనురక్తులు కావడమూ కేవలమూ ధర్మబాహ్యాలని నేను నిష్కర్షగా నిర్ణయిస్తున్నాను. తమరు దీన్ని జవదాటడానికి వల్లకాదని ఖచితంగా విధిస్తున్నాను.

చిట్టివీరన్న—(దోసిలి వొగ్గి ఆత్రంగా రాజుతో) మహాప్రభూ! నామనవి— నా మనవి— (అర్ధోక్తి)

రాజరాజు— (మీరుండండి అన్నట్టు, చూడకుండానే పళ్లు బిగించి చిట్టివీరన్నను చేత్తో నిషేధించి, నన్నయతో రోషంగా) మీ ధర్మనిర్ణయం శుద్ధతప్పు. మీది పదవికి మించిన ఆజ్ఞ. కనక, నేను నిస్సంకోచంగా నిరాకరిస్తున్నాను.

నన్నయభట్టు—(చెయ్యి జాడిస్తూ)అదీ మాట. అదీ తేలవలసిన పర్యవసానం. ఇంత ఘనీభవించిపోయిన తరవాత అది నిగూఢంగా యెందు కుండిపోవాలీ?

రాజరాజు—ఘనీభవిస్తే యేమిటండీ? జగన్నియంతను నాకు రహస్యం యేమండీ?

నన్నయభట్టు—తమరు జగన్నియంతలే. అయితే, ఆ నియంతృత్వానికి ధర్మనిబద్ధం అయివున్నంత నేపే చెల్లుబడి. నిజానికి, నిన్నటిదాకా, ధర్మదేవతకు చళుక్య సామ్రాజ్యమే ఆటపట్టు; కాని, యివాళ అక్కడే ఆ ధర్మదేవతకు పాదప్రహారం జరిగింది. ఇది లజ్జావహమైన పరిణామం. తెలిశాక కూడా ముక్కు మూసు క్కూచోడం అవివేకం. తమరు మహాభారతం తమపేర ఆంధ్రీకరించమని సెలవిప్పించినప్పుడు తాము ధర్మరక్షకులుగా వుండడంవల్ల నే అంగీకరించి నేనందుకు పూనుకున్నాను; కాని తమ ధనకనక వస్తువాహనాదులు ఆశించి కాదు. పాండవుల ధర్మైతిహాసం వారి సంతతివారి ప్రేరేపణవల్ల నే ఆంధ్రీకరించబడడం చాలా గొప్ప సంగతి అనీ, అది నాకు వ్యాసమహర్షి పదవి సంఘటిస్తుం దనీ— ఇలా అనుకునే నే నుప్పొంగిపోయాను; కాని వైదికధర్మం కాల రాసేసిన తమపేరుమీదుగా పంచమవేదం ఆంధ్రీకరించడం చాలా అనుచితమైన పని. ఇంకా ఆపనే సాగిస్తే నాపదవితో పాటు నాజన్మకూడా కలుషితం అయిపోతుంది; కనుక ఇంతటితో నేనది కట్టిపెట్టేస్తున్నాను. ఈవిధంగా, నాపదవికి కూడా యిప్పుడే స్వస్తివాచనం అయిపోయింది కనక (గభీ మని లేచి) ఇదే నేను వెళ్లిపోతున్నాను. (చివాలున వెళ్లిపోతాడు.)

[రాజూ, చిట్టివీరన్నా మొదట కనపడ్డంతనేపూ నన్నయకేసి చూసి తరవాత వొకరికేసి వొకరు చూసుకుంటారు.]

చిట్టివీరన్న—మహాప్రభూ! అంతా

విషమిస్తోంది. తమ రిప్పటి కేనా దూరం ఆలోచించకపోతే యింకా చిక్కులు వస్తాయి. సెలవయితే, నేను వెళ్లి, కాళ్లా వేళ్లా పడి ప్రార్థించి భట్టారకులవారిని తీసుకు వస్తాను. వారిని న్యూనతపరచడం యేమీ మంచిది కాదు. భారతరచన ఆగిపోవడమే అపాయకరం. అందులోనూ అరణ్యపర్వంలో విఘాతం రావడం యెంతమాత్రమూ శ్రేయస్కరం కాదు. తమరు త్వరపడాలి. లేకపోతే—(అర్థోక్తి)

రాజరాజు—ఏమిటి లేకపోతే?(తాపీగా) కంగారుపడకండి. ఇంకటితో ఆగండి. మీరేమీ భయపడనక్కరలేదు. అంతా సవ్యంగా జరుగుతుంది. ఏదీ మిగిలిపోదు, దేనికీ విఘాతమూ కలగదు.

చిట్టిపీరన్న—తమ నమ్మకం యేమిటో, తమకీ ధైర్యం యెలా కలుగుతోందో నాకేమీ బోధపడ్డం లేదు.

రాజరాజు—అంతా బోధపడుతుంది, కొంచెం ఓపిక పట్టండి. ఒకానొక ప్రాజ్య సామ్రాజ్యానికి ప్రధానులు, మీరే యిలా బేలపోవడం ప్రశంసాపాత్రం కాదు.

చిట్టిపీరన్న — భట్టారకులవారు — (అర్థోక్తి)

రాజరాజు— వారు సర్వసమర్థులే. ఎవరూ కాదనడం లేదు; కాని వారి కావేశం యెక్కువ. వారి దినచర్యలో క్షణక్షణమూ అది కనపడుతూనే వుంది. అది, వారికి, కవిత్వంవల్ల సంక్రమించిన దోషం. పరిశీలించి చూడండి, కవిత్వమూ, ధార్మికత్వమూ వొకదాని కొకటి చుక్కెదురు; వాటి కెప్పుడూ పొత్తు కుదరదు. దురదృష్టవశంవల్ల భట్టారకులవారి దగ్గిర అవి రెండూ పరమావధి పొందాయి; కాని దురత్యయమైన వాటివేగం వారు తాళుకోలేకపోయారు. అంచేతనే వారిప్పు డిలాగ మహోన్మాదప్రదర్శనం చేశారు. పోనివ్వండి. మీరేమీ బెంగ పెట్టుకోకండి.

చిట్టిపీరన్న — భట్టారకులవారి దగ్గిర కవితావేశం లేదని నేననను; కాని వారు చేసిన ధర్మనిర్ణయం మాత్రం తప్పు కాదు.

రాజరాజు—అది మీ కలాగే కనపడుతుంది; కాని వారు కొద్దిరోజుల్లోనే తమ తప్పు తెలుసుకుంటారు. పశ్చాత్తాపం పొంది, యథాపూర్వంగా తమ విధులున్నూ సక్రమంగా నిర్వహించుకుంటారు. కనక, తొందరపడి, మీరు, వారి పేరుగా జరుగుతూ వున్న ఏర్పాట్లు ఏమీ తగ్గించబోకండి.

చిట్టిపీరన్న—చిత్తం. నేను చెప్పవలసింది చెప్పకపోవడం ధర్మం కాదు; కనక విన్నవించుకుంటున్నాను. భట్టారకులవారు తమరు భావించినంత చలచిత్తులు కారు.

రాజరాజు—మీరలాగే అనుకుంటూ వుండండి. కొద్ది దినాల్లో, యీభట్టారకులవారే నా నవవధువును ఆశీర్వదించి నన్ను ప్రశంసిస్తారు.

చిట్టిపీరన్న—(నిరాశ కనపరుస్తూ) ఇక తమ చిత్తం. నా కిప్పటికి సెలవిప్పించండి.

రాజరాజు—వెళ్లిరండి.

[చిట్టిపీరన్న వెళ్లిపోతాడు]

రాజరాజు—(పక్కకి చూస్తూ) ఎవరక్కడ?

[చిట్టి వస్తుంది]

చిట్టి—చిత్తం మహాప్రభూ!

రాజరాజు — మహారుద్రయ్యగా రెక్కడ?

చిట్టి— వర్తమానించి కింద వేచి వున్నారు మహాప్రభూ!

రాజరాజు— సరే, చంద్రశాలలోకి పంపు.

చిట్టి—చిత్తం.

రాజరాజు—ముందు పానీయం పంపు. పోసీ, నువ్వే పట్టుకురా. (వెళ్లిపోతాడు)

చిట్టి—చిత్తం చిత్తం. (వెళ్లిపోతుంది)

తొమ్మిదో రంగం

రాజరాజు విలాసమందిరం.

కోటలో వున్న భవనా లన్నిటిలోనూ అది దక్షిణపు చివర వుంది.

రాజరాజు నగరికంటేనూ, రత్నాంగి నగరికంటేనూ అది కొంచెం చిన్నది; కాని అందులో వున్నన్ని గొప్పవస్తువులు మరెందులోనూ లేవు.

చక్రవర్తి సార్వభౌముల వైభవాని కది ప్రదర్శన శాల అని చెప్పవచ్చు.

రాజూ, మహారుద్రయ్యా తప్ప మరెవరూ అందులోకి వెళ్లడానికి వల్లకాదు.

ఏ కొళకిద్దరో తప్ప భృత్యులున్నా అక్కడికి వెళ్లకూడదు.

రాజుపరిచారికలకు మాత్రం అడ్డేమీ లేదు.

రాజు అక్కడి కెప్పుడు వెడతాడో, ఎందుకు వెడతాడో, వెళ్లి యెంతసేపుంటాడో యెవరికీ తెలవదు.

దాని శాశ్వత అంతా మహారుద్రయ్యది.

గడియ కిందటే వచ్చి చిత్రాంగి అందులో విడిసింది.

చిలకా, రుక్కు కాక, ఆమెవెంట, అరణపు దాసీలు మరో యిరవై అయిదుగురు వచ్చారు. ఇరవై మంది భృత్యులున్నూ వచ్చారు.

రాజరాజు భృత్యులు, సెలవై తేనే - సమ్మం దాకానే వెళ్లవచ్చు. పరిచారికలు కింది అంతస్తులోకి మాత్రమే వెళ్లవచ్చు.

జక్కులదేవి పరిచారకులు కూడా కిందే వుండాలి. జక్కులదేవి దాసీలు పైనే వుండవచ్చు; కాని పిలుపు వస్తేగాని లోపలి గదుల్లోకి వెళ్లకూడదు.

అక్కడి సర్వాధికారాలూ చిత్రాంగి అనుమతికి లోబడి చిలకవి.

రుక్కు చిలకతరవాత అంతటిది.

జక్కులదేవిపరిచారికలు సారెసామా నంతా యథార్థంగా సర్దుతున్నారు.

చిత్రాంగి, గుడికి వెళ్లిన మేకలాగ, వెనకవసారాలో బాలీసుకి ఆనుకుని రత్నకంబళీమీద కూచుని వుంది.

పక్కని కూచుని, చిలక, చిత్రాంగి ధరించి వున్న నగలలో అసాధారణాలైనవి ఒక్కొక్కటే వొలిచి దంతపుబరిణలో వుంచుతోంది.

చిలక కూడా నిరుత్సాహంగానే వుంది.

అప్పటికి నాలుగు గడియల పొద్దు మాత్రమే వుంది.

***

చిత్రాంగి—అనుభవించడం తప్పనప్పుడనుకుంటే వచ్చిన తప్పేమిటీ? నే నిప్పుడు అభిసారిక నయ్యే వున్నాను.

చిలక—(మాట్లాడదు. నగలు వొలుస్తూనే వుంటుంది.)

చిత్రాంగి— అభిసారిక ప్రియుణ్ణి వెతుక్కుంటూ సంకేత స్థలానికి వెడుతుంది.

నేను తిన్నగా ప్రియుడి యింటికే వచ్చే శాను. ఈ తేడా మాత్రం వుంది.

చిలక—(మాట్లాడదు. నగలు వొలు స్తూనే వుంటుంది.)

చిత్రాంగి—అయితే, యీ సాహసానికి ఫలితం? ఈ జన్మకి సాఫల్యం వుందా?

చిలక—(గడ్డం పట్టుకుని చిత్రాంగిని బతిమాలుతూ) వద్దు తల్లీ! గోడలికి చెవు లున్నాయి మామ్మా!

చిత్రాంగి—అయితే, అక్కడి గోడలికి కూడా చెవు లున్నాయా మరీ!

చిలక—(మాట్లాడదు. నగలు వొలు స్తూనే వుంటుంది.)

చిత్రాంగి—సాఫల్యంమాట దేవు డెరు గును, అక్కడకూడా యిలాంటి తపన వున్నట్టు తెలిస్తేగాని బతుకు కడతేరడం మెలాగా?

చిలక—అది సుఖసుఖాల తేలే విష యమా తల్లీ! అసలే మహా— గంభీరు లని బిరుదాయె, ఈ సమయాన అది మరింత గంభీరం అయిపోయి వుండదూ? తమలో తా మయినా మథనపడడానికి వారి కవకాశం ఉందో లేదో? సుబుద్ధి అయ్యవారు—(అర్ధోక్తి)

చిత్రాంగి—(చెవులు మూసుకుని) శివశివా! ఆ పేరెత్తకే. నా ఆశ కాయో పండో తేలిపోయేదాకా ఆ భూతం నాకళ్ల బడకుండా చూడవే.

చిలక—వారు షష్టిగడియలూ సుబుద్ధి అయ్యవారిని విడిచివుండ రని వింటాం కదా, యిక్కడ నేనేం చేతునమ్మా?

చిత్రాంగి—(నిరాశతోటీ, నిరసన తోటీ చేతులు దులుపుకుంటూ) శని...శని గాడు...ఆదిలోనే వక్రించాడు. ఈ సంగతి వా రిప్పటి కయినా గ్రహించుకోకపోతే యేమిటి దారి?

[తెరలో]

"చిలకా!"

చిలక—ఆ! రావచ్చు.

[రుక్కు వస్తుంది.]

రుక్కు—మహారాజు దయచేశారు. దర్శనం—(అర్ధోక్తి)

చిత్రాంగి—(దురుసుగా) వల్ల కాదని చెప్పు. ఇంకా మించిపోలేదు. యీపాటికి దయచెయ్య మని చెప్పెయ్యి.

చిలక — (చిత్రాంగిగడ్డం పట్టుకుని) మీా రుండండి తల్లీ! (రుక్కుతో) ఏమిటే?

రుక్కు—మహారాజూ, మహారుద్రయ్య గారూ వచ్చారు.

చిలక—వచ్చి?

రుక్కు— మహారాజు మొగం కలక ల్లాడిపోతోంది.

చిత్రాంగి —ఆ మొగంమీాద నిప్పులు పొయ్యి. వెళ్లు.

చిలక—(చిత్రాంగిగడ్డం పట్టుకొని) మా అమ్మకాదూ? ఇవాళకి మీాకళ్లబడ నివ్వను. మిమ్మల్ని చూడనివ్వను. ఇక్క డికి రానివ్వనే రానివ్వను, సరా?

చిత్రాంగి—(మొగం పక్కకి తిప్పు కుంటుంది)

చిలక— కొంచెం సేపు వూరుకోం డమ్మా. (రుక్కుతో) ఎక్క డున్నారే?

రుక్కు—కిందే వున్నారు.

చిత్రాంగి—మెట్లమీద కూడా అడుగు పెట్టడానికి వల్ల కాదని చెప్పు.

చిలక—ఏం చేస్తున్నారే?

రుక్కు—ఏమిటేమిటో పురమాయిం పులు మాట్లాడుకుంటున్నారు.

చిత్రాంగి—పురమాయిస్తారు, పురమాయిస్తారు. (చిలకతో) నువ్వెళ్లి తొరగా సాగనంపెయ్యక యింకా కూచుంటావేమే?

చిలక—ఇదిగో వెడుతున్నాను. (లేచి రుక్కుతో) పదవే.

[చిలకా, రుక్కూ వెళ్లిపోతారు.]

చిత్రాంగి—వచ్చి గడియ కాలేదు, ముసలిరాజప్పుడే సిద్ధం. నాగతి యింతకి వచ్చేసిందా? ఆడదాని జన్మ యింత దిక్కుమాలిందా?........... కాదు కాదు. ధైర్యంగా నిలిచి ఆడది యెదురుకోగలిగితే మొగాడు ఉక్కిరిబిక్కిరయిపోతాడు. నేనెందుకు బేలపోవాలి? నా తండ్రి తనకి సామంతుడు కనక యీ రాజు నన్నాక్రమించుకోగలిగాడు. మరి తానిప్పుడు నాకు భృత్యుడయిపోయి వుండడం గుర్తించుకున్నాడా? నేను తలుచుకుంటే ముకుదాళ్లు పోసి ఎలుగుబంటి నాడించినట్టు తన్నాడించగలను, యీ సంగతి తెలుసా? కాని...ఛీ... అదేం బతుకూ? ముసిలాణ్ణి దద్దమ్మని చేసి యీ సామ్రాజ్యం అంతా కొనగోట నిలపాలంటే క్షణం; కాని దానివల్ల నా జన్మ కలుషితం అయిపోదూ? పెట్టిపుట్టానా, సారంగధరులవారి కౌగిట కరగిపోతాను. లేదూ, నా కైజా రుండనే వుంది. నాబతుకు బుగ్గిచేసి యీ రాజేమి బావుకోగలడూ? వీలుతప్పి వచ్చేటట్టయితే, యీ ముసలి పీనుగుని సమూలంగా నాశనం చెయ్యకపోతే నేను చిత్రాంగిని కాను.

[చిలక వస్తుంది.]

చిత్రాంగి—ఏం, బుద్ధిగా వెళ్లాడా?

చిలక—కీలెరిగి వాతబెడితే వెళ్లక యేం చేస్తారు తల్లీ?

చిత్రాంగి—ఏం జరిగిందీ? నువ్వేం చెప్పావూ?

చిలక—పూజ—(అర్ధోక్తి)

చిత్రాంగి—(చిటికెవేస్తూ) సెబాస్!

చిలక—దాంతో నవనాడులూ కుంగిపోయాయి.

చిత్రాంగి—ఇక మిడసరిలగ్గంలో వస్తాడు. అంతేకాదూ?

చిలక—అంతే తల్లీ!

చిత్రాంగి — అట్నుంచి నరుక్కువద్దాం. అయితే, వెళ్లిపోయాడా?

చిలక — వెడుతూ వెడుతూ — (అర్ధోక్తి)

చిత్రాంగి—ఏమిటి వెడుతూ వెడుతూ?

చిలక—ఒక్కమాట చెప్పారు.

చిత్రాంగి—ఏమనీ?

చిలక—భోజనం అయినాక వొక్కమాటు మహారాణీ దర్శనం చేసుకు రమ్మన్నారు. అది చాలా అగత్యమట. దాని వల్ల చాలా మేళ్లున్నాయిట.

చిత్రాంగి — (లేస్తూ) కాదని ఎవరంటారూ? తప్పకుండా దర్శనం చేసుకుందాం. కథ అంతా సవ్యంగా నడిచినా నాకు మొదట అయ్యేది అత్తయ్యగారి దర్శనమే. ఇప్పుడూ అదే లభిస్తోంది; చాలా సంతోషం. కనక, భోజనం చేసుకుని దర్శనానికి వస్తున్నామని వర్తమానించు.

చిలక — అలాగే. (చిత్రాంగి రెక్క పట్టుకుని) ఒక్కమా టలా వెళ్లి కాసేపు లతామండపంలో కూచుని వద్దాం రండమ్మా!

చిత్రాంగి — పద.

చిలక — (చిత్రాంగిని ఒక్క అడుగు వేయించి, ఆగి, వెనక్కిచూస్తూ) రుక్కూ!

[తెరలో]

వచ్చాను.

[రుక్కు వస్తుంది]


చిలక — (కళ్లతో చూపిస్తూ) అదిగో బరిణ, జాగ్రత్త చెయ్యి. స్నానానికి సకలమూ సిద్ధంచేయించు. తామరపువ్వు లింకా రాలేదనీ, దీపాలు పెట్టేటప్పటికి కలవ పువ్వులు రావా లనీ — తెలిసిందా?

రుక్కు — చెప్పాలా? రాజుగారి మనుష్యులకు అరికాళ్లకింద మంటలు పెట్టిస్తాను.

చిత్రాంగి — (వెనక్కి చూస్తూ) ఆ మంటలు రాజుకి తగలాలి, తెలుసా?

రుక్కు — చిత్తం అమ్మా!

[అందరూ వెళ్లిపోతారు]



కాండీ విహంగమ దృశ్యము, సిలోను

ఘంటాకర్ణుని శ్రీకృష్ణ స్తవము

● శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి ●

పాపం బెడలును పశ్చా
త్తాపంబున నందు రదియ ప్రాయశ్చిత్తం
బో పురుషోత్తమ! కాదే
నీపాదాలోకమునఁ బునీతుండఁ గానే?

శబ్దపూర్వకసృష్టి సాధన వేదంబు దొంగకు ముక్తి నొసంగలేద?
సర్వభూమండలిఁ జాపచుట్టగఁ జుట్టు పాపబుద్ధికి ముక్తి చూపలేద?
హరిహరి యను భక్తు నగచాల్లఁ బెట్టిన క్రూరాత్మునకు ముక్తి కూర్పలేద?
పరమర్షినుత పతివ్రత నెత్తుకొనిపోయి మెసఁగుకూళకు ముక్తి నీయలేదె?

నిన్ను నిందించి మెదిరించు నీచమతుల
కందఱికి నీవు ముక్తి నీయంగలేదె?
అట్టులే నన్నుఁ జక్రాన మట్టుపెట్టి
దీనవత్సల! యిమ్ము విదేహముక్తి.

నీమహిమఁ బుట్టె జగములు
నీమహిమనె విశ్వమెల్ల నిలిచెను దుదకున్
నీమహిమనె యణఁగారును
నీమహిమన నీవ యుందు నిగమనిదానా!

మందర మెత్తినావు నృపమండలి నిర్వదియొక్కమాఱు కి
న్కం దునుమాడినావు బలగర్వితుఁ డైన బలీంద్రుఁ నుద్ధతిఁ
గ్రిందికిఁ ద్రొక్కినావు చెలరేఁగిన యా శిశుపాలు దంతవ
క్త్రుం దునియించినావు బహురూపము నీ మహిమంబు కేశవా!

రాతిని నాతిఁ జేసి తిభరాజును బ్రోచితి గోపభామినీ
ప్రీతి యొనర్చి తంధునికి విశ్వముఁ జూపితి కుబ్జమేను వి
ద్యోత మొనర్చి తాశబరి కుత్తమలోక మొసంగి తుద్ధతా
రాతుల సంహరించితివి ద్రౌపదిమానము గాచి తీశ్వరా!

కొడుకును గూల్చి తండ్రి కొనగూర్చితి రాజ్యము, తండ్రిఁ జీల్చియుం
గొడుకునకుఁ సుఖంబు నొడఁగూర్చితి, తల్లి నణంచి తండ్రి యీ
సుడిపితి, వన్నఁ జంపి యొకయుం బొనరించితి తమ్ముఁ, దమ్ములం
గడపిన యన్న గర్వ మణఁగించితి వేమన నీ మహాత్త్వమున్ ?

కశ్యపుని శిక్ష గాంచితి కాలకంఠు
నుపచరించితి కౌశికునొద్ద నేర్చి
తధిగమించితి సాందీపనాంతికమున
విశ్వగురుఁడవు నీమాయ వేద్య మగునె ?

నీ యవతారంబులు నీ
-మాయలు లీలలు ననంతమహిమలు తెలియన్
నాయట్టివాని కగునే ?
మాయామానుషశరీర ! మహిమాధారా !

కనుఁగొనవచ్చితి నిన్నే,
కనవచ్చితి వీవె నాకుఁ గలలో, నీవే
కనుపించితి విచ్చట, నిం
కను నందియు మేల? లోకకర్తవు నీవే.

హరి హరి ! కృష్ణా కృష్ణా !
మురహార సురవర ! ముకుంద మునిజనవంద్యా !
కరుణింపు భక్తినమ్రుని
శరణాగతవత్సలా ! ప్రసన్నగభీరా !

[మదీ'యాంధ్రభవిష్య పర్వము'నుండి]

శ్రీనాథుడు - కర్ణాటభాష

> భీమఖండమునందలి "నాకవిత్వంబు నిజము కర్ణాట భాష"యను గీతచరణములోని 'కర్ణాటభాష' పదమును శ్రీనాథుడు ద్రావిడాంధ్రకర్ణాటభాషలని దేశ భాషావిభాగము చేయునప్పు డిచ్చు నర్థమునందుగాక ఆంధ్రదేశాంతర్భాగమైన 'కర్ + నాట=నల్లనినాడు'- అనగా ప్రాగుదీచీ, ప్రాగ్దక్షిణాంధ్రదేశ మను నర్థము ననే ప్రయోగించినాడు.

శ్రీ కుందూరి ఈశ్వరదత్తు

శ్రీనాథుడు భీమేశ్వరపురాణమునందు ప్రథమాశ్వాసములో కుకవినిరాకరణ సందర్భమున చెప్పిన యీ క్రిందిపద్యమున కాంధ్రపండితులు పలువురు పలువిధముల యర్థమును చెప్పి యుండిరి. ఆ పద్యమున కర్థము నే నిట్లు నిర్ణయించుచున్నాను. వివిధాభిప్రాయములను సమన్వయించి, కవితాత్పర్య మిద మిత్థమని తేల్చుటను విమర్శకులకు వదలి వేయుచున్నాను. ఆ పద్య మిది:

"తే. ప్రౌఢిఁ బరికింప సంస్కృత భాష యండ్రు
పలుకు నుడికారమున నాంధ్రభాష యండ్రు
ఎవ్వ రే మన్న నండ్రుగా కేల కొఱఁత,
నా కవిత్వంబు నిజము కర్ణాటభాష."

పై నుదాహరింపబడిన పద్యము కుకవినిరాకరణ సందర్భమునందు కవి చెప్పినాడు. గ్రంథ నిబంధన మాంధ్రభాషలో నున్నది. ఒకవిధమున సంస్కృత భాషయే యనియు, వేఱొక తెఱగున కర్ణాటభాషయే యనియు గవి యాయాంధ్రభాషకే రూపాంతరములు గల్పించినాడు. ఇట్లు చెప్పుటలో గవియుద్దేశ్య మేమైయుండును ?

మొదటిపాదము—

"ప్రౌఢి బరికింప సంస్కృతభాష యండ్రు"

పై పాదమున కర్థము సులభమే. శ్రీనాథుడే రెండు మూడుచోట్ల స్పష్టపఱచినాడు. భట్టహర్షుడు ప్రౌఢవాక్పాటవమున సంస్కృతములో రచించిన నైషధ సత్కావ్యమును దా నాంధ్రభాషగా నొనరించిన విధము ఆంధ్ర శృంగార నైషధ కావ్య పీఠికలో గవియే చెప్పుకొన్నాడు. తరువాత శ్రీ కాశీ ఖండ కృతిలో దన ప్రౌఢసాహిత్య సౌష్ఠవమును గూర్చి యిట్లు కృతిపతి సంబోధనలో నుటంకించినాడు:

"శా. ఈ క్షోణిన్ నినుఁబోలు సత్కవులు లే
కీ నేటి కాలంబునన్
ద్రాక్షారామచళుక్యభీమవరగం
ధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయ గంధసారఘుసృణ
ద్వైరాజ్యభారంబు న
ధ్యక్షించున్ గవిసార్వభౌమ! భవదీ
య ప్రౌఢసాహిత్యముల్."

—కాశీ ఖండపీఠిక, పద్యము ౧౪

పై పద్యమునకు బూర్వ సీసపద్య చరణమునందును గృతిపతిసంబోధనసందర్భములోనే,

"భాషింతు నన్నయభట్టుమార్గంబున
నుభయవాక్ప్రౌఢి నొక్కొక్కమాటు"

అని తన కవిత్వము సంస్కృతాంధ్రముల రెంటి యందును ప్రౌఢవాక్పాటవము గలదని వ్యక్తీకరించినాడు. నన్నయభట్టువిధమునసే శ్రీనాథుడును రెండు పంక్తులు సంస్కృతపదములు, నొకపంక్తు తెనుగు పదములును గల్పించి కవిత్వమును జెప్పినాడు. సంస్కృతపదభూయిష్ఠమై, తద్భాషాప్రౌఢసాహిత్య సమోల్లాసనమగు కవిత్వమార్గము నవలంబించుటచే, తాను జెప్పినది ఆంధ్ర కవిత్వమైనను, వాక్పాటవములో సంస్కృతకవిత్వమును బోలియున్నదని కవి యుద్దేశము.

రెండవపాదము —

"పలుకునుడికారమున నాంధ్రభాష యండ్రు"

ఈ రెండవ పాదములో 'నుడికార' పదమున కర్థము మొదట నిర్ణయించవలెను. నిఘంటుకారులు వ్రాసిన యర్థములను జెప్పి, అటుపిమ్మట నాకు దోచిన యర్థమును నిర్ణయించెదను.

నొడి, నొడికారము, నొడుగు, = పదము; వచనము. (ఆంధ్రపదపారిజాతము)

నుడి, నొడి = పదము ; వచనము.

నుడికారము, నొడికారము = మాటచమత్కారము.

నుడువరి, నొడికాడు, నొడికారి = మాటలమారి; మాటకాడు; మాటచమత్కారము కలవాడు. (శబ్ద రత్నాకరము)

ఆంధ్రభాషార్ణవములో "పలుకు", "నుడికారము" అను పదముల కర్థము వరుసగా "భాషితము", "పదము" అని కలదు.

1. "సీ. నుడువు, మతువు, నుడి, నుడికారము, నొడువు
నొడి, నొడికారము, నొడుగు నాఁగఁ
బద మొప్పు"

2. "గీ. నాకు నా భాషయో, నటవమ్మ తెనుఁగు
కన్నడం బన మఱి యిట్లు కొన్ని దేశ
భాషలై యొప్పఁ గలదవాఁ బలుకు నాఁగఁ
బొల్చు భాషితమై మాతృభూతలింగ."
—వాగ్వర్ణము.

శ్రీనాథుడే యీ నుడికారము, నొడికారము పదముల మఱి రెండుచోట్ల ప్రయోగించెను.

1. "ఉ. ఎట్టు పురాణము ల్పదియు
నెన్మిదిఁ జెప్పితి ? నెట్టు వేదముల్
గట్టితి వేర్పఱించి ? నుడి
కారము సొంపెసలార భారతం
బెట్టు రచించి ? తీవు ఋషి
నెట్టయి ? తొక్కదినంబు మాత్రలోఁ
బొట్టకు లేక తిట్టెదవు
పుణ్యగుణంబుల రాశిఁ గాశికన్."
—కాశీఖండము, స. ఆ. ప. ౧౯౩

2. "వ. కళావతీ, నీవు నొడికారపుమాట లాడం ప్రోడ వని విందుము; నీ వెఱుంగని పాడి పంతంబులు లేవు. తగవు దప్పక చెప్పెదేని కొన్నిమాటలడిగెదము; మాటలాడక విచారించి యుత్తరం బిమ్ము."
—శృంగారనైషధము, అ. ఆ. ప. ౨౧౫

శబ్దరత్నాకరకారుడు నుడికారపదమునకు కాశీఖండములోని ప్రయోగము నిచ్చి "మాట చమత్కారము" అని యర్థము వ్రాసెను. నొడికారపదమునకు నైషధములోని ప్రయోగము నిచ్చి "నుడికారముయొక్క రూపాంతర"మని యర్థము వ్రాసెను. శృంగారనైషధములోని ప్రయోగమునకు శ్రీ వెంకటరాయశాస్త్రులుగారు "నొడికారంపు = చమత్కారంపు" అని తమవ్యాఖ్యలో నర్థమును వ్రాసియున్నారు. ఈ ప్రయోగమునకు "మాటల చమత్కార" మని, మాటకాడు, లేక మాటకారి యుక్తియుక్తముగా మాటాడువిధ మని యర్థమే సందర్భమునుబట్టి తెలియుచున్నది. అట్లే "నొడికారి", "నొడికాడు", "నుడువరి" అను పదములకు మాటకారి, మాటకాడు అను నర్థమును పొసగును. శబ్దరత్నాకరకారుడు శ్రీనాథుని కాశీఖండ, నైషధములలోని ప్రయోగముల నిచ్చి, భీమఖండములో పై పద్య పాదములోని ప్రయోగ మిచ్చినాడు కాడు. కాశీఖండములోని "నొడికారము సొంపెసలార" అను సందర్భమున "మాటకారితనము పెంపొంద" అని యర్థము చెప్పుకోవడము బాగులేదు

వ్యావహారికభాషలో చమత్కారపదమునకు యుక్తి, ఉపాయము, ఉపలాలనము, పరియాచకము అను నర్థములు సందర్భమునుబట్టి యూహింప వచ్చును. శ్రీనాథుని నైషధ ప్రయోగమునకు కళావతి యుక్తియుక్తముగా మాటలాడు మాటకారియని తెలుసుకొనవలెను. భీమఖండ, కాశీఖండములందలి నుడికారపదమున కా యర్థము పొసగదు. పై రెండు గ్రంథములలోని "నుడికారము" ప్రయోగమునకు "పదము" అనిగాని, లేక ఆలంకారికపరిభాషలో సమానార్థకములైన "విచ్ఛిత్తి", "వైచిత్ర్యము", "చారుత్వము", "చమత్కారము", "సౌందర్యము", "హృద్యత్వము" అను నర్థములు గాని చెప్పవలెను. ఆంధ్రభాషార్ణవములో నుడికారమునకు పద మనియే యర్థ మున్నది. చమత్కార మను నర్థము లేదు. కాబట్టి నుడికార పదప్రయోగమునకీ రెండర్థములను జెప్పవచ్చును.

౧ పలుకు = భాషితము, మాటాడినది, చెప్పినది.

౨ నుడికారము = పదము, శబ్దము.

నా కవిత్వమునందు జెప్పిన మాటలు, లేదా భాషించిన పదములు, లేక శబ్దములు ఆంధ్రభాషా పదములే యౌటచేత నది యాంధ్రభాషయే యని యీ పాదమున కర్థము. ఈ నుడికారపదములోని "కారము" తద్ధితప్రత్యయము. నుడికారమున కాలంకారికపరిభాషలోనున్న చమత్కార మను నర్థమే చెప్పికొన్నయెడల "నా కవిత్వము చమత్కార శబ్దభూయిష్ఠమున నాంధ్రభాష" యని యర్థము వచ్చును. కాశీఖండములోని "నుడికారము సొంపెసలార" యను పదముల కర్థము "పదముల సౌందర్యము, లేక పదముల చమత్కారము అతిశయింపగా" అని చెప్పవలెనుగాని, నిఘంటువులో నిచ్చిన "మాటచమత్కారము, లేక మాటకారితనము అతిశయించునట్లుగా" అను నర్థ మిచ్చుట తగదు. ఈ విషయ మింకను జర్చింపదగినది.

మూడు నాలుగు పాదములు—

"ఎవ్వ రేమన్న నందు నాకేల కొఱఁత,
నా కవిత్వంబు నిజము కర్ణాటభాష."

ఈ రెండు పాదములకును, పై రెండుపాదముల కును తాత్పర్య మేమనగా—"ప్రౌఢిమలో సంస్కృత భాషవలెను, నుడికారమునం దాంధ్రభాషవలెను గనపడి, ఎవ్వ రేభాషయని చెప్పినా, నేను చెప్పిన కవిత్వము కర్ణాటభాషలోనే సుమీ" యని ఈ కడపటి చరణమే యీ పద్యమునకంతకును ప్రాణము. ఈ చరణమునకు ప్రథమ ద్వితీయ పాదములు విశేషణములు. వ్రాసినది కర్ణాటభాష; ఉపయోగించిన పదము లాంధ్ర పదములు; వాక్పాటవములో, వాక్ ప్రౌఢిలో సంస్కృతభాష అని శ్రీనాథకవి కంఠోక్తిగా బలుకుచున్నాడు. ఆంధ్ర శబ్దసముదయమైన యాంధ్ర కవిత్వము, ఆంధ్రభాష; కర్ణాట కవిత్వము, కర్ణాట భాష యెట్లగును? కర్ణాటభాషాసంప్రదాయములు శ్రీనాథుని యాంధ్రకవిత్వమునం దేమియు లేవు. ఇచ్చట కర్ణాటభాషను దేశభాషగా జెప్పలేదని నా యభిప్రాయము. కర్ణాట దేశమును, కర్ణాట భాషను దలపెట్టిన పద్యములు శ్రీనాథుని కవిత్వమునందు గలవు. వాని నుదాహరించెదను:

(౧) "మ. అరబీభాష, తురుష్కభాష, గజ
కర్ణాటాంధ్ర గాంధార ఘూర్జరభాషల్"

—భీమఖండము, ౧–౭౩.

(౨) "తే. యవన కర్ణాటకటక భూధవులతోడ
బలిమి వాటించి యేలించెఁ దెలుఁగుభూమి"

—భీమఖండము, ౧–౬౩.

(౩) "శా. కర్ణాటోత్కల పారసీక నృపస
ఖ్య! ప్రాభవశ్రీనిధీ!"

—కాశీఖండము, ౩–౨౪౭.

(౪) "శా. కర్ణాటక్షితిపాలమౌక్తిక సభా
గారాంతరా కల్పిత"
స్వర్ణస్నాన జగత్ప్రసిద్ధ కవిరాట్
సంస్తుత్యచారిత్ర"

—కాశీఖండము, ౭–౨౬౪.

(౫) "ఉ. ....ధర్మశీల! క,
ర్ణాటవరాట ఘూర్జరవిహార! కళింగ కుళింగమండలా,"

—హరవిలాసము, ౧–౨౯.

(౯) "కం. కుకుర, కురు, చోళ, కేరళ
శక, మరు, కర్ణాట, లాట, సౌవీర, నృప
ప్రకరసభాభరణ"

—నైషధము, ౧-౪౧

పై నిచ్చిన యుదాహరణములలో ఆంధ్ర దేశమును, ఆంధ్రభాషను వేరుగను, కర్ణాటదేశమును, కర్ణాట భాషను వేరుగను శ్రీనాథుడు స్పష్టముగ జెప్పి యున్నాడు. రెండు నొక్కటే యని చెప్పలేదుగదా! భీమఖండములో మనము చర్చించు పద్యమునందు ఆంధ్రభాష, కర్ణాటభాష సమానార్థకము లగునట్లు చెప్పిన విషయము చూడగా నిచ్చట "కర్ణాట" శబ్ద మునకు కవి వేరొక యర్థమును స్ఫురింప జేయుచున్నట్లు తోచెడిని. కర్ణాటశబ్దమును పదమధ్యమునందు యతి స్థానములో ప్రయోగించిన పద్యములు మూడు. మొద టిది మనము చర్చించు పద్యములో న - ణలకు మైత్రి గూర్చి యతి వేసినాడు. పై నిచ్చిన మొదటి యుదా హరణములో అచ్చునకు యతి వేసి ఆ — కర్ణ + ఆట అని అ, ఆ లకు యతి గూర్చినాడు. ఆంధ్ర లాక్షణికులు కర్ణాటశబ్దమును శకంధ్వాదిగణములో జేర్చి, నిత్య సమాస విశ్రాంతులలో నీ శబ్దము నుదాహ రించినారు. కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణసార సంగ్రహములోను, అప్పకవీయములోను కర్ణాటశబ్దము పదమధ్యమునందు అచ్చుతోను, హల్లుతోను యతిగల పద్యము లుదాహరింపబడినవి. నిత్య సమాస విశ్రాంతు లనుగూర్చి అప్పకవి వ్రాయుచు కర్ణాట శబ్దమును గూర్చి యిట్లు చెప్పినాడు:

"తే. ఒక్క సమసమున శబ్దయుగము గూడి,
పదములేర్పాటుగాఁ గానఁబడని ప్రాణ
సంధులకు నిత్యసమసనవిశ్రాంతులును, న
ఖండవిశ్రమములు నన రెండుఁ జెల్లు.

క. లోకంబునఁ గర్ణాటవ
సాకోద్వి పాంతరీపనాస్తిపదార్థా
నేకానోశ్వ్యజనార్దన
నాకాదులు నిత్యసమసనము లంద్రు బుధుల్."

—అప్పకవీయము, ౩-౧౩౫,౧౩౬

మనము చర్చించు పద్యచరణములో కర్ణాట శబ్దము యతిగూర్చిన విధానము చూచినయెడల కర్ణాటశబ్దమును రెండుపదములుగా నేర్పాటు చేయ వచ్చును. కర్ + నాట యని కర్ణాటశబ్దము రెండు పదము లగును. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలో "కర్నాటక, కర్ణాటక శబ్దసాధుత్వము" (మూడుడు: సంపుటము ౨౧, సంచిక ౩) అను శీర్షిక క్రింద వ్రాయబడిన సంపాదకీయ వ్యాసమునందు కర్ణాటక సాహిత్య పరిషత్పత్రిక సంపుటము ౨౩, సంచిక ౩ యందలి విమర్శక వ్యాసములనుండి రొత్తి వ్రాయ బడిన సారాంశములో కర్ణాటక శబ్దమునుగూర్చి యిట్లు వ్రాయబడినది:

"ఇక కర్ణాట మనునది సంస్కృతీకరింపఁ బడిన కన్నడశబ్ద మనియు, పాణినీయ సూత్రాను సారముగ ణత్వము సిద్ధించిన దనియుఁ జాలమంది యభి ప్రాయము. అదియే సమంజస మని కన్పట్టుచున్నది. వీరి యభిప్రాయమున కర్ + నాడు = కర్నాడు అయి, తరువాత కర్ణాట మైనది. కరి అనగా నలుపు, లేక గొప్పది యని యర్థము. కర్నాడు అనగా నల్లనిదేశము, లేక గొప్పదేశ మనును."

శ్రీనాథుడు పాకనాటివాస్తవ్యు డనియు, పాక నా డనునది యిప్పటి నెల్లూరుజిల్లాయున్న గుంటూరు జిల్లాలోని కొంతభాగమునకు సరిపోయెడి భూభాగము ననియు, నీ ప్రాంతభూమిని, దత్తమండలములను నల్లని రేగడిభూమిగా నేటికినిపరిగణించుచున్నారనియు తెలుసుకొన్నచో, శ్రీనాథు డీపద్య చతుర్థ చరణ ములో న - ణలకు యతివేసి కర్ణాటశబ్దమును కర్ + నాటగా యర్థమిచ్చునట్లు ప్రయోగించిన విధము స్పష్ట ము గాగలదు. శ్రీనాథుడు చెప్పినది ఆంధ్రకవిత్వమే. ఆంధ్ర సారస్వతములో ఆంధ్రదేశమందలి ప్రాగుదీచీ ఖండములో బుట్టిన కావ్యములకును, ప్రాగ్దక్షిణ ఖండ ములో బుట్టిన కావ్యములకును మాండలికములగు పద ప్రయోగములందు వ్యత్యాస మున్నది. ఒక ఖండములో వాడిన కొన్ని పదములు రెండవ ఖండములో వాడలేదు. ఒక ఖండములో వాడిన పదములు రెండవఖండములో మరియొక యర్థమున వాడబడినవి. నేటికిని ఉత్తరాంధ్ర

దేశమునకును, మధ్య దక్షిణాంధ్ర దేశమునకును భాష యొకటియైనను మాండలికములను నదుల భేద మున్నది. అట్టి వ్యత్యాసమే శ్రీనాథుడు పై పద్యములో సూచించుచున్నాడు. పాకనాటికవులగు తిక్కన, కేతన, ఎఱ్ఱాప్రెగడ, సోమన, జక్కన, అనంతామాత్యుడు మొదలగువారి కవితలపోకడలకును, ఆ సీమ వాడైన శ్రీనాథుని కవిత్వమునకును నెంతో యీ మాండలికములందు సాదృశ్య మున్నది. కాబట్టి శ్రీనాథుడీ చరణములో కర్ణాటభాష యనగా ద్రావిడాంధ్ర కర్ణాటభాష లని దేశభాషావిభాగము చేయునప్పుడిచ్చు నర్థమునందుగాక, ఆంధ్రదేశాంతర్భాగమైన కర్ + నాట = నల్లనినాడు, అనగా ప్రాగుదీచీ, ప్రాగ్దక్షిణాంధ్రదేశ మను నర్థముననే ప్రయోగించెనని యూహించుచున్నాము. శ్రీనాథుడు గడుసరి. "నా కవిత్వంబు నిజము కర్ణాటభాష" యని నొక్కి వక్కాణించి నిర్ధారణ చేసి, యీ పద్యచరణములో న-ణలకు ప్రత్యేకముగ యతినిగూర్చి చెప్పుటలో కర్ణాటభాష యనగా కర్ణాట దేశభాష యని స్థూలదృష్టికి దోచినను సూక్ష్మదృష్టిచే నాంధ్రదేశాంతర్భాగమును శ్రీనాథుడు సూచించియుండునని చెప్పవచ్చును. అప్పుడు ఆంధ్ర కర్ణాటభాషలకు సారూప్యము గలుగును. పద్యమున కర్థము సుగమముగా నుండును.

శ్రీనాథుడు పాకనాటివాడై, రాజమహేంద్రవరము వచ్చి గోదావరీతీరమున వేంగీరాజ్యాధీశులగు రెడ్డిరాజులకడ కవిత్వము చెప్పినవాడగుటచే, తా నాంధ్రుడై, ఆంధ్రభాషలో కవిత్వమును జెప్పినను, విషయాంతరవాస్తవ్యు డగుటచే, మాండలికాభిమానమును బోనొట్టుకొనలేక, మత్సరగ్రస్తులగు పండితమ్మన్యులయెదుట వారి నేడిపించుటకై చెప్పిన పద్యమిది. పైని వ్రాసిన దంతయు సమన్వయించి యీ పద్యమునకు తాత్పర్య మిట్లు వ్రాయుచున్నాను:

"ఆంధ్ర దేశములో ప్రాగుదీచీ ప్రాగ్దక్షిణ ఖండమగు ఆంధ్ర కర్ణాట (కర్ + నాట = కర్నాట; కర్ణాట) మండలములోని ఆంధ్రభాషలోనే నేను కవిత్వమును జెప్పితిని. ప్రౌఢిలో సంస్కృత భాషా కవిత్వము ననుసరించితిని."

ఇంకొక విషయమును వ్రాసి యీ వ్యాసమును ముగించెదను. తెలుగుశబ్దము వేఱు; త్రిలింగ శబ్దము వేఱు. ఒక శబ్దములోనుండి రెండవ శబ్దము పుట్టలేదు. ఈ విషయము నేను సవిస్తరముగా నాంధ్రసాహిత్య పరిషత్పత్రిక (సంపుటము ౨౮, సంచిక ౪) లో నిదివఱకు చర్చించియున్నాను. దేశ్యమగు తెలుగు శబ్దమునకు సంస్కృతరూపము నేదో సృష్టించుటకు యత్నించి, తెలుగుశబ్దముతర్వాత త్రిలింగశబ్దము నొకదానిని మన ఆంధ్ర లాక్షణికులు కల్పించిరి. అట్లే కన్నడ, కర్ణాట శబ్దములు. కర్ణాటశబ్దమునుండి కన్నడ శబ్దముగాని, కన్నడశబ్దమునుండి కర్ణాటముగాని పుట్టలేదు. కర్ణాటదేశ మంతయు కర్నాట, కర్ణాట (కర్ + నాట)భూమి కాదు. తెలుగు దేశ మంతయు త్రిలింగ దేశము గాదు (త్రి + లింగ). కాని తెలుగుభాష యనినను, త్రిలింగభాష యనినను ఆంధ్రభాషకు పర్యాయపదములుగ పరగుచున్నవి. కర్ + నాట, కర్నాట భూమిచే కన్నడదేశమున కంతకును కర్ణాటదేశ మని పేరు వచ్చినట్లు ఆధునిక కర్ణాటక పండితుల అభిప్రాయమైనట్లు కర్ణాట సాహిత్య పరిషత్పత్రికలోని చర్చలవల్ల తెలియుచున్నది.

కవిత్వము - సంఘము

నవ్య సాహిత్యపద్ధతులు

శ్రీ జి. వి. కృష్ణరావు

ఆధునికయుగం సాహిత్యసిద్ధాంతాల్లో ఒయ్యారాలు పోతూవుంది. మున్నే యుగంలోనూ ఇప్పుడు వస్తున్నన్ని సాహిత్యపద్ధతులు రాలేదు. ఈ నూతన సిద్ధాంతాలను పురస్కరించుకొని వస్తున్న సాహిత్యం నేటి జర్మన్ వైశ్రమాత్రలాగు పాఠకుడి కళ్లకు బయర్లు కమ్మిస్తూంది.

ఒక ప్రక్కనుంచి కళకోసమే కళ అనీ, మరో ప్రక్కనుంచి సాంకేతికవాద (Symbolism) మనీ, ఇంకా మరోదిక్కునుంచి ఇంప్రెషనిజ మనీ, పోస్టు ఇంప్రెషనిజ మనీ, ఎక్స్‌ప్రెషనిజ మనీ, ఇంకోదిక్కునుంచి సర్ రియలిజమనీ వస్తున్నాయి. కవిత్వాన్ని గూర్చి ఆలోచించ దలచుకొన్నవాళ్లూ, సాహిత్యం వ్రాసేవాళ్లూ ఈ సిద్ధాంతాలు తప్పక తెలిసికోవాలి.

ఆధునిక సాహిత్య సిద్ధాంతాల్లో ముందు కళకోసమే కళ అనే పద్ధతి వచ్చింది. ఈ వాదమే సాంకేతికపద్ధతికి దారి తీసింది. తరువాత వచ్చిన ఇంప్రెషనిజాలు, ఎక్స్‌ప్రెషనిజం, ఇమేజిజం, క్యూబిజం, ఫ్యూచరిజం, డాడీజం, సర్ రియలిజం అనేవి సింబాలిజంలోనుంచి వచ్చినవే.

అసలు ఈ సిద్ధాంతాలన్నీ యిసుక్లఘట్ట గూటంలో పగిలింది. కళకోసమే కళ అనే సాహిత్యపద్ధతి మొట్టమొదట ఫ్రాన్సులో బయలుదేరి వాల్టర్ పేటర్ అనే ఆంగ్లేయవిమర్శకుడిద్వారా ఇంగ్లండుకు వ్యాపించింది. తరువాత ముప్పైసంవత్సరాలకు మన దేశానికి వచ్చింది. ఈ సిద్ధాంతంప్రకారం కవితాప్రపంచం భౌతిక ప్రపంచంతో సంబంధం లేక స్వతంత్రంగా వుంటుంది. కేవలం కళాదృష్టితోనే కవితాప్రపంచంలో విహరించాలి. కవితానుభూతి ఆత్మప్రకృతులకు భిన్నమైవుండే దేవుడిలాగ సాంఘికసిద్ధాంతజీవికలకు భిన్నమై వుంటుంది. కవిత్వం పేరు ప్రతిష్ఠలకూ, ధనసంపాదనకూ, నీతి బోధించటానికీ కాక, కేవలం కళకోసమే ఉంటుంది.

ప్రస్తుతానికి ఈ వాదాన్ని ఒప్పుకుందాం. అయితే కవిత్వం ఎలా వుంటుంది? మానవుడు తన జీవితాన్నుంచి విడివడి ఆలోచించగలడా? హృదయంలో అతనికి తెలియకుండానే లీనమైన అనుభవాలు కళను ఆనందించేటప్పుడు పనిచేయకుండా వుంటాయా? అసలు అది సాధ్యమా? నిజంగా మానవుడు అలా చూడగలిగితే, ప్రాచీనతములైన కళలను ఎందు కానందించలేకపోతున్నాడు? ఈ ప్రశ్నలకు సమాధానం లేదు.

నేను కేవలం కళకోసమే వ్రాశానన్న ఆస్కార్ వైల్డుయొక్క 'పిక్చర్ ఆఫ్ డోరియన్ గ్రే' కూడ జీవితంలోనుంచి బయలుదేరిందే. ఆ పుస్తకంలోనిది ప్రత్యేకప్రపంచం కాదు. దానిలో ప్రాపంచిక జీవితం, శ్రేయస్సు ఉన్నాయి. ప్రాపంచికానుభూతి గలిగిన పాఠకుడే ఆ పుస్తకాన్ని చదివి ఆనందించ గలుగుతున్నాడు. కాబట్టి యీ వాదన నిలవదు.

ఈ సిద్ధాంతంతరువాత వచ్చినది సింబాలిజం. దీని ప్రకారం కావ్యంలో చిత్రింపబడే అనుభూతి వ్యక్తికమనీ, దాన్ని శబ్దం ద్వారా ప్రకటించటానికి సాధ్యం కాదనీ కేవలం నాదంవల్లను, రంగులవల్లను, ఆకృతివల్లను (Form) స్ఫురింపజేయవలసినదేననీ చెబుతారు. ఇది ధ్వనిపద్ధతికి చాలా దగ్గర్లో వుంది. రెండూ వాచ్యార్థంకంటె వ్యంగ్యార్థమే ముఖ్యమంటాయి. రెంటికీ ప్రమాత, అంటే రసికుడు, లేక సహృదయుడు కావాలి. అయితే ధ్వనికారుడి మతంలో కావ్యగతమైన అనుభూతి సాధారణీకరణాన్ని వరిస్తుంది. సింబాలిజంప్రకారం కావ్యానుభూతి కేవలం వ్యక్తికం. అందువల్ల శబ్దాన్ని తిరస్కరించి కేవలం నాదంమీద ఆధారపడవలసి వచ్చింది. కాబట్టి సింబా

లిస్టుకవిత్వమంతా సాంకేతికమయమై చాలావరకు అర్థంకానిదైనది.

తరువాత వచ్చిన సిద్ధాంతాల్లో ఎక్స్ప్రెషనిజం ఒకటి ముఖ్యం. ఈ సిద్ధాంతం కాపిటలిస్టులు చెప్పే ఆధ్యాత్మికవాదంలోనుంచి మొలకెత్తింది. దీన్ని మొలకెత్తించింది క్రోచే అనే ఇటలీదేశస్థుడు. ఈతని సిద్ధాంతంప్రకారం జ్ఞానం రెండు విధాలు. ఒకటి: ఇంద్రియాలద్వారా లభించేది (Logical). రెండు: ఇంద్రియాతీతమైనది (Intuitive). ఇంద్రియాతీతమైన జ్ఞానం దేశ, కాల, ఇంద్రియాలకు బద్ధమైనది కాదు. ఇది స్వయంజ్యోతి. ఇలాంటి ఇంద్రియాతీతమైన జ్ఞానమే కళ. ఈ కళ వ్యక్తికమైన అనుభూతులను ప్రకటిస్తుంది. ఇది మనస్సులోనే జరుగుతుంది. ఈ అనుభవం వ్యక్తికం కావటంవల్ల పునరుక్తం కాజాలదు. కళ దేశకాలబద్ధంకాని ఇంద్రియాతీతజ్ఞానం కావటం వల్ల క్షీణతాభివృద్ధులూ, న్యూనతాధిక్యతలూ లేనిపరంజ్యోతి.

అంటే, కాళిదాస భవభూతుల కావ్యాలొక్కటే; నన్నయ తిక్కన కృతులు ఒక్కటే; పెద్దన తిమ్మనకావ్యాలూ ఒక్కటే. ఒకటి గొప్పది కాదు, రెండోది తక్కువదికాదు. ఈ మాట వింటే ప్రతిపాఠకుడూ, ప్రతివిమర్శకుడూ నవ్వుతాడు. కాని క్రోచే సిద్ధాంత మదే.

నిజంగా కళనుగూర్చి అతడు క్రొత్తగా చెప్పాలు ఏమన్నా చెప్పాడా అంటే, యిలా అన్నాడు: కళ అంటే ఇంద్రియాతీతమైన జ్ఞానం; అంటే వ్యక్తికానుభూతిప్రకటన; అంటే సౌందర్యం. సౌందర్యమంటే కళ. ఇలా నాలుగు స్తంభాలాట ఆడతాడు క్రోచే.

ఇక ఫ్యూచరిజం, డాడిజం కేవలం అరాజక సిద్ధాంతాలకు సంబంధించిన సాహిత్య సిద్ధాంతాలు. పూర్వపు కావ్యాలను ధ్వంసంచేయటమే ప్రధానోద్దేశం. ఇవి పూర్వ కావ్యాలను అర్థంచేసికోటానికి కాని, రసస్వరూపాన్ని నిర్దేశించటానికి కాని పనికిరావు.

తరువాత సర్ రియలిజం బయలుదేరింది. బోడితలకూ మోకాలికీ ముడిపెట్టినట్టుగా, ఈ సాహిత్య సిద్ధాంతం ఫ్రాయిడ్ సిద్ధాంతానికీ మార్క్సిజానికీ లంకెవేసింది. రాజకీయరంగంలో మార్క్సిజమే ఆదర్శమన్నారు. శృంగారమే అన్నిటికీ మూలమనే (దీనికి మనదేశంలో భోజుడు బీజం వేశాడేమోననిపిస్తుంది) ఫ్రాయిడిజం స్వీకరించి, అంతరాత్మకు అనుభూతిమీద పెత్తన మిచ్చారు. కావ్యానుభూతికి చమత్కారం, లేక అద్భుతం ముఖ్యమన్నారు. ప్రాచీనాలంకారికుడైన విశ్వనాథుడు రసానికి చమత్కారం, లేక అద్భుతం ప్రాణమని ఎప్పుడో చెప్పాడు. కొత్తదన మొక్కటే రసం కాజాలదు. పైగా, ఈ చమత్కారజీవి అయిన కావ్యాన్ని అంతరాత్మ శాసిస్తూ వుండటంవల్ల పాఠకుడు కావ్యాన్ని ఆనందించ లేకపోతున్నాడు. ఈ అంతరాత్మతో వ్యక్తిత్వం ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలుతూ వుంది. సాధారణీకరణం తొలగిపోతున్నది.

పైగా, ఈ సిద్ధాంతం కావ్య పరిణామాన్ని తెలప లేకుండా వుంది.

ఈ విధంగా ౧౮౭౦ నుంచి ౧౯౩౦ దాకా వచ్చిన యీ సిద్ధాంతాలు కలుపుమొక్కలు పెంచటానికి వచ్చినవే కాని పూర్వకావ్యాలనుకాని, ఇప్పటి కావ్యస్వరూపాన్నికాని, ముందు రాబోయే కావ్యస్వరూపాన్నికాని అర్థం చేసికొని ఆనందించటానికి తోడ్పడటం లేదు. ఇవన్నీ అహానికి ప్రాముఖ్యత యిస్తూవున్నాయి.

అయితే కవిత్వంయొక్క స్వరూపం ఎలా అర్థమౌతుంది? దీనికి మార్గంఉందా? ఈవిషయమే ముఖ్యం.

శబ్దాత్మకమైన భాషతో కావ్యం నిర్మితమౌతుంది. ఏ సిద్ధాంతాలు ఎలా చెప్పినా, భాష సాంఘిక జీవనంతో వచ్చింది. సాంఘిక జీవనం లేక భాష ఉండదు. పరస్పర అభిప్రాయాలు తెలిసికోవలసిన ఆవశ్యకత ఉన్నప్పుడే భాష ఉంటుంది. ఈ ఆవశ్యకత సాంఘిక జీవనం ఉన్నప్పుడే వస్తుంది. ఏ విషయాన్నైనా ఆలోచించటానికీ, ఆలోచనాశక్తిని పెంపొందించటానికీ భాషే ముఖ్యం. భాష లేకపోతే మానవుడు ఆలోచించ లేడు.

సాంఘిక జీవనంలో ఉత్పన్నమైన భాష సంఘంతో పాటే మారుతూ వుంటుంది. శబ్దం నశించదనే మీమాంసకుల స్ఫోటసిద్ధాంతాన్ని యీ విష

యంలో ఆదరించటానికి వీల్లేదు. పూర్వపు తెలుగు ఇప్పటి కెంత నాశనమయింది? తెలుగులో తూర్పు పడమర శబ్దాలున్నాయి; లతిన్కి రెండు దిక్కుల్నీ తెలియజేసే శబ్దాలు నశించాయి.

అసలు కళ అనేదికూడ సాంఘిక జీవనం ఉన్నప్పుడే ఉంటుంది. సాంఘిక జీవనం లేకపోతే కళ అనేదే ఉండదు. చీమలూ, తేనెటీగలూ సాంఘిక జీవులు కాబట్టి వాటికి కళ ఉంది. జూలియన్ హక్స్లీ చీమల్ని గూర్చి వ్రాస్తూ, అవి సాంఘిక జీవులు కాబట్టి వాటికి కళ ఉన్న దన్నాడు.

కాబట్టి కళను కాని, కవిత్వాన్ని కాని సంఘాన్నుంచి విడదీసి విమర్శించి ఇదమిత్థమని తేల్చుకోటానికి వీల్లేదు. ఒక వేళ విడదీస్తే అగమ్య గోచర మౌతుంది. మారకంలేని కరెన్సీనోటుగతి పడుతుంది.

మానవుడు సాంఘికజీవి కానట్లైతే, భాష, కళ, కావ్యం ఉండేవికావు. వ్యక్తిత్వం ఉండేది కాదు. అతడు జంతువులాగానే, కేవలం శారీరకంగానే, ఇతరులకంటె భిన్నుడుగా కనిపించేవాడు. కళకూ, కవిత్వానికీ హేతుభూతమైన సంఘం ఎల్ల కాలం ఒక్క రీతిగా ఉండదు. దీన్ని అంతా అంగీకరిస్తా రనుకుంటాను. ఈ సంఘంతో పాటే మానవుడి అనుభూతి మారుతూ వుంటుంది. క్రొత్త అనుభూతితో ప్రాత అనుభూతిమీద మానవుడు కొంతవరకే సానుభూతి చూపించగలడు. ఈ సానుభూతి రెండనుభవాల భేదాన్ని పట్టి వుంటుంది. వెనకటి రోజుల్లో, ఆ నాటి సంఘానికి ఋగ్వేదం కావ్యం. ఈ రోజున దానిలోని ఋక్కులకు అర్థం చెప్పకోగలిగినా, కవిత్వ మని ఆనందించలేము. ఈ విషయ మన్ని కళలకూ అన్వయిస్తుంది. ప్రాచీన కాలంలో చిత్రకారుడు లేడిని రెండు కాళ్లతోనే చిత్రించాడు. ఆ బొమ్మను చూచి ఆనందించటం మనవల్ల సాధ్యపడుతుందా?

ఈ అనుభూతిభేదంవల్లనే పూర్వకావ్యాల్లోని ఒక ప్రత్యేకరసం ఆధునికులకు మరొకరసం కావచ్చును. నాచనసోముడు వ్రాసిన ఉత్తర హరివంశంలోని "జడలు కంపలువట్టి జరుగ నీ కున్నచో" అనే సీసపద్యం రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారికి నవ్వు తెప్పించింది. నిజంగా ఆ పద్యం కేవలం కరుణరసఘట్టంలోనిది. షేక్స్పియరు వ్రాసిన "మాక్బెత్" అనే నాటకంలో Porters' scene (పోర్టరు సీను) డీక్విన్సీ అనే విమర్శకుడికి పూర్వమున్నవారికి హాస్యఘట్టంగా తోచి "ఇది విచార్యము" అన్నారు.


మరో విషయ ముంది. మొట్టమొదటికావ్యాల్లో హాస్యం అట్టే కనిపించదు. ఆ రసం మానవసంఘంలో అభివృద్ధి చెందుతూ వస్తున్నది. అందుకనే ప్రాచీనాలంకారికులు—గ్రీకు దేశస్థులు కానీ, మన దేశస్థులు కానీ—హాస్యానికి ప్రాముఖ్యత యివ్వలేదు.

కాగా, ఒకటి: కళనుగాని, కవిత్వాన్నిగాని సంఘాన్నుంచి విడదీయటానికి వీల్లేదు. రెండు: మానవ సంఘం మారుతూవుంది. సంఘంతో పాటు భాష, అనుభూతి, కావ్యం మారుతూ వస్తున్నాయి. ఈ మార్పును అంగీకరిస్తేనే కాని అన్ని యుగాల కావ్యాలనూ అర్థం చేసికోటానికి కాని, కవిత్వతత్వం కొంత గ్రహించటానికి కాని వీలులేదు.

అయితే, సంఘం ఎందుకు మారుతున్నది? ఇది వరకు ఎలా మారింది? ఇకమీదట ఎలా మారుతుంది? ఈ విషయాలను తెలిసికొంటే కవిత్వం సంగతి కూడా తేలుతుంది. "కో వేత్తి కవితాతత్వ మీశ్వరో వేత్తివా నవా" అని కాళ్లారజాపుకో నక్కరలేదు.

ఈ మార్పును వివరించ గలిగింది చారిత్రిక భౌతిక సిద్ధాంత మొక్కటే. కొంతమంది మార్క్సు చెప్పిన యీ సిద్ధాంతం సాహిత్యానికి ఏమాత్రమూ అన్వయించ దంటారు. ఇది పొరపాటు. మూఢ మార్క్సిస్టుల్లాగా భౌతిక సిద్ధాంతాలు అన్వయిస్తే ప్రయోజనం లేదు.

కాబట్టి కొంచెం జాగ్రత్తగా అన్వయిస్తే కవిత్వతత్వాన్ని అవగాహన చేసికోటానికి ఒక చారిత్రిక భౌతిక సిద్ధాంతమే తోడ్పడుతుంది. ఈ దృక్పథంతోనే సాహిత్యాన్ని అవలోకించాలి. అట్లుకాక కవిత్వాన్ని సంఘాన్నుంచి వేరుచేసి చూస్తే నాలుగు స్తంభాలాట ఆడవలసి వస్తుంది.



మా దొర బాబు

[కథానిక]

శ్రీ మునిమాణిక్యం నరసింహారావు

మా కాంతానికి సంతానం అయిదుగురు: మహాలక్ష్మీ సమానులు ముగ్గురు; రాజమాన్య రాజపుత్రులు ఇద్దరు. ఈ ఇద్దరిలో శ్రీరఘురామ యాజ్ఞవల్క్య జ్యేష్ఠుడు. యాజ్ఞవల్క్యమహాఋషిలాగ మేధావి కావాలని ఉద్దేశించే మా కాంతం వాడి కా పేరు పెట్టింది.

అనేకసార్లు నాతో అన్నది మా ఆవిడ "వీడు అఖండమైన తెలివి తేటలు గలవాడు అవుతాడండీ" అని.

వాడి ముఖం చామన ఛాయలో కళ కళలాడుతూ ఉంటుంది. వాడిది గంభీరమైన చూపు. తీవిఅయిన నడక కూడాను.

తల్లి, కాంతం, వాడిని దగ్గరకు తీసుకొని ముద్దాడి, "మా తండ్రి పెద్దవాడైన తరువాత గొప్ప ఉద్యోగం చేస్తాడు. దేవుడు వాడికి ఆయురారోగ్యాలు అనుగ్రహించాలె గాని, మా బాబు డిప్యూటీ కలెక్టరు ఉద్యోగం చెయ్యడూ?" అనేది.

"అంతకంటే పెద్ద ఉద్యోగం ఏదీ నీకు తోచింది కాదా?" అన్నాను నేను.

"అది కాకపోతే పోలీస్ సూపరెంటు. కాదంటారా? వాడు జనరల్ మానేజర్ ఆఫ్ ది మద్రాస్ అండ్ సదరన్ మహారాటా రైల్వే అవుతాడు, ఏమంటారు?" అన్నది కాంతం.

"ఓ. తప్పకుండా" అన్నాను నేను.

కాంతం మళ్లీ వాడిని దగ్గరకు తీసికొని, ఇంకో సారి ముద్దాడి "ఏమండీ, మా బాబుకు ఏం తక్కువ! దొరబాబండీ" అంటుంది.

ఇల్లాంటి సమయంలో ఆ చిన్న వెధవ రఘు ఛాతీవిరిచి, నిటారున నిల్చుని కొత్త నవ్వుకొంటాడు. ఇల్లాగ అనేకసార్లు జరుగుతూ వచ్చింది.

నేను ఇల్లాగ చాలాసార్లు అనటం మూలాన వాడూ గట్టిగా నిశ్చయించుకున్నాడు — ఎప్పుడో ఒకప్పుడు ఠపీమని గొప్పవాడు కావాలని. ఎవ్వరూ చెప్పకుండానే వాడికి కొన్ని గొప్ప గుణాలు అబ్బినై. ఎవరైనా బిచ్చగాడు ఇంటి ముందు కొచ్చి, దీనంగా అడిగాడో... వాడిదగ్గర కానీ ఉండనీయండి, అర్ధణా ఉండనీయండి, ఎంత ఉంటే అంతా ఠపీమని ఇచ్చేసేవాడు. ఇచ్చేసిన తరువాత కూడా తనకు లేకపోయిందే అని విచారించేవాడు కాదు! బ్రాహ్మడికి యాయవారం పెట్టినా దోసిలితో పెట్టడు. వెండి కప్పుతో గాని బియ్యం తీసుకెళ్లేవాడు కాదు.

"అబ్బో! రఘూకు దర్జా ఎక్కువైందే అమ్మా, వెండి గిన్నెతో గాని పాలు తాగట్టే" అని పెద్దపిల్ల తల్లితో అంటే, ఆవిడగారు "అంతే అమ్మా, వాడంతే" అనేదేగాని, వాణ్ణి "అదేమిరా" అనేది కాదు.

ఈ సామాన్య కుటుంబంలో పుట్టికూడా వాడు పిల్ల జమీందారులాగే జరుపుకొంటున్నాడు. ఇంత వరకూ వాడికి అవ్వల్ దర్జాగానే జరుగుతూ ఉన్నది.

ఆరోజు నేను స్నానం చేస్తున్నప్పుడే చిన్నవాడొచ్చి చెప్పాడు సూర్యంమామయ్య వచ్చాడని. నేనూ స్నానం త్వరగా పూర్తిచేసుకొని మేడపైకి వెళ్లేసరికి సూర్యనారాయణ కుర్చీలో కూర్చుని కాంతంతో మాట్లాడుతున్నాడు. ఆవిడ గదిగుమ్మంలో తలుపు కానుకొని నుంచున్నది. ఆయన కుర్చీలో కూర్చుని సిగరెట్టు తాగుతున్నాడు.

మే మిద్దరం ఓహో అంటే ఓహో అనుకొన్న తరువాత, సూర్యనారాయణ అన్నాడూ— "ఏమోయ్, వీడే కదూ మీ పెద్ద అబ్బాయి" అని. "అవును, వీడే" నన్నాను. "ఇట్రా నాయినా" అని పిల్చాడు వాణ్ణి. మా అబ్బాయి ఆయనకు దగ్గరగా వెళ్లి నుంచున్నాడు, ఠీవిగా. మర్యాదగా బ్లూమర్‌ను ఓడించిన 'వే' సేనాని నెపోలియన్ ముందు నించున్నట్లు. ఆయన వాణ్ణి తన ప్రక్క కుర్చీలో కూర్చోపెట్టుకొని, వాడితో ఏదో విషయం చెప్పటానికి "కిహూ..."అని ఆరంభించాడు. ఇంతలో కాలుస్తూఉన్న సిగరెట్టు అయిపోవటంమూలాన కిటికీలోనుంచి బైటకు పారేసి పాకెట్‌లోనుంచి కొత్త సిగరెట్టు తీసి దానిమొనను నిప్పుపెట్టెమీద ఒక పద్ధతిలో, ఒక రిథిమ్‌లో ముమ్మాటు కొట్టాడు. అల్లా కొటుతూన్నపుడు ఆయన నావంకా చూడలేదు, మా ఆవిడ వంకా చూడలేదు. కిటికీలోనుంచి దూరాన ఉన్న దేన్నో చూస్తున్నట్లుంది. ఆ కిటికీకి అవతల బాదం చెట్టు ఒకటుంది. దానికి వెనకాల తాటిచెట్లు గాలికి తల లూపుతున్నాయి. మరి ఆయన ఏంచూస్తున్నాడో నాకు తెలియలేదు. ఏదో చెప్పబోయి ఆగటంచేత నేనూ ఆతురతతో ఆతనివైపు చూస్తూ కూర్చున్నాను.

ఆవిధంగా ఆయన సిగరెట్టుతో నిప్పుపెట్టెమీద ముమ్మారు కొట్టీ...సిగరెట్టు వెలిగించీ...ఏదో గొప్ప రహస్యం నాకు ఆదరణతో చెపుతున్నవాడిలాగ చూస్తూ ప్రతిమాటా నొక్కుతూ "వీడు చాలా గొప్పవాడు అవుతాడు" అన్నాడు ప్రసన్నవదనంతోనూ, గంభీరమైన గొంతుతోనూ.

ఆమాటలు విన్న కాంతం ముఖం సంతోషంతో తొణికిసలాడింది. కాని ఆవిడ ఏమీ మాట్లాడకుండా శ్రద్ధతో ఆయనమాటలు వింటానికి కుతూహలం కనపరిచింది.

"అవునవును, వాళ్ల అమ్మకికూడా అదే అభిప్రాయం. ఇంతకూ పెద్దఅయినతరువాత వాడు ఎట్లాగ తయారు అవుతాడో మరి" అన్నాను.

"ఆఁహాఁహాఁహ, నీ కింకా అర్థంకాలేదు. నేను తమాషాకు అన్నమాట కాదు, అనుభవంమీద చెబు

తున్నాను. వాడి చూపుల్లో ఉంది, భాగ్యం అంతా. అది అట్లా ఉంచు. అసలు ఈమర్యాద ఎక్కడ నేర్చాడోయి" అన్నాడు. అని, నన్ను అడిగితే లాభం లేదనుకొని ఆవిడగారివంక తిరిగి చూశాడు.

"వాడిమొఖం లెండి! ఏమన్నా డేమిటి?" అన్నది కాంతం.

మళ్లీ మా సూర్యనారాయణ అందుకొన్నాడు: "ఇంటిముందు కారు ఆపి, 'నాన్నగారు ఉన్నారా' అన్నాను. వీడు ముందుకొచ్చి 'ఉన్నారండీ, స్నానం చేస్తున్నారు, దయచేయండి' అన్నాడు."

"వాడం లేనండీ అన్నయ్యా. వాడికి కొత్త మాట మర్యాద తెలుసు" అన్నది కాంతం.

"అసలు పదేండ్ల కుర్రవాడికి అంత మర్యాద తెలియటమే గొప్పవిషయ మనుకో! దానితరువాత ఆ అన్న సద్ధతి! ఎంత తమాషాగా అన్నాడోయ్! వినయానికి వినయం! మర్యాదకు మర్యాద!" అని ఆ స్నేహితుడు మెచ్చుకొన్నాడు మా అబ్బాయిని.

"ఇదీ ఒక గొప్పేనా ఏమిటండీ!" అన్నది కాంతం చప్పరిస్తూ. పైకి ఇల్లాగ అన్నా లోపల ఆమె ఎంతో సంతోషిస్తున్నది.

"అదిగాదు అమ్మాయ్. అసలుసంగతి వినాలి నీవు. లోపలికి వచ్చానా. పైకితీసుకొచ్చాడు. కుర్చీలో కూర్చోమన్నాడు. కూర్చున్నా. 'నాన్న ఏంజేస్తున్నా' రంటే, 'స్నానం జేస్తున్నారు. పదినిమిషాలలో వస్తారు' అన్నాడు. 'మీఅమ్మ ఏంజేస్తోందిరా' అంటే 'మీరు వచ్చారని చెప్పాను, వస్తున్నది' అన్నాడు. సరేనని కూర్చుని, ఒక సిగరెట్టు తగలేద్దామని జేబులో నుంచి పాకెట్ తీశాను. చూస్తే అందులో సిగరెట్లు లేవు. ఎట్లాగా అని ఆలోచిస్తున్నాను. వీడు చప్పున మేడమెట్లదగ్గరకు వెళ్లి 'అప్పీ' అని కేకేశాడు. అది మీ పనిజేసే పిల్లకదూ?"

"అవును" అని నేను తల ఊపాను.

"చూశావా, వాడి తెలివి? నాకు సిగరెట్లు కావాలన్న సంగతి గ్రహించాడు! ఏమిటంటావు? అది తెలివంటావా, కాదంటావా?"

కాంతం నవ్వింది. నేనూ ఆమెముఖం చూస్తూ "తెలివే మరి. తెలివికాదూ" అన్నాను.

"అప్పుడే కాలేదు కథ! నేనూ సంగతి గ్రహించి 'ఇందవోయ్ డబ్బు. ఒక్క సిజరుపాకెట్టు తెప్పించు' అన్నాను. వీడు చిరునవ్వుతో, 'అక్కర లేదండీ' అంటూ ఆ అప్పీతో ఏమో రహస్యంగా, నాకు వినిపించకుండా మాట్లాడాడు. అయిదు నిమిషాలైందో లేదో అప్పీ పాకెట్టూ, నిప్పెట్టే నాబల్లమీద పెట్టింది. చూశావా...ఆమర్యాదకు చెబుతా!" అన్నాడు.

"ఏమిటోయ్, అంత గొప్పగా చెబుతావు! ఆమాత్రం మర్యాద తెలియటంకూడా ఒక గొప్పే అంటావూ?"

"అదేమిటి అల్లా అంటావూ? నేను ఇన్స్యూరెన్సుపనిమీద రకరకాల మనుష్యుల ఇంటికి వెడుతుంటాను. సాధారణంగా బాగా భాగ్యవంతుల కొంపలకే వెడుతుంటాను. కాని ఇంత చిన్నవయస్సులో ఇంత మర్యాదగా ప్రవర్తించటం నేను చాలా అరుదుగా చూశాను" అన్నాడు.

ఈయన మా ఆవిడకు సయాం అన్నయ్య కాదు. నాకు బాల్యస్నేహితుడు. ఆ రీత్యా ఆవిడకు అన్నయ్య అయినాడు. అయితేనేం, స్వంత అన్న కంటే ఎక్కువ ఆపేక్షగా ఈయన ఉంటాడు. స్వంత చెల్లెలు కంటే ఎక్కువ చనువుగా ఆవిడగారూ ఉంటుంది.

అదీ అసలు సంగతి. ఎప్పుడైనా ఈ ప్రాంతాలకు పనిమీద వచ్చినప్పుడు మా ఇంటికి వచ్చి చూచి పోతుంటాడు.

౨

మామూలు వేళకు భోజనా లైనై. నేను కాసేపు నిద్రపోయి, లేచి, క్రిందికి వచ్చాను. ఆయన ఇంకా నిద్రపోతూనే ఉన్నాడు. మా ఆవిడ మధ్యాహ్నం ఫలహారానికి కామాలు గారెలు చేస్తున్నది.

"అయితే, కాంతం, గారెలు చేస్తున్నావా, ఫలహారానికి? మరీ...కాఫీకూడా చేస్తావా?"

"మరి ఎండ మండిపోతూంటే కాఫీ ఏమి టండీ" అన్నది.

"మరి ఏమంటావూ?" అన్నాను నేను.

"ఏమీ వద్దు, కమ్మని గారెలు తిని కాసిని మంచినీళ్లు తాగుతారు లెండి" అన్నది ఆవిడ.

"ఆ. కాస్త ఏదైనా షర్బతు లాంటిదైనా ఇస్తే బాగుంటుంది కాని ఒట్టిగా మంచినీళ్లు ఇస్తే ఏం బాగుంటుంది? అదీ నే ననటం" అన్నాను నేను.

"మరేం ఫరవాలేదు. ఇప్పు డెల్లాగ వస్తుందీ షర్బతూ గిర్బతూను! బావిలోనుంచి తోడి చల్లటి నీళ్లు ఇస్తాను చాల్లెద్దురూ?" అన్నది ఆవిడ.

"మన బావినీళ్లు కాస్త ఉప్పనగదా కర్మం!"

"మరి ఏమంటారూ?"

"మంచి నీళ్లలో రెండు నిమ్మకాయలు పిండి కాస్త పంచదార వేసి ఇస్తే షర్బతులాగ ఉంటుంది, అవునా?"

"దానికైనా నిమ్మకాయలు కావాలిగా?"

"ఇంట్లో లేవూ?"

"ఊహూఁ"

"అయితే, నేను బజారుకు వెళ్లి తీసుకొస్తాను" అన్నాను.

"మీరు నన్ను క్షమించాలె. ఈ ఎండలో మీరు బజారుకు వెళ్లటానికి నే నొప్పుకోను. మీ వయస్సువాళ్లు ఇంత ఎండలో తిరగకూడదు. అంతగా అయితే రఘూను పంపండి" అన్నది ఆవిడ.

"వాడు బజారుకెళ్లి..........."

"మీ కాసందేహం అక్కర లేదు, పంపండి... బాబూ, ఒరే రఘూ" అని పిల్చింది కాంతం. పెద్ద బాబు దొరలాగ వచ్చి అమ్మ కెదురుగా నుంచున్నాడు. అమ్మ కొడుకును చూచి ఆనందిస్తున్నది.

"నాయినా, బజారుకు వెళ్లిరావాలరా!" అన్నాను నేను. "అల్లాగే" అన్నాడు దొర బాబు.

"చూశారా, నా తండ్రి ఎంత బుద్ధిమంతుడో! పోనని గాని, ఎండ అని గాని అన్నాడేమో చూశారా? విధేయత—మర్యాద తెలుసండీ బాబుకూ" అన్నది మా ఆవిడ.

"ఏం తేవాల నాన్నా!" అన్నాడు బాబు.

ఆ సమయంలో వీథిలోకి వెళ్లి ఏదైనా తేవటం అనే ఒక సాహసకార్యాన్ని వాడు సాధించాలని కుతూహలపడుతున్నాడే కాని ఎండలో పోవటం కష్టం అని వాడు అనుకోటం లేదు. పితృవాక్య పరిపాలనార్థం ఎంత సాహసకృత్యమైనా చేయటానికి సిద్ధపడ్డవాడిలాగా, సిపాయిలాగా నుంచున్నాడు.

అప్పుడు నే నన్నాను — "నాయినా, ఇదిగో రూపాయి. బజారు కెళ్లి, నాలుగు నిమ్మకాయలూ, ఒక పౌను మంచుగడ్డా తీసుకొని రావాలె"

సరేనని వాడు బయలుదేరాడు. "రూపాయి ఎక్కడైనా పారేస్తావేమోరోయ్" అన్నాను నేను. వాళ్లమ్మకూడా "జాగ్రత్తరా నాయినా" అన్నది. వాడేం మాట్లాడలేదు. కాని ఒక చిరునవ్వుమాత్రం నవ్వాడు. ఆ చిరునవ్వులో ఉన్న అర్థవిశేషాన్ని గురించి ముగ్గురు పండితులు నోట్సు వ్రాయాలిసినంత విషయ ముంది.

"ఒక్క రూపాయి జాగ్రత్తగా వాడలే ననేనా నీ అభిప్రాయం? పిచ్చిదానా...ఒక్క రూపాయి ఏమిటి, వందరూపాయలు ఇచ్చినా అంచక్కా జాగ్రత్తగా వాడగలను, తెలుసునా" అన్నట్లు అర్థమైంది మా ఇద్దరికీ.

"సరే నాన్నా, వెళ్లు. చెప్పులు తొడుక్కొని గొడుగు వేసికొని వెళ్లేం" అన్నది కాంతం.

వాడు వెళ్లుతుంటే నిలబడిచూచి, కాంతం "ఎట్లా నడుస్తాడో చూశారా" అన్నది.

"ఏం, మామూలుగానే ఉంది" అన్నాను.

"మామూలుగా ఉందీ, వంకర కాళ్లతో...వంగి తూలుతూ నడిచే వాళ్లకు...నడకలో ఉండే దర్జాతనం ఏం తెలుస్తుంది? — బెంగాలులో ఉంటారు చూశారూ, జమీందారులు, శరత్ బాబు, హేమచంద్రుడు...అదిగో అల్లాంటివాళ్ల నడక అబ్బాయిది."

"సరే, సరే, రైట్ – ఒప్పుకొన్నాను. అది సరే కాని మరి పర్బేతు ఇయ్యటానికి గ్లాసులు ఏవీ?"

"పింగాణీగ్లాసు లున్నాయి కదండీ"

"ఎబ్బే, పింగాణీగ్లాసులలో ఇవ్వటం ఏంకర్మం, మనకు వెండిగ్లాసు లుండంగా?"

"ఆ వెండిసామానులు ఎక్కడో ఉన్నాయి పైన. ఇప్పుడు ఎవరు తెస్తారు పోనిస్దురూ!"

"నామాట వింటూ, నేను తెస్తాను పైకెళ్లి!"

"మన భాగ్యం అంతా బైటపెట్టాలకాబోలు?"

"ఏదో పోనిద్దూ అన్నానుగా"

"సరే, అల్లాగే కానీండి" అన్నది కాంతం.

"అబ్బాయి ఇంకా రాలేదేమబ్బా? చాలా సేపు అయిందే వెళ్లి! వాడికి రూపాయికూడా ఇచ్చాను! ఏం తేసుకొస్తాడో" అన్నాను నేను.

"వాడి కేమీ తెలియదనా మీ ఉద్దేశం? మీ కంటే బాగానే బేరం చేయగలడు. మీకు అసలు బేరంచేయటం ఏమీ తెలియదు. ఒకటి తెమ్మంటే ఒకటి తెస్తారు. తెమ్మన్న వస్తువులలో సగం మర్చిపోతారు. మీసంగతే చెప్పాలె! అయ్యో! అయ్యో! ఎందుకొచ్చిన అవస్థ! ఇక మీరు ఊరుకోండి. బజారు వస్తువులన్నీ వాడిచేత తెప్పించుకొంటాను!"

"తెప్పించుకొందువుగాని, ఇంకా రెండేళ్లు పోనీ" అన్నాను.

"అయితే, మన అబ్బాయి తేలేడనే మీ ఉద్దేశం? చాలా పొరపడుతున్నారు. బేరం చేయటం తెలుసు వాడికి! కొసరు అడగటం తెలుసూ. అన్నీ తెలుసునండీ. మీకంటే వెయ్యిరెట్లు నయం. మొన్న వంకాయలు తెచ్చాడు. ఎల్లాంటివి తెచ్చాడు! లేత మువ్వలు, నవనవలాడుతూ ఉన్నాయి."

"పుచ్చు వంకాయలు తెచ్చాడని నీవు విసుక్కున్నావు గదూ"

"లేతవి తెమ్మంటే లేతవి తెచ్చాడండీ. పుచ్చు సంగతి వాడి కప్పుడు తెలిసింది కాదు. ఒక్కొక్క విషయమే చెపితే తెలుస్తుంది. ఇప్పుడు బజారుకు పంపారుగా చూడండి, మీరు చెప్పిన రెండు వస్తువులూ కొనుక్కొని వస్తాడు దొరబాబులాగ"

"దీని కేం భాగ్యంలే"

"అబ్బా, అంతేనా? పచ్చిమెరపకాయలు తెమ్మని మిమ్మల్ని బజారుకు పంపిస్తే మీరు ఆరోజున ఏం తేసుకొచ్చారు జ్ఞాపకంలేదూ?"

"ఏం తేసుకొచ్చానేమిటీ?"

"ఏం తేసుకొచ్చారా? కాఫీహోటల్లో కానేపు గడిపి, ఆతరువాత కూరలబజారు కెళ్లి వంకాయలూ, నలక్కాయలూ తెచ్చారు. పచ్చిమెరపకాయల సంగతే మర్చిపోయినారు!"

"ఎందుకు అల్లాగ నవ్వుతావు? మర్చిపోతే మర్చిపోయి ఉండవచ్చు. వంకాయలు మటుకు పని కొచ్చే వస్తువులు కావా?"

"అయితే, అప్పటికే ఇంట్లో రెండువీసెల వంకాయ లున్నాయి. ఆసంగతి మరిచిపోయి మళ్లీ వంకాయలు తెస్తే ఏం చేసుకోవాలె!! నెత్తినేసి కొట్టుకోవాలా? అల్లాంటివి మీ పనులు! మా బాబును వదిలేస్తే ఇల్లాగే తయారవుతాడేమో! ఇప్పటినుంచీ నేర్పుకొంటాను" అని అన్నది కాంతం.

"అల్లాగే చేయ్... సరేగానీ, అబ్బాయి ఇంకా రాలేదే మబ్బా!"

"రావాలా మరి ఎండలో?"

"సరే. నీవు ఇంతలో స్నానంచేసి మంచిబట్ట కట్టుకో"

"ఏచీర కట్టుకోమంటారూ?"

"పట్టుచీర"

"ఎందుకండీ పట్టుచీర ఇప్పుడూ?"

"ఎందుకో నాకు తెలియదు. అడిగావు కాబట్టి చెప్పాను" అన్నాను. ఇద్దరం ఊరికేనే నవ్వుకొన్నాం.

నేను మేడపైకి వెళ్లాను. నేనూ, ఆయనా క్రిందికి వచ్చేసరికి మా ఆవిడ వెండిపళ్లాల్లో మాకూ, పిల్లలకూ అందరికీ వడ్డించింది. రఘుగాడిపళ్లెం ఇంకా ఖాళీగానే ఉంది. ఇంకా రాలేదేమా అని ఆదుర్దా కలిగింది.

"ఫలహారం కానిస్తుంటే వాడే వస్తాడు ఆమటా" అని కూర్చున్నాం. ఆ తరువాత పదినిమిషాలకు వాకిట్లో

బండెడో ఆగింది. పిల్లలు పరుగెత్తికెళ్లి రఘు వచ్చాడని కేకేశారు. పోనీలే సమయానికొచ్చాడని సంతోషించాము.

ఇంతలో రఘూ మా ఎదట నుంచున్నాడు. "అదేమిట్రా నాయనా అట్లా ఉన్నావూ?" అన్నది వాళ్లమ్మ. వాడి తలంతా తడిసి ఉంది. బట్టలన్నీ తడిసి ఉన్నాయి. వంటినిండా రంపపుపొట్టు కొట్టుకొంది.

"ఏమిట్రా నాయనా, ఇదంతా ఏమిట్రా" అంటూ వాళ్లమ్మ పమిట చెంగుతో తల తుడుస్తున్నది.

"వెధవ మంచుగడ్డే, కరగటంమూలాన రంపపు పొట్టు వంటినిండా పడ్డది" అంటూ ఆరంభించి నక్క తిప్పకుండా చెప్పటం సాగించాడు.

"మొదట నిమ్మకాయలే కొన్నానే అమ్మా. వంద పావలా చెప్పాడు. కాని అణాకు పదే ఇస్తానన్నాడు. చిల్లరగా కొంటే నష్టమని యాభై నిమ్మకాయలూ కొన్నాను."

"చూశారా వాడి తెలివి!" అన్నది వాళ్లమ్మ.

"అపళంగా అయిస్ ఫాక్టరీ కెళ్లి ఒక పావు అయిస్ కొన్నాను. 'ఎందులో తీసికెడతావు' అన్నాడు ఆయన. పొట్లం కట్టి ఇయ్యమన్నాను. సరేనని ఆయన ఒక కాయితంలో రంపపుపొట్టు పోసి దానిలో ఈ అయిస్ పెట్టి పొట్లంగట్టి ఇచ్చాడు. ఒకచేత్తో నిమ్మకాయల సంచీ పట్టుకొని, నెత్తిన అయిస్ మూట పెట్టుకొని ఇంటికి బయలుదేరాను. కాని ఏమైందనుకొన్నావ్ అమ్మా, కొత్తబూడ్సులు కావూ ఇవీ— అందుకని కరవటం మొదలుపెట్టినవి. అదీగాక రెండు చేతులలో రెండూ ఉంటే గొడుగు ఎల్లాగ పట్టుకొనేది? అందుకని చెప్పులూ, గొడుగూ అక్కడున్న సోడా షాపులో పెట్టి అపళంగా బయలుదేరాను. కూలి పెడదాం అనుకొన్నా, కాని, ఆవెధవే, 'ఈ ఎండలో అణా ఇస్తేగాని రానండీ బాబూ' అన్నాడు. అందుకని కూలీ పెట్టక నేనే అయిస్ నెత్తిన పెట్టుకొని, నిమ్మకాయల సంచీ చేత్తో పట్టుకొని నడవటం మొదలుపెట్టాను.

"వాలండ్రే! మా నాన్న! చూశారా? కూలీకి అణా ఇయ్యాలని తానే మోసుకొచ్చాడు. మా మోస్తరు అర్ధణా కూరకు అణా కూలీ పెట్టడు" అని నన్ను జూచి నవ్వి ఆవిడ కొడుకును ముద్దాడింది.

"అదిగాదే అమ్మా, వినూ మరి. కోటవారి తుర్ల దగ్గరకు వచ్చేసరికి ఏమైందీ! మంచుగడ్డ కరిగి పొట్టు అంతా నావంటినిండా పడ్డది. అదీగాక అది కరిగిపోతున్నది! బట్టలన్నీ తడిసిపోయినై. బరువు తగ్గింది. ఇంటికొచ్చేదాకా ఉండేటట్లు లేదూ! ఎండకు మంచు కరుగుతుందా? ఆ సంగతి నాకు ఇప్పుడు తెలిసింది!! ఇక లాభం లేదు, ఇంటికి పోయేటప్పటికి ఒక్కముక్క అయినా మిగలదనుకొని ఆపొట్లాం ఆ పక్కనే ఉన్న ప్రెస్ ఆఫీసులో పెట్టాను. మళ్లీ వచ్చి తీసికెళ్లతానని చెప్పి నిమ్మకాయల సంచి తీసుకొని వస్తున్నానే. వస్తుంటే... ఏమైందీ, ఆ ఎండులో ఇసక... కాళ్లు మాడిపోయినవనే. అందుకని నడవలేకపోయినాను. చెప్పులుకూడా లేవాయె! నడవలేక మళ్లీ రోడ్డుమీదికి వచ్చాను. వచ్చి అక్కడొక జట్కా కనపడితే 'మా ఇంటికొస్తావోయ్' అన్నాను. వాడు 'మూడు అణాలు ఇస్తేకాని రానన్నాడు. బేరం చేసిచేసి ఎట్లాగయితేనేం చివరకు బేడ అర్ధణాకు కట్టించుకొని రంయిన వచ్చేశాను. నిమ్మకాయలు అర్ధపావలా, అయిస్ అణా, బండీకి బేడ అర్ధణా— పోతే పదణాలన్నరా ఇదిగో" అని చిల్లర నాచేతిలో పెట్టాడు.

"అయితే, రెండు నిమ్మకాయలు, అణా అయిస్ కలిపి అణాకానీతో పోయేదానికి అయిదు అణాలన్నర ఖర్చుచేసుకొచ్చాడు నీకొడుకు" అన్నాను మా ఆవిడతో.

ఆవిడ చిన్నబుచ్చుకొని "పోనీలెండి, చిన్న వెధవ! యాభై నిమ్మకాయలు తెచ్చాడు. ఊరగాయ వేద్దామని అనుకొంటునే ఉన్నాను. పిల్లలకు పద్ది అన్నాలలోకి అయినా ఉంటుంది" అని సరిపుచ్చుకొంది.


"ముందు రెండు కాయలు పిండవూ" అన్నాను నేను.

"నాయనా! కాయలు ఎక్కడ పెట్టావురా నాయనా" అన్నది వాళ్లమ్మ.

"అరె రే రే రే రే" — అని అంటూ, పండ్లు బిగించి తెల్లమొఖం వేసి వాకిట్లోకి— వీధి గుమ్మంలోకి ఒక్కగంతులో పరుగెత్తి, "ఎటుపోయిందే జట్కా" అని పసిదాన్ని అడుగుతున్నాడు.

తిండి విశేషాలు

శ్రీ భమిడిపాటి
కామేశ్వరరావు



12-11-1939 తేదీని రాజమండ్రీచుట్టుపట్ల ఒక వనంలో సంతర్పణ జరిగింది. ఆ తేదీనే చాలా జరిగిఉంటాయిగాని, వాటిల్లో ఇది ఒకటి. అందునిమిత్తం గ్రామాంతరాల్నించి సార్థకులైన ఆంధ్ర ఉద్యోగులు విరివిగా రావడానికి ఏర్పాట్లు కావడం, అట్లానే చాలామంది రావడం కూడా జరిగింది. దీన్లో అదనం ఏమి టంటే, సంతర్పణానంతరం — పోనీ, సంతర్పణకి తప్పనిసరిఫలితంగా ఉండే క్షుద్రనిద్రానంతరం, అనగా మూడుగంటలకి ప్రారంభించి — ఒక మాటలప్రదర్శనంకూడా జరుగుతుందని కరపత్రాలు అచ్చుపడ్డాయి. అగ్యక్షులు ఫలానా, వక్తలు ఫలానా అంటూ కార్యక్రమం వాటిల్లో ఉంది. లోగడే కార్యదర్శిగారు నన్ను గౌరవించి ఆసందర్భంలో నన్ను ఒక వక్తగా ఉండకోరారు. నేను ఆయనకి విధాయకుణ్ణి అవడంచేత "కాదు" అననూ లేక, అయినా వెంటనే ఒప్పుకోనూ ఒప్పుకోక, "ఎంత చదువుకున్నవాళ్లయినా ఎంత 'అర్థం' చేసుకోగలవాళ్లయినా, ఉదాత్తంగా భోజనంచేసిన తత్క్షణం ఏ ఫలారం అంటిదో పుచ్చుకోగల్రుగాని, ఉపన్యాసాలవంటివి బొత్తిగా స్వీకరించలేరేమో, ఆరకంపదార్థాలు ఆ సమయంలో విమర్శించవచ్చునుమండీ!" అంటూ నసగడం మొదలెట్టినా, ఆయన తన ఉత్సాహంలో "వల్లకాదు, మీరు ఒప్పుకునితీరాలి!" అని, నాచేత "సరే లెండి" అనిపించి, వక్తల జాబితాలో నన్ను కూడా అచ్చుకొట్టేశారు. అక్కణ్ణించి, నేనూ కొంచెం బుర్రదులిపి, చేల్చడానికి వీలైన సామగ్రి కొంత సిద్ధం చెయ్యవలిసొచ్చింది. మరోవిషయం మరోవిషయం అయితే అప్పట్లో మరీ వికటించిపోతుం దేమో అని భయం పట్టుకోవడంవల్ల, జనం అందరూ అంతకిపూర్వమే ఆచరణవల్ల గ్రహించిఉంటారుగనక భోజనప్రమేయమే ఎత్తుకుని కొన్నిసంగతులు వడ్డించుదాం అనీన్నీ, ఏఘట్టంలో పదార్థం మిక్కుటం అయిపోయి వెళ్లిపోయేలా కనిపిస్తుందో అక్కడితో కక్కున ఆగిపోయి శీవక్షోభ కలగకుండా జాగ్రత్త పడదాం అనీన్నీ ఆయత్తం చేసుకున్నాను. అయితేం! మనవశమా! సంతర్పణ అయింది, రిమార్కులు అయినాయి, నిక్కచ్చిగా దంతపుపని చేసినవాళ్ల అపసోపాలు అయినాయి, ఇటూ అటూ దొర్లుతూ కుమకులాగడాలు అయినాయి, కొంచెం గానా బజానా అయింది, ఎల్లానో తంటాలుపడి, దాని మొహం కూడా, సాయంత్రం అయిదుగంటలుకూడా అయింది.

తక్షణం కొందరు బ్యాంకుఉద్యోగులు, "కొంపతీవ్వ కరపత్రాల్లో నిరూపించి ఉన్నప్రకారం, ఆలస్యం అయితే అయిందని, మీటింగూ దానితాలూకు ఉపన్యాసాలూకూడా ఎక్కడ రద్దేస్తారో కదా, ఇవన్నీ భరించడం ఎల్లారా భగవంతుడా!" అని బెంగపెట్టుకున్నట్టు దిక్కుమొహాలు వేశారు. దానికితోడు మా ముఖ్యస్నేహితు డొకాయన, "మరి ఆలస్యం చెయ్యక మీటింగు కానిత్తాం, బల్లలు సర్దండి" అనే సంగతి చకచకా నిష్కర్షగా మంచినీళ్లప్రవాహంగా ఆంగ్లంలో అనేశాడు. "సభంతపనీ జరిగిపోయిం దన్నమాటేరా దేవుడా" అని కొందరు ఉద్యోగులు నిస్పృహలో పడిపోయారు. ఏవాడు చేసుకున్నదో మరి అనుభవించాలిగావును అనుకోడంవల్ల గావును, కొందరికి మొఖాన్ని కత్తివాటు వేస్తే నెత్తురు లేదు. కాని కొందరు గడసర్లు ధైర్యం అవలంబించారు. "అన్నట్టు, ఫొటో తీయించుకోవాలిగావునుగా! అది చాలా ముఖ్యం. వెలుగుండగానే ఇల్లు చక్కబెట్టుకోమన్నాడు, ఫొటో చిక్కబట్టుకోమన్నాడు. ముందు ఫొటోనే! తరవాత తతిమ్మావి" అని మాట్లాడుతూనే, వాళ్లు, బల్లలూ, కుర్చీలూ అవీ ఉన్నచోట్నుంచి ఓ ఫర్లాంగుదూరం ఈడ్చేశారు. సూర్యాస్తమయంవరకూ వాళ్లు నిమ్మళనిమ్మళంగా ఫొట్రోగ్రాఫుదిగుతూనే ఉండిపోయారు. మెట్టుకి ఒక్కడూ వక్తలున్నవైపైనా రాలేదు. కార్యదర్శిగారు చాలా నొచ్చుకుని, వక్తల్ని క్షమాపణ కోరుకున్నారు. వానప్రస్థంరోజూనే ఉపన్యాసవ్యాసంకూడా సిద్ధించి శ్రమలేకుండా రెండాశ్రమాలు లభించడం జన్మకి చాలుగదా అని వక్త లన్నారు. కార్యదర్శి ఆ ఫొట్రోగ్రాఫుచెట్టుదగ్గిరికి మళ్లీ వెళ్లి చూసొచ్చి, కొందరు కుర్చీలకి అంటిల్లా అయిపోయారనీన్నీ, కొందరు మౌనవ్రతంలో పడ్డట్టు చెప్పారనీన్నీ, తక్కినవాళ్లు పంచబంగాళం అయిపోయారనీన్నీ చెప్పారు. "అయ్యో! ఇప్పుడొచ్చిన ప్రమాదం ఏమీ లేదు. కూనోపన్యాసాలకే, అర్థంచేసుకోగల వాళ్లుకూడా హడిలిపోడం వేళావిశేషం! మీరు చేసింది పదార్థాల సంతర్పణ, మాది పదాల సంతర్పణ. అదీ ఇప్పుడు కేవల తర్పణ అయిపోయింది. మా పదాలు మేం నోటితోనూ అనవచ్చు, లేకపోతే ఆ నోటిలోంగిలికూడా తగలనీయకుండా, పత్రాలమీద కూడా పెట్టచ్చు. అల్లాగే కానిస్తాను. అసలు నే చెప్పదలిచినదాల్లో కొన్ని లెఖ్ఖలూ, అంకెలూ వచ్చేపట్లు ఉండడంవల్ల, అది లిఖితంచేసుకునే వచ్చాను, రచనకి కారకులు గనక మీకు ప్రత్యక్షనమస్కారం. సర్దు మిత్రో అంటూఉన్న తమ సమక్షంలో చదవబడకుండా తప్పిపోడం అనే పుణ్యం నా రచనకి పుట్టగానే కట్టబెట్టిన తక్కినవారికందరికీ లోపాయికారీగా నమస్కారం. సెలవు" అని నే నన్నాను. అయిపోయింది. నిష్క్రమించి మేం వచ్చేశాం. రచన అల్లాగే ఉండేసింది.

ఇంతలో 17-2-1940 తేదీని రాజమండ్రి ఆర్ట్సుకాలేజీ పూర్వవిద్యార్థివార్షికోత్సవంతాలూకు సమావేశం వచ్చింది. నేను అక్కడ పూర్వవిద్యార్థినై ఉండడంవల్లా, ఆంధ్రదేశపు విద్యాధికసమావేశాల్లో ఆ సందర్భపుసమావేశం ఒకటి అవడంవల్లా, విద్యాసక్తిగల స్త్రీబాలవృద్ధులతో నిండిన సభయెదట నిలబడి ముఖాముఖీగా మాట్లాడవలసిన అవసరం వచ్చినప్పుడు వక్త గమనించవలసిన సార్వజనీనతా, మార్దవం, వైవిధ్యం, మోతాదూ గురించి అనేకంగా నేను నేర్చుకోడానికి అదే తరుణం అవడంవల్లా, ఆసందర్భపు ప్రణాళికలో నేనూ పడ్డాను. కాని, ఆరోజున ఇతర విషయాల్లో చాలా ముఖ్యమైనవి ఉండడంచేత, నాకు ఇచ్చిన వ్యవధి చాలక, నాకు కొంచెం— అవగా చాలా—ఉక్కిరిబిక్కిరి అయింది. ఏదేనా సమగ్రంగా చెప్పడానికి వీలులేకుండా, పోనీ మానడానికీ వీలులేకుండా వచ్చింది. నేను పరాపరా ఉపోద్ఘాతం కానిచ్చుకుని, "అబద్ధం ఆడడం" గురించి ఒక పరిచ్ఛేదం చదివి, విషయం మారుస్తున్నా నని చెప్పి, ఈ క్రిందిరచనలో తిండిపోటీ లున్న ఘట్టంలో కొంతమాత్రం తిరగేశాను. ఆవాక్యాలలో పేర్లూ, స్థలాలూ, అంకెలూ, లెఖ్ఖలూ, తేదీలూ ఉంటూండడం చేత వాటి యాథార్థ్యం జనం నమ్మే చదివాను. కాని, వాటిల్లో, చెప్పులుతినడపు పందెం సంగతి నేను చదువుతూన్న క్షణంలో, చీమ కేనా సందులేకుండా ఉన్న

ఆమహాసభలోంచి ఒక పురుషుడు (—శ్రీ శ్రీ సర్ కె. వి. రెడ్డినాయకుగారు అధ్యక్షతవహించిన అంత సభలో ఉన్న అంతమందినీ నేను అసత్యాలు చెప్పి మోసగిస్తున్న సంగతి తను ఒఖడే హఠాత్తుగా పరిశోధించినట్టు — నేను అబద్ధం ఆడడంగురించి అంతకి పూర్వమే ముచ్చటించిఉన్న వాణ్ణవడంచేత ఆతరవాత నేను ప్రసంగించేది ప్రతీదీ మంచి అబద్ధం అయి ఉండకపోతుందా అనే అఖండానుమానం తన్ని పీడించుతూన్నట్టు—) లోకకల్యాణం నిమిత్తం నావాక్యం కేవలం కోత అని ఋజువుచెయ్యడానికిట, "కొయ్ కొయ్" అనే శంకారావం చేసి, తను రెండు కోతలు కోశాడు. నావి ఆత్మస్తుతిగల వాక్యాలైఉంటే వాటిని రెండు కాదు మూడుకోతల దువ్వెన్నలాగ కొయ్యవచ్చు. కాని, స్థితి వేరు! వారు అవస్థావశంచేత గౌతమీస్నానం నిమిత్తం రాజమండ్రీ వేంచేసిన యాత్రికులై ఉండవచ్చు నని నా రాజమండ్రీత్వానికి తోచి, నేను ఆధ్వని వచ్చిన వేపు తిరిగి, "అయ్యా! నా వాక్యాలకి లిఖితమై నమ్మతగ్గ ప్రమాణం నాదగ్గిర ఉందండి! ప్రస్తుతం క్షమించండి" అనేసి, అప్పట్లో వ్యవధిలేని స్థితిలో ఉండడంవల్ల ఊరుకున్నాను. కాని, ఇప్పుడేనా సప్రమాణంగా ఉంటే ఆనాటి మహాసభకి హాజరై ఉండి ఆవేళ కమామీషు జ్ఞాపకం ఉండి, ఈరచన చూడటంబస్థించే రాజమండ్రీవాళ్లేనా నన్ను శంకించకుండా ఉంటారుగదా అనే ధైర్యం చొప్పున అటువంటి వాక్యాల చివర జగత్ప్రసిద్ధిగల ఒకానొక వారపత్రికయొక్క సంచిక నెంబరూ, మరి దానితరవాత ఆసంచికలో ఆయా పోటీసంగతి అచ్చుపడ్డ పేజీసంఖ్యా ఇచ్చాను. అన్నివేల సంచికలు కోతలతో భూమిమీద చెలరేగడం కష్టం. అయినా సరే, ఆపత్రికమాత్రం కొండమీంచి ఊడిపడిందా అంటే, మరి నమస్కారం!! పేర్లూ, అంకెలూ, లెఖ్ఖలూ ఉన్నాయిగా! హృదయం, బుర్రా, ఓపికా, పట్టుదలా ఉంటే ఋజువుచేసి చూసుగోడానికి వీలున్న సంగతులుకూడా చెవికి ఇల్లా తగిలాదో లేదో ఆపళంగా కొయ్కొయ్ మని గర్జించి తెయ్ తెయ్ మని ఆడేసేకంటె, తణిఖీచేసి యథార్థం తేల్చుగునేదాకానేనా ఆగడం ధర్మం. విద్యావంతుడు వినగానే తను విన్నది ప్రతీదీ నమ్మెయ్యకూడదని మాట నిజమే. కాని, క్షణానికి ఒకటిచొప్పన మహాద్భుతాలు అని వినక అనుకుంటూండబడేవి సుప్రాభ్యాలూ, సాధారణాలూ అయిపోతూన్న ఈయుగంలో చెవినిపడ్డ ప్రతీసంగతీ, ఒకవేళ దాఖలాఅయే బాపతేమో అనికూడా ఆగకుండా, వేసమయం అయినా సరే, మూకలో నొక్కడానికి వీలున్నంతమాత్రాన్ని, ఇతరుల ఖర్చుమీద శ్రమలేకుండా నుంచున్న పాట్న. నీచవుకీర్తి పల్లీకుగా నొల్లుకుని ఖాయంగా ఉంచేసుగోవాలనే కక్కూర్తితొందరలో 'అబద్ధం, అయథార్థం' అని కేకలెట్టి, తద్వారా రసాభాసం కల్పించి, ఆ క్షణంలో విజయం తండే అనుకుని గర్వంకూడా వహించి, తనకంటె చిన్నసైజు మైరావణులైన లోకువ స్నేహితుల దగ్గిర అపవిత్రస్థలాల్లో పచ్చిడచ్చీలు కొట్టుగోడం విద్యాధికుడియొక్క లక్షణంలా కనిపించదు—అందులో మళ్లీ ఇంగ్లీషువిద్యాధికుడియొక్క లక్షణంలా అసలు కనిపించదు. అయినా చెప్పలేం! స్వాతంత్ర్యపు రోజులు! "మరి ప్రకృతం—"

భోజన సందర్భాల్లో ప్రసంగాలు మనలో వాళ్లీ ఉన్నట్టు తోచదు. భోజనకాలంలో గోవిందనామస్మరణతోనే ఆర్యులు—అనార్యులూ అంతే అయిఉండదు—తృప్తిపొందుతారుగాని, ఐహికస్మరణ చెయ్యరు. దేవుణ్ణి తల్చుకునేటప్పుడు జోరుగా సమూహంగా అరవడంవల్ల కూడా గొంతిగ సాఫీపడి భుజించడానికి ఎక్కువ అనువుపడుతుందని కొందరి ఊహ. అయినా ఈ (మిథ్య) వనభోజనసందర్భంలో ఎదైనా మామూలు ప్రసంగం చెయ్యవలిసిందని నిర్వాహకులు నన్ను కోరడం వల్ల భయపడుతూనే నేను అంగీకరించడమైంది. సభ్యుల్లో పరిచితులు విశేషంగా లేనప్పుడు చనువుగా మాట్టాడడానికి కొంచెం బెదురుగా ఉంటుంది. కాని, మానవవ్యక్తుల

స్వభావ నిర్ణయంతో జోక్యంలేని మాటలు కొన్ని చెబుతున్నాను గనక అపరిచితులైనా ఏమీ మరోహాలాగ ఎంచవద్దని ప్రార్థన.

ప్రాణరక్షణకోసం తినేది తిండి అంటారు. అందుకోసమే కాకుండా విలాసంకోసం కూడా భుజించే సందర్భాన్నీ, అవకాశాన్నీ, పదార్థాల్నీ భోజనం అంటారు. ఏదేనా సందర్భంలో, భోక్తా పదార్థమూ ఉంటేగాని భోజనం ఉండదు. సందర్భం అంటే: తిండితినడం, అయిం దనిపించడం, ఎంగిలిపడడం, మూతి తుడుచుగోడం, మెతుకు కొరకడం, మంచిమాట చేసుగోడం, వాలాయితు తీర్చుకోడం, పథ్యం తినడం, పోగు చెల్లించడం, విందారగించడం, మనుగుడుపులు, దేవతార్చన, సాపాటు, పార్వణం, అశనం, పిండం—ఇల్లాగ్గా మిక్కిలి ఉన్నాయి. భోక్తల్లో రకాలు చెప్పడానికే ఇది సమయం కాదు. ఏమంటే, వాళ్ల వయస్సులూ, ఆశ్రమాలూ, స్వభావాలూ, స్థితులూ, పరిస్థితులూ, అవస్థలూ—ఈరీతిగా జోలెడు చూడాలి. కాని, ప్రతీభోక్తకీ ఒక శరీరం ఉండితీరాలి. స్థూలంగా చెప్పాలంటే, 200 ఎముకలూ, 500 కండరాలూ, రోజుకి లక్ష సార్లు కొట్టుకునే గుండె, చదరపు అంగుళానికి 3000 రంధ్రాలు గల చర్మమూ మొదలైనవి ఉండితీరతాయి. ఇల్లాంటి శరీరం యొక్క రక్షణకై సగటున రోజు 1-కి 5½ పౌన్ల ఆహారం— అనగా దామాషాయీని సంవత్సరానికి ఒక టన్ను బరువు తినుబండ త్రాగుబండాలు మానవుడు లోపలికి పుచ్చుగోవలిసి ఉంటుంది అని శాస్త్రజ్ఞులు లెక్కవేశారు (నెం. 2972 పే. 5).

ఆహారపదార్థం ఏది కావచ్చును అనేది ప్రశ్న. దీనికి సమాధానం చాలా విశాలం. ప్రాణంగాని ప్రాణాన్ని పోషించలేదు. అందుకని పెద్దప్రాణం చిన్న ప్రాణాన్ని మింగేసినప్పుడుగాని నిలబడదు. అందుచేత మానవుడు ఇతరప్రాణుల్ని తినేస్తాడు. మనుష్యుల్ని తినేసే మనుష్యులు ఇప్పుడుకూడా అక్కడక్కడ—పోనీ ఎక్కడో అక్కడ—ఉంటారని కొందరు చెబుతారు. ఉండవచ్చును! మనలో ఒకొక్కడికి ఇంకోడిమీద తీవ్రకోపం వచ్చినప్పుడు వాణ్ణి తినేసేటట్టు చూస్తాడుగాని తినేసెయ్యడు. సాధారణంగా మానవుడు జంతువుల్ని పుచ్చుగుంటాడు. తననే తినేస్తాయేమో అనే భయం ఉన్న క్రూర జంతువుల్ని మానవుడు వదిలేస్తాడు, కడం వాటినే కానిస్తాడు. అటువంటివి తిన్నకొద్దీ పుడుతూంటాయి, పుట్టినకొద్దీ తినబడుతూంటాయి. పళ్ల గట్టీ, నాలిక వాడీ, ముక్కుదళసరీ గల మానవులు పచ్చి జంతువుల్నే కొరుక్కుని తినేస్తారు. కాని, నాజూకుమనుష్యులు తమ నేర్పువల్ల కొన్ని భాగాలు స్వీకరించి, కొన్నింటిని విసర్జించి, ఇతర ఘనద్రవ పదార్థాలతో కలిపి, అగ్నిమిత్రసాహాయ్యం పొంది, కొత్తసమాసాలు సృష్టించుగుని పుచ్చుగుంటారు. అల్లానే గాల్లో పక్షుల్నీ, నీళ్లల్లో చేపల్నీ స్వీకరిస్తారు. అపైని, మానవులు వృక్షాల్ని మూలంలగాయతు చిగురువరకూ తమ ప్రజ్ఞవల్ల చేర్చి నూతనమిశ్రణాలు కల్పించుగుని తింటారు. మూలానికి నాశనం రాకుండా చెట్లు ఇచ్చే ఫలంగాని, జంతువు లిచ్చే రసంగాని పుచ్చుగోడం కొందరి మతం. చెట్టుయొక్క

ఫలం కోసుకునేటప్పుడు కూడా దాని ప్రాణానికి హాని కలుగుతుంది గనక, చెట్టునించి వాటంతట అవే రాలిపోయిన ఫలాలే తినాలని కొందరి బాధ. వానకి మొల్చి గాలికి పెరిగే నీవారం తినాలని కొందరి తంటాలు. దూడ వెళ్లి ఆవుదగ్గిర పాలు తాగేటప్పుడు లేగే నురగ రేణువులు దూరాన్ని ఉండి ఆరగించాడు ఒకాయన అన్నారు. పరిశుభ్రమైన జలం తాగీ, వాయువు పీల్చీ జనం జీవించాలి అంటారు కొందరు. వీళ్లందరికీ ఉద్దేశం ఏమిటంటే, ప్రాణం నిలిపే మూలకణాలు గల పదార్థాలు కొన్నీ, ప్రాణం తీసేసే కణాలు గలవి కొన్నీ ఉన్నా యనిన్నీ, ప్రాణం నిలిపేవే పుచ్చుగోవా లనిన్నీ, అవయినా మోతాదు చూసుగుని, వేళకట్టున, తత్వాన్నిబట్టి, కాలానుగుణ్యంగా, అందుబాటు ఆలోచించి, మొహమాట పడుతూ పుచ్చుకోవలిసి ఉంటుంది అనిన్నీ.

కాని, ప్రపంచంలో జరుగుతూండే తిండి పోటీలు గమనిస్తే, చాలా ఆశ్చర్యం వేసి, ప్రాణాపాయం అయిన వస్తువులు అసలే లేవా అనిపిస్తుంది; తిండికి హద్దు లేదా అనిపిస్తుంది. చూడండి: స్టాట్‌ఫోర్డులో జె. కాండార్ అనే అతడు నాలుగు పౌన్ల బరువు గల చేపల్ని ఒక గంటలో తినలేడు అని ఒకడు పందెం వేశాట్ట. అయితే, అతడు అన్ని చేపలూ 20 నిమిషాల్లో తినేసి ఊరుకోక పైపెచ్చు ఏడుపైంట్ల 'బీరు'పీల్చేసి పందెంనెగ్గి రాయల్లా ఉన్నాడు [2880-4]. లాస్ యాంజెలిస్‌లో కోడిపెట్టలు తినడం పోటీ జరుగుతూంటుందిట. 1936-వ సంవత్సరపు పోటీలో మూడేసి పౌన్ల బరువు గల 10 కోడిపెట్టల్ని—15 పౌన్ల బరువు మసాలాతో సహా—తినేసి ఎడ్నాపాటర్ అనే అదృష్టవంతురాలు నెగ్గిందట [2887-12]. పెద్దరకం అరటిపళ్లు తినడం పోటీలో ఆల్బర్టా నగరానికి చెందిన మెక్‌గీ అనే దొర ఒకటి మాత్రమే ఎక్కువగా మెక్కి పందెం నెగ్గాడట. అవతల పోటీదారు 42 మాత్రమే పుచ్చుకోగలిగాడట, ఇతడు 43 ఊదేశాడు [2911-5]. ఏడేసి అంగుళాల వెడల్పు గల పెద్దపెద్ద బిందిరొట్టెలు 36 మాత్రం 61 నిమిషాల్లో నమిలేసి ఒక అమెరికా దేశస్థుడు యునైటెడ్ స్టేట్సులో రొట్టెల మహాసమ్రాట్ అనే బిరుదం పుచ్చుగున్నాడట [2894-4]. యూగోస్లావియాలో ఒక ముష్టివాడు పచ్చికప్పల్నీ, చేపల్నీ, ఎలకల్నీ, పాముల్నీ జనంఎదట భక్షించి యాచనవల్ల జీవయాత్ర చేసేవా డున్నాడు [2917-4]. టర్కీలో డెమిర్‌డ్రీలో ఒక రయితు మామూలు కూర తరిగినట్టు తన రెండు చెప్పులూ తరిగి, ఇంత వెన్న ఆ చెప్పు ముక్కలికి పామి ఒక్క అరగంట వాటిని పెనంమీద వేయించి, దింపి, లగాయించేసి పందెం నెగ్గి బహుమతీ నవరసు విలువా పుచ్చుకున్నాడట [2968-3]. నోవాస్కోషియాలో ఒక బాలుడు ఒక కత్తిరేకూ, ఒక ఎలెక్ట్రిక్ బల్బూ తినేశాడట. ఇంకొక మనిషి ఇనపతీగెలూ, తీగచుట్టలూ తినేస్తున్నాడని తెలిసి, వాణ్ణి తీసిగెల్లి గ్లాస్గో కారాగృహంలో పెట్టగా, వాడికి బుద్ధిరాక, వాడు ఇనపగడియలూ, ఊచలూకూడా తినయ్యడం మొదలెట్టాడట. డార్జిలింగ్‌లో యోగుల స్నేహం సంపాదించిన ఒక ఐరిష్ వాడు ఒకేసారి 150 మేకులూ, 700 గ్రామఫోను సూదులూ తినేశాడట, చావలేదు.

వీరందర్నీ మించినవాడు ఒక జర్మన్ సామంతుడు. ఆయన 150 మేకులూ, 102 ఇత్తడి సూదులూ, 150 గాజుముక్కలూ, 7 గుజ్జపు లాడపు మేకులూ, 6 నాణెపుకాసులూ, 3 కల్లైపుముక్కలూ, సీసపుముద్దా, 20 ఇతర సామానులూ తినేసి చావడంలేదు దిబ్బా లేదు, 'బాయిలర్'లాగ అల్లానే ఉన్నాడట [2944-6]. విషద్రావకాలు తాగి చావకుండా నిల్చినవార్ని ఎరుగుదుం. విషం పెట్టగా తెలియక తినేసి చావకుండా నిల్చిన శాండో రామమూర్తిని ఎరుగుదుం. మనదేశంలో పోటీలు, ప్రాణాపాయం కావు అని అందరూ ఎరుగున్న పదార్థాలతోటే గనక విస్తారం అవసరం లేదు. అవసరమైన పాదరసంతో ఆహారం కల్పించుగుని, అది బుగ్గనో కంఠంలోనో ధరించి,మరి ఏళ్ల తరబడి ఆకలిదప్పులు గాని విసర్జనగాని లేకుండా విహరించగల మనుష్యులు హిమాలయ గుహల్లో ఉన్నట్టు స్నేహితులు చెబుతారు.

దేనివల్లా ప్రాణాపాయం రాకపోవచ్చునని పైవాట్లవల్ల తెలుస్తూంటే, ప్రాణరక్షణకి ఏదైనా చాలని చెప్పడానికి కొన్ని నిదర్శనాలున్నాయి. మేబిల్ యాష్‌వర్త్ అనే ఆమె 11 ఏళ్లనించి పాలుమాత్రం తాగి ఉంటోందట. పంచదారమట్టుకు జాస్తీగా వేసిన 'టీ' మాత్రం తాగి ఇ. హార్ అనే ఆమె 18 ఏళ్ల నించి ఉందిట. వీళ్లిద్దరూ ఇంగ్లండువాళ్లే. ఇండియాలో, బంకూరాలో ఉప్పుకలిపిన నీళ్లుమాత్రం తాగి, 56 ఏళ్ల నించి జీవిస్తూన్న గిరిబాలాదేవి ఉంది [2920-4]. యుద్ధసమయంలో ఒక స్త్రీకి దొరతనంవారు దినవెచ్చం ఇయ్య సంకల్పించగా ఆమె తనకు అది అవసరం లేదనీన్నీ, తాను క్రితం 12 ఏళ్లనించీ ఆహారపానీయాలు లేకుండానే జీవించుకొస్తున్నాననీన్నీ చెప్పిందట [ఇది ఆ వారపత్రిక 3043 నెంబరు 6-వ పేజీలో 24-2-1940 తేదీగల సంచికలో ప్రచురం అయినసంగతి గనక, సంతర్పణనాటికిగాని, సభనాటికిగాని నేను ఇది తెలుసుగుని ఉండలేదు, 'కొయ్య'నూ లేదు].

ఇక, భోజనపదార్థాలవల్ల కలిగే ఆరు రసాల్లోనూ ఉల్బణ, అనుల్బణ, ఉల్బణానుల్బణ అనే 'ముయ్యారు భేదాల్లోకీ' ఇప్పుడు వెళ్లను. అదీకాక, పదార్థం, రుచి, పాకం, రసం అనే మాటలు భోజనంలోనే కాక, కవిత్వంలోకూడా ఉన్నప్పటికీ అందులోకికూడా ఇప్పుడు ప్రవేశించను. ప్రవేశిస్తే మోతాదు ఎక్కువ అవుతుంది. ప్రాణాపాయం అనుకున్నవన్నీ ప్రాణం తీయవు, సరిగదా, ఒక అవస్థలో ప్రాణాన్ని రక్షిస్తాయి. కాని, ప్రాణాధారం అని మనం అనుకునే అన్నమే మోతాదుమీరి విషం అవుతుంది. మాటలుకూడా అంతేగా! ఆగుతాను!

"ప్రాణాః ప్రాణభృతా మన్నం,
తదయుక్త్యా హిన స్త్యసూన్."

అనిగదా మాధవుడు!

‘రెంటికిం జెడిన రేవఁడు’

శ్రీ కొడవంటి శంకర నరసింహ బ్రహ్మం

పూర్వ మొకప్పుడు కొండొక ‘చంద్రిక’లో నీ పైగాథనుగూర్చి చర్చించుచు నిదే శీర్షికతో కీ. శే. కవిభూషణ పెట్టి లక్ష్మీనరసింహముగా రొక వ్యాసము వ్రాసిరి. ఈ లోకోక్తికిఁ జాకివానికథ నిటీవల నెవ్వరో కల్పించి యుండిరే కాని పూర్వము నుండియు నుద్దేశింపఁబడి యుండిన ట్లాధారము లేదని వా రనిరి. బ్రౌణ్యనిఘంటువున ‘రేవడు’ పదమున కట్టి యర్థ మీయఁబడలేదఁట. సీతారామాచార్యులవారి నిఘంటువున నీ చాకివాఁ డనునర్థ మాపదమున కీఁబడినను దానికి లక్ష్యముగా వా రిచ్చిన “నీచనుదోయి పంకమద”అను మనుచరిత్రపద్యమును వారు వేఱొకపదమున కర్థమును వ్రాయుసందర్భమున “రెంటికిం జెడిన రేవణనాదు నె” అని వేఱొండు పాఠముతో నిచ్చియుండుటచే వా రేపాఠమును సరియైనదిగా గ్రహించినదియుఁ దెలియ రాకున్న దనిరి. మనుచరిత్రమందలి పైపద్యమునం దున్న ‘రేవడి’ పదమును బురుషవాచకముగా భావించి యొకరు ఖండించుచుఁ జేర్పఁగా నింకొక రా పద్యమున కర్థమును వ్రాయుసందర్భమున నీ చిత్రకథ సృష్టించి రని వారు నిర్ణయించిరి. ఆ పద్యభాగమునకు శ్రీ శ్రీ శ్రీ విక్రమదేవవర్మమహారాజులుంగారు చెప్పిన “సానుచేయుటకును గాఁపురముండుటకును బనికి రాక, రెంటికిని జెడిన రేవడ (భూమి) వంటివాఁడ నౌదునా?” అను నర్థ మెంతయు నొప్పియున్న దరియుఁ, గావున నదియె సరియైన యర్థ మనియు నిర్ధారించిరి. శ్రీ జనమంచి శేషాద్రిశర్మగారును దమ మనుచరిత్రహృదయావిష్కరణ మనెడి గ్రంథమున నీభాగమును గూర్చియే చర్చించుపట్టున నీరజకునికథ యీ లోకోక్తి కేమియు సంబంధింపలే దని వ్రాసిరి. ‘చదువుకొన్నవానికన్న చాకలి మేలన్న’ లోకోక్తికీకథ విరుద్ధముగ నున్న దఁట. ఇది గాకున్న మఱే యేయర్థ మిట ననుసంధింపవలెనో వారు తెలుపమానిరి. కనుక నీయర్థ మెంతవఱకీ పద్దెమునకు సరిపడియున్నదో, యిది పూర్వులచేతనే యుద్దేశింపఁబడినదో, కాకీవలివారే కల్పించిరో తెలిసికొనవలసియున్నది.

నిఘంటువులయం దీయర్థ మీఁబడలేదు కనుక నిట్టియర్థము నీపదమునకుఁ జెప్పరా దనుట హాస్యాస్పదము. ఈ లోకోక్తికీకథ పూర్వులచే నుద్దేశింపఁబడినదో లేదో యెఱుఁగవలెనన్న దీని నెవ్వరెవ్వరు వాడియుండిరో తొలుతఁ దెలిసికొనవలయును. అనంతామాత్యుఁడు భోజరాజీయమున దీనిని దొల్తొల్త ప్రయోగించినట్లు పెట్టి లక్ష్మీనరసింహముగారు వ్రాసిరి. కాని పద్యసంఖ్యగాని, యాశ్వాసపు సంఖ్యగాని యిచ్చినవారు గారు. వావిళ్లవారి ప్రతియం దది నా కగపడలేదు. వారు చూచిన వేఱొకప్రతియం దుండునేమో? నా కది మఱిరెండు గ్రంథములఁ గన్పట్టినది. జైమినిభారతాశ్వమేధపర్వమునందుఁ బిల్లలమఱ్ఱి యభిజ్ఞుఁడు—

> “అనుదినము నిట్లు ప్రాతికూల్యము ధరింపఁ
> జండికతమున ముని బ్రహ్మచర్యనియమ
> మునకు గృహమేధివర్తనమునకుఁ దొలఁగి
> రెంటికిని జెడ్డ రేవనిరీతి యయ్యె.”
>
> [౮. ౭౩]

అని వ్రాసినాఁడు. ఈపద్యమే మనుచరిత్రపద్యమునకు మూలమని తత్ప్రతికాకారులగు శ్రీ జనమంచి శేషాద్రిశర్మగారి యభిప్రాయము. ఇందు ‘రేవని’అని పురుషార్థబోధకమగు పదమునే కవి వాడినాఁడు. దీన నచ్చుతప్పుగాని, మఱే యేదిగాని యున్నదని యేతత్పదమును ‘రేవటి’గాఁగాని, ‘రేవడి’ గాఁగాని మార్చి వేయుదు మందురా? ఇంతకన్నను బ్రబలాధారమగు ప్రయోగ మింకొండు గలదు. గౌరనకవిరచితమగు హరిశ్చంద్రద్విపదకావ్యములో నది చూపట్టును. ఏతద్గ్రం

థమును బరిష్కరించి లఘుటీకాయుతముగా నచ్చు వేయించిన కీ. శే. కళాప్రపూర్ణేత్యాది బిరుదాంచితులు వేదము వెంకటరాయశాస్త్రులవారీగాథనే లఘుటీకలో నిచ్చియుండిరి. అందలి పాద మిది:

"రెండు పోనాడిన రేవనిరీతి"

[ఉ. ద్వి. ౨౭౩]

ఇందు కవి 'రేవని'అని ప్రయోగించుటయే కాక, 'పోనాడిన' యనియుఁ బ్రయోగించి రేవనికి జీవము పోసినాఁడు. మట్టిపాలై నశింపనున్న రేవఁ డీకవిబ్రహ్మ మూలమున జీవము నొంది పురుషత సంపాదింపఁగల్గినాఁడు. చెడుటయుఁ, బోనాడుటయు నొక్కటి కాదని యెల్ల రెఱుంగుదురు. పోనాడుట (పోన్ + ఆడుట) యనఁగాఁ దనంతఁ బోఁగొట్టుకొనుట కావునను, ప్రత్యేక వ్యక్తిత్వముగల చేతనమే యట్లు చేయఁగల్గిన దగుటను పైలోకోక్తియం దుపయోగింపఁబడిన పదము చాకలివానిని దెలియఁజేయు సార్థబిందుక 'రేవఁడ'పదమే యగుట యెంతయు విస్పష్టము! ఈ పైకవు లిరువురును బెద్దనకుఁ బూర్వులు. కనుకఁ బెద్దనయు నాయర్థమునే దృష్టిపథమునం దుంచుకొని యాలోకోక్తిని వాడినాఁ డనుట విదితము. 'రేవఁడ'పదములోని 'వ-డ'లమధ్య నరసున్న నాతఁడే యుద్దేశించినాఁడు. కనుక నేతదర్థానుస్వారమునకుఁ బూర్ణానుస్వారముఁ జుట్టఁబోవుట సమంజసము గాదని తలంతును.

శ్రీ శర్మగారు 'చదువుకొన్నవానికన్న చాకలి మే'లన్న లోకోక్తి నాధారము చేసికొని యీగాథ దప్పనుచున్నారు. ఈలోకోక్తి యెల్లచో నిజమా? ఎక్కడనో నొక్క రట్టివారు చదువుకొన్నవారిలో నుందురు గాక. కాని యంతమాత్రమున నెల్లకడలఁ జాకివారు విద్యావంతు లందఱికన్న మిన్న లనఁబూనుచో లోకము నవ్వదా? ఈకథయు నందఱు రజకులకు ననువర్తించు నని యెక్కడ నన్నది? ఇది కొండొకనిఁ గూర్చిన గాథ. ఆ రజకునివలె నని యర్థము. అంతియ. శర్మగారివలెఁ బైలోకోక్తి నెల్లకడల ననుసంధింపఁ బూనుచో నుద్యోగములనుండి చదువుకొన్నవారిని వెళ్లఁగొట్టి చాకివారిని ప్రవేశింపఁజేయవలసివచ్చును. ఈవాదన యెంత బాగు!

ఇఁక నుభయార్థంబుల నేది మనుచరిత్రాంతర్గత పద్యమున కనువుపడియున్నదో పరికింతము. వేమాయ చెప్పినదెల్ల వేదమన్నట్లు దేనినో యెవరో చెప్పిరి గనుక దాని నొప్పుకొనవలెనన్న నద్దులేదు కాని, మనుచరిత్ర నందలి

"ఉ. నీచమదోయి సంకుమద
నిర్భరవాసన మేన నూనన
య్యా చిరసౌఖ్యముల్ గనుట
యొండెఁ దపం బొనరించి పాపముల్
రాచుట యొండెఁ గాకిహప
రంబుల కొరకె దూరమై వయ
శ్రీ చన రెంటికిం జెడిన
రేవఁడ నాదుసె నీరజేక్షణా!"

అను పద్యములోని రేవఁడపదమునకు రేగటి భూమి యర్థము చెప్పుట యెంతటి సరసత! అట్లయ్యెడిచో నా సామ్యమునందలి సామరస్య మంతరించెడిని గదా! అసలు రసజ్ఞు లేరెని నీ యర్థము మెత్తురే! రేవటినేల మిగుల సారవంతమైనదని ప్రసిద్ధి. కృష్ణా పశ్చిమగోదావరీమండలములయం దెక్కుడుభాగ మీ రేవటినేలలే. అచ్చటఁ బంటలు పండకుండెనా? కాక ప్రజ లచ్చో నిండ్లు లేక చెట్లక్రింద నివసించుచుండిరా? కావున రేవటిభూమి యింటికిం బంటకుం బనికిరాక పోవుట యేమి?

"చిరసౌఖ్యముల్ గనుట యొండెఁ, దపం బొనరించి పాపముల్ రాచుట యొండె"–ఈ రెండుమాత్రమే (మాయా) ప్రవరున కున్న మార్గములు. ఇహమైనను గలుగవలయును, లేకున్నఁ బరమైనను లభ్యపడవలయును. "తపం బొనరించి పాపముల్ రాచుట" కతఁడు సర్వస్వతంత్రుఁడుగ నున్నాఁడు. వరూధినిని జేకొనచో నది యిఁక సాగదుగదా? అనఁగా నట్టిచో నాతఁడు పరమునకు దూరగుఁడు గావలసివచ్చును. ఇఁక మిగిలిన దేమి? ఇహసౌఖ్య మొక్కటియ కదా? అట్టిసౌఖ్యమున కాతఁడు పూర్ణాధికారి గాఁడు. అది వరూధిని యిష్టముపైఁగూడ నాధారపడియుండును కదా! "తపం బొనరించి పాపముల్ రాచుట" యన్నట్లు కాదు. అట్టి కార్యమున కాతని సంకల్పమొక్కటియ చాలును.

వరూథినితో "చిర" సౌఖ్యముల్గనుట కామె యొప్పుదల కూడఁ గావలసియున్నది. లేనిచో నాసౌఖ్యము "చిర" మని యెట్లు నమ్ముట? అనిశ్చితమైన దానిని నమ్మికొని స్వవశమై సులభలభ్యమగు పరమును వదలుకొన్న వెనుక నా యైహికసౌఖ్యమును "చిర"మైనది గానిచో వాని గతి యేమి? "రెంటికిని జెడిన రేవఁడు" గాఁడా? అట్టి యవస్థ నొందకుంటకొఱకే

"......నను నీవు వదలఁ జెల్ల
దేను నిను సమ్మతిలఁజేసి యేఁగుదనుక" ·

అని తొల్దొల్త వరూథినితో నొకసమయము చేసి కొనుటయని యెఱుంగవలెను.

ఇట్టి భావసామ్యము రేవటిసేల యను సర్థమునఁ గంచుకాగడాలు—కంచుకాగడా లేమిటి, 'సెర్చి లైట్లు'—పెట్టి వెదకినను గనుపించునా? రేవటిసేల యింటికిం బంటకుం బనికిరాకపోవుట యేకకాలముననేకదా? పనికివచ్చునో లేదో తెలియని యొకానొక కార్యార్థమై దానిని యోగింపఁగా రెంటికిం గొఱగాకపోవుట యను భావము గన్పింపదే! అదియుంగాక రేవటియం దొక్క కార్యమునకే పనికిరాకుండె ననుకొన్నను సైత మిక్కడ సరిపడదు. ఏలన నాకార్యార్థమై దానిని వినియోగించినా రనుకొందము. అందున కాధూమి యుపయోగపడకున్న వెంటనే దానిని రెండవకార్యార్థమై వినియోగపఱుపవచ్చును. రజకుని కథయం దట్లుకాదు. దగ్గఱనున్న బట్టలను దూరస్థమగు వస్త్రములకొఱకుఁగా వదలి రెండిటినిం గోల్పోయినాఁడు. మఱి యిం దేదికూడ నాతనికి లభ్యమగుట కవకాశము లేదు. ఈ భావమే మనుచరిత్రమందలి పద్యమునకును సరసముగ నన్వయించును. ప్రవరుఁడుమాత్రము వరూథినితోడి సౌఖ్యములు చిరముగావని యెఱింగినవెనుక తపం బొనరించి పరమును బొందుట కవకాశ మేల లేదందురా?

క. "బ్రాహ్మణుఁ డింద్రియవశగతి
జిహ్మాచరనైకనిపుణచిత్తజనిశితా
జిహ్మగముల పాలై చెడు
బ్రహ్మానందాధిరాజ్యపదవీచ్యుతుఁడై"
[ఆ. ౬౦]

అయిన నొకపరి చేని గాఁగిట నామెచేర్చు నింపుగని, యామె చనుదోయి సంకుమద నిర్భరవాసన మేన నూని సౌఖ్యమును బొంది, యట్టిసౌఖ్య మచిరమై శిథిలమైన వెనుకఁ బరమును బొందఁగల్గునా? అసంభవము. ఇహపరంబుల కొఱకై దూరమై రెంటికిం జెడిన రేవఁడుమాత్ర మగును.

ఈయర్థమే జైమినిభారతాశ్వమేధపద్యమునకును సరిపడుచున్నదని చదువరు లెఱుంగుదురు. అర్థజ్ఞానసౌకర్యముకొఱకా పద్యమునంతటి నిక్కడ నొసంగుచున్నాఁడను.

సీ. "సంధ్యవార్చఁగ నిమ్మ జలపాత్ర మనఁ బోవఁ
గొట్టిన నతికించుకొనఁగవలసెఁ
దడిదోవతిమ్మన్న నడిమికి నడిఁ జింపఁ
గట్టుకోఁ బడె బ్రహ్మకమ్మవైచి
యక్షమాలికఁ జూపు మనఁ ద్రెంచివైచినఁ
బనిచెడి మఱి గ్రుచ్చికొనఁగవలసె
సమిధ లిమ్మన్న ద్రేలిమిగుండ మార్చిన
నూఁదుకోఁబడె మంట నొకవిధమున
ననుదినము నిట్లు ప్రాతికూల్యము ధరింపఁ
జండి(భార్య) కతమున ముని బ్రహ్మచర్యనియమ
మునకు గృహమేధివర్తనమునకుఁ దొలఁగె
రెంటికిని జెడ్డ రేవనికీతి యయ్యె."

వివాహితుఁడైనట్టి యాతఁడు మరల బ్రహ్మచారి గాలేఁడుకదా! ఆతని గృహస్థాశ్రమ మెట్లు వెల్గుచున్నదో పైపద్యమే చాటుచున్నది. గృహస్థాశ్రమావలంబనార్థమై బ్రహ్మచర్యనియమమునకుఁ దొలఁగెను. గృహస్థధర్మమునకుఁ జండికతమున నిప్పుడు తొలంగవలసివచ్చెను. కడకు రెంటికిని జెడ్డ రేవఁడు గావలసినవాఁ డాయెను. కనుక నీరెం డర్థముల నేది సరసమును, గవ్యుద్దిష్టమును, సార్థకమును నగునో రసగ్రహణపారీణులగు పాఠకులే యెఱుంగఁగలరు.



తాడిపత్రిలోని చింతలరాజు దేవాలయపు గోపురము:
ఆంధ్రుల శిల్పకళాప్రావీణ్యమునకు నిదర్శనము

విమర్శ-కవిత్వము

సంబంధబాంధవ్య సంక్షేపము

శ్రీ

బొడ్డపాటి కుటుంబరాయశర్మ

విమర్శనకును, కవిత్వమునకును నడుమ నొక సన్నని తెర మాటున్నట్లుగ దోచును. చంద్రునకును, నవసారసలక్ష్మికిని గల బాంధవ్యము నందముగ జెప్పిన నంది తిమ్మనార్యుని భాషలో వచింప, కవితావనిత 'తొలంగుబావ' విమర్శకపురుషుడు. అనగా విమర్శనకు, కవిత్వమునకు నొకవిధమైన భావమరదంద్ర సరస మున్నట్లు తోచునని యర్థము.

కవి సృష్టిలీలల ననుకరింప నాంతరంగికముగ బ్రోత్సాహితుడై, సహజజ్ఞాన వివేకములు తోడ్పడుచుండ, భావితమైన యభిప్రాయమును పద్యరూపమున సృష్టించును. కొంతకాలము గడచినపిదప ప్రాయశః కవుల లోని సృజనసామర్థ్యము క్షీణించుట కారంభించి నపుడు గావచ్చును—విమర్శకుడు బయలుదేరి, కవితో సాన్నిహిత్యమైనంతవఱకు సానుభూతినొందుచు నా కవి రచనలోని యభిప్రాయములను బరీక్షింప బ్రారంభించును. కాని తాదాత్మ్య మెంతటిదైనను తాద్రూప్యము కాదు గనుక, విమర్శకుడు కవి మనోవ్యూహమును ఛేదించుకొని పోలేక కొంత నియమితమైన దూరము మాత్రమే పోయి వెనుకకు దిరుగవలసినవాడగుచున్నాడు. కాగా తా నన్వేషించిన మేరతో వ్యూహము పరిసమాప్తమైన దనుకొని మోసపోయి విమర్శకుడు తాను పరిశోధించిన విషయములలోని కళారహస్యములను పాఠకలోకమునకు వివరించి, యా రహస్యములను మూర్తీకరించి 'యిది కవికంఠ పాశము — ఇది కవిగజాంకుశము — ఇది కవి పంశయవిచ్ఛేదము'వని గ్రంథరూపమున క్రోడీకరించి మాపును. ఆలోచింపగా నాలంకారికులమనియు, వ్యాఖ్యాతలమనియు పేరిడుకొని మనము చేయునది సృష్టికాదు. ప్రకృతిరీతులకు రసవ్యాఖ్యచేసి కవి సృష్టించు కావ్యములను యథాశక్తిభావ్యము, కారిక, లేక యర్థవివరణము చేయుచున్నాము. ఇది యిట్లుండెను.

ఇట్టి విమర్శనమునుగూర్చి చక్కగ యోచింప కవిత్వముయొక్క పతనదశయం దిది యుద్భవ మొందుటయే కాక, యది దీని త్వరపతనమునకు కారణభూతమగుటకూడ కేర్పడుచున్నది. రెండవ యంశమును కొందఱు కాదనవచ్చును గాని నిరంతర విమర్శనోద్యోగము కొంతవఱకు మన రసానుభూతికి భంజకమే యనుట నిస్సందేహముగ సర్వత్రాంగీకృతము. ప్రాచ్యపాశ్చాత్యసాహితీలలన లీవిషయమున నేకమై తలలూపిరి. అయినను నీ విమర్శనము పుట్టుట కొన్ని ప్రబలకారణములచే ననివార్యమగుచున్నది. కవికి కవిత్వ రచనాశక్తి యులవడుటాదిగ నాకవనము క్రమక్రమముగ చాతుర్యము నేర్చి యాలంకారికముగ బ్రసంగించుచు, కొంత కొంత కృత్రిమతకు పాల్పడుచుండును. దీనినే యాలంకారికశైలి యందుము. గుణవాచకము లధికముగ లేని భాషయం దిట్టి రచన మనివార్యమని భాషాశాస్త్రవేత్త లెఱుగకపోరు.

చేవగలచెట్టు చిగుర్చు టెంత స్వాభావికమో, మానవుడు పారబడు టెంత సహజమో, కవికిని కవిత్వరచనాశక్తి యంత నిసర్గము. కనుక తాను రచించుచున్న యా కృతికశైలినిగూర్చి కవి యంతగ నుత్తింప నేరజాలడు. కవి శిల్పియే గాని యతని కాకళ యాప్రయత్నలబ్ధము. శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి పలుకులు వినుడు:

గీ. "మావి నున్నకొమ్మను మధుమాసవేళ
బల్లవము మెక్కి కోయిల పాడు టేల?
పరుల దనియించుటకొ! తన బాగుకొఱకొ!
గాన మొనరింపక బ్రదుకు గడవ బోకొ!"

—కృష్ణపక్షము, పుట ౩౦

భరద్వాజపక్షి (Sky-lark) యొక్క సంగీతము నభినందించుచు షెల్లీ మహాకవి చెప్పినది యీ యప్రయత్నముగ లభ్యపడు కళను (Unpremediated art) గుఱించియే!

కవులై విమర్శకులైనవారిలో 'గోథే' మహాకవియని మించినవా రరిది. అతని భావగీతములన్నియు నతని కవితా మహత్త్వమును స్థాపించుచున్నవి. అతడు వానిని విమర్శక వివేచనతో వ్రాయనేలేదు. వసంత ఋతువున కోయిలవలెనే కూజించితి నని యతడే చెప్పెను.

ఈసంగతినే 'బైరన్' కవియు [1] "నా రచన మితి మనోహరముగ సాగినపుడు దానిభావము నాకు బాగుగ వ్యక్తపడిన దననే రాదు. ఒక క్షణకాల మానందముగ గడుపుట యను కోరికవినా నేను ప్రయత్న పూర్వకముగ నన్న పన్నుగడయం దేమియు నుండదు." అని యన్నాడు.

కవిత్వ మనగా కవి పెద్ద యుపాయముతో పన్నువట్టి పన్నుగడకాదు సరిగదా, పాఠకు లూహించుకొనునంతటి యుపయోగమునే కల్గినదియు, లేక యొక పాఠకుని యధికారమునుబట్టి యది యెంత యర్థమును స్ఫురింపజేయునో యంతటి యర్థమునే కల్గినదియును గాదు. దీని వ్యాప్తి యపారము. ఐన నీ విషయము నిట్లుంతము. కవిత స్వతస్సిద్ధమనుటకే టెనిసన్ మహాకవియు [2] "నేను గానము సేయక తీరదు గాన గానము సేతును. కోయిలకు కూజితమువలె నా కిది ప్రకృతిసిద్ధము." అనియున్నాడని మునుపు తెలిసికొంటిమి. ఇదియుగాక తాను రచించు విషయములోని లోతుపాతులు విమర్శకులు చెప్పునంతవఱకు నతని కేవియు దెలిసెడివి కావనికూడ తజ్జ్ఞులు చెప్పుచున్నారు. ఈవిషయమునే సంస్కృతమున సుబంధు డను కవియు జెప్పినాడు:

"భవతి సుభగత్వ మధికం
విస్తారితపరగుణస్య సుజనస్య,
వహతి వికాసితకుముదో
ద్విగుణరుచిం, హిమకరోద్యోతః"
గుణానామపి నిజరూప
ప్రతిపత్తిః పరత ఏవ సంభవతి,
స్వమహిమ దర్శన మక్ష్ణో
ర్ముకురతలే జాయతే యస్మాత్."

—వాసవదత్త, ౫-౧౨ శ్లో.

కనుక కవిత్వ మప్రయత్న లబ్ధమనుట సర్వసమ్మతము. ఇందుచేతనే దీనిని అప్రయత్న జనకమగు కళ (Unconscious art) యందురు.

విమర్శ ప్రయత్న జన్యము (Conscious art). ఇది బయలుదేరి తన ప్రభావమును కవులపైనను, శ్రోతలపైనను తనకు, వారికి గూడ తెలియకుండగనే వెలయించి, వారిని వశపరచుకొనును. ఈవిమర్శల జదివి యాజ్ఞానము నేర్చుకొనిన కవుల రచనలు పూర్వమంతటి స్వతస్సిద్ధములుగ నుండజాలవు. అపుడు కవిత మనఃప్రేరితముగ గన్పింపక కల్పితయుక్తులతో గూడియుండును. అస్వాభావిక రచనల జదివిచదివి పాఠకులు రోతురు. ఇక ననివార్యమైన పరిణామ సిద్ధాంతము పొడగట్టును. పిందె పెద్దదైనంతనే పువ్వుదళములు

1. *"I don't pretend that I quite understand*
My own meaning when I would be very fine ;
But the fact is that I have n :hing planned
Except perhaps to be a m(at merry."

2. *"I do but sing because I mus.*
And pipe as but the linnets sing"

తమంతట తాము రాలిపోవును. వ్యక్తిత్వము మనయం దభివృద్ధియైనంతనే మనుష్యత్వము తనంతట తాను వీడిపోవును. ఇది విమర్శవిషయమునను చెల్లుచున్నది. కొందరు కృతకశైలిని దూషించి సరళశైలి వాదప్రతివాదముల నెంతురు. ఇట్టి వన్నియు సూత్రములుగ నేర్పడును. మన యాలంకారిక వ్యాకరణ సూత్రము లన్నియు నిట్టి వాదప్రతివాదములనుండియు, జనాంగీకృతివడసిన మహాకవుల రచనలనుండియు గ్రహింపబడిన యంశముల సంపుటీకరణ మనవలెను.

‘అరిస్టాటిల్’ మహావిమర్శకుడని కీర్తిగడించుకొనినవారిలో నొక యుద్దండుడు. ఇతనియొద్ద నొక్కచే కొలతబద్ద గలదు. ఏ కవినైన దానితో కొలతవేసి విలువగట్టును. ఒక్కచేత్రాసు; వస్తువర్ణ్యమీనముగానిందు, ప్రాచీనముకానిందు సమస్తమును దానితోనే తూచును. కథా నిర్మాణమునందు తూగు (Balance) యున్నదా? కృతి జనసమ్మతినొందినదా? ఈ రెండంశములే తప్ప తదితరములతో వానికంతగ పనియున్నట్లు కన్పింపదు. ఇట్టి సూత్రములు మానవసహజమైన మనోవికార చిత్రణమును, కవుల యుపజ్ఞను ధ్వంసముచేయుట కుద్దేశించును. అందుచే నద్భవించిన కవిత్వము స్వానుభావమును పొందిన దేశికవిత(House-poetry)వలె స్వచ్ఛతాశోభితముగ నుండక, సహజగౌరవమును గోల్పోయియుండును. నిబంధనలకు లోనై, తీవ్రమైన కృషివలన కవిత్వము బయల్పడుటయే దీనికి గల ఫలితము. దీనికే యాలంకారికశైలి(Embellished style)యందురు.

ఆంధ్రమునందిది చాలవరకు సంస్కృతకవుల పోకడల ననుకరణము. మానవోపయోగ మేమాత్రమును లేక, సిద్ధాంతము శిలాక్షరముగనుక దుర్లంఘ్యమని యెంచి, యాలంకారికుల యాత్మశాంత్యర్థము ప్రాణము, సాత్మ్యము గోల్పోయి రూపనామమాత్రావశిష్టమై యున్న కవితను రచించిన యాకవులు నూతనయుగారంభముతోపాటు యువసంస్కర్తలచే శప్తులగుచుందురు. విషయము నాలోచించిచూడ మనము పూర్వకవుల రచనా వైఖరుల ననుసరింపగలము గాని, వారి ప్రజ్ఞా పటుత్వ ప్రతిభల దొరకించుకొనలేము. వారి బాహిరవేషభాషలును, క్వచిత్కల్పనాయుక్తియు పట్టుపడవచ్చునుగాని మనకు వారి రచనలలోని జవము, జీవము, శక్తియు పట్టుపడవు మందబుద్ధియైన శిష్యునివలన ప్రజ్ఞావంతుడైన గురువున కపకీర్తి కల్గునట్లు మనవలన నాలంకారిక భాషాకవుల రచనలన్నియు నిందింపబడును. కనుక విమర్శకయుగమందు తద్యుగానుగుణమగు రచనాపద్ధతియే మేలగునుగాని, చాలని యనుకరణములకు బోయి, పూర్వకవి ఋషులను దూషణపాలు చేయుట సమంజసము కాని పని.

[3]విమర్శక యుగమందలి కవిత్వముకూడ విమర్శకదృష్టి గలదగును. అనగా తత్తదుచితవాక్యసరణిని సాగదీర్చినట్లు పద్యము లల్లుటయేగాక విమర్శకయుగమందు కవి కొన్ని విషయములను చర్చించుకొనునని భావము. "కవిత్వ మెట్టి ప్రయోజనముగలది?" యనునదియేగాక "నేను లోకమున కెట్టి విషయములను నివేదింపవలెను? ఏ విధముగ వ్యక్తపరుపవలెను? ఎవరిని లక్ష్యముగా గొని రచనాబంధురుడను గావలెను?" అను కొన్ని సంప్రశ్నలు కవిహృదయమున దోచును

అసలు కవిత్వ మనునది యాత్మానుభవ వ్యక్తీకరణ సాధనమగుచో, సామాన్యము సామాన్యమని మన మనుకొను స్వల్పానుభవము గాకయు, కాని మఱల సర్వజనానుభూతికి దూరము గాకయునుండెడి యొకానొక లోకోత్తరానుభవమును(Unique experience), లేక యనుభవపరంపరల నూహాశక్తితో భావనచేయుటచే కల్గుచున్న భావమును (Impression) ఉచితశబ్దసంకలనముతో, లోకోపయోగమును కాంక్షించి రచించుటను కవిత్వమందుము. కాని పద్యమును భావవ్యక్తీకరణసాధన (Instrument of Communication) మందుమేని, యిక వ్యక్తమగునది (The Communicated) మాత్ర మేది? వ్యక్త మగునది మాత్రము పద్యముగాదా? అనగా సందర్భవశమున పొందుపడిన యనుభవ, భావనల భావముచే గర్భితమై పఠితల మనస్సునకు వ్యక్తమగునదియు పద్యమే గదా?

---

3. *"The age of criticism is also the age of critical poetry"*—J. S. Eliot.

ఇచ్చట నిక పద్యముయొక్క బాహిరాకారమును గూర్చియు, నాంతరమైన భావమునుగూర్చియు వివాదముగల్గి, శబ్దమే ప్రధానమని కొందఱును, నర్థమే ప్రధానమని కొందఱును వివాదపడుదురు. ప్రాసంగికముగ నీవిషయము వచ్చుటచే దీనినిగూర్చి క్వాచిత్కముగ చర్చింతును. ఇందుచే కవిత్వమన నేమియో తెలిసికొనుట యను మన ముఖ్యోద్దేశముకూడ నెరవేరుచున్నది. దీనినిగూర్చి రససిద్ధివాద మను శీర్షిక క్రింద విపులముగ తెలిసికొనగల్గుదుము.

కవి విమర్శకులలో కవిత్వపరమావధి కవిత్వము; కళకు పరమీము కళ; రసానుభూతి పరమోద్దేశము రససిద్ధియే యని వాదించువారును, నట్లుగాక కవిత్వపరమావధి ధర్మోపదేష్టృతే యను వారును ననబడు నిరుదెగలవారు కలరు. కవితాపరమావధి (Ultimate goal) కవిత్వానందమే యనుచో నాకవనము జీవితచిత్రణము గాక సార్వజనీనతను కోల్పోవుచున్నదనియు, మానవ నిత్యజీవిత సన్నిహితము గాదనియు ధర్మోపదేశకుల వాదము. యోచింప, జీవితమును, లేక ప్రకృతిని కవిత చిత్రింపకపోదుగాని, తనకు నిసర్గమైన రీతిని మాత్రమే జీవితప్రకృతులను భావనాశక్తిసమ్మిశ్రితముగ నడుపుచున్నదని పల్కుట సువర్ణసమన్వయము. అనుచో భావనాశక్తియు, నితివృత్తమును కవిత్వమగునా, లేక కేవల రచనావిధానమే కవిత్వమగునా యనునవి సమస్యలు. శాబ్దికులు (Formalists) 4 "కవి కవితలో చెప్పనదేది అను విషయమును లక్ష్య పెట్టరాదు; ఎట్లు చెప్పె ననువిషయమే పరిగణింప దగిన" దందురు. ఏలన "కవితకు పనికిరాని యితివృత్తమే (Theme) లేదు. సర్వవిషయములును సమర్థునకు రచనార్హములే" యని వారు ప్రత్యుత్తర మిత్తురు. నిర్మాణవిధానమును, పాత్రపోషణాదులును ప్రధానములుగాని విషయ మేదియైన నేమియని వారి వాదసారము.

కాగా, నితివృత్తముతోడి యగత్యమే లేక విధాన మెట్లు నిలుచును, ఎట్లు సంభవించును, దానిని కవితయనుట కెట్లు పొసగును అనునవి క్లిష్టసంప్రశ్నములు.

ఇంతకు నితివృత్తమనగా నేమి? ఇతివృత్తమనగా లోకాలోకగాథనుగూర్చి సంస్కారబుద్ధులును, పరిణతాత్ములును మనస్సున భావించియుంచిన విజ్ఞానసంపత్తి. అనగా రామాయణ భారత భాగవతాదికృతులలో నాది కవుల భావనాసమ్మిశ్రితమై పద్యరూపమున వెలువడిన యంశము. కావున నిప్పుడు కవిత్వము నుండి పద్యములోనికి దిగినది వాదము. అనుచో పద్యమున నితివృత్తమా, విధానమా మనల నానందింపజేయునది? రచయితభావనాశక్తి బాసట యగుచుండగా సర్వజనవిదితమైన గాథ యితివృత్తమగుచున్నది. కవితగాని, పద్యముగాని యితివృత్తమును బట్టికాక విధానమునుబట్టి ఘనమగుచో భారత మితిహాసమునుబట్టియా, లేక కవిత్రయరచనా విధానము ననుసరించియా 'యాదరణీయ ధన్యకవితార్థ గతిస్ఫురణము' గలదిగ పరిగణింపబడుచున్నది? కవిత్రయము చెప్పిన విధానమువలన భారత ముత్కృష్టత వహించినదని కొంద అనవచ్చును. కావ్యమందలి యితివృత్త మహాత్త్వముచే నాకవులు ఘనతవహించిరని మరి కొంద ఊహింపవచ్చును. కాని యిది పూర్తిగ నిర్ణయింపబడజాలనిది. అనగా బీజాంకుర న్యాయము వంటిది. కాని స్వల్పవిషయమైన పూచికపుల్లను గూర్చియు భారతమంతటి యుత్కృష్టగ్రంథముకూడ వ్రాయబడినచో నది కవుల ఘనతకు సాక్ష్యము. లేక యెట్టి సుకవియు భారతమునంతటి సామర్థ్యముతో రచింపగల్గిన నది యితివృత్తప్రాశస్త్యమునకు తార్కాణమని మాత్రము నిర్ణయింపనగును.

అనుచో నితివృత్తము, విధానము నను రెంటిలో నేది పద్యమగుచున్నది? పోనుపో నీవాదము శబ్దార్థములందేది ఘనమనువఱకు సాగి, భర్తృహరివాక్యపదీయాంతమును చూచుచున్నది. కాళిదాసమహాకవి దీనిని గుర్తించి సమంజసముగ యోచించిన దిట్లు; సిద్ధహస్తుడైన కవి; సంకుచేరిన విమర్శకుడును. కావుననే శ్రీపురు

4. *"What is Poetically indifferent, how that counts."*

ములం దెవరు గొప్పవారు, ఎవరు సృష్టికర్తలు అను వాదముకంటె యీవాదమును 'వాగర్థావివ సంపృక్తౌ' అని విప్పి చెప్పి తన విమర్శనాశక్తిని పాఠకులకు పట్టి యిచ్చినాడు. అనగా మంచిపద్యము, లేక సత్కవిత శబ్దార్థముల యుత్కృష్ట సమ్మేళనమని తేలినది.

అయిన శాబ్దికార్థికవాదుల నడుమ నింతవాద మేల పెరిగినది యనుచో, వారు శబ్దార్థములు వేర్వేరని తలచుటయే కారణ మనవలెను. శబ్దము, నర్థము ననునవి పృథగ్భాగములు గావు. అవి బ్రహ్మమునకు గల రెండు ప్రత్యేకశక్తులుగాని విభిన్నరూపములు గానేరవు. ఈ బ్రహ్మమునే శబ్దబ్రహ్మమని యార్యుల నుడి. గానమునందు శబ్దమునా, లేక యర్థమునా సంగీత మనుచున్నాము - రంగులనా, లేక లేఖకుని భావమునా చిత్రలేఖన మనుచున్నాము అని శోధించిన నీకవిత్వ విషయమును తేలును. ఆ నానావర్ణముల (రంగుల) మనోజ్ఞసమ్మిశ్రీకరణముచే వ్యక్తమగు భావము చిత్తరువగునుగాని, కేవలము రంగులకణికలుగాని, లేక శకుంతల కుణకుణ నిర్భరప్రౌఢ యౌవన ప్రాదుర్భావముగాంచి యనుచున్నదని జలసేకవృత్తాంతమున చిత్రకారుడు మనకు గోచరింపజేయు భావముగాని చిత్తరువు కాజాలదు. అట్లగుచో వర్ణసమామ్నాయమందలి యక్షరమాలయు కవిత్వము గావలసివచ్చును. లేదా మూగవాని సైగ లన్నియు కావ్యములుగా నెంచబడ వలసివచ్చును.

అట్లే కవితా విషయమునను. "వాని మందహాస మానందము గొల్పుచున్నది" యందుము. అప్పు డా నవ్వువాతని ముఖరేఖలందు వ్యక్తమగు భావమా, లేక యాతని ముఖసౌందర్యరేఖలు వ్యక్తపరచు భావమా మన కానందము గొల్పుచున్నది యని ప్రశ్నింప మన మొకదానిని రెండవదానినుండి వేర్పరచి చెప్పలేము. అట్లే శబ్దార్థములొకపద్యమునందు, లేక పదమునందుఅవినాభావసంబంధముతో గర్భితమైన యొకానొక శక్తి యగుచుండగా కవిత్వ మన శబ్దమా, లేక యర్థమా యను ప్రశ్నము సందర్భములేనిది; నిరర్థకమైనదియు. ఐనచో భారతమందలి ప్రతిశబ్దమును, ప్రతిపద్యమును మనకు జ్ఞప్తియందులేవు. కాని భారత మనినంతనే నవ్యదక్షిణమరుత్పోతముచే వలె తనయొడలు పులకించునని యార్థికుడు వాదింపవచ్చును. అట్లయిన ప్రతిపద్యస్ఫురణగల్గియున్న యొడల నీకు మఱియు మహానంద మహదానందములు గల్గెడివని శాబ్దికుడు ప్రత్యుత్తర మిచ్చును. కావున శబ్దార్థసంకలనము జీవరక్తము నుండి రక్తమునందలి జీవము విడదీయబడరానట్లు వేరుపరుపబడజాలనిది. ఇందుచే శబ్దమే యర్థమనియో, లేక భావనాసహాయమగు నర్థమే శబ్దమనియో యన దగును. కాగా ఫలితార్థమున తత్తదుచితార్థ స్ఫురణచే మనోహరముగ ప్రయోగింపబడిన శబ్దసంకలనము సత్కవిత్వ మని స్థాపింపబడుచున్నది.

ఇట్టిది సత్కవిత్వమగుచో నెల్లరు నిట్టి రచనలనే వెలయింతురుగదా, ఇక విమర్శ యేల యను నది నేటొక ప్రశ్నము. కవిత్వమన నెట్టిదో యెట్టకేలకు తెలిసికొనవచ్చును గాని తెలిసికొనినది యంతయు నాచరించుట యనునది మాత్రము సర్వమానవ సాధ్యమైనది కాదు. మనకందఱకు నసత్యమాడరాదని తెలియును. కాని లోకమున నెందఱము సత్యసంధులమై యున్నాము? అట్లే చాలమంది కవిత్వతత్త్వ మెరుగవచ్చును. అయ్యు నాచరణలో బెట్టజాలరు. అప్పుడే విమర్శ మిక్కిలిగ నావశ్యకమగుచున్నది. కొందఱు కవులు కవిత్వతత్త్వ మెఱిగికొనిరి గాని దాని నెంత వఱకు జీర్ణించుకొనగల్గిరో పరిశీలించుటయే మనకు మున్ముందు కార్యము. ఇది కవిత్వవిమర్శనములకు గల సంబంధ బాంధవ్య సంక్షేపము

ఇంతవఱకు చర్చించి నిరూపించిన యీశబ్దార్థముల నౌచితితో ప్రయోగించుట కవిత్వమునకు జీవగఱ్ఱ. అప్పు డా కృతిని సప్రాణమందుము. దాని పఠనముచే గల్గు నానంద మాత్మ. అట్టి యానంద దాత్రియైన కృతి యాత్మవతి. ఆయాత్మయే రసము. అది బ్రహ్మానంద సబ్రహ్మచారి.

ఆయా కవి విమర్శకులు తమ తమ యభిరుచి ప్రకారము శబ్దార్థసంయోగ వ్యాఖ్యానముచే కావ్యశరీరమును మార్పగలరు గాని కావ్యాత్మ యెప్పుడును రసముగనే యున్నది. అయ్యు నిట్టివేష భాషల నర్థము చేసికొనిననేగాని సర్వవిధములైన కవితలకు నాత్మ

రసమే మని యన్వయించుకొనలేము. ఈ కారణము చేతనే కవి యభిరుచి ప్రకారము భాషారూపవాదాల్పు వేషములను మనము మున్ముందు విమర్శించి తెలిసికొన గలము. ఏ దెట్లున్నను "కవిత్వ మెట్టిది" యను సమస్య పోనుపోను విమర్శనాయుగ ప్రభావముచే బహుక్లిష్ట మై, పూర్వము చిన్ననాడు నాల్గుపద్యములు వ్రాయ గనే "కవిత్వమన నేమున్నది" యని మన మనుకొని నంత సులభసాధ్యమైనది గా దనిపించును.

మధుర వ్యథ

'సముద్రుడు'

తెరువన్ జోకుము ఫాలనేత్రము కపర్ది దేవకార్యార్థియై
స్మరునిన్ చంపకు మంచు దేవతలు, నా మాంగల్యముం గావు శం
కర యంచున్ రతి సేయు విన్నపము లెక్కింబెట్ట డాశూలి; ఈ
శ్వరఫాలాగ్నుల మ్రుగ్గి మన్మథుడు భస్మంబయ్యె నొక్కింతలోన్.

కనుగొనుచుండగా మగని కాయము నీఱయిపోవుచుండగా
కని యసువుల్ భరింపగల కామిని లేదు జగాన; లోకమో
హనతనుడైనయట్టి కుసుమాంబకు దుర్మరణంబు గాంచి ని
ల్వన రతి కూలిపోయె; చనిపోయెనొ, లేనిచో మూర్ఛపోయెనో?

క్షణములో తెప్పరిల్లి కన్గవను విప్పి-కలయజూచిన దా రతి కాంతుకొఱకు
కాని మరునకు మారుగా కానుపించె - పురుషరూపముతో నున్న బూదిరాసి.

కలవా ? కంతుడ కాంతుడా, ఉసురుతో కాళీశు మూడోకనుం
గొలకుల్ వెల్వడి పైకి లేచు విలయక్రోధాగ్ని కీలాళిలో
పల నీవై చనలేదు గాద యనుచున్ ప్రాణేశు సాన్నిధ్యమున్
కలతన్ పొందిన దీనమానసముతో కన్నీళ్లతో డగ్గరెన్.

ఎన్నడు నీవు నాయెడ నయిష్టము లేమియు సేయలేదు, నీ
కెన్నడు చేటుచేత లొనరించి యెఱుంగను నేనుగూడ, నా
కన్నుల నీదురూపమును గాంచగనీయక యేల యూరకే
న న్నిటు లేడ్వజేసెదవు నా అపరాధము లేమి చెప్పుమా ?

నిను నీడంబలె వెంటనంటికొని యుంటిన్ సాటిపూబోండ్లకున్
కనుగుట్టై , శివుకన్నుగుట్టి మన భాగ్యంబెల్ల నిట్టాయె; ఈ
తను వింకేటికి దాల్పగావలయు నాథా? నిత్యనీరైక జీ
వనయౌ పద్మిని నిర్జలహ్రదములో ప్రాణాలతో నిల్చునే?

అల్లదె చూడు మామదెన, అక్కట దైన్యము వెల్లిబోవగా
దెల్ల మొగంబు వైచికొని తేలగవైచిన కండ్ల చూచు, నీ

విల్లున కల్లెత్రాడనగ పేరును పొందిన తేంట్ల బారు నే
పెల్లుగ నేడ్వజూచి దురపిల్లెడి జుమ్మని విన్న బాటునన్.

ఉమ్మలికంబునన్ బడలియుండిన నీచెయి తాకినంత ప్రా
ణమ్ములు లేచివచ్చునని నాథ వచింతువు మున్, తదీయహ
స్తమ్ములె నీ శరీరమును తాకిన నాదెసనైన జూడ వ
చ్చమ్ముగ నెంతలో అనిమిషత్వము కల్గెను నీకు మన్మథా ?


శమనుని యంతవా డమరజాలక చిత్తయిపోయినట్టి సం
యమికుల చంద్రుడైన గవియన్ బురికొల్పుచు నెంతలేసి బీ
రములను నమ్మబల్కి అమరత్వము నీయక ఇంత నీసి రా
సుమనసు లింక నా ఉసురు సోకి నశింపరె శాశ్వతమ్ముగన్.

వంకపోయిన తూపుల వంపు దిద్దు - కొనుచు చలికాడగు వసంతుగూడి, నాకు
సరసనల్లాపములచేత సంతసంబు - రేపు నీరూపు ఒకతేప జూపరాద ?

ఏడీ ? వసంతుడేడీ ? ఎటులేగె ? మహేశుని కంటిమంటలో
మాడి మశానమై చనెనె మాధవుడున్, ఇక పుష్పచాపమున్
వేడుక నిచ్చువారెవరు ? పీఠికగా దొకో నేను, ధన్వియే
పోడిమి మాసిపోవగను పూవులవింటితో నేమి కార్యముల్?

వాయుతాడితమైన దీపమ్మువోలె - మలిగె చలికాడు, మాధవా, మరలిరాడు
కష్టధూమావృతంబైన నష్టదీప-వర్తిరీతిని మిగిలె నా బ్రతుకు నేడు.

రమ్మిటు వసంత మాకు గారాబుచుట్ట-మీవు సేయుము బాంధవకృత్య మొకటి
విరహిణిని, నాకు చితిపేర్చి విభుని జేరు-అనువు కల్పించి మాదుపుణ్యమునపొమ్ము.




చమత్కార కథలు

రిచర్డ్ బ్రిన్స్లీ షెరిడన్ అనే ఒక ఆంగ్ల మహాకవి (1751-1816) ఒకనాడు తన చేతిసంచిలో కట్టి పెట్టుకొనియుండిన పైకము వంతను ముందు పోసుకొని లెక్కపెట్టుకుంటున్నాడట. అదే సమయంలో అతని దర్జీవాడు అక్కడ హాజరై తనకు బాకీ యుండిన మొత్తానికి ఒక బిల్లు ఆయనముందు పెట్టి డబ్బు ఇవ్వమని అడిగినాడట. షెరిడన్ వెంటనే అతని కి సమాధాన మిచ్చినాడట: "అయ్యా, అలా వల్లకాదు. పత్రమూ గిత్రమూ లేని ఒక నమ్మకపు బాకీలు తీర్చడానికి కట్టిన ముడుపు ఇది. దీనిలోనుంచి తమ కివ్వడాని కిప్పుడు వల్లకాదు." అతడలా అనే సరికి ఆ దర్జీవాడు తన చేతిలోని బిల్లును చించిపారవేసి "అయ్యా, నాదికూడా ఇప్పుడు నమ్మకపు అప్పే కదా, దయయుంచి ఈ మొత్తము నిచ్చి నన్ను పంపండి" అని అన్నాడట. అతని యుక్తికి మెచ్చుకొని షెరిడన్ ఆ మొత్తాన్ని యిచ్చి అతన్ని పంపివేసినాడట.

... ...

ఒకసారి ఒక స్కూల్లో ఒక విద్యార్థి "ఇదిగో, నేను జార్జి బెర్నార్డుషా సంతకం తెప్పిస్తాను చూడుకోండి" అని తోడి విద్యార్థులతో పందెం వేసుకొన్నాడట. మాట ఎలాగయినా నెగ్గించుకోవలె ననే ఉద్దేశంతో షా సంతకంకోసమై ఎన్నో ప్రయత్నాలుకూడా చేసినాడట. కాని ఆ ప్రయత్నా లేమీ ఫలించనే లేదు. అందుమీదట ఆ మేధావి బాలకుడు ఇది కాదు ఉపాయ మని బెర్నార్డుషాకు ఒక ఉత్తరం వ్రాసినాడట— "మా విద్యార్థినిలయంలో ఒక ముద్దు పంది ఉన్నది. దానికి తమ పేరు—బెర్నార్డుషా అని పేరు పెట్టవలె నని అనుకొంటున్నాము. మా యందు దయయుంచి అందుకు అనుమతి ఈవలె నని ప్రార్థిస్తున్నాము" అని. ససేమిరా, అలా చేయడానికి వల్లకాదు అని బెర్నార్డుషా నుంచి ఒక కోపపు జవాబు మరు టపాలులో వచ్చి పడిందట. ఇక నేమి, ఆ అబ్బాయి ఆశించిన సంతకం లభించింది. పందెం గెలుచుకొన్నాడు!!

—యస్. వి. రంగన్న.



చారిత్రకఖ్యాతిగాంచిన గుత్తిదుర్గము



నా జ్ఞాపకములు

శ్రీ వేలూరి శివరామ శాస్త్రి

రమారమి పాతిక యేండ్ల క్రిందట నా ఒంటెద్దుబండి సాయంకాలము నాలుగు గంటల వేళ సముద్రప్రాంతమున ఉప్పుటేఱు దాఁటఁబోవుచుండెను.

ఒక ప్రక్క నల్ల సముద్రము. మఱియొక ప్రక్క పచ్చసముద్రము. చల్లగాలి. చక్రవాళము చూపులఁ గ్రోలుచుండెను. మనస్సు తనకన్న లోఁతుగా నున్న మఱియొకవస్తువులో నప్రయత్నముగా మునుఁగుచుఁ దేలుచుఁ దేలుచుమునుఁగుచు నుండెను. 'తాను' దనలో వెలుఁగుచు నాఱుచు దాఁగురుమూఁత లాడఁజొచ్చెను. అట్టి ఘట్టములో దూరదూరమునుండి శహనా రాగము కర్ణజాహమునకుఁ దగిలెను.

బండి మునిముందులకు సాగినకొలఁదియు ఆస్వరము స్ఫుటతరమును, స్ఫుటతమమును అగుచు వచ్చుచుండెను గాని అది యే యంత్రము నుండి వెల వడుచున్నదో తెలియ నయిలి కాలేదు. వీణ కాదు. ఫిడేలు కాదు. ఏదో తెలియదు.

నా శకటము మఱి కొంచెము దవ్వరిగెను. పోనపోన ఒంటెద్దుబండి. దాని దాపున ఒక యెద్దు మేయుచుమేయుచుఁ దలయెత్తి ఆలకించుచున్నటు లుండెను. సుమారు ముప్పదుగురు చక్రాకారముగాఁ గూరుచుండిరి. దాని నడుమ మధ్యబిందువువలె నొకరు కూర్చుండి నాగసారబుర్రతోఁ దన్మయులై పాడుచుండిరి.

నేను నా బండిని రోడ్డుమీఁద నాపఁదీయించి సుమారు నాలుగు ఫర్లాంగులు నడచి వారికడకు వెళ్లి కూరుచుంటిని. ఆ గాయకు నంతకుముందు నేను కనియెఱుఁగనుగాని విని యెఱుఁగుదును. వా రపుడు చాలఁ గృశించియుండిరి.

అపు డచట నున్నవా రెవరును గదలుటయు, మెదలుటయు లేదు. "చిత్రార్పితారంభ ఇవావతస్థే." చేఁపలు లేయ నీటి కెదురెక్కినటులు శ్రోత లందఱు నానంద ప్రవాహములోని కెదురెక్కుచుండిరి. ఆపాటకు నాలో నున్న పాము పడగవిప్పి యాడ మొదలు పెట్టెను. మఱి కొంచెము సేపటికి గానమును, గాయకుఁడును, శ్రోతలును నేకమైపోయిరి. అందఱి హృదయములును ఏకమైపోయెను.

అంతట విహంగ గాన మారంభ మాయెను. సభాభంగ మాయెను. గాయకుఁడు మెల్లగా నాగసారము క్రింద నిడఁబోయెను. వారి శిష్యురాలు కాఁబోలు నొకామె దానిని బుచ్చుకొని పెట్టెలోఁ బెట్టెను.

అచట నున్నవారి నెవరిని నే నెఱుఁగఁగాని వారిలోఁ గొందఱు నన్నెఱిఁగి యుం

దురు. కాఁగా నామాట వారిగురువుల చెవి వఱకుఁ బోయెను. వారు మిగుల శ్రద్ధాభక్తులతో నా కాతిథ్య మిచ్చిరి. వారి పేరు ముగ్గిళ్ల రామారావుగారు. వారి కేఁడాది నుండియు దీర్ఘవ్యాధి. వారి మామగా రొక లక్షాధికారి. ఆయన తన యల్లుని శిష్యులతోఁ గూడఁ దన యింటికిఁ దీసికొని వచ్చి మం దిప్పించుచుండెను.

శ్రీ రామారావుగారును, వారితమ్ములు శ్రీ విశ్వనాథముగారును జోళ దేశమునఁ జాలఁ గాలము నివసించి అచటి ఫక్కి నలవరుచుకొనిరి. శ్రీ రామారావుగారు మైసూరు విద్వాంసులతోఁ బన్నిదము చఱచి వేయి నూటఁబదాఱులు పలుమాఱులు గెలుచుకొనిరని వినికి. వీరు వాచని వాద్యము లేదు. వీరిది మయూరకంఠము. "రాచప్ప పాటకు రాలు పలుగును, రామప్ప పాటకు రాలు కరఁగును" అను నానుడి నే నొకతూరి బెంగళూరున వింటిని. శ్రీ వెం. శా. గా రొకతూరి వీరి గానమును సాగరగాన మనిరి. వీరిది గొప్ప పాండిత్యము. దానికిఁ దగిన శక్తి. వీరి సంపాదనమునకును, వ్యయమునకును బరిమితి లేదు.

వీరి మామగారిది గట్టి పిడికిలి. వారు రెండవ లక్షకు మీఁదు కట్టిరి. విదేశవాసము చేసిచేసి తిరిగివచ్చిన యీయల్లుఁడీ గట్టి పిడికిటినిఁ గొంచెము సడలింప నేర్చెను. ఆ మామగా రీ యల్లుని, అల్లునిపిడప నల్లునంత వాఁడును, అల్లుతమ్ముఁడును అగు విశ్వనాథముగారిని, శిష్యరాండ్రను, శిష్యులను సుమారు ముప్పదుగురను, ఇరువురు వైద్యులను, నడుమనడుమ నావంటి నత్తరకాయలను ఆఱునెలలనుండి పోషించుకొనుచు వచ్చుచుండిరి. అపుడు నేను రెన్నాళ్లు వీరి కతిథి నైతిని.

వైద్యులు కొందఱు ప్రతిదినమును వచ్చి రామారావుగారి చేయి చూచి వారి పాట విని పోవుచుండెడివారు. ఇరువురు వైద్యు లెపుడును అచట మకామే. ఇంత వైద్యోపచార మున్నను వారి యారోగ్య భాస్కరుఁ డస్తాచలము దెసకే మొగ్గుచుండెను.

నే నచట రెన్నాళ్లుండి వారి యమర గానము విని వీడుకొంటిని. రామా రావుగారు తమ తమ్ముఁడు విశ్వనాథముగారితో నన్ను సాగనంపుటకు నూరిచివరవఱకువచ్చి "నాకుఁ గొంచె మారోగ్యము కలుగఁగ నే నా శిష్యుని మీకడకుఁ బంపుదును. తమరు దయచేయుదు రేని నాగాత్రము పూర్తిగా వినిపించెదను" అని యనిరి.

"మీ రిపుడు పాడవలదు. విశేషించి గాత్ర-పాట నిషిద్ధ మని వైద్యుల యభిప్రాయము." అని నే నంటిని.

"కా దండీ! వైద్యుల కేమి తెలియును? ఈతూరి మీరు నాగాత్రము పూర్తిగా విననిచో మఱి వినలేరు" అని రామారావుగా రనిరి.

నా మన స్సార్ద్ర మాయెను. దాని ప్రభావమును గనులలోనికి రాకుండఁ జేసికొని "వార్త నంపుఁడు, రెక్కలు కట్టుకొని వాలెద" నని నే నంటిని.

ఒకరి నౌకరము విడిచిపెట్టి వెళ్లలేక యిక్కట్టులో విడఁబడి వెళ్లితిమి. ఒకవారము గడచెను. రెండు వారములు గడచెను.

వార్త లేదు. నా శిష్యుని వారికడ కంపితిని. అతఁడు తిరిగి వచ్చి, "రామారావుగారికిఁ జాలనెక్కువగా నున్నది. విశ్వనాథము గారు మిమ్ము వెంటనే రమ్మనిరి." అని చెప్పెను. నాగుండెలలో రాయి పడెను.

వీరితో నాకుఁ బరిచయభాగ్యము కలిగి ఒకనెలయైనను కాలేదు. ఈ పరిచయము మిగిలిన పరిచయములవంటిది కాదు. ఇది వైయక్తికముగాఁ గాక కళాద్వారమునఁ గలిగిన పరిచయము. ఈకళ యానంద సంధాయకము. గానమును దీసివేసినచో రామారావుగారే మిగులుదురు. వారు వైయక్తికముగాఁ గూడ గొప్పవారే కావచ్చును. కాని ఆసంగతి నాకపరిచితము. రామారావుగారి గాయకత్వమునే నే నెఱుఁగుదును. ఇటువంటి మహాగాయకుని పరిచయము కలుగుటయును, వెంటనే ...

జగత్తంతయు నెంత శోకము ?

నే నచటికి వెళ్లునరికి రామారావుగారి స్థితి తెలుపనలవిగా నుండెను. శిష్యుల మొగములమీఁద నగవులు లేని మేఘము లాచ్ఛాదించి యుండెను. రామారావుగారికి ఆగ్రామమున పలువురు గాయికలు శిష్యురాండ్రు కలరు. వారిలో సువదన యనునామె మక్కువ శిష్యురాలు. కాఁగా, వచ్చి చూచి పోవు స్త్రీలకును బురుషులకును ఎడతెఱపి లేదు.

నేను వారు పడుకొనిన గదిలోని కడుగిడితిని. వైద్యు లమృత మిచ్చు ప్రయత్నములో నగపడిరి. రామారావుగారి మొగము అంధకారములో నంతర్ధానమగుచున్నటులు కానఁబడెను.

ఫలానివారు వచ్చిరని శ్రీ విశ్వనాథముగా రన్నగారి చెవిలో నూఁదిరి. రామారావుగారు వెంటనే కనులు విప్పి, "నాపాట వినిపింపలేకపోతి" నని యనిరి.

"మీ పాట నా చెవిలో మ్రోఁగుచునే యున్న"దని నే నంటిని.

వైద్యులందఱును తెల్లఁబోయి మరల నాడి చూచిరి. సంచికట్లు కట్టిపెట్టి వాకిటిలోనికి వెళ్లి కూర్చుండిరి. సందులో సందు చేసికొని యొకక్రొత్తవా రచ్చటికి వచ్చిరి. వారినిఁ జూడఁగనే రామారావుగారి మొగము మాఱిపోయెను. వారు వెంటనే చేతులు జోడించి, "అయ్యా, తమ ఋణము నేను తీర్చికొనలేకపోయితిని; నా కొకసెంటుపొలము లేదు. మీ ఋణమునుండి యెట్లు విముక్తిఁ బడయఁగలనా యను నాలోచన తెగకే నా ప్రాణములు పోకున్నవి" అని యనిరి.

"ఎంత ఋణము ?" అని నే నంటిని.

"అసలు మూఁడు వేలు." అని ఋణదాత యనెను.

విశ్వనాథముగా రిటు లనిరి: "అయ్యా! సుబ్రహ్మణ్యముగారూ ! మీ ఋణమునకు నేను పూఁటకాఁపను. ఈ కష్టసమయములో మీరు......"

సుబ్రహ్మణ్యముగారు విశ్వనాథముగారి మాట సాగనీయక, "మీకెవరు పూఁటకాఁపు?" అనివేసిరి.

రామారావుగారికిఁ బాదసంవాహనము చేయుచు నిలువఁబడియున్న సువదన సుబ్రహ్మణ్యముగారిని గనులనిండఁ జూచెను.

విశ్వనాథముగారు తెల్లఁబోయి "అయ్యా! అన్నగారికిని, నాకును తోడా లున్నవి. నాకు ప్రాణమున జీవ మున్నది. ఇఁతియకాక మీ ఋణము తీరుదాఁక నేను నిదుర పోను." అని యనిరి.

"వడ్డి నిదుర పోదుగాని మనుష్యుఁడు నిదురపోవఁడటండీ?" అని సుబ్రహ్మణ్యముగా రనిరి.

'హరి హరి' అని రామారావుగారు మరలఁ గనులు మూసికొనిరి. మరల వారి నాడి ఛేదించెను. వైద్యులు త్రొక్కిసలాడిరి. సుబ్రహ్మణ్యముగారు కక్కసపడిరి.

నేను సదరు సుబ్రహ్మణ్యముగారి చేతిని బుచ్చుకొని ఒకమాదిరి బలవంతముగనే వాకటిలోనికిఁ దీసికొని వెళ్లుచుంటిని. ఇంగ్లీషు డాక్టరు మా కెదురు వచ్చెను. నేను సుబ్రహ్మణ్యముగారిని వాకటియరుఁగు మీఁదఁ గూరుచుండఁబెట్టితిని. డాక్టరు వెనుదిరిగి నాచెయ్యి పుచ్చుకొని నన్ను మరల లోనికిఁ దీసికొనిపోయెను. రామారావుగారి స్థితి అయోమయముగా నుండెను.

డాక్టరు కొంచెముసేపటికి నా చేయి పుచ్చుకొని బలవంతముగా నన్ను వాకటి లోనికిఁ దీసికొనివచ్చెను. నే నది గ్రహించి వారితో నూరివెలుపటిదాఁక వెళ్లితిని. అక్కడ వారు నిలువఁబడి "ఈ రాత్రి గడచునని తోఁచదు." అని వైద్యరహస్యము చెవి పుచ్చి నన్నుఁ దమ యింటికి కతిథిగఁ గొంపోయిరి.

"ఏకనిమిషమున కనిమిష మొక్కొక్క యుగముగాఁ దోఁచెను. ఉచ్ఛ్వాసనిశ్వాసములు స్తంభించునటు లగపడెను. గాలి కదలదు. మూర్తపదార్థ మంతయు నాకాశమున లయమగుచున్నటు లాయెను. నేను డాక్టరుగారి యింట నొకఁడఁ గూర్చుండి దైవమును ప్రార్థించితిని.

మృత్యు వనతిక్రమణీయ మని యందఱు నెఱుఁగుదురు. కాని ప్రతివాఁడును దానిని దప్పించుకొనుటకును, ఇతరులను దప్పించుటకును బ్రయత్నించును. మందులతోఁ బని తీరినతరువాత శేషించిన దొక దైవమే.

ఆపత్సమయమున మన మీశ్వరునిఁ జాలదగ్గఱగఁ జూతుము. అతఁడు సుదూరమున నున్నటు లుండును. మామూలు సమయములలో మన మాతని దూరమున నున్నటులు చూతుము. కాని యతఁ డెప్పటివలెనే దగ్గఱదగ్గఱనే యుండును.

ప్రతి యెడఁబాటునందును ఒక్కొక మృత్యువు కల దని నాకు లోఁగడ రామారావుగారిని వీడుకొనునపుడే తెలిసివచ్చెను. ఆ యెడఁబాటునకు వంతెన యుండెనుగాని ఈ యెడఁబాటునకో?

రాత్రి జాముప్రొద్దు పోయెను. నే నొకఁడనే రామారావుగారిని జూడఁబోయితిని. సుబ్రహ్మణ్యముగారు వాకిటియరుఁగుమీఁదఁ దిష్ఠవేసికొని కూర్చుండిరి. వారి మోమెల్లయు జేగురురంగు కొట్టుకొని యున్నటు లుండెను. కనవచ్చుచున్న యేరి మోమునను కళ లేదు. ఏదో గందరగోళము జరిగియుండెనని యనుకొంటిని. మెలమెలగా గదిలోనికరిగితిని. రోగితక్క మఱియెవరును లేరు. ముసలి మామగారును, పదియేండ్ల భార్యయు దూరముగా మఱియొకగదిలోఁ గూరుచుండి యుండిరి. శిష్యు లందఱును సుబ్రహ్మణ్యము

గారిని లేచిపొమ్మని కటువుగా పనమొదలిడిరి.

"రామారావుగారూ!" అని పిలిచితిని. వారు శంకనఁ గనులు విప్పి చూచి చూపులతోఁ నా కాతిథ్య మిచ్చిరి. నేను కూర్చుండుచున్నంతలో సువదన ఆ గదిలోనికి గబగబ వచ్చి, "అయ్యా! మీరు బెంగపెట్టుకొనకుఁడు; సుబ్రహ్మణ్యముగారూ! తమరిటులు లోనికి దయచేయుఁడు." అని యనెను.

ఋణదాత లోనికి వచ్చెను. ఆయన వెనువెనుకనే విశ్వనాథముగారును, వైద్యులును లోనికి వచ్చిరి.

సువదన యిటు లనెను: "అయ్యా! సుబ్రహ్మణ్యముగారూ! ఇవిగో నగలు. నాలుగు వేల పైచిలుకు బంగారము. ఈపెట్టె మీరు తాకట్టు పెట్టుకొనుఁడు. కానిచో బాకీ రద్దు చేసికొనుఁడు." అని ఒకొక్క నగ తీసి మరల చేపెట్టెలోఁ బెట్టి ఆయన కిచ్చివేసి నా కేసి తిరిగి "అయ్యా! తమరు సాక్షి." అని యనెను.

నే నాశ్చర్య సముద్రములోఁ బడిపోతిని. వసంతసేనా చారుదత్తులు నా యెదుట నిలువఁబడిరి.

ఇంతకుముందు మాటలేని రామారావుగారు 'అమ్మ' యని నిట్టూర్చి బలువుగా 'సువదనా' యని ఉచ్చరించి కనులు మూసికొనిరి.

"నే నీనగ లీయకుండ నుండినచో మఱి కొంచెము నే వుండెడివారేమో" యని విలపించిన సువదనమాటలు నాచెవిలో నేఁటికిని వినిపించుచునేయున్నవి.

[ఇచటఁ బ్రసక్తులయినవారి పేరులు మార్పఁబడెను. కారణము సుగమము. — వే. శి.]





డాక్టర్.
శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, బెజవాడ వారి
ఆరోగ్యసుధ
సమస్తవ్యాధులకు



దేవి యిచ్చిన వరం

[కథానిక]

శ్రీ కపిల చినవేంకటరావు

(గత సంచికతరువాయి)

వెంటనే భళ్లున తెల్లవారింది. కలకలా రవములు చేస్తూ పక్షులు ఎగురుతున్నాయి. గాలి నెమ్మదిగా వీస్తోంది. పశువులు అరుస్తున్నాయి. తూర్పుదిక్కున సూర్యబింబము కరకర ఉదయిస్తోంది. ఎర్రని వెలుతురులో స్టేషనూ, మాస్టరుగారి యిల్లూ ఎర్రగా కనబడుతున్నాయి. ఒకళ్లొకళ్లే లేచి జనులు ఎవరిపనులమీదికి వాళ్లు పోవడానికి సర్దుకుంటున్నారు. తెల్లవారి వచ్చే మెయిలు ఎక్కడంకోసం కాబోలు కొందరు జనం విసవిస నడిచి వస్తున్నారు స్టేషనుకి.

"అంతా చీకటి కావాలి" అన్నాడు శరభన్న.

జిమ్ముకుంటూ చీకటి వచ్చిపడింది. కన్నుపొడుచుకున్నా కానరాని చీకటి! నక్షత్రాల వెలుతురుకూడా రాకుండా మబ్బులు. ప్రపంచమంతా కారుచీకటి క్రమ్మింది.

శరభన్న లేచి సత్రంబయటికి వచ్చాడు. చీకట్లో ఆ పాతసత్రం వికారంగా కనపడుతోంది. ఎన్నాళ్ల క్రిందట యే మహారాజు కట్టించాడో అది, తిరిగీ దాని మొహం చూచినవాళ్లు లేకపోబట్టి పెణకలు కూలి, చవుడు డుల్లి, పాతబడి, పాడుబడిఉంది. అక్కడక్కడ తలుపులు చెదలు తినడంచేత క్షేమం తక్కువైపోయింది. రైలుమాస్టరుగారిల్లూ, మరినాలుగు పూరికొంపలూ తప్ప వేరేమీ లేని ఆ నిర్జనప్రదేశంలో దొంగలభయంచేత ఈ పాడుసత్రంలోకి రావడమే మానేశారు యాత్రికప్రజ.

ఆసత్రం చూస్తే శరభన్నకి అసహ్యం వేసింది. "వెధవసత్రం, తగలడితే బాగుండును" అనుకున్నాడు.

ఏ మూల అంటుకుందో మరి, ఒక్కనిముషంలో సత్రం అంతటా పాకింది అగ్ని. పాత కలప కావడంచేత అన్ని మూలలా అన్నిమంటలూ లేచి దహించడం మొదలుపెట్టాయి. ఫెటఫెట మని ధ్వనులు చేస్తూ పాతదూలాలుమండి చెవులుపగిలేట్టు చప్పుడు చేస్తూ పగులుతున్నాయి. నల్లటి పొగలు ఆకాశంనిండా క్రమ్ముతున్నాయి. పెద్దపెద్ద పాములలాగు నాలుకలు చాస్తూ మంటలు బ్రహ్మాండంగా లేగుతున్నాయి. ఆ శబ్దమూ, ఆ హడావిడీ విని, ఆ చుట్టు ప్రక్కల ఉన్న కొద్దిజనం పరుగెత్తుకుంటూ వచ్చారు

"అయ్యయ్యో! సత్రం కాలిపోతోంది, సత్రం కాలిపోతోంది" అని కేకలు వేసుకుంటూ. స్టేషనూ, మాస్టరుగా రిల్లూ గట్టి కట్టడాలే అయినా మాస్టరుగారు తమ పశువులపాక ఎక్కడంటుకుంటుందో అని పరుగెత్తుకుని వెళ్లారు. తక్కినవాళ్లు తమ పూరికొంప లెక్కడ నాశనమవుతాయో అని వెళ్లారు. సత్రం ఆహుతి అయిపోతోంది.

శరభన్న వీళ్ల కంగారు చూచి నవ్వాడు. నవ్వితే ఒక ముత్రాసివాడు చెడామడా తిట్టాడు శరభన్నని—"సత్రం తగలడి పోతా వుంటే నవ్వుతావేటి శెవింటి బాపనయ్యా!" అని. శరభన్నకి వినపడలేదామాట. ముత్రాసివాడు శరభన్నని చేతితో తట్టి మరీ తిట్టాడు. మాటలు అర్థంచేసుకుని శరభన్న మళ్లీ నవ్వాడు. అతని కొక ఊహ తోచింది.

"సత్రం మళ్లీ ఎప్పటిలాగ ఉండాలి" అన్నాడు నిమ్మళంగా.

మంట లేమైనారో, పొగ లెక్కడికి పోయారో—ఆ పాతసత్రం మళ్లీ అక్కడ సిద్ధమయింది. ఇందాకట్నుంచీ మంటలు చూస్తున్న వాళ్లంతా మళ్లీవచ్చిచూచి ఏమీ పాలుపోక, ఆఖరుకి కొరవిదయ్యాలకోల అని విడ్డూరంగా చెప్పుకుంటూ ఎవరికొంపకు వాళ్లు పోయారు.

కొన్నాళ్లు గడిచాయి. ఒకనాడు సత్రం చావడితలుపు దగ్గరగా వేసుకుని లోపల కూర్చొని శరభన్న సృష్టిలయాలు చేస్తున్నాడు. సత్రం ఏస్థితిలో ఉందో పరీక్షచేద్దామని ఎవరో పెద్దఅధికారి వచ్చాడు. ఆయన సత్రంకడకు అదేవేళ వచ్చి, "ఎవరయ్యా, గుమాస్తా, తలుపుతియ్యడేం?" అని కేక వేశాడు. శరభన్నకి ఆ కేక వినబడలేదు. అధికారి మెట్లెక్కివచ్చి తలుపు తన చేతి కర్రతో త్రోశాడు. లోపల తాను సృష్టించిన చేగోడీలు తింటూ శరభన్న మహానందంలో ఉన్నాడు. అధికారికి ఎంతకోపమయినా వచ్చింది. "బుద్ధి లేదురా? పిలుస్తోంటే పలుకవేం, చెవిటిమొద్దా" అని తిట్టాడు. శరభన్నకు అహంభావము కుతకుతలాడింది. "మన సత్తా వీడికి తెలియక మాట్లాడుతున్నాడు, వెధవ అధికారం వీడూను" అనుకొని అల్లాగే కూర్చున్నాడు. ఆ అధికారి కర్ర పుచ్చుకుని కొట్టాడు శరభన్నని. దెబ్బ తగలడంతోటే రేచిక్కెత్తుకు వచ్చి శరభన్న "చావు, వెధవా" అన్నాడు. పొట్టిగా, లావుగా ఉండి, సేలం అంచుపంచె, లాంగుకోటూ, జరీతలపాగతో ఉన్న ఆ అధికారి కర్ర చేతిలో పట్టుకుని ఉన్నవాడున్నట్టుగానే, ఆయనప్రాణం దేహంవదలి వెళ్లిపోయింది; కట్టె దభీలుమని క్రింద పడిపోయింది పెద్ద దుంగలాగ. లబలబ మని నెత్తికొట్టుకుంటూ పరుగెత్తుకుని వచ్చాడాయనబంట్రోతు. ఏం చెయ్యగలడు? స్టేషన్లో నలుగుర్ని పిలిచి, సాయంపట్టి శవం ఒకమూల పడుకోపెట్టి, అధికారి బంధువులకి టెలిగ్రాము ఇచ్చాడు.

ఆరోజల్లా శరభన్నకు మహోగ్రహంగా ఉంది. ఆ ఘటనతోటి అతనికి తన శక్తి యొక్క అపారత్వమున్నూ, అమోఘత్వమున్నూ బోధపడింది. అతని ముఖంలో ఒక విధమైన తీక్ష్ణత బయలుదేరింది. వెనుకటి చింతాపరత్వమూ, వైరాగ్యధోరణీ లేవు ఇప్పుడు. తీక్ష్ణత, ఒక విధమైన క్రౌర్యం!

మనిషి చస్తే మాటలా? అందులో అధికారికూడాను. పోలీసువారు సంజాయిషీలు తీసుకోవడానికి వచ్చారు. నూజివీడునుంచి ఒక సర్కిల్ ఇన్ స్పెక్టరూ, సబు మేజస్ట్రీటూ, అంతా వచ్చారు. సత్రంలో ఒక పెద్ద విచారణ జరిగింది. శరభన్న సాక్ష్యంకూడా విచారించారు. తనకేమీ తెలియదని చెప్పాడతను. చెప్పేటప్పుడు అతని మొహంమీద నవ్వు మొలకలెత్తడం చూచి పోలీసు ఇన్ స్పెక్టరుగారు "నవ్వుతావేంరా ? ఫూల్" అన్నాడు. శరభన్నకి వినపడింది ఈ తిట్టు. ఒళ్లు మండిపోయింది.

"పోలీసు ఇన్ స్పెక్టరు చావాలి" అన్నాడు మనసులో.

పాతకుర్చీలో కూర్చున్నవాడు కూర్చున్నట్టుగా, కాకీలాగూ, కాకీకోటూ, జందెంలాగ తోలుపటకా, టెడుటోపీ, బూట్సులతో ఇన్ స్పెక్టరుగారు సీల్గి చచ్చిపోయినాడు. మాట్లాడడంకొరకు ఆయన తెరచిన నోరు తెరచినట్టుగానే ఉంది. ప్రాణంపోయేటప్పుడు మాత్రం 'డప్పు' మని చప్పుడైంది. అంతే.

ఇంక ఆ విచారణసభలో కలిగిన అలజడి యేమనిచెప్పను! పులిమీదపుట్రలాగ, ఒక పెద్ద అధికారి హఠాత్తుగా చనిపోయినాడని విచారణకు వస్తే ఇంకొక అధికారి చావడమా? హఠాత్తుగానే చావడమా ఆయనకూడా? అదేమోటున? వాళ్ల గుండెలు పగిలిపోమా యనడంలో ఆశ్చర్యం యేమిటి? "రేపు వస్తా" నని చెప్పి సబుమేజస్ట్రీటుగారు నూజివీడు వెళ్లిపోయినాడు. ఇన్ స్పెక్టరుగారి శవంకూడా లోగడ చనిపోయిన అధికారిశవంలాగే, కాపలాగా ఒక పోలీసుభటుణ్ణి ఉంచి, ఎక్కడికో పంపించేశారు.

అప్పటినుంచీ శరభన్నకు మనస్సులో భయమూ, సంకోచమూ పోయాయి. ఇప్పుడు శరభన్నకి చాటూ మాటూ లేదు. ఒకనాడు స్టేషనులోకివచ్చి నిలబడ్డాడు. మిఠాయి దుకాణంవాడిదగ్గరకు వచ్చి వాడి మిఠాయి తట్టలన్నీ మాయంచేశాడు. వాడు మిఠాయి తింటే చేదుగా ఉండేటట్లు చేశాడు. వాడి పిల్లిని పక్షినిచేసి ఆకాశంమీద ఎగిరించాడు. ఆకాశంమీద ఎగిరే పక్షుల్ని మాటమాత్రం చేత క్రిందపడగొట్టాడు. స్టేషనుమాస్టరుగారి ఆవుని మార్చి కుక్కని చేశాడు. రైలుగేటు దగ్గర పడుకుని కూస్తోఉండే ఒక ముసిలి కుక్కను పిల్చి ఏనుగును చేశాడు. రైలు పట్టాలు నిలువునా నిలబెట్టాడు. స్టేషను యావత్తూ ఆ రెండు రైలుపట్టాలమీద నిలబెట్టాడు. మళ్లీ సత్రంలోకి వచ్చి కూర్చున్నాడు.

ఈ విపరీతాలు చేస్తున్నప్పుడు మొదటిలో ఆశ్చర్యపోయారు వాళ్లు. తరువాత భయంవేసింది వాళ్లకి. వీడే బహుశః ఆ ఉద్యోగస్థు లిద్దరిని చంపిఉంటాడని తోచింది వాళ్లకి. మనలని ఏంజేస్తాడో అని భయంవేసింది. శరభన్న అవతలికి పోగానే వాళ్లు వణుక్కుంటూ వణుక్కుంటూ నలుగురూ ఒకమూలచేరి వీణ్ణి మనం హత మారుస్తేనే గాని మనకు బ్రతికేఉపాయంలేదని నిశ్చయం చేసుకుని ఆవేళ రాత్రికే పెట్టుకున్నారు ఆముహూర్తం ప్రాణభయం అంతచేయిస్తుంది కాబోలు!

రాత్రి సరిగా పన్నెండు గంటలకి చేరుకున్నారు వాళ్లంతా. చీకట్లో నల్లగుడ్డలు

ముసుగులు వేసుకొని గడ్డపార ఒకడు, పెద్ద కత్తి ఒకడు, గొడ్డలి ఒకడూ పట్టుకుని ముగ్గురు నడుస్తుంటే ముందు దారి చూపిస్తూ మితాయిదుకాణంవాడు నడిచాడు. వీళ్లు నలుగురూ సత్రంలోకి వెళ్లి నుంచున్నారు. హఠాత్తుగా తలుపుతీసుకొని, శరభన్నమీద అమాంతంగా పడి అతనిని కొట్టి పొడిచి చంపుదామని వీళ్ల ఊహ. తలుపు పాతది, దాని మరలు తుప్పుపట్టిఉన్నాయి; త్వరగా రాలేదు. నలుగురూ బలంగా తోస్తే అది పెద్దచప్పుడుచేస్తూ విడిపోయింది. నలుగురూ ఒకదెబ్బని దూరారు లోపలికి.

తలుపు చప్పుడో, ఆయుర్దాయపు గట్టితనమో శరభన్నకు మెళుకువ తెచ్చింది. వెంటనే తెలిసిం దతనికి వీళ్ల ఉద్దేశం.

"చావండి వెధవల్లారా" అన్నాడు.

నాలుగు శవాలు! మొదళ్లు నరికిన అరటిచెట్లలాగ దబ్బుమని పడ్డాయి ఆ సత్రం గదిలో నాలుగు శవాలూనూ.

శరభన్న ఉగ్రుడైపోయినాడు. ఆవేశంగా బయటికి వచ్చి అక్కడ ఉండే మనుష్యుల్ని, పశువుల్ని, పక్షుల్ని, కీటకాదులన్నింటినీ ఒక్కశాపంలో నాశనంచేశాడు. రైలుపట్టాలను ఇంకొకచోటికి పంపేసి, స్టేషనును తగలబెట్టాడు. ఆ చుట్టుప్రక్కల అంతా ప్రసిద్ధి అయిపోయింది—అక్కడ ఒక బ్రహ్మరాక్షసుడు చేరాడని. అటువైపు ఒక్క పిట్టయినా పోవడంలేదు. ఇదివరకు జనపదములైనచోట్ల క్రమశః చెట్లుచేమలు పెరిగి పెద్ద అడవి అయిపోయింది. ఆ అడవిలో ఏకాకి శరభన్నతప్ప మరి మనిషిజాడ లేదు.

ఒకనాటి మధ్యాహ్నం వెనకటి వృద్ధ సన్యాసి మళ్లీ ఆదారినే వెడుతూ, పాతరస్తా కానక వెతుక్కున్నాడు. చెట్లు పెరిగి మాసిపోయిన పాతత్రోవను నడిచి ఆయన పూర్వం స్టేషను ఉన్నచోటికి వచ్చి చూస్తే అక్కడ పెద్ద తాడిఎత్తున పుట్ట ఒకటి పెరిగిఉంది. "దారి తప్పాను కాబోలు" అనుకుంటూ సన్యాసి అటువైపు చూస్తే సత్రంమాత్రం పాతది, పాడుపడి అల్లాగే ఉంది. "ఏమిటి ఈవిచిత్రం" అనుకుంటూ సన్యాసి అక్కడకు వెళ్లి అరుగుమీద కూర్చున్నాడు. కూర్చోగానే అతనికి ఒకవిధమైన భయం కలిగి అక్కడనుంచి లేచి లోపలికి వెళ్లిచూస్తే శరభన్న సావట్లో చాపమీద పడుకొని ఉన్నాడు. శరభన్నను చూడగానే గుర్తుపట్టి సన్యాసి అతనికి నమస్కారంచేసి నిల్చున్నాడు. శరభన్న నిరసనభావంతో లేచి కూర్చుని, "ఎవడ్రా నువ్వు? ఇక్కడ కెందుకు వచ్చావురా?" అన్నాడు.

వృద్ధసన్యాసికి ఆశ్చర్యంవేసి తనలోతాను ఆలోచించుకుంటున్నాడు ఏమిటో. శరభన్న చీకాకుపడుతూ "ఎవడ్రా నువ్వు? మాటా పలుకూ లేదేం?" అన్నాడు. సన్యాసి నమస్కారంచేసి "మహాప్రభో, నేను ఒక సన్యాసిని" అన్నాడు.

శరభన్న చీదరించుకున్నాడు. "ఛీ, అవతలికి పో. సన్యాసికి ఇక్కడేంపని? పో, పో. అసలు మనిషి అన్నవా డిక్కడికి రావడానికి వల్లకాదు. పో" అన్నాడు.

ఆ సన్యాసికి ఏమిబోధపడిందో 'రాం రాం' చెప్పి బయటికి వచ్చేశాడు. వచ్చి వంటయింటివైపుకు ఎరిగిఉన్నవాడిలాగ వెళ్లి

అక్కడ గోడమీద గీచిఉన్న భార్గవవిగ్రహం దగ్గర వృద్ధుడున్నూ, దేశద్రిమ్మరిన్నీ, సర్వ సంగత్యాగిన్నీ అయిన ఆసన్యాసి సాష్టాంగ పడి ప్రార్థనచేశాడు. ప్రార్థనానంతరం ఆయన ఆస్థలం విడిచిపెట్టి విసవిస నడుస్తూ తన దారిని తాను పోయినాడు.

మరికొన్నాళ్లు గడిచాయి. ఒకరోజున శరభన్నకి ఒళ్లంతా తపనపుట్టింది. మనసు కూడా ఏమీ బాగుండలేదు. మొదలు సంతృప్తి అనేది లేదు అతనికి. అందువల్లనో, మరి నిజంగా దేహంలో అస్వాస్థ్యంవల్లనో అతి వేదన కలుగుతోంది. ఈమధ్య కొన్నాళ్ల నుంచి అది యెక్కువై, ఈవేళ మరీ ఎక్కువైంది. ఏమీ తోచడంలే దతనికి. కూచో లేడు, నుంచోలేడు, పడుకోలేడు, నిద్రపట్టదు, మరోపని చేయడానికి మనసు పుట్టదు.

పట్టపగలు పన్నెండుగంటలకి అర్ధరాత్రి కావాలని ఉత్తరువుచేశాడు. వెంటనే చీకటి ముంచుకువచ్చి ప్రపంచ మంతా అంధకార బంధుర మయిపోయింది. ఎండపోయినా అతని తపన చల్లార లేదు. వెన్నెల వస్తే చల్లగా ఉంటుందని వెన్నెల కావా లనగానే పున్నమ వెన్నెల చక్కావచ్చింది. అందువల్లనూ అతనికి శాంతి కలుగలేదు. మంచిగంధం, మల్లె పువ్వులూ సృష్టించి తనకు తాను శైత్యోపచారాలు చేసుకున్నాడు.

ఏమీ లాభం లేకపోయింది. అంతలో అతనికి తోచింది చంద్రుడు చల్లదనమిస్తాడు కదా, చంద్రుడు మరీ దూరంగా ఉన్నాడు కాబట్టి పూర్తిగా చల్లదన మియ్యలేకుండా ఉన్నాడు, దగ్గరకు వస్తే బాగుంటుందని. వెంటనే శరభన్న ఉచ్చైస్స్వరంతో—

"చంద్రుడూ, భూమికి దగ్గరగా వచ్చెయ్యి" అన్నాడు.

ఆ వాక్కు శరభన్న నోట్లోనుంచి రావడం ఏమిటి, చంద్రమండలం గిర్రుగిర్రున తిరుగుతూ భూమండలం వైపు దిగడం ఏమిటి! ఒక శతలక్షకోటి రైలు ఇంజన్ల హోరు పుట్టింది. ఏమూలనుంచో రంయి రంయి రంయిమని ఝంఝామారుతం దుమ్ముతో, ధూళితో, రాళ్లతో రేగింది. పండువెన్నెల పోయి, చిమ్మచీకటి అలుముకుంది. ఆచీకట్లో ఆ విపరీతపుగాలీ, ఆగాలికి ప్రపంచమంతా నాశనమైంది; తమంత లేసి ఊడలుదిగిన మది మఱ్ఱిచెట్లు సమూలంగా పెల్లగిలి పండుటాకుల్లాగ ఎగిరిపోతున్నాయి. కొండలు కదిలాయి. ఇకను మనుష్యమాత్రుడు కట్టిన మేడలూ మిద్దెలూ లెక్కఏమిటి? దీనికితోడు ఏనుగుతొండాలధారతో వర్షం. ఢాం ఢాం అంటూ చెవులు పగిలేధ్వనులతో ఉరుములు. వాటిసమించి జగతిని కంపింపజేసే పిడుగులు. కళ్లు గ్రుచ్చుకుపోయే మెరుపులు. ఆగాలి, ఆధ్వనీ! ప్రళయంవచ్చింది. ఇంతలోనే సముద్రాలు గట్లు తెగి భూమిమీద పడ్డాయి. ఒక్క చిటికెలో భూమినిండా నీరు ముంచుకు వచ్చింది. ఆదిశేషువు బుసకొట్టినట్లు బుసకొట్టుతూ, తెల్లగా నురుగులు కక్కుతూ, పదితాళ్ల ప్రమాణాన్ని మిడిసిపడుతూ, త్రుళ్లుతూ, అరుస్తూ వచ్చి జగత్తును కబళిస్తున్నది సముద్రం. క్రింద సముద్రం, పైని ప్రళయవర్షం. మేఘాలన్నీ తెగిపడ్డాయి కాబోలు, ఆగాలి, వాయుదేవునికి వెర్రి యెత్తింది కాబోలు, కులపర్వతాలే ఎగిరిపోతున్నాయి. ... ... ఆకాశంలోనుంచి మనోవేగంతో భూమివైపు వస్తున్న

ఆ చంద్రుని గోళంలోనూ ఇంతే. దగ్గర కొచ్చినకొద్దీ చంద్రమండలం పెద్దదవుతోంది. తుదకి ఆకాశమంతా ఆక్రమించుకునేట్టుంది. వెలుతురూ లేదు, ఏమీ లేదు. ఎంత అందవికారంగా, ఎంత భయంకరంగా ఉంటుంది చంద్రబింబం! అక్కడకూడా చీకటే, అక్కడకూడా కొండలు కూలిపోతున్నాయి. ఆ గమనవేగానికి చంద్రుడు వణికిపోతున్నాడు. భూమి చెప్పనే అక్కర్లేదు. క్షణానికి వెయ్యిమార్లు భూమికూడా వణికిపోతోంది. గజగజ గజగజ వణికిపోతోంది.

ఈ మహావిలయంలో శరభన్న పాత సత్రం కూలిపోయింది. గాలికి తాను ఎగిరిపోతున్నాడు. అతని మొట్టమొదట సత్రం తాలూకు దూలాలు దూదిలాగ ఎగిరిపోయాయి. ఆకాశంమీదనుంచి వడగళ్లో, గాలిలోనుంచి రాళ్లో అతని నెత్తిమీద పడి గాయాలు చేస్తున్నాయి. అన్నిటిని మించి ఆ హోరు. ఒక్కటే హోరు, ఒక్కటే హోరు! ఏమీ తోచదు, ఏమీ తెలియదు, ఎక్కడికి పోతాడు? ఎక్కడ తల దాచుకుంటాడు? చంద్రుడు ఇంకా దగ్గరకు వస్తున్నాడు. గిర్రు గిర్రున తిరుగుతున్న చంద్రమండలం వైపు చూస్తే కళ్లు తిరిగిపోతున్నాయి. చంద్రమండలంలోనుంచి పెద్ద పెద్ద భాగాలు విరిగి పడిపోతున్నాయి. భూమిలోనూ అంతే. పెద్ద పెద్ద పెళ్లలు విరిగిపోతున్నాయి. గాలియొక్క ఒక్క ఊపుతో ఎగిరి శరభన్న ఒక గోతికి కొట్టుకున్నాడు. ఆ దెబ్బతోటి శరభన్నకి జ్ఞానం వచ్చింది. విశ్వప్రయత్నం చేసి మనస్సు బిగించుకుని —

"అమ్మా, నాకు వద్దు తల్లీ, ఈశక్తి. మళ్లీ ఎప్పటిలాగ ఉండనియ్యి నన్ను. ప్రపంచం మళ్లీ ఈశక్తి నాకు రాకపూర్వం ఉన్నట్లు చేసెయ్యి, తల్లీ!" అన్నాడు.

ఆ ప్రళయ మంతా టక్కున ఆగిపోయింది. ప్రపంచం మళ్లీ యథాస్థితికి వచ్చింది.

నూజివీడు రైల్వేస్టేషనూ, మిఠాయి దుకాణమూ, రైల్వేసాకర్ల కొంపలూ, పాత సత్రం అన్నీ ఎప్పటిలాగున ఉన్నాయి.

చవితి చంద్రుడు ఉండీ లేనట్టుగా ఉన్నాడు. గుడ్డివెన్నెలలో లోక మంతా మసకమసకగా ఉంది. శరభన్న వంటచేసుకుంటున్నాడు. పొయ్యి మండడంలేదు. పొయ్యిలోనుంచి పొగ కళ్లలోకి పోయింది. శరభన్నకు మహాకోపం వచ్చింది. లేచి నుంచుని విసుగుకుంటూ, పైమీది గావంచాతో కళ్లు తుడుచుకున్నాడు. *

---

* ఇందులో ముఖ్యభావము సుప్రఖ్యాతులు హెచ్. జి. వెల్సుగారి ఏదో ఒక రచనలోనుండి తీసుకోవడమయినది.

పిచ్చివాడు

శ్రీ వేంకట వీరరాజ కవులు

౧

అవతారపురుషుండ
ఆనందరూపుండ
అఖిలాండకోటి బ్ర
హ్మాండనాయకు డేనె
నాకంటె సంతోషి ఏడీ?
లోకాన
నావంటి సంతుష్టు డేడీ?

౨

పిడికె డన్నమె నాకు
పిండివంటక మౌను
గోనెగుడ్డలె చీని
చీనాంబరా లౌను
నాకంటె సంతోషి ఏడీ?
లోకాన
నావంటి సంతుష్టు డేడీ?

౩

ఒరుల సంపద చూచి
పరుల సౌఖ్యము గాంచి
దురపిల్ల నాకు నె
త్తరి నిమిత్తము లేదు
నాకంటె సంతోషి ఏడీ?
లోకాన
నావంటి సంతుష్టు డేడీ?

౪

ఒకరి ఊసుకు పోను
ఒకరి జోలికి పోను
ఒకరి కొంపను గూల్చ
టకు దలంపగ బోను
నాకంటె సంతోషి ఏడీ?
లోకాన
నావంటి సంతుష్టు డేడీ?

౫

జాతిభేదము నాదు
జన్మానికే లేదు
చేతి కందిన ఎంగి
లే తృప్తిగా తిందు
నాకంటె సంతోషి ఏడీ?
లోకాన
నావంటి సంతుష్టు డేడీ?

౬

ఆరు నూరే కాని
నూరు ఆరే కాని
గోరం తయిన నే వి
చారింపగా బోను
నాకంటె సంతోషి ఏడీ?
లోకాన
నావంటి సంతుష్టు డేడీ?

వేదాంతదర్శనము

అచింత్య భేదాభేదవాదము

(గౌడీయ వైష్ణవమత సంప్రదాయములు)

శ్రీ పూర్ణానంద

యస్య బ్రహ్మేతి సంజ్ఞాం క్వచిదపి నిగమే యాతి చిన్మాత్రసత్తా
ప్యంశో యస్యాంశకైః స్వైర్విభవతి వశయన్నేవ మాయాం పుమాంశ్చ,
ఏకం యస్యైవ రూపం విలసతి పరమవ్యోమ్ని నారాయణాఖ్యం
స శ్రీకృష్ణో విధత్తాం స్వయ మిహ భగవాన్ ప్రేమ తత్పాద భాజామ్.

[గోవిందభాష్యమ్]

ప్రవేశిక :

వాదిసింహ, విద్యాసాగర లను బిరుదములను బడసి, నిమాయిపండితు డని ప్రసిద్ధికెక్కిన శ్రీ కృష్ణ చైతన్యస్వామియే (మధ్వ-గౌడీయవైష్ణవదర్శన మన బడు) అచింత్యభేదాభేదవాదబీజములను వెదజల్లినది. ఈయన శ్రీమన్మధ్వాచార్యులనే పరమగురునిగ గ్రహించెను. సాంప్రదాయికముగ భాష్యములను విరచించు శక్తి గలిగియుండియు, అనవసర మని యెంచి, జీవితమంతయు భగవన్నామ ప్రేమ మాహాత్మ్య ప్రచారమునకే వెచ్చించెను. తరువాతివారు శ్రీకృష్ణ, బ్రహ్మ, నారద, బాదరాయణ, మధ్వ, పద్మనాభ, నృహరి, మాధవ, అక్షోభ్య, జయతీర్థ, జ్ఞానసింధు, దయానిధి, విద్యానిధి, రాజేంద్ర, జయధర్మ, పురుషోత్తమ, బ్రహ్మణ్య, వ్యాసతీర్థ, లక్ష్మీపతి, మాధవేంద్ర, ఈశ్వర (అద్వైత, నిత్యానంద), చైతన్యదేవుల నామములను తమ గురుపరంపరలో పఠించుకొనిరి.

శ్రీ చైతన్యదేవుని సాక్షాచ్ఛిష్యులును, షడ్గోస్వాము లనబడువారును నగు రూప (సంబంధజ్ఞాన తత్త్వాచార్యులు), సనాతన (అభిధేయాచార్యులు), రఘునాథ (ప్రయోజన తత్త్వాచార్యులు), రఘునాథ (భట్టు), గోపాల, జీవగోస్వాములు ఈవాదబీజమును అంకురితమును, పల్లవితమును అగునట్లొనర్చిరి. వీరి జీవితములను, గ్రంథములను, మతవాదమును వివరింప వేర్వేరుగ వ్యాసములు కావలసి యుండును. వంగ, ఓఢ్ర దేశములలో చైతన్యస్వామి కలియుగమును పావన మొనర్ప ఇలాతలమున నవతరించిన శ్రీ కృష్ణుడే యని విశ్వసింతురు. అట జనసామాన్యము మనస్సులలో భగవంతుని నామ ముచ్చరించిన ఉదయించునది శ్రీమన్మహాప్రభునిమూర్తియే యని ఇట సంక్షేపముగ జెప్పిన చాలును. ఇట్లు షడ్గోస్వామిపాదులచే పల్లవితమును, అంకురితమును నగు ఈవాదబీజము విశ్వనాథ, బలదేవాదుల యత్నముగ కుసుమితమై ఫలప్రద మయ్యెను.

శ్రీ చైతన్యస్వామియును, తదనంతరము ఏతన్మత వాదమును ప్రచార మొనర్చిన శ్యామానంద, శ్రీనివాస, నరోత్తమదాసు లనువారును, గోస్వామిపాదులును శ్రీమద్భాగవతమునే వ్యాసమాత్రములకు భాష్యముగ గ్రహించియుండిరి. క్రీ. శ. ౧౮-వ శతాబ్దమున వెలసిన బలదేవ విద్యాభూషణుడే సంప్రదాయానుసారము ప్రస్థానత్రయమునకు భాష్యమును రచించెను. కనుక, ఈ వ్యాసమున ఏతదాచార్యుని జీవితము, గ్రంథములు,

మతవాదమును వివరింపబడుచున్నవి. 1 ఈ మతము వారికి నవద్వీప, బృందావన, జగన్నాథక్షేత్రములు పీఠస్థానము లని తెలియనగును.

జీవితము:

శ్రీ బలదేవుడు వంగీయబ్రాహ్మణుడు. బాల్యమున స్వదేశమునందే కావ్యాలంకారాది శాస్త్రముల నభ్యసించెను. శ్యామానందుని ప్రశిష్యుడగు రాధాదామోదరుని శిష్యత్వమును గ్రహించెను. పిదప బృందావనమున కరిగి, శ్రీ విశ్వనాథచక్రవర్తి, పీతాంబరదాసు లనువారికడగూడ శాస్త్రముల నభ్యసించెను.

జయపురాధీశు డగు జయసింహుని (రాజపుత్రస్థానము) సభయందు, అట నున్న శ్రీగోవింద విగ్రహమున కెవరెవరికి సేవాధికార మున్నదో నిర్ణయింపబడుసమయమున, గౌడీయ-వైష్ణవులకు సంప్రదాయభాష్యము లేనందువలన అధికారము లేదని నుడువబడెను. అప్పు డట, ఆసభయందు శ్రీబలదేవ విద్యాభూషణు లుండుట తటస్థించెను. ఆయన వెంటనే శ్రీగోవిందుని పాదముల నాశ్రయించి, తదాదేశానుసారము వేదాంతభాష్యము నొక నెలలో రచించి, తన సంప్రదాయమువారి ప్రతిష్ఠను నిలబెట్టెను. ఫలితముగ, ఈయన విరచించిన భాష్యగ్రంథమునకు 'గోవిందభాష్యము' అను అన్వర్థనామము కలిగెను. 2 ఈ విషయమును బలదేవుడే వ్రాసినాడు.

పీతదాచార్యుడు వైశ్యకులసంభూతుడని కొందఱందురు గాని, ప్రస్థానత్రయభాష్యరచయిత యగు బ్రాహ్మణుడే ఆచార్యు డను సాంప్రదాయికనియమ మున్నందువలన ఈమాట చెల్లదు. మఱియు, అపశూద్రాధికరణమున "బ్రాహ్మణానా మేవ అధికారః" అని వ్రాసియుండుటవలన ఈయన బ్రాహ్మణుడే అని ఒప్పుకొనవలసివచ్చుచున్నది. స్వాధికారవ్యాఘాతకరమగు సిద్ధాంతమును మందుడుగూడ విరచింపజాలడుకదా!

గ్రంథములు:

గోవిందభాష్య మనబడు వేదాంతసూత్రభాష్యమే బలదేవుని ముఖ్యగ్రంథము. సులలితమగు భాషలో అచింత్యభేదాభేదవాద మిందు స్థాపింపబడినది. దీనికి బలదేవుడే స్వయముగ నొక టీకను వ్రాసెను. సటీక గోవిందభాష్యము వంగాక్షరములలో ముద్రింపబడియున్నది. కాని ఇంతవఱకు దేవనాగరిలిపిలో ముద్రింపబడినట్లు తోచదు. అలహాబాదునందలి 'పాణిని ఆఫీసు' వారుఆంగ్లానువాదమును ప్రకటించియున్నారు.

విస్తృతమగు భాష్యమును ఒకింపజాలనివారికి వీలుగనుండునట్లు బలదేవుడు 'సిద్ధాంతరత్నము', లేక 'భాష్యపీఠకము' అను ప్రకరణగ్రంథము నొకదానిని రచించెను. ఇది మ. మ. పండిత గోపీనాథకవిరాజు, ఎమ్. ఏ. గారి సంపాదకత్వమున కాశీయందలి సరస్వతీభవనగ్రంథమాలనుండి వెలువడియున్నది. దీనికిగూడ బలదేవవిరచితమగు టీక యున్నది.

దశోపనిషద్భాష్యము, గీతాభూషణ మను గీతాభాష్యము, సుధ యను విష్ణుసహస్రనామభాష్యముగూడ వంగాక్షరముల ముద్రితమై వెలువడినవి.

'ప్రమేయరత్నావళి' అను ఒక ప్రకరణగ్రంథమును బలదేవుడు సంక్షిప్తముగ పీతమ్మతసారమును

1. గౌడీయ వైష్ణవుల మతసారము నొక్క-ముక్కలో చెప్పవలె నన్న—

"ఆరాధ్యో భగవాన్ వ్రజేశతనయ స్తద్ధామ బృందావనం రమ్యా కాచి దుపాసనా వ్రజవధూవర్గేణ యా కల్పితా,
శాస్త్రం భాగవతం ప్రమాణ మమలం ప్రేమా పుమర్థో మహాన్ శ్రీచైతన్యమహాప్రభో ర్మత మిదం తత్రాదరో
[నః పరః."

—శ్రీనాథచక్రవర్తి.

2. "విద్యారూపం భూషణం మే ప్రదాయ ఖ్యాతిం నిన్యే తేన యో మా ముదారః,
శ్రీగోవింద స్వప్న నిర్దిష్ట భాష్యో రాధాబంధు ర్బంధురాంగః స జీయాత్." —గోవిందభాష్యమ్

తెల్పుచు విరచించెను. ఇందు ౧. విష్ణుని పారమ్యము (శ్రేష్ఠత్వము), ౨. (విష్ణుని) అఖిలామ్నాయ వేద్యత్వము, ౩. విశ్వసత్యత్వము, ౪. జీవభేద సత్యత్వము, ౫. భగవద్దాసత్వము, ౬. జీవతారతమ్యము, ౭. శ్రీకృష్ణప్రాప్తిరూపమగు మోక్షము, ౮. విశుద్ధభక్తియొక్క మోక్షహేతుత్వము అను ప్రమేయములును, ఈ ప్రమేయజ్ఞానకారణము లగు ప్రత్యక్ష, అనుమాన, శబ్దము లను ప్రమాణములును విశదీకరింపబడినవి. ఈ గ్రంథమునకు శ్రీ విశ్వనాథచక్రవర్తిశిష్యుడగు శ్రీకృష్ణవేదాంత వాగీశుడు 'కాంతిమాల' యను టీకను రచించెను. శ్రీ అక్షయకుమార శాస్త్రి యను నవీనపండితుడుగూడ 'ప్రభ' యను టీకను రచించెను. ఈ గ్రంథ మింతవఱకును మువ్వురచే ప్రకటింపబడినను, ఉపర్యుక్తటీకాద్వయసమేతముగ కలకత్తాయందలి సంస్కృత సాహిత్యపరిషత్తువారు దేవనాగరలిపిలో వెలువరించిన సంస్కరణమే శుద్ధముగ నున్నది. న్యాయవైశేషికదర్శనప్రవేశము గోరువారికి సిద్ధాంతముక్తావళియు, అద్వైతవేదాంతసారమును దెలుసుకొనగోరువారికి సదానందకృతమగు వేదాంతసారమును, రామానుజదర్శనమర్మమును గ్రహింపగోరువారికి 'యతీంద్రమతదీపిక' యును తోడ్పడునట్లు అచింత్యభేదాభేదము నెఱుగగోరువారి కీ గ్రంథము తోడ్పడగల దని నా విశ్వాసము. ఇందు బలదేవుడుగూడ శ్రీమధ్వాచార్యులనే పరమగురువుగ గ్రహించియుండుట గమనింపదగియున్నది. 3

ఇట్టిదేయగు 'వేదాంతస్యమంతక' మను మతియొక ప్రకరణగ్రంథమునుగూడ బలదేవుడు రచించెను.

శ్రీరూపగోస్వామివిరచితములగు 'స్తవమాల', 'లఘుభాగవతామృతము' అను గ్రంథములకును, జీవగోస్వామిరచితమగు 'షట్సందర్భము' నకును, 'శ్రీమద్భాగవతము' నకును, 'గోపాలతాపినీయోపనిషత్తు' నకును, 'ఛందఃకౌస్తుభము' అను గ్రంథమునకును టీకలను సమకూర్చెను. ఇదిగాక 'సాహిత్యకౌముది' యను గ్రంథమునుగూడ లిఖించెను. ఇవి అన్నియు ప్రస్తుతము లభించుచున్నవి.

కాని సిద్ధాంతదర్పణము, కావ్యకౌస్తుభము, చంద్రాలోక టీక, నాటకచంద్రికాటీక, వ్యాకరణకౌముది అను గ్రంథములు దొరకకున్నవి. లభ్యము లగునవి పదునారు, అలభ్యము లగునవి ఐదు కలిపి మొత్తము ఇరువదియొక్క గ్రంథములు బలదేవవిద్యాభూషణుని గ్రంథములు.

ఈ ఆచార్యుని సిద్ధాంతముల నొక్కింత గమనింతము. 4

అధికారి:

నిష్కామ ధర్మాచరణఫలితముగ చిత్తమును నిర్మల మొనర్చుకొనినవాడును, సత్ప్రసంగలబ్ధుడును, శ్రద్ధాళువును, శమాదిసంపన్నుడును నగు జీవుడు అధికారి. 5 ఈ అర్హతను గాంచుటకు బూర్వము సాంగ సశిరస్కమగు వేదార్థజ్ఞానము, తత్త్వవేత్తయగు ఆచార్యునితో ప్రసంగము, నిత్యానిత్యవస్తువివేకము, అనిత్యవితృష్ణ అనునవి అవసరములు. 6 యాగాది కర్మలు ముఖ్యములు గావు; అట్టి కర్మల నాచరించినను లోకమున విశేషమగు ఫలము, అనగా జిజ్ఞాస ఉద

3. "ఆనందతీర్థ నామా సుఖమయధామా యతి ర్జీయాత్,
సంసారార్ణవతరణిం య మిహ జనాః కీర్తయంతి బుధాః." —ప్ర. ర. ౧-3.

4. కొవ్వూరునందలి శ్రీ గౌడీయమఠమువారిచే ప్రకటింపబడిన 'శ్రీచైతన్యశిక్షామృతము' అను ఆంధ్ర గ్రంథ మీమతతత్త్వమును గ్రహింప తోడ్పడగలదు.

5. "నిష్కామధర్మా నిర్మలచిత్తః సత్ప్రసంగలబ్ధః శ్రద్ధాళుః శాంత్యాదిమాన్ అధికారీ" —గోవిందభాష్యమ్.

6. "సాంగం సశిరస్కంచ వేద మధీత్య తదర్థా నాపాతతోఽధిగమ్య తత్త్వవిత్ప్రసంగేన నిత్యానిత్యవివేకతోఽనిత్యవితృష్ణో, నిత్యవిశేషావగతయే చతుర్లక్షణ్యాం ప్రవర్తత ఇతి." —అందే.

యించుట లేదు. పవిత్రవర్తనుడై, సాధుసంగమొనర్చిన జిజ్ఞాస అవశ్య ముదయించుచున్నది. కనుక సాధుసంగమే ముఖ్యము. నిత్యానిత్యవస్తువివేకాదిజ్ఞానానంతరము అధికారము లభించు నని చెప్పజాలము. సత్ప్రసంగము లేకున్న ఈ వివేకము లభింపదు. కనుక, సాధుసంగఫలితముగ చిత్తశుద్ధిని, వివేకాది గుణములను బడసినవాడే అధికారి. సనిష్ఠులు, పరినిష్ఠులు, నిరపేక్షులు అని అధికారులు మూడువిధములుగ నుందురు. అందు నిష్ఠతో కర్మ నాచరించువారు సనిష్ఠులు; లోకసంగ్రహార్థము కర్మ నాచరించువారు పరినిష్ఠులు; కేవలము ధ్యానమొనర్చువారు నిరపేక్షులు.

సంబంధము:

బ్రహ్మమునకును, శాస్త్రమునకును వాచ్యవాచక సంబంధ మున్నది. లక్ష్యార్థముతో పనిలేదు. "తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి" ఇత్యాదులగు శ్రుతివాక్యములు బ్రహ్మముయొక్క శబ్దవాచ్యత్వమునే నిరూపించుచున్నవి. "సర్వే వేదా యత్పద మామనంతి" అను వాక్యములుగూడ ఈ విషయమునే దృఢపరుచుచున్నవి. దృష్టమగు మేరువును అదర్శనీయమననట్లే బ్రహ్మముగూడ 'అవాచ్య' మనబడుచున్నది. "దేవదత్తుడు కాశీనుండి నివృత్తుడైనాడు" అనిన అతడు కాశీకాపురి కరిగి మరలినట్లు గ్రహింపదగినరీతిగనే "ఎటనుండి వాక్కు నివర్తిత మగుచున్నదో" (తై.ఉ.), "ఎవడు వాక్యములవలన సంపూర్ణముగ ప్రకాశింపబడడో" అను వాక్యములనుగూడ అర్థ మొనర్చుకొనవలసియున్నది. అనగా, ఒకింత జ్ఞానము లభించిన దని. బ్రహ్మము వేదప్రకాశ్యము కానిచో వేదపఠనమే వ్యర్థ మగును.

విషయము, ప్రయోజనము:

నిరవద్యుడును, విశుద్ధుడును, అనంతగుణయుతుడును, అచింత్య శక్తియును, సచ్చిదానందుడును, పురుషోత్తముడును నగు శ్రీకృష్ణుడే విషయము. "తస్మాత్ కృష్ణ ఏవ పరో దేవ స్తం ధ్యాయేత్ తం రసేత్ తం భజేత్ తం యజేత్" (గోపాల ఉ.) అను శ్రుతివాక్యము ఈవిషయమున ప్రమాణము. అశేషము లగు దోషముల వినాశన మొనర్చి, శ్రీకృష్ణదర్శన మొనర్చుటయే ప్రయోజనము. మఱియు, ఈ శాస్త్రమున ఈశ్వర, జీవ, ప్రకృతి, కాల, కర్మము లను తత్త్వము లైదు ప్రతిపాదింపబడును. ప్రమాణములు ప్రత్యక్ష, అనుమాన, శబ్దములు. ఈశ్వర, జీవ, ప్రకృతి, కాలములు నిత్యములు; కర్మ అనిత్యము.

బ్రహ్మము, లేక ఈశ్వరుడు:

ఈశ్వరుడు స్వతంత్రుడు, కర్త, సర్వజ్ఞుడు, ముక్తిదాత, విజ్ఞానస్వరూపుడు. పూర్ణచైతన్య మగు ఈయన నిత్యజ్ఞానగుణవిశిష్టుడు. స్వరూపశక్తియుతుడగు ఈయన ప్రకృతి మున్నగువానియందు అనుప్రవేశ మొనర్చి, జగత్సృష్టిని, భోగమోక్షములను గలిగించుచున్నాడు. ఈయన నిత్యలక్ష్మీయుతుడు. అవతారములను దాల్చినప్పుడుగూడ లక్ష్మీయుక్తుడుగనే యుండును. ఈయనకు సంధినీ-సంవిద్-హ్లాదినీరూప త్రయయుత మగు స్వరూపశక్తి యున్నది. ఈయన జగత్తునకు నిమిత్తోపాదానకారణములు. ఈయనకు సచ్చిదానందవిగ్రహ మున్నది. అయ్యు, ఈయన సర్వవ్యాపి. గాంధర్వశాస్త్రజ్ఞులు శ్రవణేంద్రియమున రాగ స్వరూపమును ప్రత్యక్ష మొనర్చుకొనునట్లు భక్తులు భక్తిభావితచిత్తమున ఈచిదానందవిగ్రహమును ప్రత్యక్ష మొనర్చుకొనుచున్నారు. అంతియకాక, ఒకే సమయమున ఉపాసకుల కందఱికిని విభువు అగుట వలన ప్రత్యక్షమగును. ఇయ్యది 'అచింత్య'శక్తివలననే జరుగుచున్నది. ఈయనయందు ప్రభుత్వ, సుహృత్త్వ, జ్ఞానదత్వ, మోచకత్వాదిగుణము లున్నవి. భగవంతుని చిద్ఘనదేహమునకును, ఆత్మకును 'భేదము' లేదు; రెండును ఒక్కటియే. విభుత్వాది ధర్మములుగూడ ధర్మియగు ఈశ్వరునినుండి వేరుగావు. ఈశ్వరుడును, ఆయనశక్తియును ఒక్కటియే యైనను ప్రకాశము ననుసరించి అంశాంశిభావము సిద్ధించుచున్నది. అవతారములలో కొన్ని అంశావతారములు; మఱి కొన్ని కలామాత్రములు. కాని శ్రీకృష్ణుడు స్వయముగ భగవంతుడే. ఈయన అప్రాకృతుడైనట్లు ఈయన ధామముకూడ అప్రాకృతమే. రూప - లీలా - కర్మ -

ధామ పార్షదులుగూడ నిత్యములే. ఈయన అవ్యక్తుడైనను, ఏకరసస్వరూపుడేయైనను స్వరూపభూతమగు జ్ఞానానందమును ప్రసాదించుచున్నాడు. నిత్యజ్ఞానాది గుణము లీయన కున్నవి. అయ్యు, ఇది నిర్గుణము. నిర్గుణమన ప్రాకృత రజస్తమోగుణహీనము. మఱియు, బ్రహ్మము అప్రాకృతగుణముల కాకరము.

జీవజగత్తులు:

బ్రహ్మమే జగత్తుయొక్క నిమిత్తోపాదాన కారణము లని నుడివితిని. ఈయన తన 'అచింత్యశక్తి'వలన స్వరూపప్రచ్యుతుడు గాకుండగనే జగదాకారముగ పరిణమించుచున్నాడు. జగత్తు సత్యమే. అటనట, శాస్త్రముల జగత్తు మిథ్య యని చెప్పుట వైరాగ్యమును కలుగజేయుటకే. కాని, జగత్తు అనిత్యము. జీవుడు అణుచైతన్యము. ఈశ్వరునివలెనే నిత్యజ్ఞానాది గుణవిశిష్టుడు, అస్మత్ శబ్దవాచ్యుడు. ఈశ్వరుడు గుణి; జీవుడు గుణము. ఈశ్వరుడు శరీరి; జీవుడు శరీరము. జీవాత్మలు పెక్కులు. ఇవి నానావిధస్థితుల నెలయుచుండును. కర్మఫలానుసారము జీవుల పరస్పర భేదత్వము కూడ గ్రహణీయము. ఈశ్వరవైముఖ్యమే బంధము. ఈశ్వరనిరతివలన స్వరూప ఆవరణ, గుణావరణ అను బంధములు తొలగిపోవ, తత్సాక్షాత్కారము లభించును. జీవుడు నిత్యుడు.

అన్నిటికిని ఊర్ధ్వమున గోలోక మున్నది. తరువాత క్రమముగా వైకుంఠ, శివ, దుర్గా (భూ)లోకము లున్నవి.

సాధన, భక్తి:

భక్తియే ముఖ్యసాధనము. ఉపాసనాఫలముగ భగవంతుడు ప్రీతు డగును; ముక్తి నొసగును. జ్ఞానవైరాగ్యములు సహకారిసాధనములు.[7] భక్తి హ్లాదినీ, సంవిత్ శక్తుల సారము. కనుక నియ్యది జ్ఞానరూపమును, ఆనందదాయకమును నగుచున్నది. విద్యా, వేదన రూపమగు జ్ఞానసారమే భక్తి. శుద్ధమగు 'త్వం' పదార్థజ్ఞానమే విద్య. ఇయ్యది నిర్వాణముక్తికి సాధనము. 'తత్' పదార్థజ్ఞానమగు విధిభక్తియును, రుచిభక్తియును గలసి వేదన యనబడును.

తాప, పుండ్ర, నామ, మంత్ర, యాగము లను పంచవిధ సంస్కారములను బడసి ద్వివిధభక్తిభావములను సిద్ధింపజేసుకొనినవారికే ఈశ్వర సాక్షాత్కారము లభించును.

తాప మన చందనాదులతో హరినామాదికము ముద్రించుకొనుట. పుండ్రమన తిలకధారణము. నామమన 'హరిదాసు', 'కృష్ణదాసు' మున్నగు భృత్యత్వసూచక నామములను ధరించుట. మంత్రమన అష్టాదశాక్షరాది మంత్రోపదేశమును బొందుట. యాగ మన సాలిగ్రామపూజ. శ్రవణకీర్తనాదిరూపకమగు నవధాభక్తియే శాస్త్రవిధినియంత్రితమైన వైధీభక్తియనియు, అనురాగనియంత్రితమైన రాగానుగయనియు అనబడును. వైధీభక్తి ననుసరించువాడు చతుర్బాహుధారియగు భగవంతుని పూజించును. రాగానుగ భక్తియుక్తుడు నృలింగ చిహ్నితములును, ద్విభుజ యుక్తములును అగు రామకృష్ణాదిరూపముల నర్చించును.[8]

ఈ భక్తి పరిపక్వమైన భావ మనబడును. ఈ భావము శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య, మధురములని పంచవిధము.

శాంతభావమున సర్వమత సామాన్యమగు తీవ్రవైరాగ్యము, ఇష్టవస్తువుపై జపాది సాధనల ననుసరించి మనస్సును నిల్పు యత్నము నుండును. ఇందు తీర్ణుడైనవాడు దాస్యభావము నాశ్రయించును. భగవంతుడు ప్రభువు, భక్తుడు దాసుడు. ఇట క్రియా, కర్మ లుండును. వీట పరిశ్రాంతుడైన నతడు సఖ్యభావమును ఆశ్రయించును. ఈ భావమున భగవంతుడును, భక్తుడును

7. "న వినా సాధనైర్దేవో జ్ఞానవైరాగ్యభక్తిభిః, దదాతి స్వపదం ప్రీతో నత స్తాని బుధః శ్రయేత్."
—గోవింద భా. (౩.౧.౧)

8. గోస్వామిపాదుల ఉత్తమభక్తినిర్వచన మిట అనుసంధేయము:
"అన్యాభిలాషితా శూన్యం జ్ఞానకర్మాద్యనావృతమ్, ఆనుకూల్యేన కృష్ణానుశీలనం భక్తి రుత్తమా."

ఛలికాంద్రవలె వ్యవహరింతురు. ఎట్టి నైతికనిబంధనలును వీరి మనస్సుల నరికట్టజాలవు. ఇందు స్థితిని బడసినవాడు మధురభావము నాశ్రయించును. ఇట భక్తునకు, భగవానునకు ప్రేమబద్ధులగు యువతీయువకుల మధ్య నుండు సంబంధ ముండును. పూర్వపూర్వములగు భావముల గుణములు ఉత్తరోత్తరముగ సంక్రమించుచుండును. అన్నిటికంటె మధురభావమే ఉత్కృష్టము.

ఈ భావసాధనయొక్క మహత్ఫలమే మహాభావ మనబడు ప్రేమ. ఇదియే జీవుని సహజస్థితి. ఇదియే ప్రాప్యము. ఇదియే భగవద్దర్శనమును, నిత్యధామమగు గోలోకవాసమును జేకూర్చి, జీవునకు అనంతమగు ప్రశాంతిని, ఆనందమును, సౌఖ్యమును గలిగించును.

అనుశీలన:

పూర్వతనాచార్యు లందఱును చతుస్సూత్రినే (వేదాంతసూత్ర, ప్రథమాధ్యాయ, ప్రథమపాద, ప్రథమ చతుస్సూత్రములు) సమస్తశాస్త్రమర్మోపబోధకముగ గ్రహించియుండిరి. కాని ఆచార్యబలదేవవిద్యాభూషణులు—

"ఏతా మేకాదశసూత్రీం సభాష్యాం
పంచవ్యాయీం యే పఠేయుః సమాత్మ్యామ్,
తత్త్వజ్ఞానం సులభం కిం న తేషాం
శేషగ్రంథోఽయ మతివిస్తరకారీ."

—గోవింద భాష్య టీక (౧-౧-౧౧)

అని మొదటి పదకొండుసూత్రములను శాస్త్రసారముగ నిర్వచించెను.

శాంకరమతమున బ్రహ్మము నిర్గుణము; వీరి మతమున బ్రహ్మము స్వరూపశక్తియుతము. అద్వైతమతాధికారి సాధనచతుష్టయసంపత్తి కలిగియుండుట ముఖ్యలక్షణము. బలదేవుడు విధించునది సాధుసంగము. కర్మాద్యనాశ్రితమగు శుద్ధజ్ఞానమును మోక్షకారణముగ అద్వైతు లంగీకరింప, వీరు ఏవంవిధమగు భక్తినే గ్రహించుచున్నారు. అద్వైతుల ముక్తి ప్రాప్యవస్తుప్రాప్తి; గౌడీయవైష్ణవదర్శనము ముక్తి భగవత్ప్రసాదలబ్ధము. శాంకరమతమున సగుణ, సోపాధికబ్రహ్మము వాచ్యము; నిర్గుణ, నిరుపాధికబ్రహ్మము లక్ష్యము. బలదేవుడు కేవలము వాచ్యార్థమునే గ్రహించెను. అద్వైతులు బ్రహ్మ మవాచ్యమగుటవలన నిషేధముఖమున వేదములు ప్రస్తావించుచున్న వందురు. బలదేవుని మతమున అవాచ్యత్వ మన సాకల్యనిరూపణాసమర్థతయే. "ఇతరేషాం చానుపలబ్ధేః" (వే. సూ. ౨-౧-౨) అను సూత్రమున శంకరుడు అశ్రౌతమని నిరసించిన మహత్తత్త్వమును బలదేవుడు గ్రహించినాడు. శూద్రులపట్ల శంకరుడు చూపిన ఔదార్యము నీయన చూపక, పురాణాదిశ్రవణమున వీరు పొందు ముక్తి నికృష్టముసెను.

శ్రీరామానుజుడు చిదచిద్విశిష్టమగు బ్రహ్మము నంగీకరించినట్లు వీరు శక్తిత్రయవిశిష్ట (స్వరూపశక్తి) మగు బ్రహ్మము నంగీకరించుచున్నారు. శ్రీరామానుజుడు అచిదంతర్గత మొనర్చిన కాల, కర్మము లనునవి వీరికి భిన్నములగు తత్త్వములు. శ్రీరామానుజుడు జీవన్ముక్తి నంగీకరింపకపోయినను వీరు అంగీకరింతురు.

మధ్వుడు ప్రతిపాదించిన బ్రహ్మసగుణత్వసవిశేషత్వములను, జీవుని అణుత్వసేవకత్వములను, జగత్సత్యత్వబ్రహ్మాధీనత్వములను బలదేవుడు గ్రహించెను. "ఈక్షతే ర్నాశబ్దమ్." (వే. సూ. ౧-౧-౫) అను సూత్రమునుగూడ మధ్వుడు వ్యాఖ్యానించినరీతిగనే గ్రహించెను. కాని, జీవబ్రహ్మములకు అత్యంతభిన్నత్వమును వీరు ఒప్పుకొనరు. గుణిగుణత్వభావముగ భిన్నాభిన్నులు. మధ్వమతమున లక్ష్మి జీవకోటియందు పరిగణింపబడుచున్నది. కాని, బలదేవుని సిద్ధాంతప్రకార మీశ్వరుడు నిత్యలక్ష్మీయుతుడు. మధ్వుడు కర్మమిశ్రితమగు భక్తిని గ్రహించెను. వీరు శుద్ధభక్తినే అంగీకరింతురు. మధ్వుడు తప్తముద్రాంకనమును గ్రహింప, వీరు చందనాదులవలన ముద్రలను ధరించుచున్నారు. మధ్వమతమున ఐశ్వర్యప్రధానమగు భక్తియును, ఈ మతమున మాధుర్యప్రధానమగు భక్తియును అవలంబింపబడుచున్నవి. మధ్వమతమున, భక్తులలో దేవతలే ముఖ్యులు. ఈ మతమున నిత్యధామమగు వ్రజపురియందు వసించు నిత్యసహచరులే ముఖ్యులు.

వల్లభాచార్యుని 'పుష్టి'మార్గమే వీరి మధుర రతిగ పరిపుష్టినందినను, వల్లభుడు వాత్సల్యభావమునకే విశేషప్రాధాన్యము నొసగెను. వీరు మధురభావమునే సర్వభావసమాహారముగ నంగీకరించిరి. ఇక, నింబార్కుని 'అచింత్యశక్తి', 'భేదాభేదము'లను గౌడీయ దర్శనము సర్వాత్మనా అంగీకరించినది. శ్రీ జీవగోస్వామిపాదులు 'అచింత్యశక్తి'ని, బలదేవవిద్యాభూషణులు మధ్వమతాంతర్గతమగు 'విశేషము'ను గ్రహించి భేదాభేదతత్త్వమును ఉపస్థాపిత మొనర్చిరి. మఱియు, అద్వైతులు, ఏ 'అర్థాపత్తి' ప్రమాణబలమున జగన్మిథ్యాత్వమును స్థాపించిరో, ఆ అర్థాపత్తినే గ్రహించి శ్రీజీవగోస్వామిపాదులు 'భేదాభేదము'ను నిర్వచించి యుండిరని గమనింపవలెను. వీరి మతమున 'తత్త్వమసి' అఖండార్థబోధకము కాదు. 'తత్త్వమసి'యన 'తస్య త్వమ్ అసి'.

సమాప్తి:


వైదికసూక్తములందు మందముగ నిక్వణితమైన భక్తితంత్రులు ఆళ్వారుల తీవ్రసాధనచే ప్రతిస్పందితములై, శ్రీరామానుజ, మధ్వ, వల్లభ, నింబార్కులచే మీటబడి, గౌడీయవైష్ణవదర్శనమను మధురరాగిణిగ రూపొందినవి; ఆళ్వారులయొక్కయు, శ్రీరామానుజునియొక్కయు ఆశాస్వప్నములు శ్రీచైతన్యదేవుని యందు సఫలీకృతములై, ఆసేతుహిమాచలము భక్తితరంగములను లేవదీసెను.

ఈ భక్తితరంగములయొక్కయు, నూతనవిజేతలగు మహమ్మదీయుల మతముయొక్కయు సంఘర్షణ ఫలితముగ ఉత్తరభారతమున జనించిన నానక్, దాదూ, కబీర్, సూరదాస్ మున్నగు మహాత్ముల జీవితమును, ఉపదేశములును ప్రణిధానయోగ్యములు. కేవలము మధురభావమునే ఆశ్రయించి ఉత్పన్నములో, లేక పరిపుష్టములో ఐన 'సహజియా', 'బాఉల్', 'కర్తభజా' మొదలగు 'ప్రకృతి సాధక'మతములను గుఱించికూడ ఇదే మాట.


వల్లభుడును, తదనంతరపు వైష్ణవులును శ్రీమద్భాగవతమును 'చతుర్థప్రస్థానము'గ గ్రహించి, తదితరప్రస్థానములకంటె దానికే విశేషమగు ప్రాధాన్యము నొసగిరి. కనుక వీని నన్నిటిని 'భాగవత దర్శనము' లనినను అనవచ్చునని నా అభిప్రాయము. అద్వైతులు శ్రీధరస్వామిటీకను ప్రామాణ్యముగ గ్రహించునట్లు, రామానుజసంప్రదాయమువారు వీరరాఘవీయటీకను, మధ్వులు విజయధ్వజటీకను, వల్లభసంప్రదాయమువారు సుబోధినీటీకను, నింబార్కమతస్థులు విశ్వనాథచక్రవర్తికృతమగు సారార్థదర్శిని యను టీకను, గౌడీయ సంప్రదాయమువారు జీవ, సనాతనవిరచితములగు క్రమసందర్భ, వైష్ణవతోషణి లను టీకలను ప్రమాణములుగ పరిగణించుచున్నారు.

గజపతి రనుకంప్యా సంపదా యస్య సద్యః
సమజని నిరవద్యః సాంద్ర మానంద మృచ్ఛన్,
నివసతు మమ తస్మిన్ కృష్ణచైతన్యరూపే
మతి రతిమధురిమ్ణా దీప్యమానే మురారౌ.


[సిద్ధాంతరత్నమ్]



మీ సౌందర్యమును కాపాడుకొనుడు



పాండ్స్ కోల్డ్ క్రీమ్: చర్మమును శుభ్రపరచి మృదువుగానుంచును. దినము రాత్రి, ప్రొద్దున ఉపయోగించుడు.



పాండ్స్ వ్యానిషింగ్ క్రీం: చర్మమును ఎండ, గాలి వీటినుండి రక్షించి మృదువుగా జేసి, పౌడరు బాగుగా పట్టునట్లు చేయును.

మీ భర్త, మిత్రులహాసమ్ముఖమునకు కారణము మీ ముఖసౌందర్యమేయని మీకు తెలిసిన మీరెంత సంతసింతురు. మనోహరత్వము తప్ప మరేదియు అతిస్వల్పకాలములో మెప్పు వడయజాలదు.

మీ చర్మముపై తగిన శ్రద్ధవహించిన అమోఘమైన దేహసౌందర్యమును పొందగలరు. ప్రతిదినము మీచర్మ రంధ్రములతో కూడిన మురికిని, నూనెను తీయుట మొదటిపని. సబ్బుతో కడుగుటమాత్రమే చాలదు. నిత్యము పాండ్స్ క్రీమును వాడుడు. చర్మమును శుభ్రపరచి మృదుత్వము గల్గించుటలో పేరుగన్నది. ఇది ప్రతిరంధ్రములోను పోయి మురికిని పూర్తిగా తీసి చర్మమునకు పువ్వుదళ మృదుత్వము, యౌవనము నిచ్చును.

పాండ్సు కోల్డ్ క్రీమును ప్రతిరాత్రి, ప్రొద్దున పట్టించుడు. చర్మముమీద వ్రేలితో క్రిందినుండి పైకి మెల్లగా రాయుడు. కొంతకాల మట్లుంచి తరువాత మృదువైనగుడ్డతో గాని, పాండ్స్ టిష్యూతో గాని శుభ్రముగా తుడుచుడు. మరొకసారి ఇదేవిధముగా చేయుడు. మీచర్మము ఎంత మేలుచెంది మృదువుగా ప్రకాశవంతముగా నుండునో మీరే చూడగలరు.

పగలు ఎండ, గాలి, దుమ్ము వీటినుండి రక్షణపొందుటకు పాండ్స్ వ్యానిషింగ్ క్రీమును ఉపయోగించుడు. ఏకొద్ది గరుకుదనమునుకూడాపోగొట్టి, పౌడరు చక్కగా అంటునట్లుచేసి, అందమును కలుగజేయును.

పాండ్స్ క్రీమ్స్

కోణార్క క్షేత్రము, కృష్ణమందిరము

[ఉన్నతి అవనతుల చరిత్ర, శిల్పసంపద చిత్రణము]

● శ్రీ భగవచ్ఛరణ పట్నాయక్ ●

జపాకుసుమసంకాశం కాశ్యపేయం మహాద్యుతిమ్,
ధ్వాంతారిం సర్వపాపఘ్నం ప్రణతోఽస్మి దివాకరమ్.

కోణార్కము పుణ్యమైన రవిక్షేత్రము; ఒక రసవంతమైన తీర్థప్రదేశము. ఇదే కృష్ణమందిరము (The Black Pagoda). ఉత్కళుల గౌరవ స్తంభము. శిల్పి - కళాశీవుల లోక కేళాశాలి. ఉత్కళులదే కాదు, విశ్వభారత కళామాలికకు మణిపూస. జాతీయోజ్జ్వలదీపిక. ఇది విశ్వకర్మసృష్టియా, లేక పండ్రెండువందల శిల్పుల కళాసైన్యమా! లేక సామాన్య శిల్పి బాలకుని కళాచిత్రమా! సరే. ఈ వృత్తాంతము తెలుసుకొనేముందు తీర్థయాత్ర లంటేనేమో, ప్రతిమా ప్రతిమోపాసనలంటే యేమో కొంతవఱ్ఱుకు తెలుసుకొందాము.

ప్రతిమోపాసన, తీర్థయాత్ర

తీర్థయాత్రలంటేనూ, ప్రతిమోపాసనలంటేనూ హిందువుల కెంతో ధర్మవిశ్వాసము. అన్ని ధర్మాలకంటె హిందూధర్మం మహోత్కృష్టమైంది. సహనశక్తియే దీనికి కారణము. ఈ ధర్మవిశ్వాసమందు పుట్టినదే ప్రతిమోపాసన. ఇక మందిరాల విషయమై వేరే చెప్పవలెనా? పాశ్చాత్యులకు చర్చి లెలాగో, మహమ్మదీయులకు మసీదు లెలాగో, మనకుకూడా మందిరా లంటే ఎంతో భక్తి, భయము, భ్రాంతి కూడాను. అందుకే వేలకొలది తీర్థయాత్రలు, కోట్లకొలది దేవుడిగుళ్లు! అటు వారణాసి, ఇటు మధుర కాంచీలు చూడండి: అటు నాసిక్, ఇటు పూరీ భువనేశ్వరములు చూడండి—ఎన్నో మందిరాలు, ఎన్నో ప్రతిమలు! అందుకోసమే మనదేశం పరదేశీయులకు వినోదస్థలం, మన దేవతలకు ప్రియనికేతనం.

ఇక—'ప్రతిమ' అంటేఏమి? మనము ప్రతిమ అన్నదానిని పాశ్చాత్యులు 'విగ్రహ'మంటారు. ఇదే ఇంగ్లీషున Idol. అంటే బూటకపుదేవు డన్నమాట (False God). అందువల్ల మనము ప్రతిమ అంటే విగ్రహం అనుకోకూడదు. ప్రతిమకూ విగ్రహానికీ ఎంతో తేడా వుంది. మన ప్రతిమ వాళ్లవిగ్రహంకంటె చాలా దివ్యమైంది. మనలది దేవాంశమైన ఒక స్వరూపము. సంస్కృతములో ప్రతిమ అనగా తుల్యతమరూపం, లేదా ప్రతిబింబం. "The embodiment of the Highest Being." అందుకోరకే హిందూధర్మానికి ప్రతిమలంటేనూ, అవతారాలంటేనూ, తీర్థాలంటేనూ, ధ్యానమంటేనూ ఎంతో ధర్మవిశ్వాసం! నమ్మితే దేవుడు, నమ్మకపోతే రాయి!

ఐతే దేవుడు నిరాకారుడు, నిర్గుణుడు గదా, ప్రతిమోపాసన ఎందుకు చేయవలెను? అంటే, ప్రతిమోపాసనవల్లనే హిందూధర్మం పవిత్రమైంది. నిర్గుణాకారుడగు దేవుణ్ణి తెలుసుకోవటం గొప్ప వేదాంతులూ, యోగులకు తప్ప సామాన్యజనసముదాయానికి అలవికాదనే ప్రతిమలను పూజింపవలసివచ్చింది.

అందరూ వేదాంతులూ యోగులూ ఐతే ప్రతిమలే అనవసరం. అందువల్లనే దేవుణ్ణి సగుణాకారుడన్నారు, బ్రహ్మ విష్ణు మహేశ్వరులన్నారు. ఇంకేవో చిన్నెలు వన్నెలు పెట్టి చిహ్నాలను కన్నారు. భక్తులు ఎన్నో విధాల పూజిస్తారు. ఆ ప్రార్థనలో, మైమరపులో తానారాధించిన దేవుణ్ణి తన ప్రతిమలో పెట్టుకుంటాడు. దీనినిబట్టే ప్రాణప్రతిష్ఠ (Infusion of life)' అధిష్ఠానము అని ఎన్నో వ్రతాలు చేస్తారు!

మనము చూస్తున్న ఈప్రకృతి, యీ ప్రపంచమంతా ఒక ప్రతిమాస్వరూపం. అనగా దేవుని ప్రతిబింబం. దీని కొక నిదర్శనం చూడండి. సూర్యగ్రహణంలో మన మెట్లా సూటిగా సూర్యుని చూడలేక ఒక పాత్రలో నీళ్లు పోసి ఆసూర్యుని ప్రతిబింబాన్ని చూడగలుగుతున్నామో, అట్లాగే భక్తుడు నిరాకారుడగు దేవుని గ్రహించలేక ప్రతిమారాధన చేసి, ప్రాణప్రతిష్ఠ పెట్టి, దేవుణ్ణి చూసి పవిత్రుడౌతున్నాడు.


ఐతే ఈప్రకృతికీ, ప్రతిమకూ, కళకూ సంబంధమేముంది? మానవహృదయం ప్రకృతిని ప్రతిబింబిస్తూ బహిరంగపరచి వ్యక్తీకరించేదే కళ. మానవుడు ప్రకృతిని చూస్తూ తనకూ,ఈప్రపంచానికీ వున్న అవినాభావ సంబంధాలను, సంపర్కాలను (influences), పోలికలను ఏనాడు కనిపెట్టాడో ఆనాడే మానవుడు కళాజీవుడయ్యాడు. ప్రకృతి కేవలం జీవశక్తులతో కూడుకున్న మందిరంవంటిది. అందునుంచే యీ జీవాంశాలుద్భవించి ప్రకాశిస్తున్నాయి. కనుక ప్రకృతి మన తల్లిదండ్రులని చెప్పకతప్పదు. అందుకే ప్రకృతి కేవలం మానవత్వం చెందింది. మానవునికీ ప్రకృతికీ వున్న సంబంధం ఎప్పుడు తేటతెల్లమైందో అప్పుడే మానవుని గుణగణాలన్నీ ప్రకృతినుంచి గోచరమయ్యాయి. ఇట్లు ప్రకృతికీ మానవునకూ గల సంయోగంనుండి పుట్టినవాడే కళాజీవుడు.

ఆ కళాజీవులే ప్రతిమలను మనకు ప్రసాదించారు. ఎంతో రసవంతంగా, చక్కగా చెక్కి స్థాపించారు. ఆ రసస్వరూపాన్ని చూసే భక్తుడు తన్ను తాను మరచి తన దేవునిలో కలిసిపోతాడు.

“అభిరూప్యాచ్చ బింబానాం
దేవః సాన్నిధ్య మృచ్ఛతి”

సులభసాధ్యమగు దేవారాధనయే ప్రతిమారాధన. తక్కిన దేశాల్లో ప్రతిమలు చూపులకోసం ఆర్టు గ్యాలరీలంటా అలంకరిస్తారు. ఈనాడు మన దేశంలో కూడా మన యిళ్లంటా, మ్యూజియములంటా దేవుని బొమ్మలను వినోదంకోసం అలంకరిస్తున్నాం! కాని ఆనాడు శిల్పులు మన వినోదంకోసం ప్రతిమలను స్థాపించలేదు. కేవలం భయభక్తులకోసమే. అది నేడు మనము తెలుసుకోలేకపోతున్నాము.

ప్రతిమోపాసన ప్రపంచంలో అన్నిచోట్లనూ వుంది. ఈజిప్టు, చైనా, అసీరియా, బేబిలోనియా, గ్రీసు—మొత్తంమీద అన్నిచోట్లా వుంది. మన దేశంలో సరేసరి. అది ఏకాలంనుంచి? కొందరు ప్రతిమోపాసనలో గ్రీకులను అనుకరించారనీ, మరికొందరు



కోణార్క క్షేత్రమునందలి కృష్ణమందిరము

బౌద్ధులనే అనుసరించారనీ అంటారు. కాని యిదంతా శుద్ధఅబద్ధం. ఇదేమో వేదకాలంనుంచీ వస్తోంది. పురాణాల్లోనూ, శిల్ప శాస్త్రాలంటా యీ ప్రతిమావర్ణనలు నిండివున్నాయి. పతంజలిమహాభాష్యం, కౌటిల్యుని అర్థశాస్త్రం, మహాభారతం, మనుధర్మశాస్త్రం యివన్నీ మనకు ప్రమాణం. గాంధార బౌద్ధకళ ప్రారంభం కాకమునుపే హిందువులు ప్రతిమోపాసన చేసేవారు.

ఇక తీర్థయాత్రలంటారా? మన దేశంలో మూడు వందల అరవైరైదురోజుల్లోనూ ఏదో ఒకయాత్ర, వుత్సవం జరుగుతూనే వుంటుంది. ఈస్థలాల్లో దేవుడి గుళ్లు, దేవుళ్లు నిండివుంటాయి. మధ్యమధ్యను దైవభక్తిగల రాజులు యీతీర్థప్రదేశాలంటా శిల్పులను నియోగించి ప్రతిమలు స్థాపించి వాటి ప్రాధాన్యతను యింకా పెంచారు.

తీర్థయాత్రలు విశ్వమానవ సౌభ్రాతృత్వానికీ, భావరుచులకూ, కళాపరిచయాలకూ, పుణ్యయోగానికీ ఎంతో ఉపకరిస్తున్నాయి.

౨


కాలనిర్ణయము

కోణార్కము చాల చక్కని సూర్యమందిరము. ఒరిస్సాలో గల మందిరాలన్నిటిలోను ఈమందిరము చాల రసవంతంగా, వినయ పుష్టితో, గంభీరంగా కనిపిస్తోంది. ప్రాచీన భారత గౌరవాన్ని కాపాడ గలచిన విజయస్తంభ మిదియే. ఇది ఇప్పుడు నిశ్శబ్ద నిర్జనప్రదేశంలో ఇసుకరాశుల్లో స్వప్నం కంటూంది. దీనినే అబుల్ ఫజాల్ వర్ణిస్తూ తన్మయుడయ్యాడు. ఆ సొంపు, ఆ దృశ్యం చూస్తే ఎవరి హృదయం ఆటాడి, పాటాడి శిలావేశమైపోదు! కారు కళలోతులు ముట్టిన మేటిశిల్పి ఎంత ఆధ్యాత్మికంగా, ఎంత రసవంతంగా కఱకురాయిమీద కళలను క్రీడింప చేశాడో! దర్శకుడు వుత్సాహపూరితుడై మందిరాన్ని చూడబోతాడు. కాని మందిర శిథిలావస్థను, కళాకాంతుల క్షీణదశను చూసి కంట తడిబెట్టి మరలివస్తాడు.

ఈ పుణ్యక్షేత్రము కలకత్తా – మదరాసుత్రోవ మధ్యలో వుంది. బి. యన్. ఆర్. ఖుర్దా జంక్షన్‌లో దిగి పూరీకి పోవలెను. అచ్చటినుండి ఈశాన్యదిక్కున సుమారు ౨౨ మైళ్ల దూరాన సముద్రతీరంలో వుంది ఇది. కరాళ కాలస్రోతంలో కోణార్క వైభవా లెన్నో మునిగిపోయాయి.

ఇంత చక్కని మందిరాన్ని ఎవరు కట్టారు? రాజులు లేరా, రాజ్యాలు గెలిచి మదోన్మత్తులై పాలించలేదా? వారేరీ! లేరు. కాని వాళ్ల కీర్తిజ్యోతులు మాత్రం సమ్రుగుల్లా శిథిలమందిరాలంటా మిణుకు మిణుకు తళుకబుకుమంటూ వెలుగుతున్నాయి. ప్రాచీన హిందూగౌరవానికి ఆమాత్రం చాలదూ? కోణార్క దశ అట్టిదే. ఈ మహోన్నతమైన కృష్ణమందిరాన్ని నిర్మించి పేర్గన్న రాజు లాంగులా నరసింహదేవుడు.

ఈ లాంగులా నరసింహదేవుడు రాజా అనంగభీమదేవుని కుమారుడు. మహాబుద్ధిశాలి. సూర్యభక్తుడు.



కోణార్క రథ చక్రము

అందుచేతనే ఇతడు కోణార్కమును క్రీ. శ. ౧౨౪౭ లో కట్టించాడు. నిర్మాణభారమంతా తన మంత్రి శివాయి సాంత్రాపైన పెట్టినాడు. మందిరం ఎత్తు ౨౩౦ అడుగులు. అనగా ౨౧౪ అడుగుల ఎత్తుగల పూరీమందిరం కంటేనూ, ౧౨౮ అడుగుల ఎత్తుగల భువనేశ్వరాలయం కంటేనూ అధిక మన్నమాట. దీనిని కట్టడానికి ౧౨౦౦ మంది శిల్పులు కావలసివచ్చి, ౧౬ సంవత్సరాలకాలం, ౪ కోట్ల రూపాయలు వ్యయమైందని చెప్పుతారు.

ఈ నిర్మాణంలో ఒక విచిత్రమైన పౌరాణిక గాథకూడా వుంది. దీనికే 'మైత్రేయవన'మని పురాణాలంటూ పేరుంది. ఉత్కళంలో ఇదే పద్మక్షేత్రం. సూర్య భగవానునికి ఇక్కడనే ఉపాసన జరిగేది. అదెట్లనగా: శ్రీకృష్ణుని కుమారుడగు సాంబుడు ఒకనాడు నీళ్ల రేవులో అభ్యంజనస్నానం చేస్తున్న స్త్రీలని చూశాడని తండ్రి అతనిని శపించాడట. తండ్రిశాపంవల్ల సాంబుడు కుష్ఠరోగ పీడితుడై యీ మైత్రేయవనంలో చంద్రభాగాతీరాన సూర్యారాధన చేసి రోగనిర్ముక్తు డయ్యాడట. ఆ పవిత్రతనుబట్టి సాంబుడు సూర్యప్రతిమను స్థాపించి యీమందిరాన్ని కట్టించాడట. మరొక విచిత్రం పద్మపురాణంలో వుంది. స్వయం సూర్యభగవానుడే యిచ్చట తపస్సు చేశాడనీ, అందుకే యీమందిరానికి పవిత్రత కలిగిందనీ చెప్పివున్నది.


ఒరిస్సాలోని పుణ్యక్షేత్రాల్లో శంఖక్షేత్రం (పూరి), చక్రక్షేత్రం(భువనేశ్వరం), గదాక్షేత్రం(జాజ్‌పూర్), పద్మక్షేత్రం (కోణార్కము) ప్రసిద్ధమైనవి. ఈ క్షేత్రం హిందువులకే కాదు, మహమ్మదీయులకు కూడా పుణ్యక్షేత్రమే. ఇచ్చోటనే భక్తకబీరుసమాధి వుండేనని అబుల్ ఫజల్ యొక్క 'అయినీ అక్బరీ' చెప్పుతోంది.

3

మందిరవర్ణన

ఈ దేవాలయం, ముఖసాల- రెండునూ పీఠంపైన రథంలాగు చెక్కివుంది. పీఠంలో ౨౪ చక్రాలు. ఒక్కొక్కచక్రం చూస్తే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. ముఖసాలసమ్ముఖంలో ఏడు గుఱ్ఱాలు. శాస్త్రోక్తంగా సూర్యభగవానుడు సప్తాశ్వరథారూఢుడై ప్రపంచంచుట్టూ తిరుగుతున్నాడు. అవన్నీ ఇప్పుడు అంతగాలేవు.

మందిరాలు సామాన్యంగా నాలుగురకాలు, ౧. భక్తిసూచకాలు, ౨. స్మారకాలు, ౩. రాజకీయాలు, ౪. సైనికాలు. పూరీ, భువనేశ్వరం, కోణార్కము, జుమామసీదు మొదలగునవి భక్తిసూచకములు. తాజమహల్, విక్టోరియా మెమోరియల్ హాల్ —ఇవేమో స్మారకాలు. దేవో ఆని ఖాస్, దేవో ఆనిఆమ్ — యివేమో రాజకీయాలు. ఢిల్లీ దుర్గం, బారపాటీ దుర్గం యివేమో సైనికాలు.



నాట్యమందిరమందొకభాగము

ఒరిస్సాదేవాలయాలు నాలుగురకాలు: రేఖ, భద్ర, ఖాఖారా, గౌరీయ. ఈ దేవాలయమున, పూరీభువనేశ్వరాలయాలును రేఖాదేవాలయాలు. కోణార్కము ఐదురథాల మందిరము. మందిరమధ్యభాగంలో సుచారు కారు ఖచితమగు సింహాసన మొక టున్నది. దానిపైన సూర్యభగవానుడు.

దేవాలయముతో పాటు మొగసాల ఒక తామరపూవు మీద చెక్కివున్నది. మొగసాలకు నాల్గువైపులా ద్వారాలు. ఆ ద్వారబంధాలను వర్ణించాలంటే యీచోటు చాలదు. ఎంతో చక్కగా లలితకళలాగు ఱాయిమీద సుత్తిపెట్టి చెక్కివున్నది. ఆ శ్రేణీలు, తామరపువ్వులు, లతలు—అవన్నీ చూస్తే కవిహృదయం నాట్యంచేస్తుంది.

మొగసాలసమ్ముఖాన మరొక స్వతంత్రపీఠం మీద 'నాట్యమందిరం' నిర్మింపబడివుంది. దీనిని కొందరు భోగమంటపమనీ, మరికొందరు 'నాట్యమంటపా'మనీ అంటారు. ఏది కానివ్వండి, ఇది చాలా అద్భుతమైనది. ఎచ్చటా అశ్లీలాలు లేవు. అన్ని వైపులా నర్తకులు బాజాబజంత్రీలతో దేవార్చన చేయటం కనబడుతోంది. ఆభంగిమలు యీనాటి భరతనాట్యకళా ప్రదర్శకులు అనుకరించటానికెంతో అనుకూలమని చెప్పవచ్చు. అంతే కాదు. ఈనాట్యమందిరం తామరపువ్వులతో నిండివుంది. ఒక్క నాట్యమందిర మేమిటి, కోణార్కములో సర్వత్రా శిల్పి—కళల తామరపూవులే. తామరపూవులో విశేష మేమున్నది? ప్రాచీనగ్రీకులకు, రోమన్లకు గులాబీ పూలంటే ఎంత ప్రియమో అట్లే మన భారతీయులకు జాతీయభూషణం పద్మపుష్పం. దేవార్చనకూ, భూషణానికీ ప్రాచీనులు యీపువ్వులనే వాడేవారు.

ఈ నాట్యమందిరందగ్గిఱగా ఒక పెద్ద బండఱాయి క్రింద పడివుంది. దానిమీద ఎంతో పెద్ద తామరపువ్వు చెక్కబడివుంది. పూవువ్యాసము ౫ అడుగులు. పూదళాలంటా అప్సరసలు 'గానాబజానా' చేస్తున్నట్లు కనిపిస్తారు. కేంద్రంలోకూడా ఒక చిన్న పువ్వు. దీనిలో సూర్యభగవానుడు సప్తాశ్వరథారూఢుడై ఆసీనుడైవుంటాడు. ఇరువైపులా పరిచారకులు. చేతుల్లో పువ్వులు. శిల్పి ఎంత సూక్ష్మంగా, రసవంతంగా చెక్కినాడో! ఈరాయి నాట్యమందిరం యొక్క గర్భముద్ర అని చెప్తారు.

మొగసాలకు ఉత్తరంవైపు కొంచెందూరంలో ఉన్న రెండు ఏనుగు విగ్రహాలు చూస్తే దర్శకుడు అవి నిజమైనవే అనుకుంటాడు. అవి ఎంతో స్వాభావికంగా కళ్లకద్దిచ్చినట్లు కారుకళతో విరాజిల్లుతున్నాయి. ఏనుగుపొడవు ౯ అడుగులు, వెడల్పు ౫ అడుగులు, ఎత్తు ౯ అడుగులు.

మొగసాలకు దక్షిణంవైపు విరాట్‌స్వరూపంతో రెండుగుఱ్ఱాలుండేవి. ఇప్పుడవి స్థానాంతరగతమై వున్నాయి. వాటి వీరావేశం, ఉన్మత్తభావాలను చూస్తే దర్శకుడు భయపడతాడు. అవి జీవకళతో తొణుకుతూంటాయి. ఎంతో సహజంగా, రమణీయంగా కనిపిస్తాయి. దీని పొడవు ౧౦ అడుగులు, వెడల్పు ౬ అడుగులు, నిడుపు ౪ అడుగుల ౮ అంగుళములు. ఝుంఝామారుతంవల్ల యీస్వరూపాలన్నీ యిప్పుడు వికృతంగా కనిపిస్తున్నాయి.

కోణార్కంలోని పెద్దదేవాలయపుసమ్ముఖంలో అరుణస్తంభ ముండేది. దానిని మహారాష్ట్రులు పూరీకి తీసుకపోయి, పూరీసింహద్వారమందు స్థాపించియున్నారు. అరుణుడు సూర్యుని రథసారథి. చేతులు జోడించి దేవుని ధ్యానంచేస్తున్నాడు. అందుకే దీనిని అరుణస్తంభ మంటారు.

ఇంకా వున్నాయి అచ్చోటనే ఎన్నో మందిరాలు, ఎన్నో ప్రతిమలు. ఈ క్షేత్రానినే ఉల్లేఖిస్తూ శివాజీ విక్రమకౌనవంలో (భువనేశ్వరం) "ఉత్కళదేశం దేవతల ప్రియనికేతన"మని శంఖు పూరించాడు.

రామచండీమందిరము;—ఇదే కోణార్క అధిష్ఠాత్రిదేవీమందిరము. దీనినే కొందరు బుద్ధుని తల్లియగు మాయాదేవిమందిర మంటారు. ఇంక కొందరు దీనిని రామచండిమందిరమని చెప్తారు. దీనిలోని ప్రతిమ ఇప్పుడు * 'లియాఖియా'లో వుంది. ఈ మందిరంకూడా కోణార్కమందిరంలాగు చిత్రవిచిత్రంగా కారుకలాపంతో సూక్ష్మంగా చెక్కబడివుంది. ఈవిషయమైన ఒక చిన్న స్థలపురాణం వుంది. కళాపహాడ్ కోణార్కముపైదండెత్తివచ్చినప్పుడు రామచండి

*లియాఖియా దేవాలయము దగ్గఱగానున్న ఒక కుగ్రామము.

మందిరాన్ని ధ్వంసంచేయ తలచినాడు. ఆదుస్థితిలో దేవి నీళ్లుతెచ్చే సెపాన చంకలో బిందె పెట్టుకొని లియాఖియాకు పోయింది. కళాపహాడ్ తుదకు నిరుత్సాహుడై దేవిని అన్వేషించటానికి బయలుదేరాడు. లియాఖియాలో దేవి లేలివుండటం చూసి ఎంతో పిలిచాడు. కాని లాభం లేకపోయింది. తుదకు కళాపహాడ్ సిగ్గుపడి ఆమందిరంమీద యిట్లు వ్రాశాడు:

"భోలా, రామొచాండీ, భోలారె
కొళాపహాహాకు దువారె బోసాయి
భోలాపాణి పాంయి గొలారె"

అంటే రామచండి దుదుకుతనంతో తన్ను ద్వారంలో కూర్చుండబెట్టి నీళ్లకోసం నదికి పోయి తిరిగి రాలేదని విసుగుపడి యీపద్యం వ్రాశాడు.

ఇంకా చూడవలసింది నవగ్రహాలు. ఈ శిలామాలికను బెంగాలుప్రభుత్వంవారు కలకత్తాకు తీసుకపోయి మ్యూజియములో పెట్టేనిమిత్తం శక్యప్రయత్నాలు చేశారు. "ట్రాం"బండి వేశారు. వేలకొలది రూపాయలు ఖర్చుపెట్టారు. ఈనాటి యింజనీరింగు ప్రభావాన్ని వినియోగించారు. లాభం లేకపోయింది. నే డిచ్చటనే వుంది. ఒక చిన్న మ్యూజియములో కదులకా మెదలకా, ఆకాశాన్ని చూస్తూ, ఎంతో నిరుత్సాహంతో కనిపిస్తున్నాయి. ఈ గ్రహాలు మనుష్యాకారంతో జీవకళలు చిమ్మేటట్టు మెరుస్తున్నాయి. తలలపై మకుటం, పద్మాసనం—ఆసొంపును చూసిన కొలది హృదయంలోని ఆనందం పొంగి పుబికి పోతుంది. ఈ నవగ్రహాలు మందిరముయొక్క శ్రేయస్సుకోసం నిర్మింపబడ్డాయని చెప్పవచ్చు.

ఇంకా యెన్నోమూర్తులు అజ్ఞాతావస్థలో పడి కాలగర్భాన దాగివున్నాయి. మరికొన్ని శిథిలావస్థలో చాలా వికృతంగా కనిపిస్తున్నాయి. ఈ మూర్తులన్నిటికీ ముఖ్యమైంది సూర్యప్రతిమ. తలపై మకుటం, చెవుల్లో కుండలాలు, కంఠంలో హారం, మెడలో జందెం, పాటిలో మువ్వలు, కటిప్రదేశంలో మేఖల, దానికింద గ్రంథిమాల—ఆఘటన మనోభావభంగిమలు ఎంతో స్వాభావికంగా జీవకళలు తొణకులాడినట్లు కనిపిస్తోంది. ఈ ప్రతిమనుకూడా కొందరు బుద్ధదేవుని విగ్రహమని భ్రమపడ్డారు.

ఈ పుణ్యక్షేత్రంలో మాఘసప్తమినాడు గొప్ప యాత్ర జరుగుతోంది. ఇంకా మరి కొన్ని యాత్రలు పూర్వం మహావైభవంగా జరిగేవి. ఈయాత్రల్లో ముఖ్యమైన యాత్రలు చైత్రయాత్ర, రథయాత్ర, చంద్రభాగాయాత్ర. రథయాత్రలు కేవలం బౌద్ధులే సృష్టించారనీ, హిందువులు వాళ్లనే అనుకరించారనీ కొందరు పండితులు చెప్పుతారు. కాదు. రథయాత్ర ఋగ్వేద కాలంనుంచీ వస్తోంది. హిందూదేవదేవీలందరూ రథాలనే వాహనాలుగా వాడారు. బుద్ధుని జన్మకుపూర్వం రథయాత్రలు మహావైభవంగా జరిగేవి. కాబట్టి రథాలు, రథయాత్రలు ప్రాచీనహిందువుల సృష్టియే.

రెండోయాత్ర చంద్రభాగ. ప్రాచీమాహాత్మ్యంలో అర్కతీర్థమే చంద్రభాగ. దీనినే 'ప్రాచీచిత్రోత్పల' అన్నారు. మాఘసప్తమినాడు చంద్రభాగాపుణ్యస్నానం. ఆనాడు సూర్యోదయం చాలా ఆశ్చర్యకరంగా వుంటుంది. సూర్యభగవానుడు మహోజ్జ్వలవేషధారియై, అనంతసాగరగర్భంనుంచి అకస్మాత్తుగా ఆవిర్భవించి చంద్రభాగాయాత్రికుల హృదయాల్లో అమృతకిరణాలను ప్రసరిస్తాడు. ఆ విచిత్రప్రకృతిదృశ్యాన్ని ఒకసారి చూస్తే యాత్రికుడు దానిని తన జన్మాంతంవరకు మరచిపోడు. బాలభాస్కరుడు తన అరుణకిరణసముదాయంతో ఒక్కసారి కోణార్కజీర్ణమందిరరేఖాపంక్తులను ముద్దిడి, యాత్రికుల జయజయధ్వానాల్లో తేజోవంతుడై తేలిపోతాడు. ఆరామణీయకంలో కోణార్క జీవచ్ఛవము పునర్జీవితమై దర్శకుల అశ్రుధారలంటా ప్రతిబింబిస్తుంది. ఈయాత్ర ప్రపంచంలో మరెచ్చోటా జరగదు. ఇచ్చోటి పుణ్యస్నానం సూర్యదేవుణ్ణి ఉద్దేశించి ఆరాధించుటయే.

"జననీ సర్వభూతానాం, సప్తమీ సప్తసప్తికే,
సర్వవ్యాహృతికే దేవి నమ స్తే రవిమండలే"

ఇప్పుడీకోణార్కములో సూర్యప్రతిమోపాసన లేదు. యాత్ర జరగదు. భోగరాగాదు లసలే లేవు.

ఈ మందిరపతనం తరువాత సూర్యదేవుణ్ణి పూరీకి తీసుక పోయారు. స్థానాంతరగమనంవలన భోగరాగాదులు బందై పోయాయి. కారణ మేమంటే—ఒరిస్సాతుది రాజు ముకుందదేవుని నిర్యాణానంతరం యవనులు యీమందిరాన్ని ఆక్రమించారు. ఆక్రమించారేగాని, కలశం, ధ్వజపద్మం తప్ప మరిదేనినీ నాశనం చేయలేక పోయారు. యవనస్పర్శవల్ల మందిరం అపవిత్రమైంది. భోగరాగాదు లందుకే బందై పోయాయి.

౪

మతభేదము

ముఖ్యమైన విషయ మేమనగా—ఈకోణార్కము బౌద్ధావశేష మానా, కాదా? ఈ విషయంలో చాలా మంది చారిత్రకులు తర్కించి తర్కించి ఎన్నో గ్రంథాలు పూర్తిచేశారు. అదంతా ఇచ్చట చర్చించే అవకాశం నాకు లేదు. ప్రధానాంశాలుమాత్రం తేట పరుస్తాను.

బౌద్ధధర్మం మన దేశంలో ఎప్పుడు పుట్టి, ఎలా తిరోహితమైంది? ఏనాడు బ్రాహ్మణుల ప్రభావ, ఔన్నత్యాలు మితిమీరాయో ఆనాడే బౌద్ధ ధర్మం పుట్టి పెరిగింది. అశోకుడు యీ ధర్మాన్ని అవలంబిస్తూ ప్రపంచంలో చాలాచోట్ల ప్రచారం చేశాడు. ఆనాటి రాజులు, సామంతులుకూడా బౌద్ధ ధర్మాన్ని అవలంబించారు. హిందువులు, మొత్తంమీద—బౌద్ధులు కానివ్వండి, బ్రాహ్మణులు కానివ్వండి—గొప్ప సహనశక్తితో యీ రెండుధర్మాలనూ సరిసమానంగానే చూశారు. ఐతే బౌద్ధధర్మ మెట్లా తిరోహిత మైంది? శంకరుని శైవధర్మ ప్రచారంవలన. కారణ మేమంటే—బౌద్ధధర్మానికీ, శైవధర్మానికీ ఎంతో భేదవిభేద ముంది. శంకరుడు సంపూర్ణఅద్వైతి. అతనికి బ్రహ్మమే సత్యం, జగత్తు మిథ్య. ఇక బౌద్ధధర్మమో? జగత్తు సత్యం, బ్రహ్మ మిథ్య. ఈమతవైషమ్యాన్ని బట్టి బౌద్ధధర్మం నశించిందంటే ఆశ్చర్యం కాదు. ఏమైనా, యూరోపులోలాగు మతాలకోసం రక్తాలు ధార పోయక, చరిత్రను కళంకపరచక హిందూధర్మం లోని మతాలు అవినాభావసంబంధంతో, సహనశక్తి తోనే మెలిగేవి.

కోణార్కము బౌద్ధావశేషమా? ఈచోటు దగ్గరనే హుయాన్‌త్సాంగుయొక్క 'చెలితోలా', లేక 'చిత్రోత్పలా' అనే బౌద్ధమతకేంద్ర మొక టుండేది. బౌద్ధయుగంలో కళింగరాజధాని 'దంతపురము' ఈ చిత్రోత్పలపేరే నంటారు. హిందువులూ, బౌద్ధులూ గొప్ప స్నేహభావంతో కలిసిమెలిసివుండేవా రని హుయాన్‌త్సాంగే చెప్పతాడు. ఆట్టిసంపర్కంవుందని కోణార్కము బౌద్ధులసృష్టియని చెప్పటంమాత్రం తప్పు. అలా చెప్పినప్పుడు, కోణార్కములో హిందూ ప్రభావం పునరుద్ధరింపబడినప్పుడు బౌద్ధమతం లోపించిందనికూడా చెప్పాలి.

మొదటే చెప్పాను కోణార్కక్షేత్రానికి మైత్రేయవన మని పద్మపురాణంలో వ్రాసివున్న దని. బుద్ధదేవుని మారుపేరు మైత్రేయుడనీ, పాళీభాషలో 'మితేయు'డనీ, ఆక్షేత్రాని కందుకోసమే మైత్రేయ వనమనీ కొందరు అర్థంచెప్పతారు. ఇది ఎంతమట్టుకు సమంజసమో కపిలసంహితయే చెప్పాలి.

కోణార్కములో 'అర్కవటము' ఉండేది. ఆ చెట్టుక్రింద మునులు తపస్సు చేసేవారు. దానిక్రింద వటేశ్వరుడుకూడా నేటివరకు పూజింపబడుతున్నాడు. కపిలసంహితనబట్టి ఆచెట్టుక్రింద స్వయం సూర్యభగవానుడే జపించాడని ప్రమాణం వుంది. అస్థలాన్ని కొందరు బుద్ధుని బోధిద్రుమముండే దంటారు. ఆచెట్టు క్రిందనే బుద్ధదేవుడు ౪౯ రోజులు నిరాహారదీక్షను పూని తపస్సు చేశాడట. అందువల్ల ఆమహాత్మునికి తత్వజ్ఞానం లభించిందట. ఇంకా అర్కవటం, కల్పవటం బౌద్ధుల బోధిద్రుమానుకరణంచేత హిందూ క్షేత్రాలంతటా ప్రతిష్ఠపొందిం దంటారు. చూశారా ఎంత ఘోరంగా తారుమారు చేశారో! బౌద్ధులకు పూర్వం ఈవటవృక్షాల మాహాత్మ్యం మన భారత దేశంలో లేదా? బుద్ధదేవుడే వటవృక్షంక్రింద తపస్సు చేశాడా? అతనికి పూర్వం మహర్షులను తపస్సు చేసింది లేదా? రామవనవాసంలో సీతాదేవి శ్యామ వట మను వటవృక్షమునకు పూజచేయలేదా?

మరొక విచిత్రం. హుయ్యాయన్‌సాంగు తన 'చెలితోలా' వర్ణనలో కోణార్కమువిూదుగా అయిదు బౌద్ధమందిరా లుండేవని చెప్పాడు. దానిని బట్టి ఒక చారిత్రకుడు కోణార్కముకూడా ఆమందిరాల్లో వొకటని చాలాజోరుగా దబాయించాడు. ఆదబాయింపును అతడు ఎలా సమర్థించుకొన్నాడంటే—కోణార్కమందిరం రథంలా వుంటుందనీ, రథం బౌద్ధుల ఆదరణీయ వాహనమనీ, సిద్ధుని రథాన్ని అనుకరించి ఇది కట్టబడిందనీ సమర్థించుకున్నాడు. ఇది ఎంత సమంజసమో వూహించాలి. రథయాత్ర విషయమై యింతకుముందే చెప్పాము. రథాలూ, రథోత్సవాలూ బౌద్ధులకు పూర్వం మహావైభవంగా జరిగేవి. పురాణాలనుబట్టి బౌద్ధులే అనుకరించారని చెప్పవచ్చు.

దీనితోనే సరిపోలేదు. కోణార్కమందలి సూర్య ప్రతిమను చూసి బుద్ధదేవుని విగ్రహమని భ్రమపడ్డారు. రామచండీప్రతిమను చూసి మాయాదేవివిగ్రహ మని పొరబడ్డారు. ఇదంతా పట్టి భ్రమ. పోనీ, బుద్ధమూర్తియే అయితే మంత్రాలు బుద్ధుని కుద్దేశించాలిగాని, సూర్యుని కేల ఉద్దిష్ట మవుతున్నాయి?

ఇంకా వుంది. కొందరు అమరకోశాన్ని బట్టి బుద్ధుని మారుపేరు అర్కబంధు వనీ, దేవుని పేరును బట్టి స్థలంపేరు కోణార్కమైందనీ అంటారు. నరసింహదేవుని తామ్రశాసనంలో ఈస్థలానికి "కోణాకోణా", లేదా "కోణాకమవమ" అని పేరుంది. బుద్ధదేవుని మరొక పేరు కోణాకమన మనీ, అందువల్లనే కోణార్కము బుద్ధదేవుని నామాంతరమగు స్థలమనీ అంటారు. ఈ పదగర్భిత మెంతవరకు నిజమో తెలుసుకోండి. ఇన్ని తిప్ప లేల? 'కోణార్క'కు సుభువైన, సమంజసమైన అర్థ మేమంటే?—"కోణ + అర్క = కోణార్క." పూరీక్షేత్రానికి North-East (ఈశాన్య) కోణంలోని అర్కదేవుని క్షేత్రంగనుక దీనికి కోణార్కమని పేరు. దీనినే రవిక్షేత్రమనీ, సూర్యక్షేత్రమనీ పురాణాలు చెప్పతాయి. ఐతే ఇది ఎట్లు బౌద్ధక్షేత్రమైంది? ఏదో కోణార్కములో బౌద్ధసంపర్కం, పలుకుబడి వుండొచ్చు. అదైనా అంతగా నమ్మటానికి అవకాశంలేదు.

ని

శిల్పకళ

ఫెర్గూసన్ అంటే శిల్పకళలో అసమానపండితు డన్నమాట. అతనే చెప్తాడు "కోణార్కము ప్రపంచంలోకల్లా అత్యంత సుందరమైన మందిరము (**Konarka is the most beautifully decorated Temple in the world**)" అని.

శిల్పకళ ఇంకా బ్రతికివుంది. భారతజాతీయ కల్యపంజరంనుంచి తొంగిచూస్తూ యింకా బ్రతికివుంది. ప్రపంచంలోకల్లా మహత్తరమైన మణిభూష, భక్తుల పుణ్యక్షేత్రము, రసికుల శృంగార శిల్పచాతుర్యము, కవుల కంఠాభరణమగు కోణార్కము ఇప్పుడు జరాజీర్ణమై ఎడారిప్రదేశంలో కొరముబ్బులు చూస్తూ కలలుగంటోంది. ఆ కొరుకళలోతులు ముట్టిన శిల్పులేరీ? సుచారు కారు ఖచితభూషణాదు లేవీ? అన్నీ యేమయ్యాయి? కరాళకాలగర్భంలో కప్పబడి వున్నాయి.

కోణార్కము **Indo - Aryan** (హైందవార్య) శిల్పశైలితో విరాజిల్లుతోంది. ఒక్క కోణార్కమే కాదు, ఉత్కళశిల్పమే **Indo-Aryan style**కు చెందినది. ఈ మందిరపీఠము స్వతంత్రప్రపోకడ. దీని ఆకారము, కళలే వేరు. దీనివిమానము, పార్శ్వమందిరము, మెంగపాల యివన్నీ తక్కిన మందిరాలకంటే వేరు. ఆ ఔన్నత్యము, గాంభీర్యము చూసినకొలది ఆశ్చర్యము కలిగిస్తుంది. భారతకావ్యాల్లో, గ్రంథాలలో, నాటకాల్లో, పురాణాల్లో యిటువంటి కారు-కళవర్ణనయే లేదు. నిజంగా ఆవర్ణన రాయిమీద సుత్తికొట్టి చెక్కవుందంటే ఎవరి హృదయము పొంగిపొరలదు? ఆ లతాలావణ్యము, పూలపూత, జీవజంతువుల శోభ, ప్రతిమల మనోహరత, నాగనాగినుల సొగసు వర్ణించతరమా? పువ్వులో పువ్వు, అందులో ప్రతిమ—శిల్పి ఎంతసూక్ష్మంగా చిత్రించాడో! ఇది చిత్రలేఖనమో, లలితకళయో చూడటానికి ఆశ్చర్యం కలుగుతుంది. శిల్పి మానవాతీతుడు. శిలాంతరాళాల్లో నరాలు మీటి కళాకాంతులను వెదజల్లాడు. భావభంగిమలు తేటతెల్లంగా వ్యక్తి

కరించాడు. నిరాకార నిర్గుణాలను దేవతలకు చమత్కారంగా మానవత్వాన్ని కల్పించి మానవత్వంయొక్క మాహాత్మ్యాన్ని బహిరంగపరచాడు. తనకుతానే సాటి. దీనిసే ప్రొఫెసరు హావెల్ వంటి పండితులు "యూరోపులోని ఉత్తమోత్తమకళాకృతులతో సరి తూలతూగగలవు" (They could equal the best achievements of European art) అని చాటారు. ఇంకా కొందరు కోణార్క వైభవాన్ని చూసి "ఒరిస్సా శిల్పకళయొక్క పరమావధి-రత్నం" (The Epitome and gem of Orissan Architecture) అన్నారు.

కోణార్క నిర్మాణకౌశలంలో ఎన్నో చిత్రవిచిత్రా లున్నాయి. ఈ మందిరము సముద్రతీరంలో వుంది. సమీపంలో యెక్కడా రాళ్లూ రప్పలూ లేవు. అట్టిచో అంతేసి పర్వతాలు మోసి ఎక్కడనుంచి తెచ్చి యిలా కట్టారో ఆశ్చర్యం! ఇక రెండోవిచిత్రం, అక్కడ పడివున్న ఇనుపదూలాలు. ఇవేమో మందిర నిర్మాణంకోసరం వుపయోగించారు. నిజంగా ఆ దూలాలనుచూస్తే గుండె కొట్టుకపోతుంది. ౧౭ టన్నుల బరువుగల ఢిల్లీఇనుపస్తంభాన్ని చూసే ఒక ఆంగ్లపండితుడు "అబ్బో! అనిదంపూర్వం" (Nothing heretofore.........equalled) అని నివ్వెరపడ్డాడు. ఇక ౧౦౭ టన్నుల బరువుగల కోణార్క ఇనుపస్తంభాన్ని చూసి ఏమయిపోవలసిందో! ఆచుట్టుప్రక్కల ఎక్కడా ఇనుపగనులు లేవు సరేకదా, చూదామంటే రాయి దొరకదు. అంత కౌశలంతో ఎట్లు పోసుచేసి ఎక్కడ నుండి తీసుకవచ్చారో! ఆరోజుల్లో స్టీముగాని, పవరుయంత్రాలుగాని లేవే! ఇదే చూసి హంటరు దొర ఆశ్చర్యపడి "వర్తమానకాలపు శిల్పి ఎంత సులువుగా, మెళుకువగా చీకె దూలాలను అమరుస్తాడో అంత సులువుతో, మెళుకువతో బ్రహ్మాండమైన ఇనుప దూలాలనూ, రాతిదూలాలనూ ఆకాలపు పనివాళ్లు ఉపయోగించారు" (Handled their colossal beams of iron and stone with as much ease and plasticity as modern workmen put up pine rafters—Hunter's 'Orissa'). ఆహా! ప్రాచీ శిల్పప్రభావము! ఆనాటి శిల్పులు యింకా యీ కోణార్కపు రాతిహృదయంలో సజీవులై వుండి ఉత్కృష్టకళానైపుణ్యాన్ని యీనాటికి కూడా తమ మూగనోళ్లతో చాటుతున్నారు.

౬

నిర్మాణ కౌశలము

కోణార్క నిర్మాణానికి రెండు రకాల గాథలు యింకా ఒరిస్సాలో వాడుకలో వున్నాయి. ఒకటి లాంగులా నరసింహదేవుమంత్రి శివాయిసాంత్రా—రామచండీ పరమాన్నంకథ. ఈకథ మాదలాపంచాంగంలో వుంది. రెండోది చాలా చమత్కారమైంది. ౧౨౦౦ శిల్పులు ౧౨ సంవత్సరాల కాలంలో యీ దేవాలయం కట్టారని ఇంతకుముందే చెప్పాను. అందులో ఒక ప్రధానశిల్పి ఈమందిరనిర్మాణంకోసం ఇంట్లో గర్భవతియగు భార్యను విడిచిపెట్టి కోణార్కమునకు పోయాడు. కొన్నిరోజు లయ్యాక ఆశిల్పికి ఒక పుత్రుడు జన్మించాడు. ఆపుత్రుడా డొకరోజు తోటిబాలురతో ఆడుకొనుచున్నప్పుడు పుత్రవాళ్లంతా "తండ్రిలేని పిల్ల"డని అతనిని హేళనచేశారు. దానితో వాడు చాలా సిగ్గుపడి కోపంతో తల్లివద్దకు పోయి, తన తండ్రి ఎవరో చెప్పమని నిర్బంధించాడు. తండ్రి కోణార్క మందిరనిర్మాణంలో పనిచేస్తున్నాడని చెప్పి తల్లి కొడుకుచేతుల్లో పోలి·కోసం లేసు బ్లు పెట్టి పంపించింది. పుత్రవాడు తండ్రిని వెదుకుతూ కోణార్కమునకు చేరాడు. అప్పటిసరికి ౧౨౦౦ శిల్పులు మందిరమంతా నిర్మించి పూర్తిచేయ లేకపోయారు. శిల్పులంతా నిరుత్సాహులై రాజావారి కఠినశాసనంకోసం భయపడ్డారు. ఆరాత్రి అందరూ పడుకున్న సమయం చూసి, శిల్పిబాలుడు స్వయంగా ఆమందిరము యొక్క ధ్వజాన్ని కట్టి పూర్తిచేశాడు. తెల్లవారాక శిల్పులు సంపూర్ణమందిరనిర్మాణాన్ని చూసి ఆశ్చర్యపడ్డారు. కాని తమ్మందరినీ రాజు చేతకానివాళ్లని దూషిస్తాడని, ఆపుత్రవాని తండ్రి కిట్లా ఆజ్ఞాపించారు:

"బారొశొహా బొడెయిరె దాయీ కి ఎకా పుఅరె దాయీ"

అనగా "౧౨౦౦ శిల్పుల పూచీయా, లేక ఒక్క కొడుకు పూచీయా?" అప్పుడు తండ్రి చాలా విచారా

వస్థలో పడి ఏమీ జవాబు చెప్పలేక, కుమారుడను శిల్పి చక్రవర్తిని ఆ మందిరశిఖరానికి తీసుకపోయి అక్కడ నుండి క్రిందకు జారవిడిచాడు. అంతటితో భావి భారతకళా స్తంభము ఒక్కసారి రక్తావనిలో కొట్టుకపోయింది. రక్తబలితో కోణార్క క్షేత్రము ప్రతిష్ఠ లేక అపవిత్రమై అధోగతిపాలయిందంటారు. ఇప్పటికీ యీవిషాదగాథ వేయినోళ్ల నలుగుతోంది.

౭


పతనము

కోణార్క పతనము! పతనమంటే గుండె జలదరిస్తోంది. ఆ నిర్మాణకౌశలము, ఆశోభ, ఆ కారుకళా కలాపము అదంతా యెక్కడికి పోయింది? ఆ మొగసాల, ఆ భూమణాగులు, ఆమందిరాలు ఏవీ? ఇంకా వున్నాయి భగ్నదశలో వికృతాకారాన్ని చూపిస్తూ. ఎన్ని గాలితుపానులో! ఎన్ని భూకంపాలో! ఎన్ని పిడుగులో! దయా దాక్షిణ్యం లేక భారతజాతీయ విజయ స్తంభాన్ని విరుగగొట్టింది. ఇంకా తనివితీరక ఆ కృష్ణ మణిని అజ్ఞాతంలో అణగద్రొక్కింది పతన మంటే అద్భుతం కాదా? కోణార్క శిఖరంపై వున్న నూదంటు రాయి ఆకర్షణమూ త్రాన ఓడలు విరిగిపడ్డాయని చెప్పి బాధసహించలేక హృదయం లేని పరదేశీయులు అంతటి గౌరవ స్తంభాన్ని విరుగగొట్టారు. లేక, కర్కోటకుడు కళాపహాడ్ కీర్తియా? లేక మహమ్మదీయనావికులే యీ కుత్సితబుద్ధిని వినియోగించి ఉత్కళకళామణిని వికలాంగపరిచారా? భక్తకబీరు పవిత్ర సమాధికూడా వుందని తెలుసుకోలేదా? పోనీ, దేవాలయం కడిగేనూ పేరు, విరుగగొడితేనూ పేరు!

సరే! కాలం కడుపు నిండింది. కోణార్క పతనం పూర్తి చెందింది. హిందూ దేవదేవీల దివ్యమందిరము, జాతీయ కాంతిసౌధము పోర్చుగీసుల ఆశ్రయ స్థలము నేడు నిర్జనప్రదేశంలో, నిబిడాంధకారంలో, అడవిమృగాల భయాకులంలో ముక్కముక్కలై మొండిబ్రతుకింకా బ్రతికివుంది. అంతే చాలు. భారతీయుల దాస్యవృత్తికి, ఘోరకారాగార నరకమునకు ఆ జీర్ణ విజయచిహ్నమే చాలు. ఆ గుడ్డిదీపమే వెలుతురు!



కొలంబో నౌకాశ్రయము, సిలోను



౧. మన మహాభాగ్యం

ఈ ఇరవయ్యోశతాబ్దం మానవజీవితచరిత్రలో మిక్కిలి ప్రసిద్ధమైంది. ఇటువంటిఘట్టములో మనం జన్మించి, జీవయాత్ర గడపగల్గటం నిజంగా మన మహాభాగ్యం అని కొంతవరకూ చెప్పొచ్చు. మనం ఇంకొకకాలంలో జీవించివుంటే, దానితో పోల్చి చూచుకుని ప్రస్తుతజీవితంయొక్క ఘనతను ద్విగుణీకృతంగా మెచ్చుకోగలిగేవాళ్లం. మానవజీవిత పరిణామమును ఎంతశ్రద్ధగా చదివినా పూర్వం ఎప్పుడూ — ఆఖరుకి ఒకవందసంవత్సరాలకు పూర్వంకూడా — ఇప్పుడు మనం చూస్తున్న, అనుభవిస్తున్న విషయాలు తెలిసినట్లు గోచరించదు. అందాకా ఎందుకు, ౫౦ సం. కాలంక్రిందట చనిపోయిన మనపూర్వీకుణ్ణి ఎవరినైనా మనకు శక్తివుండి తిరిగీ ఈలోకంలోకి తెచ్చుకోగల్గితే ఆయన మన అదృష్టానికి మహాఈర్ష్య చెంది, తలక్రిందులుగా తపస్సుచేసైనాసరే ఈయుగంలో నిండా నూరేళ్లుబతకాలని ఆశిస్తాడు.

ఇది నిర్మాణయుగం. దినదినం ఏదో ఒక క్రొత్త విషయం ఏదో ఒకదేశంలో కనిపెట్టబడి ప్రపంచమంతటా, మానవజాతికంతకీ సంభ్రమానందాలు కల్గజేసేందుకు పుట్టుకువస్తున్నది. ఈ విజ్ఞానాలు మనకు సర్వసాధారణమైపోవటంచేత అబ్బురపడి అబ్బురపడి మనశక్తి అంతరించిపోయింది. ఇకమీద వచ్చే అద్భుత విషయాలనుగూర్చి ఆశ్చర్యపడలేని స్థితిలో వున్నాం.

వెనుకటిరోజుల్లో శాస్త్రజ్ఞులు సాధించగల క్రొత్తవిషయాన్నిగురించి చెప్పితే నవ్వి, వెక్కిరించేవాళ్లం. ఈరోజుల్లో అలా కాదు. ఈరోజువ ఎవరన్నా వచ్చి కొద్దిరోజుల్లో ఘంటకు వెయ్యిమైళ్లవేగాన తారామండలంలో సంచరించగల వాహనం కనిపెట్టబోతున్నారని చెప్పినా మాట్లాడం. నిజమే కావచ్చు అనుకుని ఊరుకుంటాం. ఎందుకంటే, ఇదివరలో మనం నవ్వి పారేసినవిషయాలు ఎన్నో నేడు మనకళ్ల ఎదుట సాక్షాత్కరిస్తున్నాయి. గట్టిగా పరికిస్తే ఈ అద్భుత నిర్మాణాలన్నీ ఒకదానితో ఒకటే పోటీవేసుకుని మనకు అపూర్వసౌఖ్యానుభవం ఇచ్చేందుకు మనపాదాలసన్నిధికి వచ్చిపడుతున్నాయా అనిపిస్తుంది. నిజంగా వాటిని అనుభవించే భాగ్యం మనకే వుంది. అది మన ఒక్కరికే హక్కు. ముమ్మాటికీ మన మహాభాగ్యం. మనము ప్రాచీనమైన మన పురాణాల్లో పుక్కిటికథలుగా విన్నవి ఎన్నో మన కళ్లముందు నేడు జరగటం చూస్తున్నాం. పురాణాలను పూచికపుల్లవలె చూచాం. నేడు పాశ్చాత్యశాస్త్రవేత్తలు తమపరిశోధనలవల్ల నిజంగా మనకళ్లు తెరిచారు. మన ప్రాచీననాగరికతలో మనకు కొంచెంగా నమ్మకం కల్గించారు. అందుకు నిజంగా వారి నభినందించాల్సిందే. అయితే, ఆశాస్త్రపరిశోధనే నేడుమానవజాతి మారణహోమానికి ఘృతాభిషేక మైంది. ఐరోపాఖండంలో నాగరికతా, స్వాతంత్ర్యముల పేరుమీద లక్షలాదిప్రజలు — అమాయకులగు స్త్రీ, శిశు, వృద్ధులు — దారుణంగా బలి ఔతున్నారు. ఈ తప్పు శాస్త్రముది కాదు. శాస్త్రవేత్తలది అంతకుముందే కాదు. ఆ నిర్మాయంత్రాలను దుర్వినియోగంచేసే అహంకారపూరితులది.... ఒక్కక్షణం యోచిస్తే ఆశాస్త్రజ్ఞుల ప్రతిభకు మాత్రం మనం తప్పక జోహారు చెయ్యాల్సిందే. ప్రస్తుత బీభత్సంమాట అటుంచితే, సాధారణ శాంతియుత మానవజీవితంలో పారిశ్రామిక, వ్యావసాయిక, వైద్యాదివిషయములలో ఆధునికశాస్త్ర పరిశోధన ఎంత సహాయకారిగా ఉన్నదో నిరూపించడమే ఈ

వ్యాసావళి యొక్క ఆదర్శం. అయితే శాస్త్రజ్ఞులు ప్రకృతిమీద విజయం సాధిస్తున్నామని ఎంతకాలం గర్విస్తారో అంతకాలం వారి పరిజ్ఞానం కళంకితమైందే. వారి పరిశోధనలవల్ల ప్రకృతిరహస్యాలను, ప్రకృతి మహత్తును ఇతోధికంగా తెలుసుకోగలుగుతున్నామని గుర్తించిననాడే వారూ, వారి నిర్మాణ పరిశోధనలూ ధన్యత్వం చెందుతాయి. ఈ పరిశోధనలవల్ల కలిగే వెలుగునుగూర్చీ, మానవుడు జీవితపరమార్థానికి వీటివల్ల ఏవిధంగా దూరమౌతున్నదీ ఆఖరు అధ్యాయంలో మనవి చేసుకుంటాను.

౨. విడ్డూరాలకు విరామం లేదు

ఈమధ్య బాదంకాయలు పండించే ఒక పెద్ద సంస్థకు వేనవేలకాయలను, కురిడీలు విరిగిపోకుండా, ఒలిచే సాధనం కనిపెట్టాల్సిన అవసరం ఏర్పడింది. వ్యవసాయకళాశాలల్లో కృషిచేసే శాస్త్రవేత్తలు ఆ సంస్థకొకయంత్రాన్ని తయారుచేసి ఇచ్చారు. ఈ కాయలు ఒక రంపము ప్రక్కనే తిరుగుతూండే బెల్టుల మీద గిరగిరా తిరుగుతూంటాయి. ఆరంపం డిప్పల మీద గీటు పెట్టుతుంది. అలా గీట్లు పెట్టిన కాయలు ఒక చిన్నరంధ్రంప్రక్కనుంచి ఒక్కటొక్కటే పోతాయి. ఆ రంధ్రంలోనుంచి ఒకవిధమైన వాయువు (Gas) వచ్చి బద్దలు విడిపోయేటట్లు దెబ్బకొడుతుంది. వెంటనే కాయపగిలి పప్పులు విడిగాను, డొల్లలు విడిగాను పడిపోతాయి. ఇలా కొట్టినకాయల్లో నూటికి ౯౦ వంతు కురిడీలు చిరగకుండా వస్తాయి. చేత్తో కొట్టి ఒలిస్తే ఎంత చాకచక్యంగల మనిషి కొట్టినా నూటికి ౭౦ మాత్రమే నిండుకురిడీలు వచ్చేవి.

ఇటీవలనే మొట్టమొదటి నిస్తంత్రీవార్తాపత్రిక (Wireless-Newspaper) అచ్చయింది. ఒకమామూలు రేడియో రిసీవింగు సెట్టుకే అక్షరాలు కూర్చే పరికరాలు కొన్ని తగిలించి ఉంటాయి. రేడియో స్విచ్ చేయగానే వివిధప్రదేశాలనుంచి వచ్చే వార్తలు, ప్రకటనలు, చిత్రాలు అన్నీ శీర్షికలతో సహా అచ్చయిపోతాయి. ఇందులో వాడేది మామూలు వార్తాపత్రికలలో వాడే అచ్చులే (types). ౧౫ అంగుళములపొడవు, నాలుగుకాలముల వెడల్పు గల ఒక్కొక్క పేజీ ఈపద్ధతిని ౧౫ నిముషాల్లో తయారౌతుంది. ఈ పేజీలుకూడా మామూలు వార్తాపత్రికలను మడిచే లాగున మడిచేందుకు వీలుగా అచ్చుపోతాయి. స్విచ్ వేసి ఉంచితే చాలు, అచ్చుపోతున్నంతసేపూ మనిషి అక్కడ ఉండాల్సిన అవసరం లేదు. అవతల ప్రసారం చెయ్యటం అయిపోగానే అచ్చువెయ్యడంకూడా ఆగిపోతుంది.

అణువు (Atom) అనేది వస్తుస్వరూపంలో అతిసూక్ష్మమైన భాగమనీ, వాటికంటె కొంచెం పెద్దవి కణములు (Molecules) అనీ, అవి మనకంటికి కనపడవనీ శాస్త్రజ్ఞులు చెపుతారు. ఈమధ్యనే ఒక అద్భుతమైన సూక్ష్మదర్శని (Super-microscope)ను కనిపెట్టారు. ఇందులో వెలుతురుకుమారుగా ఎలక్ట్రాన్సును ఉపయోగిస్తారు. భూతద్దానికి మారుగా ఒక 'ఆకర్షణక్షేత్రం' (Magnetic field) ఉపయోగిస్తారు. అతిసూక్ష్మాలైన అణువులు ఇందులో ఒక్కొక్క అంగుళంవ్యాసంగల గోళాలుగా కనుపిస్తాయి. వాయువులలోని కణాలు, వాటిప్రవాహం విపులంగా గోచరిస్తుంది. వ్యాధివాహకాలైన క్రిములు అతి వివరంగా కనిపిస్తాయి. మంచిశక్తిగల సూక్ష్మదర్శనియంత్రాలకు కూడా ఇంతవరకు అందక వైద్యశాస్త్రజ్ఞులను కంగారుపరుస్తున్న విషక్రిములుకూడా ఇక మీద అతిసులభంగా దొరికిపోతాయి. వాటిని సంహరించే ఔషధం అంతకంటె శీఘ్రంగా కనిపెట్టుతారు. కనుక వ్యాధితో వైద్యులపోరాటం ఇదివరకుకంటె ఎంతో జయప్రదంగా ఉండవచ్చు.

ఇప్పుడు భూప్రదక్షిణం ౧౫ రోజుల్లో చెయ్యవచ్చు. కరాచీలో బయలుదేరి ఢిల్లీ, కలకత్తా, రంగూను, పెనాంగ్, బాంకాకు, హనాయి, హాంకాంగ్, మానిలా, హోనొలులూ, సాన్‌ఫ్రాన్సిస్కోలమీదుగా న్యూయార్కు, మళ్లీ అక్కడనుండి ఇంగ్లాండు యూరపులమీదుగా కరాచీకి తిరిగి రావచ్చు. ఈ ప్రయాణం అతిసులభమైనదే కాకుండా అట్టే ఖర్చుతో కూడింది కూడా కాదు. మూడువేలరూపాయలు మనవి కావనుకుంటే సరి. ఒక్కసారి భూప్రదక్షిణం చెయ్యొచ్చు.

[పు. వెం. సు.]

లేఖలు

సాయణభాష్యపర్యాలోకనానంతరము (II)

మార్చిసంచికలోని "సాయణభాష్య పర్యాలోకనము" (II) చదివినాక సందేహాలు చాలా బయలుదేరినై. నేను సాయణుల భాష్యాన్ని ఆరు ఋక్కులలో త్రోసివేసినా ఆ విమర్శకులు కొంచెమే త్రోసివేయగలిగినారు.

వేదాల కాలానికీ, బ్రాహ్మణాల కాలానికీ మధ్య కొన్ని శతాబ్దాలు గడచిపోయినై. అంతే కాకుండా ఋగ్వేదకాలానికీ యజుర్వేద కాలానికీకూడా చాలా వ్యవధి ఉన్నట్లు కనబడుతున్నది. యజుర్వేదము బ్రాహ్మణాలు యాజ్ఞికగ్రంథాలు. ఋగ్వేదంలో యజ్ఞసంబంధక విషయాలున్నా ముఖ్యంగా అది ఒక కవితాగ్రంథం. అలాంటప్పుడు ఋగ్వేదార్థం చెప్పే సందర్భంలో బ్రాహ్మణాలను, ఆరణ్యకాలను, స్మృతులను తీసికొనిరావటం గొప్పపొరబాటు. ఈపొరబాటే మన వ్యాఖ్యాతలను కొన్నిచోట్ల చాలావరకు తప్పుదారిలోకి తీసికొనివచ్చింది.

ఇలాంటి వ్యాఖ్యానమే ౧౧౪-వ సూక్తంలోని మాధుర్యాన్ని చాలావరకు మాపుచేయటానికి తోడ్పడింది.[1] అదీగాకుండా ౧-౯౫ లోని "సర్వతాతి" శబ్దానికి యాస్కుడు "సర్వాసు కర్మతతిషు" అని వివరణమిచ్చినాడు. దీనికి సాయణులు "యాగేషు" అని తోక తగిలించారు. కాని ఇది "సర్వ" శబ్దంతో కూడిన సమాసం కాదు. తాతిప్రత్యయంతో కూడిన Derivative ఇది. Cognate భాషలు పరిశీలిస్తే ఈ సంగతి తేలుతుంది. అవెస్తాలోని "హౌర్వ-తాత్", గ్రీకుభాషలోని "ఓహలో - తేత్", లాటినులోని "యువెక్ - తాతి" శబ్దాలు "పూర్ణ"మైన అర్థంలో ఉపయోగింపబడ్డై. అందుచేత ఇక్కడ సర్వశ్రేయస్సు అనిగాని, పూర్ణమైన అనిగాని తీసికోవాలి. కాబట్టి ఋగ్వ్యాఖ్యానావసరంలో బ్రాహ్మణాలను, గీతలను తీసికొనిరావటం తత్త్వావధారణానికి తోడ్పడదు; తగాదా పెంచటానికి తప్ప.

"త్రసోద్యాన:" అనే సూక్తవివరణంలో సాయణుల వ్యాఖ్యను, స్కందస్వామివ్యాఖ్యను సరిగా పరిశీలిస్తే భేదం బోధపడగలదు. ఆవిషయం ఈవరకే వివరించటంచేత పాఠకులను ఆ పేజీల నింకొక మారు సావధానచిత్తంతో చూడవలసిందని కోరుచున్నాను.

"సుదంసస:" అని మూలంలో "దస్ దర్శన దంసనయో:" అని ధాతువు కనబడుతూండగా, సాయణులన్నారుగనక "కర్మనామ" అని తీసికోమంటం వ్యాకరణవిరుద్ధమౌతుంది. విరుద్ధమైనా ఫరవాలేదంటే అలాంటివారితో నే చర్చింపజాలను.

సవితృసూర్యులు భిన్నదేవతలుగాని, ఒకే దేవత పేరు గాదు. పురుషోత్తముగారు వేదం తర్వాత వేదంగా అంగీకరించే సాయణులుకూడా "మూర్తిభేదం చేత గంతృగంతవ్యభావ్యం" ఈ దేవతలకు తీసుకోవాలన్నారు. సూర్యసవితలకు శరీర శరీరిసంబంధమున్నది. అంతేగాని వారొక్క దేవతే గాదు. అలా కాక వారిద్దరూ ఒకదేవతే ఐతే సవిత సవితకు (లేక సూర్యుడు సూర్యునికి) మార్గం చూపిస్తున్నాడనాలిసుంటుంది ![2]

మరుత్తులకూ విష్ణువుకూ, ఇంద్రునకూ ఎంత దగ్గర స్నేహముందో జనవరిసంచికలోనే వివరించటమైనది. అక్కడే ఇంద్రశబ్దపర్యాయంగా వృషణ శబ్దాన్ని తీసికోవటంలోని ఔచిత్యం వివరించినాను. మదచ్యుతశబ్దం చాలా స్థలాల్లో ఇంద్రవిశేషణంగా కనపడుతుంది. ఇంద్రుడు కొన్నిపీపాల సోమం తాగి తూలిపోతూ ఉండేవాడు. అలాంటప్పుడు ఈశబ్దం ఇంద్రవిశేషణం కావటమే సబబుగా ఉంటుంది.

---

1. భండార్కరుగారి కర్పించిన వ్యాససంపుటిలో మెక్డానెలుగారు వచించిన విషయము.

2 "సవితా వేతి సూర్యం" అని మూలం.

సాయణులు చెప్పే "కామాభివర్షకత్వం" ఇంద్రునకున్నదా, లేక స్వయంగా ఫలప్రదానశక్తి హీనమైన యజ్ఞానికా? ఇచ్చట యౌగికార్థ విచారణమే ఇంద్ర శబ్దాన్నికూడా చెప్పుతుంది. దీనిని ఋగ్వేదం తర్వాత కొన్ని వేలసంవత్సరాల పిమ్మట గీతలు, బ్రాహ్మణాలు మార్చలేవు. అవి మార్చగల వనుకుంటే Comparative Cognate భాషలమీద, Mythology మీద, వ్యాకరణంమీద, కవిత్వంమీద ఆధారపడే ప్రస్తుత కాలపు పరిశోధనల్లోనూ, వ్యాఖ్యానాల్లోనూ అలాంటి ఊహాలు చెల్లవు. అవి కేవలం విమర్శ ఎలాగైనా చేదామనే బుద్ధితో వచ్చినవి. "యేనకేనా ప్రకారేణ" అనే న్యాయానుమ్యాతాలు.

యుద్ధాలు ఆ కాలంలో ముఖ్యంగా చేసింది కీర్తి కోసంగాని, అన్నాన్ని గురించి గాదు. మొన్న మొన్న క్రీస్తుపూర్వం గ్రీకులో జరిగిన యుద్ధాలుగూడా చాలా వరకు కీర్తి నుద్దేశించే. ఇతర భాషల్లోని శ్రవశ్శబ్దం Cognates కూడా కీర్తిఅనే అర్థమిస్తై.

"త్వష్టా యద్వజ్రం" అనే సూక్తం విమర్శిస్తూ మళ్లా ఋగ్వేదభిన్నగ్రంథాలతో వ్యాఖ్యచేసి వాటిని నమ్మమంటే, మూఢంగా విశ్వసించలేము. ఋగ్వేద మసలు కవితాసంపుటి. దాన్ని వ్యాఖ్య చేయటానికి యాస్కగ్రంథాలు తీసికొనివచ్చి సాయణులను సమర్థించకపోయినందువలన వేదమంతా చదివారా, లేదా అని ప్రశ్న వేశారు. దీనికి సమాధానము నేను వారి ప్రశ్నను తిరిగి చెప్పటంలోనే ఐపోతుంది. అర్థం కుదరదని సిద్ధాంతాలు ప్రబలిపోతే "ఆవర్తయత్" శబ్దానికి "ప్రాయచ్ఛత్" అని అర్థం చెప్పుకుంటాము. అంతేగాని కాలోగా చెప్పుకోజాలము. చూస్తూ చూస్తూ మంచిబెల్లాన్ని గోమయ మనలేము. అందుకనే ఆలోచించి ఏపనన్నా మొదలెట్టాలని పెద్దలన్నారు.

పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి

"చిన్న సవరణ"

శ్రీ కొంకారు వీరరాఘవాచార్యులు గారి జిజ్ఞాస (ఫాల్గున భారతిసంచిక పేజీలు 382-383)కు నే నెంతయు కృతజ్ఞుడను. జనవరిసంచికలో "త్వష్ట చివరకు ఇంద్రునిచేత చంపబడినా"డని ప్రమాదవశమున వ్రాసినాను. త్వష్టకుమారుడైన విశ్వరూపుడు ఇంద్రునిచే హతుడైనాడనీ, అందుల కాగ్రహించి ఇంద్రునకు సోమపానార్హత లేకుండా చేయాలని త్వష్ట చేసినాడనీ, కాని విఫలమనోరథుడైనాడనీ మాత్రం కనపడుతుంది. వ్రాసినదానిని తిరిగి చదివి చూచుకొనకపోవుటచే ఈప్రమాదము సంభవించినది. కాబట్టి శ్రీ ఆచార్యులు గారిని, పాఠకులను క్షమింపమని కోరుచున్నాను.

అక్కడ నే వ్రాయదలచిన విషయము : త్వష్ట కేవలం శిల్పి ఐనా, జీవరాశికి రూప మిచ్చినా, ఆది పురుషుడైనా, కొన్నిస్థలాల్లో ఇంద్రాదులకుగూడా తండ్రిగా పేర్కొనబడ్డా, ఇంద్రునిచేత చివరకు అధః

వశికిపోయినాడు..." అని భావము. ఇంద్రుని స్వారాజ్యసార్వభౌమత్వమును ఈవిధంగా చూపించారు.

అందుచేత జనవరి సంచికలోని "చివరకు ఇంద్రునిచేత త్వష్ట చంపబడ్డాడని కొన్ని ఋక్కులలో చెప్పబడింది" అనే వాక్యానికి బదులు "చివరకు ఇంద్రునిచేత త్వష్ట అధఃకరింపబడినాడని కొన్ని ఋక్కులలో చెప్పబడింది" అని దయచేసి దిద్దుకొనవలసిందని కోరుతున్నాను.

పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి

సామరస్య-వైరస్యము ?

ఆనందతీర్థనామా సుఖమయధామా యతిర్జీయాత్,
సంసారార్ణవతరణిం యమిహ జనాః కీర్తయంతి బుధాః.
—ప్రమేయరత్నావళి.

మార్చిభారతిలో శ్రీకాసూరి వ్యాసమూర్తిగారు నా 'స్వతంత్రాస్వతంత్రవాదము' అను వ్యాసము నందలి కొన్నివాక్యములను ఇతస్తతముగ గ్రహించి, నిరసించియుండిరి. ఈ యత్నము కేవలము విద్యావిషయకమై, యథార్థతత్త్వజిజ్ఞాసా, తత్ప్రచారార్థమైనచో నాకును, పాఠకులకునుగూడ ఉపయోగించియుండెడిది. అట్లుగాక, వారు నన్ను నిరసించు అభిప్రాయముతోడనే లేఖనిని గ్రహించినట్లు తోచుచున్నది (ఇది వారి అభిప్రాయము కానిచో క్షంతవ్యుడను). ఈ వ్యాసము ఎట్టి ప్రయోజనము నుద్దేశించి లిఖింపబడినదో దురవగాహముగా నున్నది. విజ్ఞానతృష్ణను దీర్చు క్రొత్తవిషయము లేవియు తెలుపబడలేదు.

శ్రీమధ్వాచార్యుల జీవితప్రసంగమున నే నుల్లేఖించిన విషయములలో ఎనిమిదింటిని ఉల్లేఖించి, అయ్యవి సత్యదూరములును, మదీయ 'అసహిష్ణుత్వ' పరివ్యంజకములును అని తేలికగ ఒక్కమాటలో తేల్చివైచిరి. ఆ అంశములు సత్యదూరములైనయెడల, యథార్థవిషయముల నుల్లేఖించుచు, శ్రీమధ్వాచార్యుల జీవితమును సంక్షిప్తముగ వ్రాసి, ప్రస్తుతవ్యాసమునకు ప్రత్యేక ప్రకటించిన శోభనీయముగను, విజ్ఞానప్రదముగను, ఉపకారకరముగను నుండెడిది.

ఇం దసలుకు అసహిష్ణుత్వమునకు తావేమున్నదో తెలియజాలకున్నాను. బహుశః, ఇవి మధ్వాచార్యులవారి మహత్త్వమును కొంచెపరచుచున్నవనుకొని వ్యథనందినవారేమో? ఇవి అట్టి ఉద్దేశ్యముతో ఉటంకింపబడియుండలేదు. ప్రచలితములగు మధ్వాచార్యుల జీవితచరిత్రలనుండియే వీనిని సంగ్రహించితిని. నాస్వకపోలకల్పితములు కావు. ఏయేగ్రంథముల నాధారపరచుకొనినది, నావ్యాసమును జదువ విస్పష్టమగుచునే యున్నది. ఆయాగ్రంథముల ప్రామాణ్యమును సహేతుకముగ ఖండించి, యథార్థపూర్ణమగు జీవితమును రచించుట ప్రాజ్ఞత. అసహిష్ణుత్వముతో నిట్లు వ్రాసితి నంట విజ్ఞతయా?

మఱి, నేను "మధ్వాచార్యులు సుమారు ముప్పది నాలుగుగ్రంథములను విరచించిరి" అనుటకూడ ఆయన మహత్త్వమును కొంచెపఱచుటకేనా? నాకు లభించిన గ్రంథనామములను పేర్కొంటిని; మఱియు, 'సుమారు' అని జాగ్రత్తపడితినికూడను. ముప్పదిఏడు గ్రంథములైన,ముప్పదిఏడు-నాలుగులకు ఎంతప్రభేదము! ఆమూడుగ్రంథముల నామములను ప్రస్తుతవ్యాసకర్తలు పేర్కొనిన మాకు శిక్షాప్రదముగ నుండెడిదే?

బ్రహ్మసూత్రభాష్యమున శ్రుతులను, పురాణములనుగూడ నుదాహరించినారని వ్యాసకర్తలు నుడివినారు. ఇదేమంత క్రొత్తవిషయము? శ్రుత్యర్థవిచారబద్ధపరికరమగునది సూత్రగ్రంథము. దాన శ్రుతు లుదాహరింపబడవా? ఈవిషయము సామాన్యవిషయముగాబట్టి, నేను అంతముఖ్యమైనసంగతి కాదని నుడువలేదు. నుడువకపోయినను, తేటతెల్లముగనే యుండును గదా! ఇక, తదితరభాష్యకారులందఱికంటె నెక్కుడుగ ఈ ఆచార్యులు పౌరాణికవాక్యములను ఉదాహరించియుంట జేసి, ఆవిషయము నసామాన్యము కాబట్టి ఉల్లేఖించితిని (ఈ విషయ మిట్లు గ్రహింపబడు నని నే ననుకొనలేదు. పైగా, మధ్వుని బహుగ్రంథాలోకనాసామర్థ్యపాండిత్యముల వెల్లడించుననియే

తెలచితిని). పురాణేతిహాసముల పంచమవేదత్వ, వేదార్థోపబృంహకత్వస్థాపనశ్రమ నైకొను అవసర మేమి?

కాశకృత్స్నాదులను ద్వైతభాష్యము ద్వైతము లగనే ప్రమాణమొనర్చియుండవచ్చును (ఈ విషయమున సంశయ మున్నది). అగుగాక! తక్కినవారి విషయమును ఏమని తెల్పుచున్నారో, అనుకొనుచున్నారో తెలుపు అధికారము నాకు లేదా? ద్వైతులు వీరిని ద్వైతులనుటలో అబ్బుర మేమున్నది? నేను వ్రాసినది ద్వైతేతరుల అభిప్రాయ మని సువ్యక్తము. ద్వైతదృష్ట్యా, అద్వైతశ్రుత్యభావము పసంఘటింపవచ్చును. అయిన ద్వైత మొక్కటియే ఆశ్రయణీయము, తక్కినవారికి నిరయమనియా వ్యాసకర్త లనునది? అందులకేనా వారు 'త్రిమతసామరస్య' ము'ను భంగింపబూనినది? అద్వైత మతమున కొంగ గలదనిన, నెగడై సమర్థించుచుంటి ననుకొనుట?

ఈ విషయమున వారు దృష్టాంతాభావమును, సాంకర్యదోషప్రసక్తిని లేవదీసినారు. ఈసందర్భమున నాపూర్వవ్యాసమున నేను దృష్టాంతములను, 'దేహబుద్ధ్యాస్మి' అను శ్లోకప్రమాణమును నొసగియుంటిని. ఇట మరల ఆవిషయముల నుద్ఘాటించి, పునరుక్తిదోషము చర్వితచర్వణముల చేయజాలను. మరల వన్నె మతమునకు జెందని తత్త్వభ్రష్టుని నందురా? అస్తు.

శ్రీమధ్వాచార్యులవారి జీవితవిశేషములను గుణించి, మతిచికింత లేటతెల్లముగ తెలుపుకొని విరమింతును. నేను సంగ్రహింపగలిగినవియును, ప్రామాణ్యము లని నిర్ధారితములైన విషయములనే చెప్పితిని. అవి మధ్వాచార్యులవారిని కొంచెపరచుటకు చెప్పినవి కావు; అసహిష్ణుత్వమువలన కాదు. అసహిష్ణుత్వమేదైన, "...ఈ ఆచార్యుని ప్రతిభ ప్రశంసనీయము." "భక్తిమందాకినిని నీతడు వహించి ... శ్రీకృష్ణచైతన్యదేవునియందు మిళితమగుటకు కారణమైనాడు." "...దిగ్గజములకు కూడ మధ్వుడు నిర్వచించిన భక్తిపంథయే గతియైనది." అను వాక్యముల నెట్లు వ్రాయగలిగితిని? నా వ్యాసమునందలి ఈవిషయములను ప్రస్తుతవ్యాసకర్తలు ముట్టనైన ముట్టలేదు. ఇంతకును, ఆ ఎనిమిదివిషయములు మధ్వాచార్యుల మహత్త్వ మెట్లు కళంకిత మొనర్చుచున్నవో తెలియకున్నది. వారు అవతారపురుషులైన, ఇవన్నియును వారి జీవితమున జరిగినను, అవి కేవలము లీలామాత్రములుకదా! కేవల మభినయము లేకదా! అగుచో నేను అసహిష్ణుత్వమును చూపితి ననుట ఏల?

మఱి, వ్యాసకర్త లనునది ద్వైత మొక్కటియే ఆశ్రయణీయమని. నేను అనునది "ఏద్దాని నాశ్రయించినను శ్రేయమే లభించును" అని. ఎవ రసహిష్ణులైనది, ఎవరి భావ ముదారమైనది విద్వల్లోకమే నిర్ణయించునుగాత!

పూర్ణానంద



సౌందర్యము

[కథానిక]

శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు

నేను ఎప్పటిమాదిరిగానే దినకృత్యాలు తీర్చుకొన్నాను. వాటిలో ఏమీ తేడా లేదు. పి. డబ్ల్యు. డి. ఆఫీసులో ఎప్పటి గుమాస్తాపనీ, సాయంత్రం ఎప్పటి దివ్యజ్ఞాన సమాజ మందిర దర్శనం — గుంటూరులో. ఉంటే ఈ కాస్త తేడా ఉండవచ్చు. మందిరంలో ఉండే జైన విగ్రహం దగ్గిర మరొక అయిదు నిమిషాలసేపు ఎక్కువ నిల్చుని తన్మయత్వంతో చూశాను.

అర్ధరాత్రయుంటుంది. రాత్రిపూట నాకు మెలుకువ వచ్చినప్పుడు ఎన్ని గంటలయిందో కొంతమందిలాగ చెప్పలేను. కాని అర్ధరాత్రయుంటుందనుకొంటాను. ఎందుచేతంటే, అర్ధరాత్రిఘడియలలోనే దెయ్యాలూ, ఆత్మలూ భూమిమీదికి దిగుతాయని కొంతమంది చెప్తుంటే విన్నాను. అందుకని నాకు కలిగిన సన్నివేశమప్పుడు అర్ధరాత్రయుంటుంది.

నిద్రనుంచి ఎవరో తట్టగా లేచాను. కళ్లు తెరిచాను. ఏదో విగ్రహం ఎదుట ఉంది. అప్పుడేమీ భయం వెయ్యలేదు. నిద్రో, కలో, మెలుకువో తెలియలేదు. మరోక్షణంలో ఆ తెల్లటి విగ్రహాన్ని చూసి భయమనిపించింది. భయంలోనే "అబ్బే! మరేం కాదు, భ్రమ" అని విమర్శ. కళ్లు బాగా నులుపుకొని

ఈ సారి తిన్నగా విగ్రహంవైపు చూడకుండా గదిలో ఉన్న పెద్ద ట్రంకుపెట్టె, నిశ్శబ్దంగా చిలక్కొయ్యని ఉన్న సుద్దలు, ఎదుటి మేకున ప్రెస్‌లో ఉన్న రేకెట్, మూలఉన్న సన్నని ఇనప చేతిబెత్తం మొదలైనవి చూసి, మేలుకునే ఉన్నా ననే విషయం ధ్రువపరుచుకుని, మళ్లీ ఎదుటఉన్న విగ్రహంవైపు చూశాను. తలకి ఒక్కమాటు నెత్తురు ఎక్కిపోయింది. ఆపాద మస్తకం గజ గజ లాడిపోయాను. కేక వేద్దామని ఉద్దేశం. కేక వేసే ఉంటాను. కాని నాగొంతుక దాటి ధ్వని నాచెవులకే వినబడలేదు. అరడుగుల తెల్లటి విగ్రహానికి కళ్లు అప్పచెప్పి బెంబేరుగా కూచున్నాను. క్రమేపీ విగ్రహం కొంచెం నల్లపడింది. భయాశ్చర్యాలతో చూస్తున్నాను. విగ్రహం మరీ నల్లపడింది. అది నల్లపడుతూండగా గదిలో వెలుగు ఎక్కువౌతూన్నట్లుగా కనిపెట్టాను. వెలుగు విగ్రహం దగ్గరనుంచే వస్తూంది. క్రమేపీ పట్టపగలులాగ ఉంది. అందులో నల్లటి ఇనుములాంటి ఆకారం! నేను మరింత గాబరా పడ్డాను. పారిపోదా మనుకున్నాను. కాని అంగాలు నాస్వాధీనంలో లేకపోడంవల్ల ఒక్కజబ్బికూచున్నా. అంతట్లో విగ్రహం గభీమని మారిపోయింది. మునుపటి నల్లటి ఆకారమేగాని ఈ మారు పీఠంమీద కూర్చున్నట్లుగా ఉంది. నాకు చటుక్కున స్ఫురించింది ఇటువంటి దేదో ఇదివరకే చూసినట్టు. అట్టే ఆలోచించగా, నేను రోజూ చూస్తూన్నదే అనిపించింది. మరి కొంచెం ఆలోచించాను. రోజూ మందిరంలో చూస్తూన్న విగ్రహమే! పోల్చిపట్టాను. అదిగో! చేతిమీద చెయ్యి వేసుకొన్న చేతులూ, పాదంమీద పాదం వేసుకున్న కాళ్లు. అదే యజ్ఞోపవీతం, ఉత్తరీయం. అరడుగు పొడుగు చెవులు బుజాలకి తగులుతున్నాయి. నెత్తిమీద ముడిగా అమర్చిన ఉంగరాల జుట్టు. అదే తలవెనక పరివేషం. ధ్యానముద్రలో ఉన్న మొహం. నొసట బొట్టు. మెడమీది రేఖలు కూడా స్పష్టంగా కనబడుతున్నాయి. ఇంత పోలిక తర్వాత ఆశ్చర్యంతోపాటు విపరీతంగా భయంకూడా వేసింది. కాని క్రమేపీ భయం తగ్గింది. కారణ మేమిటంటే, నేను ప్రతిదినం దివ్యజ్ఞాన మందిరానికి వెళ్లి, ఎంతో భక్తి శ్రద్ధలతో పరిశీలించే విగ్రహమే అది. నాకు పూర్తిగా భయం తగ్గింది. కాని ఇది మాఇంటికి ఈ వేళప్పుడు ఎలాగ వచ్చింది అనే ఆశ్చర్యం బయలు దేరి, మళ్లీ భయం వేసింది. మళ్లీ ఇదంతా భ్రమేమో అని ఆలోచించాను. భ్రమ కాదని రుజువు చేసుకున్నాను. అదిగో! క్రమేపీ విగ్రహం మళ్లీ మారుతూంది. ఆశ్చర్యంతో కళ్లప్పచెప్పి చూశాను. నెమ్మదినెమ్మదిగా విగ్రహం తెల్లబడింది. నింపాదిగా గంభీరంగా నిలబడింది. నేను జంకుతోటే, ఆశ్చర్యంతోటే చూస్తున్నా! ముక్కు చేత్తో పట్టుకున్నాడు జైనముని. మబ్బుచాటునుంచి చంద్రుడు వచ్చినట్టుగా క్రమేపీ ఆయనకళ్లు విడ్డాయి. తేజోవంతా లయాయి. నేను జడిశాను. పెదివెలు కదిలినట్లయి మరింత భయ పడ్డాను.

మరొక క్షణంలో "అబ్బాయీ! గుర్తుపట్టేవా" అనే మాటలు వినబడ్డాయి. గుండె చెదిరిపోయింది. కాని నింపాదిగా తల ఆడించాను.

"మందిరంలోని విగ్రహం నాదే! అది నల్లరాతితో చెక్కింది" అన్నాడు జైనముని శాంతంగా.

భయంలోనే నాకు కొంచెం గ్రహింపయింది— ఈయనిది పాలవంటి శరీరమనీ, అది నల్లరాతితో చెక్కారనీ!

మళ్లీ జైనముని మాట్లాడుతున్నాడు. "నేను నేడే సమాధినుంచి లేచాను. దివ్యదృష్టివల్ల నువ్వు నా భక్తుడవని తెలుసుకున్నాను." అని ఉచ్చరించి ముక్కు చేత్తో పట్టుకున్నాడు.

నేను భయాశ్చర్యాలతో వింటూ చూస్తున్నాను.

"సమాధిలో ఉండిపోయి రెండువేల నాలుగు వందల సంవత్సరము లయింది."

అంతకాలాన్ని ఊహించ ప్రయత్నించాను. కాని మెదడు పనిచేయలేదు. భయకంపితు డ్నయాను.

"నా పేరు ఆనందతీర్థంకరు డంటారు" అని ముక్కు ఒక్కమాటు విడిచిపెట్టి మళ్లీ పట్టుకున్నాడు జైనముని.

ఆయన పేరు విని ఆశ్చర్యపడ్డాను. ఆశ్చర్య పడ్డందుకు భయపడ్డాను.

ఆనందతీర్థంకరుడు ముక్కు పట్టుకునే "మా కాలంలో చండతీర్థంకరుడు అన్నాడు: 'రెండువేల నాలుగువందల ఏళ్లకి భరతఖండంలో వామనకోతులు అనబడే ఒకజాతివారు బయల్దేరుతారు' అని. నిన్ను చూస్తుంటే నాకు ఆశ్చర్యం వేస్తోంది! చండ తీర్థంకరుడు చెప్పినవాళ్లు మీరే! మీకూ అప్పటి వాళ్లకీ ఎంత భేద ముంది! మేము ఆజాను బాహు వులం. మావాళ్లల్లో పొట్టివాణ్ణి నేనే. స్ఫురద్రూపులం! మమ్మల్ని గురించి ప్రాకృత గ్రంథాల్లోని వర్ణనలు యథార్థంగా చేసినవే." అని ముక్కుపట్టు విడిచిపెట్టి మళ్లీ గభిమని పట్టుకున్నాడు మునీశ్వరుడు.

నాకు ఈముక్కుపట్టుభంగిమం ఎంతమాత్రమూ బోధపడలేదు. కాని ఆశ్చర్యం బదులు భయంవేసింది. ఆనందతీర్థంకరుడు మళ్లీ "మీరుకూడా ఆ ప్రాకృత కాలంలో స్త్రీలనీ, పురుషులనీ వర్ణిస్తారా" అని స్ఫుటంగా, నెమ్మదిగా అన్నాడు.

తల ఊపాను.

"మాట్లాడు" అని నన్ను ఏంతో కాలంనుంచీ ఎరిగినవాడిలాగు అన్నాడు జైనముని.

నాకు బోలెడంత భయం వేసింది.

"మాటలో చెప్పాలి నాకు" అని మళ్లీ నెమ్మదైన ధ్వని వినబడింది.

మాట్లాడకుండా ఉండలేకపోయాను. "ఊ, ఊ" అన్నాను.

"మాటల్లోనే చెప్పు" అని దిట్టమైన నెమ్మది స్వరం.

కట్ట తెగిన ప్రవాహంలాగ అప్రయత్నంగా నాకు మాటల ధోరణి వచ్చింది. భయం ఎప్పటికంటే ఎక్కువయింది. కాని వాక్కును ఆపుకోలేక పోయాను. "వర్ణిస్తాము" అన్నాను.

"ఏమని?" అని చిన్న ప్రశ్న.

ఒక చెంపని భయపడుతూన్నా, నాకు వాగ్జాలం ఆగకపోగా, గడగడలాడుతూ—

"మేము స్త్రీల మొహాలు, చేతులు, పాదాలు పద్మాలలాగ ఉంటాయని—"

తీర్థంకరుడి మొహం సూర్యోదయంలాగ నెమ్మదిగా ఎర్రబారుతూంది. నేను భయపడి "మీకు అంత కోపం వచ్చే మాటలు చెప్పినందుకు నన్ను క్షమించ ప్రార్థిస్తున్నాను" అని చెప్పి నా వాచాలతకీ, చొరవకీ వణికిపోయాను.

తీర్థంకరుడు అన్నాడు: "కోపం వచ్చిన మాట వాస్తవమే కాని, వామనకోతీ, మీ స్త్రీల మొహాలు గాని, చేతులు గాని, కాళ్లు గాని నిజంగా పద్మాల లాగ అందంగా ఉండే వర్ణిస్తారా? మాకాలపు కవులు వర్ణించేరంటే, స్త్రీలు అమోఘ్యంగా ఉండేవారు. కాబట్టి వర్ణించేవారు. అంతేకాని ఇప్పటిలాగు అబద్ధాలు రాయలేదు. అందుకూ కోపం వచ్చింది. తర్వాతవిషయం చెప్పు కోతీ!"

"కోతీ" అని పిలిచినందుకు నాకు కొంచెం నొప్పి కలిగింది. ఏమీ అనలేక ఊరుకున్నాను. ఆనందం నటించ దలచుకొన్నాను కాని నటించలేకపోయాను.

"ఎందుకు ఊరుకున్నావు చెప్పక" అని ప్రశ్నించాడు ముని, నాకు ఎరిగినవాడిలాగ.

"నేను యథార్థం చెప్పడానికి భయపడి ఊరుకున్నాను స్వామీ!" అన్నాను దీనంగా.

"వామనకోతీ! ఎందుకు ఊరుకున్నావు, చెప్పక" అని బిగింపుస్వరంతో తీర్థంకరుడు పలికాడు.

మళ్లీ నానోటిమాటలు అప్రయత్నంగా వచ్చాయి. "కోతీ అని పిలిస్తే నాకు పిచ్చవేస్తూంది" అన్నాను. అన్నందుకు జడిసిపోయాను.

జైనమునికి పరమఆశ్చర్యం వేసింది. ముక్కుపట్టు వదలి, చూపుడువేలు ఒక్కక్షణం ముక్కుమీద పెట్టుకున్నాడు. తెరుచుకున్న నోరు అలాగే ఉండి పోయింది. చివరికి ఆయన "చండతీర్థంకరుడు చెప్పిన మాటలు నేను చెప్పాను! రెండువేల నాలుగువందల

ఏళ్ల తర్వాత భరతఖండ మంతటా వామనకోతులు కోట్ల కొలది ఉంటారని ఆయన చెప్పిన మాట నా చెవుల్లో ఇప్పటికీ వినబడుతూంది. నేను అంటూన్న మాటలు ఆయన అన్నవే!" అని నాబాధకి ఆశ్చర్యం కనబరిచాడు.

తీర్థంకరుడు అన్న మాట యథార్థమే అయుంటుందని నే నింకేమీ నొచ్చుకోలేదు. ఆయన నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ "వామనకోతీ! ఇంకా మీ కవులు ఏమని వర్ణిస్తారు? ముఖ్యంగా కళ్లనిగురించి ఏమని వర్ణిస్తారో చెప్పు" అన్నాడు కొంచెం కుతూహలం కనబరిచి.

"కళ్లు తామరరేకులలాగు —" స్వామివారి మొహం ఎర్రదవం చూసి నా పెదిమెలు మూతపడి పోయాయి. సాయంత్రం పడమటి ఆకాశంలాగ ఉంది ఆయన మొహం.

"చెప్పవేమి" అన్నాడు జైనముని గొంతుక బిగింపుతోటే, అదురుతూన్న పెదిమెలతోటే.

"ఎర్రకలువలలాగ ఉన్న తమ మొహం చూసి మాట్లాడలేను" అన్నాను జడుపు గిడుపు లేక. అని, నా ధైర్యాన్ని తలుచుకొని కంపించాను.

జైనముని నిదానంగా బిగువుగా "మా కాలంలో అబద్ధాలు చెప్పడం ఎరగము. నువ్వు మాట్లాడేవి అబద్ధాలు. అందుచేత నాకు అణుచుకోలేనంత కోపం వస్తూంది" అన్నాడు, కొంచెం ఆయాసంతో, తొందరగా వస్తూన్న ఊపిరితో.

ఆయనవాక్కులలో ఉన్న శాంతం నన్ను ఇనుముని అయస్కాంతంలాగ ఆకర్షించివేయగా, ముందువెనుకలు చూడని చొరవతో "స్వామీ! నన్ను మీరు కోప్పడవద్దు. మా కవులు చేసే వర్ణనలు చెప్పాను గాని నేను కల్పించి చెప్పలేదు" అన్నాను.

ఆయన పెదిమెలు మొదట బిగించి, పిమ్మట నెమ్మదిగా విప్పి, సన్నగా "మీ కవులసంగతే నేను చెప్పిన విషయమున్నూ. ఆమోస్తరుగా నువ్వే వర్ణన చేసుంటే భస్మంచేసిఉందును. నాభక్తుడు అబద్ధాలు పలికితే నేను ఊరుకోలేను!" అన్నాడు.

ఈ మాటలు విన్న నాకు ఒకవైపు భయం లాగుతూన్నా, ఆయనమీద భక్తివిశ్వాసాలు అధికమయాయి.

స్వామివారు "ఇంకా చెప్పు కోతీ!" అని సెలవు ఇచ్చారు.

'కోతీ' అన్న మాట వినగా ఎంచేతో చిన్నతన మనిపించింది. "స్వామీ! నా పేరు సుందరమూర్తి" అన్నాను జడుపు లేక.

తీర్థంకరుడికి ఆకాశ మంటుకున్నంత కోపం వచ్చింది. కాని శాంతమైన వాక్కులు నానోటినుంచి రావడంవల్లే, నేను బతికున్నాను అని ఇప్పటికీ నా నమ్మకం.

ఆయన ఎంతో నెమ్మదిగా "నువ్వు సుందరమూర్తివా!" అన్నాడు. చిరునవ్వుకళ మెరుస్తూన్న పెదిమెలతో సంధ్యాసమయంలో నీరెండలాగ కాంతివంతంగా ఉంది ఆయనమొహం.

"నా పేరు స్వామీ!" అని దీనంగా అన్నాను.

"అదే నే నడగడం. నువ్వు సుందరమూర్తివా?" అన్నాడు ముని కళ్లలో నవ్వు తొంగిచూడగా.

"నా పేరది స్వామీ!"

"నే నడగడం అదే. నీలో ఏమి సౌందర్య ముందని నువ్వు సుందరమూర్తివి?"

నేను మొదట గాబరాపడ్డాను. కాని జైనముని అవస్థ నాకు కొంచెం గోచరమయింది. సుందరంగా ఉన్నప్పుడే 'సుందరమూర్తి' అని పేరుపెట్టాలనీ, లేకపోతే పెట్టకూడదనీ ఆయనవూహ. అది తెలిసిన పిమ్మట నేను "నాతల్లిదండ్రులు నాకు ఆపేరు ఏర్పరిచారు స్వామీ!" అన్నాను, చేతులు జోడించి, వినయవిధేయతలతో.

"కోతీ! నిన్ను వాళ్లు కళ్లతో చూసే పేరు పెట్టారా?" అన్నాడు ముని కొంచెం దిట్టమైన స్వరంతో.

"స్వామీ! నేను ఎరగను"

"ఇటువంటి అబద్ధపు పేర్లు ఎలాగ పెడతారు? మా కాలంలో ఎరగమే? మీ కవులలో కూడా ఇలాంటి పేర్లు ఉంటాయా?"

"స్వామీ! ఉంటాయి."

"చెప్పు కొన్ని, వామనకోతీ!"

స్వామివారి ఆజ్ఞప్రకారం అన్నాను: "శివ, వెంకట, కృష్ణ, సూర్య, సత్య, సుబ్బ, శంకర, రామ—ఇటువంటిపదాలకు ముందూ వెనకా ఏవేవో చేర్చి పెడతారు."

మళ్లీ తీర్థంకరుడు అగ్నిహోత్రుడయిపోయాడు.

నానోటంబడి "స్వామీ! నావల్ల దోషమేదేనా ఉంటే తమరు క్షమించి, రక్షించమని ఈమూర్ఖుడు ప్రార్థిస్తున్నాడు" అని స్వామివారి పాదకమలాలమీద వాలాను.

తీర్థంకరుడు చెయ్యెత్తి అభయహస్తమిచ్చాడు.

నేను లేచాను. తర్వాత ఆయన "ఈ కాలంలో శివుడు, రాముడు, కృష్ణుడు ఏరీ? వాళ్లు వెనకటికాలంలో ఉండేవారు" అన్నాడు ముక్తసరిగా.

తీర్థంకరుడి అవస్థ నాకూ, నా అవస్థ తీర్థంకరుడికీ బోధపడలేదని నాకు కొంత గోచరమయింది. ఆతర్వాత ఆలోచించకుండానే "తమ కాలంలో పేర్లు రెండు సెలవియ్యండి స్వామీ!" అని మొండి ధైర్యంతో అనేసి, అధైర్యపడ్డాను.

"నాతమ్ముళ్లిద్దరి పేర్లూ సుకీర్తి, విచిత్రప్రకృతి. సుకీర్తి చిన్నప్పుడు చాలా దుడుకుగా ఉండడంవల్ల దుష్టబుద్ధి అనేవారు. అతను క్రమేపీ మారిపోయి గొప్పగొప్ప పనులు చేసి సుకీర్తి అయాడు. విచిత్రప్రకృతి చిన్నప్పటినుంచీ ఒక్క మోస్తరుగా లేడు" అన్నాడు తీర్థంకరుడు, వచనధోరణి మొండిగా ముగిస్తూ.

జైనముని సెలవిచ్చిన సంగతినిబట్టి నాకు బాగా బోధపడింది—మనిషి పేరు ఏదో పెట్టడం కాదనీ, అతని ప్రవర్తనవల్లే క్రమేపీ లోకంలో పేరు ఏర్పడుతుందనీ. ఈవిషయం గ్రహించాక నేను జైనముని ఆగ్రహం పూర్తిగా అర్థంచేసుకొన్నాను. నాపేరు చూసి సుందరమూర్తి అని ఎలాగ పేరుపెట్టారో అని ఆశ్చర్యపోయాను. నాతల్లిదండ్రులమీద హద్దులేనంత కోపం వచ్చింది. "దురాత్ములు!"

"వామనకోతీ! ఏమిటీ ఆలోచిస్తున్నావు?"

ఆలోచనలు తెగి "స్వామీ! తాము చెప్పినదంతా మననం చేసుకొంటున్నాను. ఈ దీనుడు తన పేరు తమకి చెప్పి నొప్పి కలిగించినందుకు తమ పాదములపై బడి ప్రార్థిస్తున్నాడు" అని స్వామివారి పాదాలమీద పడ్డాను.

భయం లేదన్నట్టు తీర్థంకరుడు చెయ్యెత్తాడు. నేను లేచాను.

"ఇంకా మీకవులు ఏమని వర్ణిస్తారు?" అని ఎంతో కుతూహలం కనబరిచి అడిగాడు ముని.

"మాకవులు కచకుచాదులు, కంఠం, నడుము, నితంబం మొదలైనవాటిని వర్ణిస్తారు మహాత్మా!" అన్నాను.

"ఏమని?—మీ పొట్టి తలవెంట్రుకల్ని ఏమని వర్ణిస్తారు?"

"తాచుపాములాగ పొడుగ్గా ఉన్నాయని"


జైనమునికోపం తారాపథం అంటుకుపోయింది. వడగళ్లు పడ్డట్టు పట పట మంటూన్న పళ్లసందునుంచి సన్నని దిట్టమైన మాటలు వినవచ్చాయి "మీకవులు తుచ్ఛులు, మోసగాండ్రు, అబద్ధపరులు" ఈ మాటలు వచ్చి ఆయన పెదిమెలు గులాబీరేకుల్లాగ దగ్గరపడిపోయాయి. మరికొంత సేపటికి "ఇంకా..." అనే మాట చెవిని పడగా తుళ్లిపడి "స్వామీ! తమకి అయిష్టమైన విషయాలు చెప్పినందుకు నన్ను రక్షించమని దేవరవారి పాదాలకి నమస్కరిస్తున్నాను." అని చాలాసార్లు నమస్కారం చేశాను.

ఫర్వా లేదన్నట్టుగా తీర్థంకరుడు చెయ్యి ఆడించాడు. సాయంత్రం సూర్యుడు నీటిలో ప్రతి

ఫలించినట్టు ఉన్న ఆయన మొహం క్రమేపీ చంద్ర బింబంలాగ, తెల్లకలువలాగ, నక్షత్రలోకంలాగ కాంతి వంత మయింది. అమృతంలాంటి వాక్కులు వెలువడ్డాయి.

"భారతీ! మీ కవుల వర్ణనలు ఇంక చెప్పవద్దు. వామనకోశుల కవుల వర్ణనలకీ, మా కాలపు కవుల వర్ణనలకీ చాలా వ్యత్యాస ముంది. మా కవులు ఉన్న విషయాలు ఉన్నట్లు వర్ణిస్తారు. వామనకోశికవులు అబద్ధాలు రాస్తారు" అన్నాడు తీర్థంకరుడు స్పష్టంగా.

ఇంతటి అన్యాయపు చేష్టలకి నాజాతి తరఫున నేను క్షమాపణ కోరుదా మనుకొన్నాను కాని తీర్థంకరుడు "మరోకమారు వస్తా" నని చెప్పి, చటుక్కున అదృశ్య డైపోయాడు. నేను చివరిసారి నమస్కరించనేనా లేదు. ఎంత అపరాధం చేశానో అని భయభ్రాంతుణ్ణయి అలాగే కూలబడిపోయాను.



పురమందిరము, కొలంబో

కోకిల

శ్రీ బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి

నాదబ్రహ్మకళల్ లయించుకొని సంధానం బపూర్వశ్రుతి
ప్రాదుర్భావముఁ బొంది నీగళము విశ్వప్రేమసామ్రాజ్యమున్
శ్రీ దాంపత్యము జేసి పాడెదవు నాందీపద్యముల్, గాన
విద్యాదాయాదులు భావదాస్యమును జేయన్ మోహనాలాపినీ!

నవమధుమాస వార్షికమునందున పాల్గొని గానవిద్య
యం దవు ననిపించుకొన్న మధురామ్రకిసాలయభక్షణీ! భవ
ద్భవము పునీతవిశ్వపథ పాంథ మనోహరణీయ మాట త్వ
ద్భవము పునీతవిశ్వపథ బంధుర మమ్మ! పికాంగనామణీ!

ఎట్టులో పొట్టబోసికొని యెల్లజగంబుల కింపు నింపు నీ
పట్టునగూడ జాతిమత భావము దాలిచి నీ న్యపత్యులే
గిట్టక నీదు వెంటబడి గేలి యొనర్చెద రవ్వ రేమనన్
బి ట్టదలించి మార్కొనక ప్రేమను బల్కెద వేమి కోకిలా!

పిల్లలు నిన్ను జూచి మురిపెంబున 'కో' యన, నీవు 'కో' యటం
చుల్లము రంజిలన్ బలికె దోసి! నిగర్వశిరోమణీ! కవీం
ద్రోల్లస మట్టె రేకొలిపి యుయ్యెల లూచెద వితునీధువున్
జల్లగ ద్రావి, గానసుధ చక్కదనాల్ గురిపించినావటే!

కవితాభారతి గానవాణియు పురాకర్మంబు సంస్కారతన్
భవమున్ జెందెడు గొన్ని తావులను నీభాగ్యంబు పండెన్గదే!
నవసీహారపయోజసౌరభిళకృన్మారందధారాంచిత
స్రవమయ్యెన్ ద్వదుదాత్తకంఠ మపురా! రాగాలరారాణిధో!

గుత్తకు దీసికొమ్ము రసికుల్ వహవా యన ప్రేమగీతముల్
కుత్తుక సాచి పెండిలుల కోమలరీతిగ మేజువాణులన్
ముత్తయిదుల్ సెబా సనగ మోజును గూర్చుమ, యేమిలోటు నీ
కిత్తురు తమ్ములా ల్కావట లెన్నియొ స్వాగతపద్యరత్నముల్.

తెలుగుంమాన్యము నీకు గ్రొత్తదియె! సిద్ధించెన్ పురాపుణ్య భా
క్ఫలశేషంబున, దాస్యశృంఖలల జిక్కంబోక, స్వాతంత్ర్య స
త్ఫలకాంతభారతి మాతృదేశ విభవం బాబాలగోపాలమున్
దెలుపన్ గంకణ మూనుమా! పికమ! సందీప్తప్రబోధాంకమా!!

పరిషన్మండలి వాగ్వివాదమున నీ ప్రాగల్భ్య మామ్రేడిత
స్ఫురణన్ భావ్యకృదర్థజాతములనే శోధించి వేధించ మే
మెరుగన్ లేము ముభావపద్ధతులు సామీచీన్యభావంబునన్
జిరసమ్మేళన దెల్పుమా! పికవిపశ్చిద్రాజచూడామణీ!

పని యేమున్నది నీకు నాకు నిటులే పాటల్ ప్రబంధమ్ములన్
మనుటేగాక ముహుర్ముహుః ప్రణయసంబంధాగమోక్తుల్ చిరం
తన సంగీతకలార్చనాభిరతి, సాంత్వనస్వస్థితిన్ బాడి జీ
వనభాగ్యోదయకాంతు దెల్పితివి, కవ్యాత్మన్ కుహూకూజితా!

వగరుచిగుళ్లు మెక్కి, రసవార్ధుల యూటలు తేనెపాటగా
జిగిగొన బంచమశ్రుతిని జీవికలోపలి లోతుపాతులన్
గగురుపజేసె త్వద్గళసుధామృతవాహిని, నేమె యెందునన్
ప్రగతులు లేనివార మవురా! చరితార్థవుగా! వనప్రియా!

నాట్య వేదము

అందలి విశేషాలు-
నట, సామాజికుల విధులు-



శ్రీ జమ్ములమడక
మాధవరామ శర్మ

నటనము ప్రాణికి సహజధర్మము. యేదో అనుభూతిలో మాత్రము గోచరించుచూ ఉండే ఆనందరేఖ నటనకౌశలమును సంపాదించుతుంది. సర్వాంగీణంగా అనుభవములో భాసించే ఆనందవిలాసము నటనమువలన సముల్లాసము పొందుతుంది. అస్పష్టంగా భాసించే నటనాన్ని శాసించి చెప్పినట్టి గ్రంథము నాట్యశాస్త్రము. నాట్యశాస్త్రములో ఉద్దిష్టమైన విషయమే నాట్యవేదములో నిరూపణను పొందుతుంది. విశ్వవిశ్వానికి నాట్యభిక్షను మన భారతభూమి ప్రసాదించింది. నాట్యధర్మాలను సరిగా అవగాహన చేసికో లేని ఇతరలోకాలు వికృతనాట్యపద్ధతులను అవలంబించుచున్నవి. ఆపాతమధురంగా ఉన్న వానిలోని అభిరుచి నిత్యమధురములైన మన నాట్యధర్మాలకు గ్లానిని, మ్లానతను, క్లాంతిని కల్గచేయక పూర్వము నాట్యవేదాన్ని గురించి తెలిసికొనుట అత్యంతము ఆవశ్యకమని మనము గ్రహించాలి. ప్రధానంగా భరతుడు రచించిన నాట్యశాస్త్రము మొదటగా ఎన్నదగిన గ్రంథము. నాట్యశాస్త్రము నాధారంగా చేసుకొని అనేక గ్రంథాలు భారతావనిలో పుట్టినవి. పుట్టిన గ్రంథాలు ఎన్ని మనకు లేవో సరిగా చెప్పలేము. ప్రస్తుతం కొద్దిగా మిగిలియున్నవి. భావప్రకాశము, నాట్యదర్పణము, అభినయదర్పణము—ఇవి రెండవపక్షంగా చెప్పదగిన గ్రంథాలు. ఇంకా ప్రతాపరుద్రీయము, సాహిత్యదర్పణము,

మందారమరందచంపువు, సంజరాజయశోభూష ణము, దశరూపకము, రసార్ణవసుధాకరము మొదలైన కొన్ని గ్రంథాలు అప్రధానంగా నాట్యవిశేషాలను చెప్పుచున్నవి. ఇంకా ఇటువంటి గ్రంథాలు చాలా ఉన్నట్లు ఆలంకారికసంప్రదాయాలు చెప్పుచున్నవి. అవి కాలగర్భంలో విలీనములైనవి. పాశ్చాత్యుల విశ్వవిద్యాలయాలను కాలగర్భములని మనముతలచినట్లయితే కొన్ని గ్రంథాలు అక్కడ దొరకవచ్చుననే నమ్మకము కూడా ఉండకపోదు.

నాట్య సంప్రదాయము

భారతభూమిలో ఏవిషయమైనా సంప్రదాయములో వడపోతపోయబడి రావాలి. నాట్యసంప్రదాయముకూడా చిరకాలమునుండి ప్రసిద్ధమైనదని చెప్పవచ్చు. శ్రీకంఠు డాదివక్త. "పరమేష్ఠీ వైకుంఠాదిభ్యః చతుష్షష్టయే శిష్యేభ్యః"—శివుడు నాట్యసంప్రదాయము నుపదేశించాడు. "స్వయంభూః స్వాంతేవాసిభ్యః శేషు కావ్యపురుషం ప్రజాపతిః కావ్యవిద్యా ప్రవర్తనార్థై ప్రాయుంక్త స సప్రపంచం ప్రోవాచ రూపకనిరూపణీయం భరతః రసాధికారికం నందికేశ్వరః" అని నాట్యసంప్రదాయమును రాజశేఖరుడు తన కావ్యమీమాంసలో ఆమ్నాత్రించియున్నాడు. బ్రహ్మ నాట్యము నుదాహరించాడు. భరతుడు గ్రహించాడు. శాండిల్యవాత్స్యకోహలాదులు భరతశిష్యులు. వారు కూడా నాట్యవిద్యను ప్రచారంచేశారు. అసలు భరతుడు బ్రహ్మ ఉదాహరించిన నాట్యవేదాన్ని మొదట పారరూపంగా గ్రహించి అంతటితో ఊరుకోలేదు. బాగా రిసర్చిచేసి పరిశీలించాడు.

"జగ్రాహ పాఠ్యం ఋగ్వేదాత్
సామభ్యో గీతమేవచ,
యజుర్వేదా దభినయాన్
రసా నాథర్వణాదపి"

గ్రహించి నాట్యవేదగ్రంథ నిబంధనం చేశారు. భరతశిష్యులు శతాధికంగా ఉన్నారు. వారందరును నాట్యవిద్యాప్రవీణులు. లోకంలో చక్కగా నాట్యవిద్యను ప్రచారంచేశారు. అది క్రమక్రమంగా లోకవ్యాప్తిని పొందింది. శారదాతనయుని భావప్రకాశనం చూస్తే ఈ చెప్పబోయే సంప్రదాయం గోచరమవుతున్నది. లోకసంగ్రహాన్ని అపేక్షించిన మనువు సూర్యుని లోకసముద్ధరణోపాయమును చెప్పుమని అడిగాడు. సూర్యుడు చెప్పిన ఉపాయములను బట్టి భరతునిదగ్గర మనువు నాట్యవిద్యాసంప్రదాయాన్ని తెలుసుకొన్నాడు. ఈశ్వరుడు ఆదిప్రవక్త. నందికేశ్వరు డీశ్వరుని సన్నిధానంలో నాట్యమును గ్రహించాడు. అతడే శివుని ఆజ్ఞపై బ్రహ్మ కుపదేశించాడు. బ్రహ్మ భరతసంజ్ఞ కలిగిన ఐదుగురకు నాట్యవిద్య నుపదేశించాడు. ఇట్లా సంప్రదాయమునుండి సంప్రదాయములోనికి నాట్యవిద్య ప్రచారంపొందింది. నాట్యవిద్యాప్రచారం అధికమైనకొద్దీ సంప్రదాయాలు చాలా వచ్చినవి. ఎన్ని సంప్రదాయాలు వచ్చినా అన్నిటికీ ఆదిప్రవక్త శ్రీకంఠు డని మరచిపోరాదు. సదాశివుడు, ఈశ్వరుడు, పార్వతి, గౌరి, వాసుకి, వాగ్దేవి, నారదుడు, అగస్త్యుడు, వ్యాసుడు, భరతశిష్యులు, అంజనాసూనుడు—వీరందరూ సంప్రదాయప్రచారకులు. శారదాదేవి ఆజ్ఞమీద దివాకరుడు శారదాతనయునకు నాట్యవిద్య నుపదేశించినాడు. ఇది వాగ్దేవీసంప్రదాయము కావచ్చునేమో. ఇట్లా ఈ సంప్రదాయమును చెప్పుకొనుట డాబుసరి అనీ, అది కేవలం ప్రాశస్త్యానికనీ యస్. కె. డే (సుశీలకుమారడే) అంటాడు. ఆశోధంగా అనటం పాశ్చాత్యశిష్యప్రభావం. ప్రవక్తల పరంపరపై ఎందుకు అవిశ్వాసం కలగాలి? వాళ్లు పాపం ఏమి అపరాధం చేశారు? కావ్యమీమాంసలో, వాత్స్యాయనుని కామసూత్రంలోకూడా సంప్రదాయాలలోని పరంపర చెప్పబడ్డది. వీని నన్నిటిని అవిశ్వాసదృష్టితో చూడటంలో అర్థమేమీ కన్పడదు. మన ప్రాచీనమహర్షు లనేకులు నాట్యవిద్యను ఆధ్యాత్మచింతతో చక్కగా ఉపాసించారు. వాటిల్లో విశేషాన్ని కనిపెట్టారు. ఆ విశేషాలను లోకానికి ప్రసాదించినారు. వారికి జేజేలు పెట్టండి.

భరతుడు

భరతుడు నాట్యశాస్త్రం రచించాడు. దానికే నాట్యవేదం అని పేరు. అసలు నాట్యశాస్త్రాన్ని

భరతుడు రచించలేదనియే కొందరూ, రచించి భరతుడి పేరు పెట్టారని కొందరూ అంటున్నారు. శారదాతనయుడు భరతపంచకం ఉన్నదని చెప్పియున్నాడు. ఆ అయిదుగురూ దీన్ని రచించిఉంటారా అని ఊహించటానికవకాశ మున్నది. కాని భరతుడు ఒక్కడే అని ప్రామాణికు లంటున్నారు. ఆ అయిదుగురు భరతులకు మూలభరతుడు — భరతవాన్న ఒకడు ఉండవచ్చుగా. అతడే సర్వము నిర్వహించిఉంటాడని గ్రహించవచ్చు. భరతుడే నందిభరతుడని కొందరంటారు. కోహలుడు నాట్యశాస్త్రాన్ని రచించాడని ఒకాయ నన్నాడు. ఏమిటో ఈవాదాలన్నీ ! అనేక కవులు భరతుని స్మరించుచున్నారు. కాళిదాసాదిమహాకవులు భరతకీర్తనం చేశారు. ఆనందవర్ధనాద్యాలంకారికులు భరతుని పూజించారు. సాహిత్యసామ్రాజ్యంలో భరతునకగ్రపీఠం ఉన్నది. భరతుడందరకును అభివంద్యుడు. భరతుడు రూపకాలు చాలా వ్రాశాడుట. అమృతమంథనం అనే సమవాకారం ఒకటి, త్రిపురోదాహరణమనెడి మరిఒకటి, దక్షయజ్ఞమనే ఇంకొక రూపకమూ నాట్యశాస్త్రంలో స్మరింపబడినవి. లక్ష్మీస్వయంవరం అనేది ఉన్నట్లు కాళిదాసు విక్రమోర్వశీయంలో పల్కియున్నాడు.

నాట్యశాస్త్రము

భరతుని నాట్యశాస్త్రానికి నాట్యవేద మని పేరు. నాట్యవిద్య ననుసరించి వెలువడిన నిఖిల గ్రంథాలకూ ఇది ప్రమాణగ్రంథము. ఈమహాగ్రంథంలో నాట్యము ప్రధానంగా నిర్వచింపబడటంవలన నాట్యశాస్త్ర మనే పేరు సార్థకమౌచున్నది. అయినప్పటికీ నాట్యాంగముగా ఉండే అనేకవిషయాలు నిరూపింపబడినవి. కావ్య విద్యాప్రమేయ మిందులో కూర్పు పొందింది. ఛందోవిచితితాళమృదంగవిధానాలు నిరూపితము లయినవి. ఇంకా కామశాస్త్రంకూడా అవసరమైనంతవరకూ గోచరించుచున్నది. నాయికానాయకుల స్వభావాలు, కామతంత్రము ననుసరించిన వారివారి ప్రవృత్తిభేదాలు చక్కగా నిరూపణము పొందినవి. మనోవిజ్ఞానశాస్త్రానికి సంబంధించిన అనేకరహస్యాలు అక్కడక్కడ గోచరమౌతున్నవి. కాని ఇవన్నీ నాట్యానికి అంగంగా నిరూపింపబడుతున్నవనే మనము తెలుసుకోవాలి. నాట్యశాస్త్రపరిమితి ౩౬ అధ్యాయాలు. ౩౭ అధ్యాయా లున్నవని కొంద రంటున్నారు. ఆగ్రంథం ౩౬ అధ్యాయాలే అవటం చాలా ఉపపన్నంగా కన్పించుతుంది. అలంకారనిబంధకు లంతా ప్రత్యభిజ్ఞాసంప్రదాయవాదులు. ప్రత్యభిజ్ఞాసంప్రదాయమునకు సంబంధించిన కొన్ని అంశాలు భరతరచనలో కన్పడుతున్నవి. ఈ సంప్రదాయవాదులను స్పందవాదులని కూడా అంటారు. స్పందవాదులు షట్త్రింశత్తత్త్వాలను అంగీకరించుతారు. ఆ తత్త్వసూచకంగా భరతుడు ౩౬ అధ్యాయాలనే రచించా డనటం బాగుంటుంది. అభినవగుప్తుడీ గ్రంథానికి వ్యాఖ్యాత. ఈ విషయంలో ఆతడు కూడా సంవదించుచున్నాడు. షట్త్రింశదధ్యాయాత్మకత్వాన్ని ఆతడు స్థిరపరచుతాడు. గ్రంథంలో మొత్తముమీద దాదాపు ౫,౫౩౬ శ్లోకా లున్నవి. ఇందులో సామాన్యంగా అన్నీ అనుష్టుప్వృత్తములు. అక్కడక్కడ భిన్నవృత్తా లున్నవి. ఉదాహరణాలు భిన్నవృత్తాలలోనే కూర్పబడినవి. ఈ శ్లోకాలు కాక అక్కడక్కడ కొంత గద్యకూడా ఉన్నది. మొదట్లో భరతగ్రంథం సూత్రాత్మకగద్యరూపంగా ఉండేదనీ, తరువాతికాలంలో ప్రకృతరూపం పొందిందనీ కొందరు నిరాధార నిస్సార వాదం చేస్తారు. భరతుని గ్రంథమంతా సూత్రాత్మకమైన కారికామయంగా ఉన్నదని మనము గ్రహించాలి.

గ్రంథంలో అక్కడక్కడ "అత్రైతే ఆనువంశ్యాః శ్లోకా భవంతి" అని కొన్ని శ్లోకాలను భరతుడు వ్రాస్తున్నాడు. అవి సంప్రదాయాగతములై ఉండవచ్చు. అంతకుపూర్వం ఏదైనా నాట్యనిబంధనం ఉండిఐనా తీరాలి. అనేకనాట్యసంప్రదాయా లున్నవని అనుకుంటున్నాముగా! ఆయాసంప్రదాయాలకు సంబంధించిన గ్రంథాలలోని శ్లోకాలేమో అవి. ఆ గ్రంథాలుకూడా ఉంటే ఎంత బాగుండేది! ఏమో, అంత ఆశ ఎందుకులే? ఉన్నదాన్ని సంరక్షించుకొంటే చాలు. నాట్యయుత్తు ఉన్నవాళ్లు ఇంతమాత్రాన

తృప్తిపడతారా? అయినా ఇప్పుడేం చేస్తారు? ఇది కాక కొంత సూత్రాత్మకమైన గ్రంథ మున్నది. కొన్ని స్వయంవ్యక్తశ్లోకాలు. ఈవిధానంలో కొందరాశ్చర్య పడతారు. భాగవతంలో, భారతంలోకూడా కొంత కొంత గద్య ఉండటము వారు భావించాలి.

వ్యాఖ్యాతలు

భట్టలోల్లటుడు, శ్రీశంకుకుడు, భట్టనాయకుడు నాట్యశాస్త్రానికి వ్యాఖ్యానాలను వ్రాశారుట. అవి ఎక్కడా కనబడటం లేదు. అభినవగుప్తపాదాచార్యుడు వ్రాసిన అభినవభారతి అనే నాట్యవివృతి మొన్న మొన్ననే కొంత ప్రకటింపబడినది. అదికూడా ఏడవ అధ్యాయం కొంతదగ్గరనుండి ౧౨-వ అధ్యాయం దాకా త్రుటితం అయిందట. గ్రంథం అంతా ప్రకటించేలోపుగా ఎక్కడైనా దొరికితే ప్రకటించుతామని గైక్వారు ప్రాచ్య గ్రంథాలయంవారంటున్నారు. లేకపోతే అనుచితం అయినా తామే ఆ భాగాలు టీకించుతారట. అభినవగుప్తుడు తన వ్యాఖ్యానంలో లోల్లటాదుల భావాలను అనువదించుతున్నాడు. తనకు సమ్మతం కానప్పుడు వానిని ఖండించుతాడు. ఆతని వచనాలవలననే లోల్లటాదులు వ్యాఖ్యానం వ్రాసినట్లు తెలుస్తున్నది అభినవభారతి నాట్యవేదానికి తగిన సమర్థ వ్యాఖ్యానం. అభినవుడు వ్యాఖ్య వ్రాసినతరువాత వేరొకరు వ్యాఖ్యానించటానికి చేతిని కదిపినట్లే కన్పడదు. అభినవగుప్తుడు సర్వవిధాలా సమర్థుడు. ఆతని వచనానికి తిరుగు లేదు. సాహితీసామ్రాజ్యంలో ఆతడు అధినేత. నాట్యవేదభావమును తెలుసుకొనటానికి అభినవభారతినే చూడాలి. అభినవభారతీ వాక్కులను ఆధారంగా చేసుకొని సాహితీకర్తలు తమ రచనలకు స్వరూపమును సంపాదించుకొన్నారు. కావ్యానుశాసన వ్యాఖ్యానంలో హేమచంద్రుడు కొన్నికొన్ని స్థలాలలో అభినవభారతీపంక్తులను అనువదించాడు. అవన్నీ తప్పులుతప్పులుగా ఉన్నవి. ఉన్నవాని నున్నట్లుగా చూస్తే కొన్నిచోట్ల అన్వయం కుదరటంలేదు. బరోడావాళ్లు ముద్రించిన అభినవ భారతిని దగ్గర పెట్టుకొని హేమచంద్రానూదితవాక్యాలను సవరించుకోవాలి. ముద్రితాభినవభారతి కూడా శుద్ధంగా లేదు. హేమచంద్రగ్రంథంతో భారతిని సవరించుకోవలసి వస్తుంది. ప్రకాశకులు ఈబాధ లేకుండా ప్రకటించితే బాగుండేది. ఇప్పుడింతమాత్రానికైనా సంతోషించాలి.

గ్రంథవిషయము

నాట్యశాస్త్రంలోని విషయము చాలా ఉదాత్తంగా ఉంటుంది. విద్యాపారంగతుల మని అనుకునేవాళ్లుకూడా తెలియతగిన విశేషవిషయాలు చాలా ఉన్నవి. పామరులైనవాళ్లు తెలిసికొని ఆనందింపదగిన అంశాలంతటా కూడుకొనియున్నవి. ౧, ౨, ౩, ౪, ౫, ౬, ౭ అధ్యాయాలలోని విషయాలు సర్వసామాన్యంగా తెలియదగినవి. ఆ అధ్యాయాలలోని విషయాలను బాగా అవగతం చేసుకొంటేనేగాని నాట్యపరమార్థము తెలిసికోవటానికి అవకాశం కలగదు. నాట్యము ఏవిధముగా ఉత్పన్నమైనది? అసలు దెందుకు కావలసివచ్చింది? దాని సంప్రదాయం ఏమిటి? అభినయించేవాళ్ల పరంపర ఎటువంటిది? ఎందుకొరకై నాట్య మవతరింపబడి వచ్చిందో ఆ ప్రయోజనాన్ని అది నిర్వహించగలుగుతుందా? నాట్యము ఏయేఫలాలను సంపాదించుతుంది! లోకతంత్రాన్ని బాగుపరచటానికి అది ఏమైనా సమర్థమౌతుందా, కాదా? అవాంతరానేకప్రయోజన ప్రవాహపతితమైపోయి నాట్యము ప్రధానమహోత్కర్షానికి ఏమైనా దూరమవుతున్నదా లేదా? నాట్యములోని ధార్మికశోభ ఏవిధంగా ఉంటుంది? ఏయే దేవతల సమారాధనము అందులో ఉద్దిష్ట మౌతున్నది? ఏయేచిహ్నాలు ఏయే అంశాలను బోధపరుస్తూ ఉన్నవి? నాట్యమంటపమును ఎట్లా నిర్మించాలి? దాని విధానం ఏమిటి? కొలత ఎంత? నిర్మాణస్థలం ఎట్లా ఉండాలి? రంగమంటపాలను ఎన్నివిధాల ఏర్పాటు చేయవచ్చు? త్రివిధనాట్యశాలల స్వరూపం ఏమిటి? రంగంలో దైవతపూజ ఏవిధంగా ఉంటుంది? అసలు రంగదైవతపూజ ఎందుకు? ఈ మొదలైన ప్రశ్నపరంపరను సమాధానించుకొనటానికి కా అధ్యాయముల విష

యాలను హృదయమున ధరించాలి. ఇంకా తాండవము, తద్భేదాలు, స్వరూపము, అభినయించేవిధానము, వాని రసభావవినియోగము, పూర్వరంగవిధి, దానిలోని సంప్రదాయము, సూత్రధారకర్తవ్యము, నటుల సము దాచారము, రసములు, తద్భేదములు, లక్షణములు, స్వరూపవివరణము, వాని సామగ్రి, భావములు, వాని స్వరూపస్వభావాలు ఇంకా ఇంకా అనేకముఖ్యవిష యాలు మొదటిఅధ్యాయపస్తకంలో నిరూపించబడినవి. ౮, ౯, ౧౦, ౧౧, ౧౨, ౧౩, ౧౪ అధ్యాయా లలో అభినయవిశేషాలు విపులంగా నిరూపించబడినవి. సాధారణంగా నేటి నటలోకంలో ఉండవలసిన అభి నయసంపద శూన్యమవుతున్నది. ఏభావాన్ని అభిన యించటానికి ఏ అవయవమును యేమేమి ఎట్లెట్లా చెయ్యాలో ఈఅధ్యాయాలలో తెలుస్తుంది. ఉపాంగ విధానాలు, హస్తాభినయము, శరీరాభినయము, చారీ మండలవిధానములు, గతిప్రచారము, ప్రవృత్తిధర్మాలు ఈప్రకరణంలో స్పష్టంగా తెలియవచ్చు. ఈఅభినయ కోవిదత్వానికి నటులే బాధపడతారుగదా మన కెందు కని సామాజికు లుపేక్షింపరాదు. ఏవిషయమైనా తెలిసినతరువాత అనుభవంలో ఆనందమును బాగా సంపాదించుతుంది. సామాజికు లీవిషయాలను తెలుసు కొనకపోతే నటుడు ఏంచేస్తున్నాడో గ్రహించలేరు. వీనిని తెలుసుకొంటే నటుడు ఏమి చెయ్యటం లేదో సులభంగా గ్రహించవచ్చు. అతడెట్లా చెయ్యాలో కూడా నిరూపించవచ్చు. సమర్థనటుడు చక్కగా అభి నయించినపుడు ఎట్లా ఆనందించాలో సామాజికులు తెలియగలుగుతారు.

౧౫, ౧౬ అధ్యాయాలలో ఛందస్సు ఉన్నది. వానిని విడిచిపెట్టితే విడిచిపెట్టండి. ఈవిషయ మితర గ్రంథాలలో ఇంకాబాగా విస్తరింపబడింది. ౧౭,౧౮, ౨౦, ౨౧ అధ్యాయాలు కావ్యవిద్యకు సంబంధించిన విషయప్రతిపాదనంతో నిండిఉన్నవి. వానిని గూడా దూరంగా ఉంచండి. వాటి విషయంలో ఆలంకారి కులు బాగా పరాక్రమించారు. వీని మధ్యలో ఉన్న ౧౯ విడిచిపెట్టదగిన అధ్యాయంకాదు. అందులో కాకుస్వరాలు నిరూపించబడిఉన్నవి. రంగస్థలంలో మాట్లాడేటప్పుడు ఎవ రేవిధంగా సంభాషించాలి? వారి స్వరం ఏవిధంగా ఉండాలి?—ఈవిషయా లన్ని టినీ అది బాగా చర్చించుతుంది. మళ్లా ౨౨, ౨౩, ౨౪, ౨౫, ౨౬, ౨౭ అధ్యాయములను అందరూ బాగా అధ్యయనం చేయాలి. ఇందులో జగద్విలాసం అంతా కన్పడుతుంది. భారత్యాదివృత్తులు, వాని అవాంతరప్రభేదాలు, ఆహార్యాభినయము, వాని రస భావానుకూలపరిస్థితులు, దివ్యమర్త్య భేదాల నను సరించిన వేషధారణము, సామాన్యాభినయము, నాట్యాలంకారాలు, స్త్రీల కభినయంలోని విధివిశే షాలు, బాహ్యోపచారము, వైశికవిధులు, చిత్రాభి నయము, సిద్ధివ్యంజనములు—ఇటువంటి నానావిషయాలు అక్కడ నేర్చుకోవాలి. ఈ అధ్యాయాలలోనే ప్రసంగ వశాన కామశాస్త్రం కొంత చెప్పబడ్డది. స్త్రీల స్వ భావాలు, పురుషుల ప్రవృత్తులు, విప్రలంభనోపాయాలు, కామోపచారవైదగ్ధ్యవిధులు—ఒకటనిఏమిటి,పథ్యము లైన సరసవిషయాలు చాలా నోరూరించేవి వున్నవి. చదివి చూడండి. ౨౮, ౨౯, ౩౦, ౩౧, ౩౨, ౩౩ అధ్యాయాలు వాద్యవిధులను చెప్పుచున్నవి. నటులు వీనిని విడువవచ్చు. సామాజికులైనా అంతగా ఉత్సా హపడ నవసరంలేదు. అంతగా చూస్తే ౩౦లోని వంశి వాదనం చూడండి. ౩౪, ౩౫, ౩౬ అధ్యాయాలను మాత్రం చూడకుండా తెలియకుండా విడువరాదు. ప్రకృతివిచారము, భూమికాపాత్రవికల్పము, నాట్యావ తారము అన్నీ వాటిలో ఉన్నవి. నటులు అపాంక్తే యులనీ, వారలతో సంబంధబాంధవ్యాలు పనికిరావనీ ఒక ప్రవాద లోకంలో ఉన్నది. ఆప్రవాద మెందుకు రావలసివచ్చిందో నాట్యావతారాధ్యాయం చూస్తే తెలుస్తుంది. ఆప్రవాద ఎంతవఱకు సత్యమో కూడ మనం కనిపెట్టవచ్చు.

మొత్తంమీద ౧౨ అధ్యాయాలను విడిచి మిగిలిన ౨౪ అధ్యాయాలను నటసామాజికులు అవశ్యంగా తెలు సుకోవాలి. అంటే ౨౩౩౮ శ్లోకాలను విడిచిపెట్టి ౨౨౦౮ శ్లోకాల విషయాలను అత్యవసరంగా తెలుసు కోక తప్పదన్నమాట. ఈభాగం బాగా రాకపోతే, తెలియకపోతే నటులు కారాదు. నాట్యవేదవిషయం తెలుసుకోకుండా నటుడైతే లోకాన్ని మోసగించట

మన్నమాట. ఇవి తెలిస్తేనే నటులు. ఈవిషయాలను హృదయగతం చేసుకొన్నవాళ్లు "మీ నటనం బాగుండ లేదం"టే నటులమనుకొనేవాళ్లు బాధపడనక్కరలేదు. విషయం తెలియకపోయినా బాగా నటించవచ్చు. అయినా అటువంటివాళ్లు సహజప్రజ్ఞాధురంధరు లని సంతోషించుతాము. కాని వాళ్లుకూడా విషయవివేకం కలవాళ్లైతే ఆదర్శప్రాయు లౌతారు. సహజశక్తికి వ్యుత్పత్తి, అభ్యాసం ఉండాలిగా! లేకపోతే "అవ్యుత్పత్తికృతో దోషః స ఝడిత్యవభాసతే" శక్తి లేక వ్యుత్పత్తి ఉన్నా ప్రయోజనం లేదు. అది పువ్వు, ఇది పరిమళం; అది బంగారం, ఇది వాసన. దేన్ని వద్దంటాము? లోకాన్ని బాగుపరచటానికి నాట్య మవతరించింది. కాబట్టి వ్యుత్పత్తి ఉన్నపుడే విషయబోధ చేసి లోకమును అనుకూలమార్గంలో ప్రవేశపెట్టటానికి అవకాశం ఉంటుంది. కాబట్టి ఈ విశ అధ్యాయాలనైనా నటసామాజికులు అధ్యయనంచేసి లోకకల్యాణమును సంపాదించుతారని ఆశిస్తున్నాము.

ముఖ్యవిషయము

నాట్యానికి అనేకప్రయోజనా లున్నవి. అవాంతరప్రయోజనాలు ఎన్ని ఉన్నప్పటికీ మహారసమే నాట్యముఖ్యప్రయోజనం. ఇతర భేదగ్రహంలో నాట్యం ఉపయోగించినట్లితరా లుపయోగింపవు. అశ్రుతాదృష్టపదార్థాలనుగూడా దేశకాలభేదవ్యత్యాసం లేకుండా భావనాసమసమయంలో ఆస్వాదింపజేయగలశక్తి నాట్యానికున్నది. దృష్టశ్రుతమైనంతమాత్రాన జగద్వస్తువు ఆస్వాదమును సంపాదింపలేదు. ఆవస్తువుయొక్క అనుభవంలోకూడా నియమంగా సంతృప్తి కలుగుతుంది అనలేము. మనోరసానికి అనుకూలమైన ప్రవణత ఎక్కడ సంపాదింపబడితే అక్కడే ఆస్వాదం కలుగుతుంది. కాని మనోభావాలు ఇంకిపోతున్నప్పుడు ఎటువంటి ఆస్వాదము కలగదు. మనోవృత్తిలో విజృంభించే స్పందశక్తులను నిరోధించి సమానావస్థను సంపాదించినతరువాతనే సాధకుడు ఆస్వాదభూమికను అందుకోగలుగుతాడు. నాట్యంవలన చక్షురాదీంద్రియాలు ఏయే విధంగా ఉన్నప్పటికీ భావనాచక్షువు, భావనాశ్రోత్రము, భావనేంద్రియము స్వస్వవ్యాపారంలో బాగా మగ్నత పొందిఉంటవి. అందువలన మనోభూమికూడా భావనకు మహాసాగరం అవుతుంది. అప్పుడు మానసరాజ్యానికి మహావిజృంభణం కలుగుతుంది. కాబట్టి ప్రపంచభేదగ్రహం సులభము. ఇప్పుడు కలిగిన భేదవిజ్ఞానం ఆవిధంగానే ఉండక ఆత్మసత్తకు ప్రకాశమును సంపాదించుతుంది. ఈ మహాప్రకాశావస్థనే మహారస మంటాము. ఇటువంటి మహారససంపత్తిని నాట్యం అందజేయగలుగుతుంది. ఈ మహారససంపదే ఆత్మసంవేదనము. ఆత్మసంవేదనము నాట్యం చూచే ప్రతివానికీ కలుగదు. విశిష్టమైన అర్హత ఇక్కడకూడా అవసరము. అవాంతరంగా అర్హతాసంపత్తినికూడా నాట్యమే సంపాదించుతుంది. ధార్మికశిక్ష నివ్వటానికి మునులు నాట్యమును అవతరింపజేశారని ఆనందవర్ధను డంటున్నాడు. ధార్మికశిక్ష అనేది ఉపలక్షణము. స్వరూపసంవేదనానికి అవసరమైన అర్హతలను అన్నిటినీ అనుకూలంగా నాట్యము సంపాదించుతుందని మనము గ్రహించాలి.

ఏదోకారణాన ప్రజలలో విప్లవం కలిగింది. పాలకుడైన మనువు ప్రజలను సంతోషపెట్టవలసినవాళ్లనుగా చేయుటానికి పెద్దల అనుగ్రహాన నాట్యమును సంపాదించాడు. అనకూలమైన సమస్థితి కల్గినతరువాత నాట్యము రాజవినోదంలోకి వచ్చింది. రాజుల అంతఃపురాలలో తెరలచాటున ఉన్నన్నాళ్లూ నాట్యానికి తగిన వికాసఫలం కలగలేదు అని భావించనక్కరలేదు. క్రమక్రమంగా వికాసంపొంది ప్రజానీకానికి వచ్చింది. కాబట్టి నాట్యం ప్రజలదే. మేము పోషించాము, ఇది మాదే అని రాజు లన్నా ఒప్పుకోము. అయ్యా! ప్రభువులుంగారూ! కళలను పోషించవలసిన భారం మీదికాని వాటి స్వత్వంకూడా మీదే అవుతుందా? కడుపునిండిన మీరు మాది మాది అని అనుకున్నన్నాళ్లూ నాట్యఫలం ఎవరికీ, ఏవిధంగానూ అందదేమో అనుకోవలసివస్తుంది. మీరు పోషించండి. అది తప్పదు మీకు. మాకోసం మీరు పోషించాలి. అది మీధర్మం. మీరు, మీవంటివాళ్లు కేవలం వకాభానైనోదికం చేశారు. అందుచేత అనర్థదాయకం

కలగూరగంప

తలనొప్పి

మన ఆస్పత్రుల ఔటుపేషెంటుడిపార్టుమెంటుల్లో కూర్చుని చూస్తే, అక్కడికి వచ్చేరోగుల్లో సగంమందికి పైగా తాము పడే బాధల్లో తల నొప్పిని ఒక ముఖ్యలక్షణంగా చెప్పడం మనము వింటూంటాము. కర్మాగారాల్లోను, ఇంకా అటువంటి ప్రదేశాల్లోను పనిచేస్తూ సుస్తీగా ఉందని సెలవు కోరే వాళ్లల్లో నాల్గింట ఒకపాలు ఈబాపతువారే అని అధికారులు అంచనావేసి చెబుతారు. వేలకొలది ఇళ్ల లోనూ, శరీరాలలోనూ ఉండే అశాంతికీ, అసంతృప్తికీ ఈ తలనొప్పే ముఖ్యకారణము.

తలనొప్పి వచ్చిందనగానే మన మేం చేస్తామంటే ఆ తలనొప్పి పోవడానికి ఏదో ఒక మందు పుచ్చుకుంటాము. ఇంతకూ ఆ తలనొప్పి ఒక పెద్ద వ్యాధి అనే భావమే కాని, అది కేవలమూ ఒక వ్యాధికి లక్షణమనే భావమే జనింపదు. అందువల్ల ప్రతివాడూ కఫీఆస్పిరిన్ బిళ్లలో, ఆస్ప్రోమాత్రలో, వెరమాన్ బిళ్లలో, అమృతాంజనమో, ఆఖరికి ఏ హోమియోపతీ తియ్యమాత్రలో తమ ఉపయోగార్థం దగ్గర ఉంచుకోడం మామూలైపోయింది. ఈమందులన్నీ తలనొప్పినిమాత్రమే పోగొట్టగలవు. కాని దీనికి కారణమైన అసలువ్యాధిని ఏమాత్రమున్నూ పోగొట్టలేవు. ఇందుచేత ఒక్కొక్కప్పుడు ఇదేదో రాబోయే విషమస్థితికి ఒక సూచనేమో అనే మాటే మరచిపోతాము. ఇంతకూ ఆ తలనొప్పికి కారణం తల్లో తప్ప మరెక్కడైనా ఉండవచ్చు!

ఒక చిన్న విషయం. మన శరీరంలోని కొన్ని అవయవాల్లో గల నొప్పి మనకు తెలియదు. జీర్ణకోశము, కార్జము, ఊపిరి తిత్తులు, ఆఖరికి గుండె కాయ — వీటి నన్నింటినీ స్థానికంగా ఏ విధమైన నొప్పి లేకుండా కత్తితో కొయ్యవచ్చు. ఇలాచేస్తే వచ్చే నొప్పి మాత్రం నాడీమండలానికి ముఖ్య కేంద్రమైన శిరస్సులో కనబడుతుంది.

పెద్ద పెద్ద వైద్యగ్రంథాలు తిరగేస్తే తలనొప్పి ౨౦౩ రకములైన జబ్బుల్లో కనపడగలదని తేల్తోంది. ఈ జబ్బు లన్నిటిలోనూ వచ్చేతలనొప్పిని బాహుళ్యం మీద మూడు విధములుగా విభజింపవచ్చు: ౧. తలలో తాత్కాలికంగా తటస్థించిన అడ్డంకుల వల్లగాని (Mechanical), ౨. మైకముల వలనగాని (Toxic), ౩. శరీరమందున్న అవయవాల్లో తాత్కాలికంగా కలిగిన మార్పులతోగాని (Functional) వచ్చే తలనొప్పులు అని. చాలావరకు తలనొప్పు లన్నీ వీటిలో ఏ రెండు విధములకో చెందకతప్పదు.

మొదటివిధానికి చెందిన తలనొప్పులు తలలో ఉండే జబ్బులవల్లనో, లేక మరేలోపాలవల్లనో రావచ్చు. మన పుర్రెకు ముందు భాగమున నాసికా రంధ్రాల కిరుప్రక్కలా, పైన, కొన్ని గుహల వంటివి ఉన్నాయి. వీటి కన్నింటికీ నాసికలనుండి స్రోవ లున్నాయి. నాసికలలోని సున్నితమైన లోపలిపొర ఏ కారణం చేతైనా ఉబ్బితే ఈ స్రోవలు మూసికొని పోయి పైన చెప్పిన గుహల్లోని గాలి కొంత తగ్గి పోతుంది. ఈ కారణంగా ఈ గుహల లోపలిపొర లోపలి కీడ్వబడుతుంది. ఈ పొరలో అల్లుకొని ఉన్న చిన్న చిన్న నరాలన్నీ సాగుతాయి. అప్పుడు ఒక చిన్న నాదు పుట్టుతుంది. ఇదే జలుబుచేస్తే ముక్కు దిబ్బడివెయ్యగా కనిపించే శిరోభారము, తలనొప్పి! నాసికల్లో ఉబ్బిన లోపలిపొర ముడుచుకునే సాధ

వాలను వైద్యులు కల్పిస్తారు. అప్పుడు గాలి ఏ అడ్డూ లేకుండా నాసికల్లోంచి పోయి సైనసుల్లో ఏర్పడిన ఖాళీని నింపుతుంది. తలనొప్పి తగ్గుతుంది.

దృష్టిలో ఏ మాత్రం దోషమున్నా తలనొప్పి రావచ్చు. ముఖానికి దగ్గరగా పుస్తకము పెట్టుకుని చదవడం, పెద్దవెల్తుర్లో చదవడం, లేకపోతే పని చేయడం మొదలైనవి దీనికి దోహదాలు. ఈ తలనొప్పికూడా మొదటి రకానికి చెందినదే. నేత్ర వైద్యుని కనుక్కొని కళ్ళజోడు పెట్టుకుంటే బాధ నివారణ అవుతుంది.

ఒక్కొక్కప్పుడు మనలను గాఢనిద్రనుండి కూడ మేలుకొలిపేఅంత తీవ్రమైన తలనొప్పి రావచ్చు. పుర్రెలోని మెదడుకు తగిలిన గాయాలు, అందులో పుట్టిన సెలలు, కణుతులు, మెదడుయొక్క రక్తనాళాలకు సంబంధించిన వ్యాధులు, మెనింజిటీస్ మొదలు గాగలవి దీనికి కారణాలు కావచ్చు.

పుర్రె లేత కొబ్బరికాయవంటిది. దాని లోపలి భాగమంతా మెత్తటి మెదడుతోను, సెరిబ్రో స్పైనలు ఫ్లూయిడ్ (Cerebrospinal fluid) అనే ద్రవంతోనూ దట్టంగా నిండి ఉంది. ఈ ద్రవ మెంతమాత్ర మెక్కువైనా పెద్ద తలనొప్పి వస్తుంది. మెదడుపైన తోలువంటి "డ్యూరా" (Dura) అను తెల్లటిపొర ఒకటి ఉంది. ఆ పొర ఎంతమాత్రమూ సాగదు. దాని మీద లెక్కలేనన్ని చిన్న చిన్న నరాలు వలలాగు చిక్కగా అల్లుకుని ఉన్నాయి. ఈ డ్యూరాను శస్త్ర వైద్యుని కత్తితో ఇసుమంతైనా నొప్పి పెట్టకుండా నాటుపెట్టవచ్చు. కాని ఏ మాత్రం సాగజేయ ప్రయత్నించినా అమితమైన తలనొప్పి పుట్టుతుంది. మైకం వల్ల కలిగే తలనొప్పికి ముఖ్యకారణం ఇదే!

రెండవరకానికి చెందిన తలనొప్పులకు శరీరంలోనే తయారయే విషపదార్థాలుగాని, ఇతరాలైన మద్యము, విషవాయువులు, పొగాకు మొదలైనవి కాని కారణాలు. మూత్రపిండాలు పాడైనప్పుడు, మలబద్ధక మున్నప్పుడు, అత్యుష్ణంతో కూడుకున్న వ్యాధులు మన కున్నప్పుడు శరీరంలో కొన్ని విషాలు తయారయి రక్తంలో పారుతుంటాయి. ఈ విధంగా రక్తంలో పారు విషాలు మెదడును అంటిపెట్టుకున్న పొరలోని చిన్న రక్తనాళాలను ఉబ్బేట్టు చేసి పైన ఉన్న డ్యూరాను సాగజేయ ప్రయత్నిస్తాయి. అప్పుడు తలనొప్పి వస్తుంది. మరొకప్పుడు చుట్టపొగ ఎక్కువైతే ఒక విషపదార్థం రక్తంలో పారి రక్తనాళాలను సన్నగిలజేసి మెదడులోని రక్తప్రసారాన్ని తగ్గించవచ్చు. చుట్టపొగ కిట్టనివాళ్లు సినీమాకు వెళ్లిరాగా వాళ్లకు వచ్చే తలనొప్పి ఇదే. సాధారణంగా ఇలాంటి సందర్భంలో వచ్చే తలనొప్పిలో రోగి నిద్రనుండి లేవవచ్చు. అప్పుడు నిత్యవిధిగా త్రాగే కాఫీపానీయాన్ని సేవిస్తే తలనొప్పి తగ్గిపోతుంది. ఎందుకంటే ఆ కాఫీలోని 'కఫీన్'లో సన్నగిలిన రక్తనాళాలను ఉబ్బేట్టు చేసే శక్తి ఉంది కనుక.

కొన్ని సందర్భాల్లో బాహ్యచిహ్నంగా కనిపించే తలనొప్పికీ, దానికి కారణమైన వ్యాధికీ సంబంధం నిరూపించడం కష్టమవుతుంది. ఇలాంటి తలనొప్పులు మూడోరకానికి చెందుతాయి. ప్రతి వైద్యుణ్ణీ చాలా తబ్బిబ్బు చేస్తాయి! అధికమైన రక్తపుపోటు, పాండురోగము, ఋతుస్రావము మొదలైన వాటిల్లో వచ్చే తలనొప్పులు పైబాపతువే.

కొన్ని సమయాల్లో కారణం మానసికంగా ఉంటుంది. దానినే 'సైకోజనిక్' తలనొప్పి (Psychogenic head-ache) అంటారు. ఇది లోపల అణచిపెట్టి ఉంచిన ఉద్రేకములవల్లనై యుండవచ్చు. ఇష్టంలేని పని చెయ్యవలసివచ్చినప్పుడు ఈ రకం తలనొప్పే వస్తుంది. నిరుత్సాహము, మనోవ్యధ, నిరానందము, లోపల అణచిపెట్టుకొని ఉన్న అమోఘములైన ఆశలు తలనొప్పిరూపంగా వ్యక్తమగుట కూడా కద్దు. మనస్సును ఆకట్టి ఉంచగల ఏదో ఒక విషయంలో కృషిచేయడంవలనగాని, అంతకంటే ఉత్తమమైన పద్ధతిని – సర్వసమ్మతమైన పద్ధతిని అనుసరించి ఆ అణచి పెట్టుకున్న ఆశలను కొనసాగించుకుని గాని ఈ తలనొప్పిని పోగొట్టుకోవచ్చు.

ఒక ఆస్పత్రిలో తలనొప్పి సాధారణంగా ఏయే కారణాలవల్ల హెచ్చుగా వస్తుంది అని అంచనావేస్తే

తేలిన విషయం ఇది. నిస్త్రాణ, ఆకలి (ఈ రెండు కారణాలవల్లా మెదడు రక్తపుష్టి తగ్గగా), మలబద్ధము, అజీర్ణము, మద్యపానము, దృష్టిలో దోషము, అంటు వ్యాధులు (వాటితో వచ్చే విషజ్వరాలతో సహా), ఋతుస్రావదోషము, పిరికితనము, మూత్రపిండాల జబ్బు, ముక్కులోని అసందర్భాలు, నరాల పీకు వగైరాలవల్ల అవి.

అప్పుడప్పుడెప్పుడేనా వచ్చే చిన్న నాటు లాంటి తలనొప్పి ఏమీ బాధాకరమైనది కాదు కాని తరుచు వస్తూ చాలాకాలము ఉండే తలనొప్పిని ఒక కంట కనిపెట్టి ఉండాలి. తలనొప్పి వచ్చీ రావడంతోనే మాత్రలను మింగేంతటి మూర్ఖము వేరేదీ లేదు.

చాలా కారణాలచేత మలబద్ధకం రావచ్చు. అప్పుడు విరేచనాలకు మందుపుచ్చుకున్నా తలనొప్పి తగ్గదు. కనుక అలాంటప్పుడు కేవలం విరేచన కారులైన మందులనే నమ్మి ఉండకూడదు. తలనొప్పి మాత్రలు ఇక్కడ నిజంగా వాడాలి. వాటిల్లో కొన్ని హానికరమైనవి వున్నాయి. వెరమాన్ బిళ్లలు అంత హాని చెయ్యవు. వైద్యుని సలహాపైన కఫీ ఆస్పిరిన్ మాత్రలను తగుమాత్రంగా సేవించవచ్చు.

కాని, ఈ క్రింద ఉదాహరించిన ఉపశమన పద్ధతులు కొంతవరకు ఉపకరిస్తాయేమో! ఆకలి, నిస్త్రాణ, హెచ్చు పరిశ్రమ — వీటివలన సాయంత్రం ఇంటికి తిరిగివచ్చేటప్పటికి తలనొప్పి వస్తే తేలికరైన ఆహారం కొంచెంగా పుచ్చుకోవడం, కట్టుబట్టలు వదులుచేసికొని చీకటిగదిలో ఒక అరగంట పడుకోవడం, నుదురుమీదా కళ్లమీదా తడిగుడ్డ పిండి పెట్టుకోవడం — ఇలా చేస్తే కొంత ఉపశమనం అవుతుంది. ఒక్కొక్కప్పుడు వేణ్ణీళ్ల స్నానం చేస్తే రక్తం దేహమంతటా వడిగా ప్రవహించి తలకు కావలసిన రక్తం పారి తలనొప్పి పోవచ్చు. ఒకవేళ మెదడుకే రక్తం ఎక్కువైతే పాదాలు వెణ్ణీళ్లలో ముంచి ఉంచితే రక్తం కాళ్లలోకి దిగి శిరోభారం తగ్గగలదు. ఇలాంటి సాధనాలవల్ల ఔషధసేవ చెయ్యకుండానే తలనొప్పి తగ్గిపోగలదు.

తరుచుగా వస్తూ చాలాకాలం ఉండే తలనొప్పికి కారణం ఇదమిత్థమని తేలితే ఎన్నో సందర్భాల్లో ఒంట్లో ఉన్న అనారోగ్యం చక్కబడితే తలనొప్పి తిరిగి రాకుండా పోగలదు. కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో నవీనపద్ధతులవల్ల, శస్త్రవైద్య శిఖామణుల సహాయంమీదట చాలావరకు బాధా నివారణ కాగలదు.

ఏమైనా సరే, తలనొప్పి పట్టు విడవకుండా ఉంటే, తత్క్షణం వైద్యుని సలహా తీసుకోవాలి. అంతకు మించిన ఉత్తమ పద్ధతి మరేం లేదు.

[ఒక ఆంగ్ల వ్యాసమునకు స్వేచ్ఛానువాదం]

విస్సా రామచంద్రరావు

స్వతంత్రమ్?

స్వరాజ్యం ప్రతిజీవియొక్క హక్కు అనీ, మనిషి ఎట్టి కట్టుత్రాళ్లూ లేక జన్మించినా శృంఖలాబద్ధుడగుచున్నాడనీ, స్వతంత్ర మనగా "కర్తు మకర్తు మన్యథావా కర్తుం సమర్థః" అనీ, పరతంత్రమనగా ఇతరసత్తాధీన సత్తాకత్వం అనిన్నీ, స్వతంత్ర మనగా ఇతర సత్తానధీన సత్తాకత్వం అనిన్నీ మనలో మాటకి అనుకుంటూ ఉన్నాము. పడమటి దేశాలలోని కొందఱు మహామహులు యిదే విషయమై యేమని వాకొన్నారో చూదాం:

మనిషియొక్క గణ్యతకి, వాని సౌఖ్యానికి స్వేచ్ఛకన్న సారతరమైనది మరిలేదు.

బుల్వర్

* * *

కబోది – కవి మిల్టన్ ఇలా పలికినాడు:

“తెలిసికొనుటకు, వివేచించుటకు, విశ్వసించుటకు, అంతరంగ ప్రేరితుడనై స్వేచ్ఛగా మాట్లాడుటకు స్వేచ్ఛ ప్రసాదించు. ఈ స్వేచ్ఛ ఒకటి ఒక యెత్తు, ఇతరమైన స్వేచ్ఛ అంతయు ఒక యెత్తు.”

* * *

పర్వతమును భూగర్భమునుండి పెకల్చి వేయుట సులభమగునేమో గాని స్వేచ్ఛాజీవులై బ్రతుక సంకల్పించినవారిపై దాసత్వము మోపుట మాత్రము కాదు.

స దీ

* * *

సత్యమును పురస్కరించుకొని స్వేచ్ఛ పొందిన వాఁడేనయా స్వతంత్రుఁడు — తదితరు లందరూ పరతంత్రులే.

కౌ ప ర్

* * *

స్వతంత్రత మే ప్రజపైనను అవతరించదు. ప్రజలే స్వతంత్రతాస్థాయికి ఉద్గమించవలెను. అనుభవింపక పూర్వము కష్టించి సంపాదించవలసిన మహావర మది.

కా ల్ట న్

* * * *

స్వేచ్ఛ న్యాయబద్ధమైనపుడే రాణింపు.

బ ర్ట న్

* * *

అఖిల జనులు సమ - జన్ములు; జన్మసిద్ధములును, పరాస్తములు కాజాలనివియు నగు అధికారములచే బ్రహ్మగారు సర్వులను ఆమంత్రించిరి; ఈ అధికారములలో జీవనము, స్వతంత్రము, సౌఖ్యాన్వేషణము ఇమిడి యున్నవి— అను యీ సత్యములు ప్రత్యక్షములని, పరమప్రమాణము లని మన [illegible]ము.

[illegible]

* *

ఒక ప్రజ స్వతంత్రులు అనగా వారి ప్రభుత్వపు రూపురేఖ లెట్లున్నను వారు తమకు తామే యేర్పఱచుకొనిన రాజ్యశాసనములచే పాలించబడుచున్నా రన్నమాట. భగవచ్ఛ్రుతిపాదితములైన ధర్మశాస్త్రములకును, స్వదేశ న్యాయశాసనములకును సమంజసముగ నుండురీతిని తన వేళ పాళలకును, తన పనిపాటులకును తానే అధికారియై యుండుట వ్యక్తియొక్క స్వేచ్ఛకు తాత్పర్యము.

క్రా లీ

స్వతంత్రము ఒక జాతి యిచ్చే వాయనము, మరొకజాతి పుచ్చుకొనే వాయనమూ కాదు. జాతియొక్క సారతరమైన రుధిరముతో చేకొనవలసిన మహానిధి అది. నిరంతరమైన కష్టముయొక్క, ఎవలేని యిడుములయొక్క ఫలితార్థ మది.

గాంధీ

[సం. వరదాతవర్మ.]

కీ. శే. కళాప్రపూర్ణ వేదము వేంకటరాయశాస్త్రి గారు మీనుమిగిలిన పండితు లని యెల్లరు నెఱిగినదే. వారి యుపన్యాసముల లోను, వ్యాసములలోను సమగ్రములుగా నుంచినట్టివానిని ఇదివరలో భారతిలో ప్రకటించియుంటిమి. శాస్త్రులవారు తమ విజ్ఞానము నంతటిని గ్రంథకరండములలో పదిలపఱచియే గతించినారు! సంస్కృతాంధ్రగ్రంథములపై వారి రచనము లఖండముగా గలవు. ఉపన్యాసములకై వారు వ్రాసికొనిన చిత్తు (నోట్సు) నోటుబుక్కులును చాల గలవు. వానిలో ప్రకటనార్హము లైన భాగము లనేకము లున్నవి. వింతవింతసంగతులు అందు నిరూపింపబడియున్నవి. వాటినెల్ల నొకటొకటిగా ఇందు ప్రకటింపదలచినాము. అందులో నీ చిన్నితునుక యొకటి. వీనిని ప్రకటించుటకు మాకు సమ్మతినిచ్చిన శాస్త్రులవారి పౌత్రులకు మేము కృతజ్ఞులము :

నవద్వీపములో బిరుదప్రదానము

పూర్వము నవద్వీపమందు మహోపాధ్యాయ, మహామహోపాధ్యాయబిరుదముల నొసంగు తెలంగును పెద్ద లిట్లు చెప్పుదురు. పరీక్ష్యుఁడు ఏదేశమునుండి యేనియు వచ్చును. అచట ఏటిలో స్నానఘట్టమున శాస్త్రమంటపము కలదు. దానికి వేలువేలుశాస్త్రములకు వేలువేలు పావంచాలు ఉండును. పరీక్ష్యుఁడు ఏశాస్త్రమునం బరీక్ష యీవచ్చినాఁడో ఆ పావం

చాపైఁ గూర్చుండును. ఆతనింగని విద్యార్థులు స్నానమై యింటికేఁగి ఆతనిరాకను తమ గురువుల కెఱింగింతురు. వెంటనే గురువు లాతని రావించి అతిథి కరించి నిత్యము నపరాహ్ణంబున సభ గావించి ఆ శాస్త్రమునం బ్రశ్న లడుగుదురు. ఆతనికి చూచుకొనుటకు వలసిన గ్రంథములను అడిగిన వెంటనే యిత్తురు. ఉత్తరము చెప్పుటకు వలసినంతకాలము ఇత్తురు. ఆ కాలమునకు చెప్పలేక మరల నడిగినను ఇత్తురు. కాని ఆ శాస్త్రము విషయముగా ఎవ్వరితోను భాషించి తెలిసికొనఁగూడదు. ఈ తీరున ఒకగురు వైనపిమ్మట మఱియొకగురువుగా గురువు లందఱును పరీక్షింతురు. ఒక ప్రశ్న యేనియు కన్నది విన్నదిగా నుండదు. ఏగురు వడిగిన యేప్రశ్నకు ఉత్తరము చెప్పలేకపోయినను, అంతటితో పరీక్ష సరి. పరీక్ష్యుఁడు భగ్నుఁడే. అందఱు గురువులకును సకలప్రశ్నలకును ఉత్తరములు చెప్పినా, ఆ శాస్త్రమున జయపత్త్రికను వారందఱును చేవ్రాలు చేసి యిత్తురు. ఇట్లు నాల్గుశాస్త్రములందును జయ మొందినచో మహామహోపాధ్యాయబిరుదము నొసంగి తత్ప్రకాశకముగా పత్త్రిక నొసంగుదురు. అట్లే ఏకైకశాస్త్రమునకు మహోపాధ్యాయ బిరుదమును ప్రసాదింతురు. అట్టివేతలను ఏసంస్థానమందును ఎవ్వరును పరీక్షింపఁగూడదు. "అభిజ్ఞులరు దయచేసితిరి, ఏమేని సెలవిచ్చి మమ్ముం గృతార్థులం జేయవలయును" అని యడుగవలయును; విని పూజించి పంపవలయును. అది అభిజ్ఞమార్గము.

కీ. శే. వేదము వెంకటరాయశాస్త్రి

రూపాయికథ

ఇది 'ఒకవూర్లో ఒక రాజుండె' అన్నే కథ కాదు. అయినా అందరూ చదివి తీరాల్సిన కథ. దీని పేరు రూపాయి కథ.

ఇప్పుడు మనం ప్రతిదినమూ కావలసినవి కొనుక్కోడానికి వాడుతామే — తెల్లనిది, గుండ్రటిది — రూపాయి! ఈ రూపాయి సమాచారం ఏమైనా మీకు తెలుసునా? లేకపోతే ఇప్పుడు తెలుసుకోండి.

బంగారం స్వేచ్ఛగా నాణెం వేయబడుతూండే దేశాన్ని 'గోల్డు స్టాండర్డు' దేశం అంటారు. యూరోపు యుద్ధానికి పూర్వం యూరోపు, అమెరికా దేశాల్లో అంతటా బంగారు నాణ్యాలు ప్రచారంలో వుండేవి. యుద్ధానంతరం ఆర్థిక కష్టాలనుంచీ, యుద్ధం జరుపడానికి తగిలిన ఖర్చులనుంచీ ఆ దేశాల సర్కారులన్నీ మిక్కిలి అప్పుల్లో పడినాయి. బంగారంతా ఇతర దేశాలకు అమ్మివేసినారు. నాణ్యాలకు బంగారే లేకపోయింది. అందుచేత దానికి ప్రత్యామ్నాయంగా కాగితం వాడడం మొదలు పెట్టినారు. ఈ కాగితానికి, గుర్రానికి గుళ్లమాదిరి, కొన్ని గుర్తులుంటేనే చలామణి అవుతుంది. ఈ పద్ధతికి 'ఇర్రిడీమబుల్ పేపర్ స్టాండర్డ్' — అంటే బంగారానికి మార్చబడని కాగితం ఆధారంగా వుండే నాణ్యపద్ధతి అని పేరు. అటు తర్వాత ౧౯౨౫-వ సంవత్సరంలో ఇంగ్లండు ఈ కాగితంపీడ వొదిలించుకుందామని మరల ఒక విధంగా గోల్డు స్టాండర్డే అవలంబించింది. కాని ౧౯౩౦-వ సంవత్సరములో దానికొక గొప్ప ఆర్థిక విపత్తు (Depression) వచ్చింది. అన్ని పదార్థాల ధరలు తగ్గి వ్యాపారమంతా పూర్తిగా పడిపోయే స్థితికి వచ్చింది. ఆ విపత్తులో ఇంగ్లాండుకు గొప్ప నష్టం కలిగింది. దాని గోల్డు స్టాండర్డు స్వప్నానికి ఒక గొప్ప దెబ్బ తగిలింది. అంతతో అది గత్యంతరం లేక మళ్లీ ఆ 'ఇర్రిడీమబుల్ పేపర్ స్టాండర్డు'కే తిరిగింది. ఈ పద్ధతిని గురించి కొంచెం [illegible]సుకుందాము. ఇప్పుడు మన నోట్లు ఎ[illegible]వో తెలుసునా? ఢిల్లీలో ఒక పెద్ద బ్[illegible]. దాని పేరు రిజర్వు బ్యాంకు. మన దే[illegible] వుండే ముఖ్యమైన బ్యాంకు లన్నిటిలోకీ ముఖ్యమయింది ఆ రిజర్వు బ్యాంకే. దాని విషయం వ్రాయవలసివస్తే గొప్ప గ్రంథ మవుతుంది. మనకు వచ్చే నోట్లు ఆ బ్యాంకునుంచే వస్తాయి. ఈ నోట్లు ఎట్లు పుట్టినాయంటే — 'ఏ' అనే వాడు 'బి' అనే వాడి దగ్గర అప్పు తీసుకుంటే ఒక పత్రం వ్రాసియిస్తాడు. "ఫలాని సైకం ఇంత వడ్డీతో ఈ దినం నీ వద్ద నావుపయోగానికి తీసుకున్నాను — ..." అని 'ఏ' వ్రాసి యిస్తాడు 'బి' కి. అదేరీతిగా ఈ బ్యాంకు కూడా పత్రా లిస్తుంది. దానిలో ఒక అవతారమే ఈ కరెన్సీ

నోట్లు. ఏదైనా ఒకనోటు చేతికి తీసుకొని చూడండి. దాని మీద 'I promise to pay the Bearer the sum of Rupees..." అని వుంటుంది. ఇది సంక్షిప్త రూపంలో వుండే ఒక ప్రామిసరీనోటు అని ఇందువల్ల విస్పష్ట మవుతూవుంది.

మనకు రిజర్వు బ్యాంకు ఎట్లో అట్లే ఇంగ్లండులో ఒక బ్యాంకు వుంది. దాని పేరు 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్' అని. అది కూడా ఇట్లాగే నోట్లనే ప్రచారంలో పెడుతుంది. ౧ పౌ. నోట్లు, ౫ పౌ. నోట్లు — ఇలాంటివి — మనదేశంలో ౧ రూ., ౫ రూ., ౧౦ రూ. ......నోట్లులేవూ? అట్లే అక్కడా వున్నాయి. వీటికి 'స్టర్లింగు నోట్లు' అని పేరు. ముందు, అంటే ౧౯౩౦ కి పూర్వం ఈస్టర్లింగునోట్లు బంగారానికి మార్చే పద్ధతి వుండేది. కాని ఇప్పుడు ఆ సౌకర్యం లేదు. ఇదంతా విస్తరించి చెప్పవలసివస్తే ఒక పెద్ద పురాణం పొడవవుతుంది. కనుక ఇంతటితో ఈ నోట్ల జిజ్ఞాసను చాలించి ప్రస్తుతం రూపాయి కథకు వస్తాము.

౧౨ పెన్నీలు — ౧ షిల్లింగు

౨౦ షిల్లింగులు — ౧ పౌను

అనే టేబిలు మీకు కంఠతా వస్తుందికదా! ఒక పౌనుకు ఎన్ని పెన్నీలు చెప్పండి చూదాము? ఒక పౌనుకు ౧×౨౦×౧౨=౨౪౦ పెన్నీలు. ఔనా. మన రూపాయకూ, ఇంగ్లీషువాళ్ల పౌనుకూ బాంధవ్యం వుంది—మనకూ, ఇంగ్లీషువాళ్లకూ వుండే బాంధవ్యంబట్టి. ఆ బాంధవ్యం ఏలాంటిది అంటే మన రూపాయకు ప్రస్తుతపు ధరల ప్రకారం వాళ్లు ౧౮ పెన్నీలు యిస్తారు. అంతర్రాష్ట్రీయ వ్యవహారాలు ఈ ధరల్లోనే సాగింపబడుతాయి.

౧ రూపాయికి — ౧౮ పెన్నీలు

౧౮ పెన్నీలకి — ౧ రూపాయి

౨౪౦ పెన్నీలకి — $\frac{౨౪౦}{౧౮}$ =౧౩-౫-౪

ఒకపౌనుకు రూ. ౧౩-౫-౪ ప్రకారం బాంధవ్యం వుంది.

ఈబాంధవ్యంవల్ల వారి పౌనుకు (స్టర్లింగు) ఏయే గ్రహచారాలు పడుతాయో మనరూపాయకు కూడా అదే గ్రహచారాలు తప్పింది కాదు.

ఒక ఉదాహరణం చూడండి: ౧౯౩౧-వ సంవత్సరం సెప్టెంబరు ౧-వ తేదీనాడు ఇంగ్లండులో బంగారంకరువు వచ్చినందువల్ల అది నోట్లు చలామణీకి తెచ్చింది. ఈనోట్లు వెనకటివలె బంగారం ఆధారంగా వుండేవి కావు. వెనక ౧ పౌను నోటుకు ఇంగ్లండు బ్యాంకు ౧ బంగారుసవరను ఇస్తూవుండేది. కాని ఆ దినంనుంచి నోటుకు సవరను రావడం లేదు. సవరనుకు ఎక్కువనోట్లు ఇవ్వవలసిన కాలం వచ్చింది. ఇప్పుడు ఒకసవరనుకు దగ్గరదగ్గరగా ౨ పౌనునోట్లు ఇవ్వాలి. అంటే బంగారంధర నోట్లమూలంగా ఎక్కింది. ఆనోట్లమీదనే ఆధారపడివుండే మన రూపాయకూ అదేగ్రహచారం పట్టింది! అందుకే చూడండి మునుపు రూ. ౧౩-౫-౪ కు వస్తూవుండిన బంగారుకాసులు ఇప్పుడు సుమారు రూ. ౨౯ ధరకు పెరిగివాయి! రూపాయలు ఎక్కువగా సంపాదించవచ్చునని మనవాళ్లంతా పెట్టెల్లో దాచిపెట్టిన బంగారంతా అమ్మివేస్తుండడముకూడా ఇందువల్లనే. దీనికి ప్రతిఫలంగా బొంబాయినుండి ప్రతిసంవత్సరమూ కోట్లకొలది రూపాయల బంగారు విదేశాలకు ఎగుమతి అవుతున్నది. ౧౯౩౯-౪౦ సంవత్సరంలో ౩౬ కోట్ల బంగారం రప్తుఅయింది యిక్కడనుండి. ౧౯౩౧-౪౦ వరకు మొత్తం ౩౨౫ కోట్ల రూపాయలకు పైగా బంగారం మనదేశంనుంచి ఎగుమతి అయింది. ఇందుమూలంగా మనదేశానికి అమితమైన నష్టం కలుగుతూ వున్నది.

అట్లాగయితే మనం స్టర్లింగుపీడ వొదిలించుకుందామా అనే సందేహం రావొచ్చు. కాని అదికూడా అసాధ్యంగానే కనపడుతుంది. మనదేశంలో వుండే నాణ్యాలన్నీ తప్పుడు నాణ్యాలు. అంటే వాటిలో వుండే లోహంవిలువకూ వాటి ముఖముద్రవిలువకూ చాలా తేడా వుంది. ఒకరూపాయలో వెండి తులానికి తక్కువే వుండినా ఆరూపాయ రెండుతులాల వెండిని కొంటుంది. ఈకష్టం బంగారంలేకపోతే తప్పక కలి

గేదే! గోల్డుస్టాండర్డుకు మన నాణ్యాలను పరివర్తించడానికి వీలులేదు. అందువల్ల మన నాణ్యాలను ఇంకేదైనా ముఖ్యమైన దేశపునాణ్యాలకు అతికిస్తేనే కాని అంతర్రాష్ట్రీయవ్యవహారాలు సాగవు. ఇవన్నీ చాలా క్లిష్టమైన సంగతులు. జపానుకూడ తన 'యెన్ను'లను స్టర్లింగుకే అతికించింది. అందుకోరకు మనకూ గత్యంతరంలేక, మన రాజకీయనాయకులూ వారే ఐనందున వారి నాణ్యానికే మన రూపాయనూ అతికించినాము.

కొంతమంది ౧౮ పెన్నీలరూపాయ మనకు ఇంకాయెక్కువ ఉపయోగానికి వస్తుందని వాదిస్తారు. వారి వాదనకు కారణాలు

(౧) దేశంలో బంగారం ఎగుమతి తప్పించడం,
(౨) మనవస్తువుల ఎగుమతిని వృద్ధిపరచడం,
(౩) ధాన్యాల విలువ ఎక్కించడం


అని. కాని నిజంగా ౧౮ పెన్నీలరూపాయ వల్ల ఈ ఆశయాలు నెరవేరవు. ఎందుకంటే,

(౧) ౧౮ పెన్నీలరూపాయ ప్రచారానికి వస్తే బంగారంఎగుమతి తగ్గదు. బంగారానికి ఎక్కువ రూపాయిలు వస్తాయి. అందువల్ల ఇంకా ఎక్కువ బంగారాన్ని మనవారు అమ్ముతారు.

(౨) ఎగుమతులు వృద్ధిపరచడం అనేది అర్థం చేసుకోడానికి కొంచెం కష్టమైన విషయం. కాని ఇప్పుడే మనదేశం ప్రతిసంవత్సరమూ ౮౦ కోట్ల రూపాయిల వస్తువులను దిగుమతులకన్నా ఎక్కువగా ఎగుమతి చేస్తున్నది. ఇదంతా ఇంగ్లండుకే పోతుంది. వాళ్లు దాన్ని మ్రింగివేస్తున్నారు. ఇంకా ఎగుమతి జాస్తీ అవుతే దాన్నుంచి మనకు లాభంలేదు. రూపాయిధర తగ్గితే మనకు విదేశాల్లో అప్పులు విశేషంగా ఉన్నాయి. వాళ్లకు వాళ్ల నాణ్యాల్లోనే అప్పు లివ్వాలి. వాళ్ల నాణ్యాలు అప్పుడు ప్రియం అవుతాయి. మన దేశం ఇంకా యెక్కువరూపాయీలు వ్యయించాలి కనుక నష్టం. అంచేత ౧౮ పెన్నీల రూపాయి నష్టదాయకమే.

(౩) ధాన్యాల ధరల విషయం : ఎగుమతులు వృద్ధికావడంనుంచి ధాన్యాలకు ధరలు పెరుగుతాయని కొందరి మతం. కాని మన దేశంనుంచి పరదేశానికి పోతున్నది ౮% ధాన్యంమాత్రమే. అందునుంచి ధాన్యంధర పెరుగుటలో మన కర్షకునికి విశేషం ఉపయోగంలేదు. వీరుమిక్కిలి మధ్యవర్తులకు ఇంకా జాస్తీ లాభం.

బి. యస్. నరసింహాచార్యులు





విమర్శనము

సర్వం విష్ణుమయం జగత్

కర్త: శ్రీ వివేకానందస్వామి: అనువాదకుడు: శ్రీ మాధవ చైతన్య బ్రహ్మచారిగారు, మద్రాసు మైలాపూరులోని శ్రీరామకృష్ణ మఠమువారిచే ప్రకటితము. వెల రు. ౦-౧-౬.

"భగవంతుడు సర్వాంతర్యామి" అను విషయమునుగూర్చి స్వామిగారు లండనులో ఇచ్చియుండిన ఉపన్యాసమున కిది ఆంధ్రానువాదము.

"బహిరంతశ్చ భూతానా మచరం చర మేవచ,
సూక్ష్మత్వా త్తదవిజ్ఞేయం దూరస్థంచాంతి కేచతత్"
"అవిభక్తంచ భూతేషు విభక్తమివచ స్థితమ్"

ఇత్యాది వాక్యములందుగల భావార్థ మీ చిన్న పుస్తకములో వివరింపబడినది. సందర్భానుసారముగా వివిధ మత బోధలలోగల సమానత, నియతికర్మాచరణము, అసలైన త్యాగలక్షణము మొదలగు ననేక విషయములు క్లుప్తముగా విశదీకరింపబడినవి.

తరువాత (What next)

రచయిత: శ్రీ లక్ష్మణరావుగానం గారు. సస్తా గ్రంథ ప్రచురణ మండలివారిచే ప్రకాశితము. షీప్ పబ్లిషింగ్ అండ్ కో., ౧౬౮/౮ త్రూపుబజారు, హైదరాబాదు (దక్కను.) వెల రు. ౦-౨-౦.

హైదరాబాదు సంస్థానములోని రాజకీయస్థితిగతులను తప్పుంగల భారతీయులకందరకూ, — ప్రపంచానికంతకూకూడ — తెలియ చేయుటకు ఆంగ్ల భాషలో వ్రాయబడిన చిన్న గ్రంథ మిది. "ప్రజా సత్తాకమునుంచి ఎన్నో మైళ్లు" (Miles off from Democracy), "హైదరాబాదు — సంస్కారములు" (Hyderabad and the Reforms), "న్యాయాన్వేషణములో" (In quest of Justice) మున్నగు శీర్షికలతో ఆ సంస్థానమునందలి హిందూ ముసల్మాను ప్రజలు ఏ విధముగా పరిపాలింపబడుచున్నదియు వివరింపబడినది. బారిష్టరు వినాయకరావు విద్యాలంకారుగారి ఉత్తమమైన పీఠికయు నిందు కలదు. తెలుగు భాషలోని అణా గ్రంథమండలివారివలె ఈ సస్తా గ్రంథప్రచారకులును తమ పరిస్థితులను లోకమున కంతయు చాటబూనుకొనుట శ్లాఘనీయము.

విశ్వజనని

తాంబ్రంలోని భారతకన్యా విద్యాలయము తరఫున శ్రీమతి యామినీ పూర్ణతిలకమ్మగారి సంపాదకత్వమున నూతనముగా వెలువడిన మాసపత్రిక. సంవత్సరము చందా రు. ౧౨-౦-౦. కార్యస్థానము నెల్లూరులో.

ఇది స్త్రీల యొక్క సమస్తములైన అభివృద్ధులను గురించి ప్రయత్నించి, సాధించవలయు ననెడి ఉదారాశయముతో ప్రకాశితమైన పత్రిక. పురుషులు గూడ తెలుసుకోవలసిన అనేక సమాచారము లిందు గలవు. పత్రిక చిన్నదైనప్పటికీ వేరు వేరు వ్యాసములు పఠనీయము లిం దున్నవి. కాలవ్యవధి చాలనందున తలపెట్టికొన్న విధముగా అందచందాలతో ప్రకటితం కాకపోయినా ముందైనను సర్వాంగ సుందరంగా పత్రిక వెలువడుతుం దని ఆశించవచ్చును. 'బరెకనిబిడ్డ బారెడన్నట్లు' 'ఆరంభశూరత్వము' ప్రకటింప నొల్లని శ్రీమతిగారి సదుద్దేశము ననుసరించి ముందు

నుంచీ ఈపత్రిక పన్నెండు రూపాయలచందాకు తగిన బహిరంతః స్వరూపాలతో పాఠకుల నందరినీ సంతృప్తి పరుస్తుందనే మా ఆశయము.

స్వీ కా ర ము

—◇—

వీర తానాజీ

గ్రంథకర్త: శ్రీ ముక్కబోట్ల సత్యనారాయణ మూర్తిగారు. చర్ల, via దుమ్ముగూడెము, తూర్పు గోదావరిజిల్లా. వెల రు.౧-౦-౦.

కళ్యాణి

ప్రతి ఆదివారమూ వెలువడు వారపత్రిక. సంపాదకుడు పి. బాలకృష్ణశాస్త్రిగారు, తెనాలి. వెల విడి ప్రతికి రు. ౦-౦-౬. సంవత్సరం చందా రు ౨-౦-౦.

ఛా య

[ఇతర నాటికలు]

గ్రంథకర్త: ముద్దా విశ్వనాథముగారు, ప్రజామిత్రకార్యాలయము, రాయపేట, మద్రాసు; ప్రాప్తిస్థానము: ఆంధ్రభూమి బుక్కుడిపో, వేపేరి, మద్రాసు. వెల మూడుఅణాలు.

సూర్యప్రభ

[మాసపత్రిక]

సంపాదకుడు: డి. అప్పారావుగారు, గోవిందప్ప నాయకన్ వీథి, జి. టి. మద్రాసు. సంవత్సరచందా రూపాయన్నర. విడిసంచిక రెండణాలు.

కళలు, ఆరోగ్యము, విజ్ఞానము అనువిషయములకు ప్రాధాన్యమునిచ్చు నుద్దేశ్యముతో ఈ నూతన మాసపత్రిక ఈ ఉగాదినాడు ప్రారంభమైనది. మొదటి సంచిక ఆశాజనకముగానే యున్నది.

ఉద్యానం

[కథాసంపుటి]

గ్రంథకర్త: పురాణం కుమార రాఘవశాస్త్రి గారు, బి. ఏ., వాడపల్లిహౌసు, బెజవాడ. ఇందులోని కథలు అయిదు. పుస్తకము వెల అయిదు అణాలు.

భా ర వి

[పద్యకావ్యము]

గ్రంథకర్త: దరిమడుగు కామయ్యగారు, కుల్లూరు, నెల్లూరుజిల్లా. వెల పది అణాలు. కిరాతార్జునీయ కావ్యకర్తయైన భారవిని గురించిన ఒకానొక సుప్రసిద్ధ గాథయొక్క వివరణ మిది.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., Madras. Editor:— S. Sambhu Prasad



సారంగ రాగము

[చిత్రకారుడు : శ్రీ వి. కృష్ణారావు]